



# ఈనాడు

విజయవాడ 2-2-2019 శనివారం సిటీ సంపుటి 45 . సంచిక 173


THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 20+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi







# ఎన్నికల రన్‌వేపై తాయిలాల విమానం

ఎన్నికల వేళ.. లేదులేదంటూనే ప్రధాని మోదీ ఉన్నట్టుండి వరాల విమానాన్ని కిందకు దింపారు! దేశవ్యాప్తంగా రోడ్లెక్కి నిరసన నినాదాలు చేస్తున్న రైతన్నలను ప్రసన్నం చేసుకునేందుకు.. 'నేరుగా మీ ఖాతాల్లోకే' డబ్బులేసేస్తానన్నారు! మధ్యతరగతి మొత్తాన్నీ తన ఖాతాలో వేసుకోవాలన్న కాంక్షతో ఆదాయపు పన్ను రిబేటూ పెంచారు. కార్మికుల కోసం పింఛన్ల పథకం పెట్టారు. తాత్కాలిక విత్తమంత్రి పీయూష్ గోయల్ చదివి వినిపించిన బడ్జెట్ పాఠం నిండా... సార్వత్రిక ఎన్నికలకు సరిగ్గా రెండు మాసాల ముందు 'బడ్జెట్' రూపంలో అందివచ్చిన ఆఖరి అవకాశాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ వదులుకోకూడదన్న ధోరణే ప్రతిధ్వనించింది. అందుకే పేరుకు ఇది 'ఓట్ ఆన్ అకౌంట్' బడ్జెట్టే అయినా.. ఇదంతా జనాకర్షక 'ఓట్ల అకౌంటు' లాగే కనబడుతోందంటూ విపక్షాలన్నీ రుసరుసలాడుతున్నాయి!

## రూ. 27.84 లక్షల కోట్లతో కేంద్ర బడ్జెట్

- పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన పీయూష్ గోయల్
- తాత్కాలికమంటూనే ఆకర్షక ప్రతిపాదనలు

### బడ్జెట్‌లో ఎవరికి ఏమిటి?

రూ. ఐదు లక్షల్లోపు ఆదాయం పొందేవారికి పూర్తి పన్ను మినహాయింపు

దాదాపు 12 కోట్ల మంది సన్న, చిన్నకారు రైతులకు ఒక్కొక్కరికి ఏడాదికి రూ.6 వేలు

ప్రామాణిక తగ్గింపు (స్టాండర్డ్ డిడక్షన్) పరిమితి రూ.40 వేల నుంచి రూ.50 వేలకు పెంపు

గో సంపద వృద్ధికి రాష్ట్రీయ కామధేను ఆయోగ్ ఏర్పాటు

తొలిసారిగా రూ. 3,00,000 కోట్లు దాటిన రక్షణ బడ్జెట్

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి రూ.60 వేల కోట్లు

రాబోయే ఐదేళ్లలో లక్ష గ్రామాలు డిజిటల్ గ్రామాలుగా మార్పు

రెండో సొంతింటికి అద్దెపై పన్ను రాయితీ


బడ్జెట్‌పై ప్రత్యేక కథనాలు 2,6,7,8,9,10,11,12,13 పేజీల్లో


### ఈ బడ్జెట్.. అభివృద్ధికి మచ్చుతునక

- అన్ని వర్గాలకు లాభం చేకూర్చాం
- ప్రధాని మోదీ వెల్లడి



### రైతులకిచ్చేది రోజుకు 17 రూపాయలా!



బడ్జెట్‌లో అన్నదాతకు అవమానం

రాహుల్ గాంధీ

# బ్యాలెటే కావాలి

## సాధ్యం కాకుంటే వీవీప్యాట్‌లు అయినా లెక్కించాలి

- ఎన్నికలపై అపోహలు పోవాలంటే ఈ రెండింట్లో ఏదోఒకటి తప్పదు
- దిల్లీలో 23 పార్టీల డిమాండ్
- సోమవారం ఈసీని కలవాలని నిర్ణయం
- రాహుల్, చంద్రబాబు, పవార్ సహా నేతల చర్చలు
- 15 రోజుల తర్వాత మరోసారి భేటీ

"రాష్ట్రంలో కాంగ్రెస్‌తో పొత్తులుండవ్. రాష్ట్రాల్లో కొన్ని పార్టీలకు రాజకీయ అనివార్యత వల్ల కలిసి పనిచేసే పరిస్థితి లేక పోయినా జాతీయస్థాయిలో అందరూ కలిసి పనిచేస్తామన్నారు. భాజపాకు వ్యతిరేకంగా పోరాడతామని ప్రకటించారు. గతంలో కూడా ఎన్నికలకు ముందు ఇలాంటి కూటములు ఏర్పాటు చేసుకొని ముందుకెళ్లారు. కొన్నిసార్లు ఎన్నికలైన తర్వాత జట్టుగా ఏర్పడి కనీస ఉమ్మడి కార్యక్రమం ఆధారంగా ప్రభుత్వాలు నడిపిన సందర్భాలున్నాయి."

- దిల్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు - దిల్లీ

ఈవీఎంలపై ప్రజల్లో ఉన్న అపోహలు నివృత్తి చేసి, ఎన్నికల వ్యవస్థపై నమ్మకం కలిగించాలని 23 విపక్ష రాజకీయ పార్టీలు డిమాండ్ చేశాయి. దీనిపై సోమవారం సాయంత్రం 5.30 గంటలకు కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలవాలని నిర్ణయించాయి. బ్యాలెట్ పేపర్ విధానాన్ని ప్రవేశపెట్టాలని, సాధ్యం కాకపోతే వీవీప్యాట్‌లనైనా పూర్తిగా లెక్కించాలని కోరనున్నాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, తెదేపా అధ్యక్షుడు చంద్రబాబు, ఎన్సీపీ అగ్రనేత శరద్‌పవార్‌ల నేతృత్వంలో శుక్రవారం ఇక్కడి కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో విపక్షాల సమావేశం జరిగింది. ఇందులో ప్రధానంగా ఈవీఎంలపై నెలకొన్న సందేహాలపై చర్చించి ఒక నివేదికను ఆమోదించారు. దాన్ని అన్ని పార్టీలూ సంయుక్తంగా కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించి, ఎన్నికల నిర్వహణను ప్రక్షాళించాలని డిమాండ్ చేయనున్నాయి. ఈ అంశంతోపాటు రైతాంగ సమస్యలు, నిరుద్యోగం, రఫేల్ కుంభకోణం గురించీ ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని తీర్మానించినట్లు... సమావేశానంతరం రాహుల్‌గాంధీ, చంద్రబాబులు వెల్లడించారు. విపక్షాల సంయుక్త విలేకర్ల సమావేశంలో రాహుల్‌గాంధీ మాట్లాడుతూ... "మేం నిర్దిష్ట ప్రతిపాదనలతో డాక్యుమెంట్‌ను తయారు చేశాం. (మిగతా 2లో)



దిల్లీలో శుక్రవారం నిర్వహించిన విపక్షాల సమావేశంలో పాల్గొన్న కనిమొళి, శరద్ యాదవ్, శరద్ పవార్, రాహుల్ గాంధీ, చంద్రబాబునాయుడు, డి.రాజా

# ఆంధ్రులకు ఆవేదనే



- ఐదు కోట్ల రాష్ట్ర ప్రజల ఆశలపై కేంద్రం నీళ్లు
- ఈ బడ్జెట్‌లోనూ మొండిచెయ్యే చూపిన కేంద్రం
- ఒక్క విభజన హామీ ప్రస్తావనా లేని ఆర్థికపద్దు

ఈనాడు, అమరావతి: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు చేసిన దగా సంపూర్ణమైంది. విభజన హామీలు, చట్టంలోని అంశాలు అమలు చేయకుండా గత ఐదు బడ్జెట్‌లలో రాష్ట్రానికి అన్యాయం చేసిన కేంద్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌లోనూ మొండి చెయ్యి చూపింది. ఎన్నికల సంవత్సరం కాబట్టి... ఓట్ల కోసమైనా రాష్ట్రానికి కేంద్రం ఏమైనా విదిలిస్తుందేమోనని ఏ కొద్ది మందిలోనో మిణుకుమిణుకుమన్న ఆశలూ అడుగంటాయి. ఈ ప్రభుత్వానికి ఇదే చివరి బడ్జెట్. ఇక ఈ ప్రభుత్వం రాష్ట్రానికి ఇచ్చేదేమీ లేదు. మోదీ ప్రభుత్వం ఏ విభజన హామీనీ తాజా బడ్జెట్‌లో పరిగణనలోకి తీసుకోలేదు. రెవెన్యూ లోటు ఊసేలేదు... రైల్వే జోన్ ప్రస్తావనా లేదు... (మిగతా 3లో)

# మట్టి, నీళ్లు ముఖాన కొడతారా?

- వైకాపా, తెరాసతో కలిసి రాష్ట్రానికి ద్రోహం
- మీకంటే బ్రిటిష్‌వారే నయం
- ప్రధాని మోదీపై అసెంబ్లీ సాక్షిగా మండిపడ్డ చంద్రబాబు
- పోలవరం తరహాలో ప్రగతి ఎక్కడ?
- జాతీయ ప్రాజెక్టు ఏదైనా పూర్తయ్యిందా?
- చూపిస్తే రాజకీయాల నుంచి విరమించుకుంటా

ఈనాడు, అమరావతి: 'పోలవరం తరహాలో జాతీయ ప్రాజెక్టు దేశంలో ఏదైనా పూర్తయ్యిందంటే రాజకీయాలనుంచి విరమించుకుంటా. రాష్ట్ర జీవనాడి అయిన ఈ ప్రాజెక్టుకు వెచ్చించిన నిధులివ్వమంటే ఇవ్వరు? (మిగతా 2లో)



బంద్‌కు సంఘీభావంగా నల్ల చొక్కా ధరించిన చంద్రబాబు

# ఎవరబ్బ సొమ్ము..

- ఎవరి కోసం నిధులిస్తారు?
- తెలుగువాళ్లకు పౌరుషం లేదనుకుంటున్నారా?
- విష్ణుకుమార్‌రాజు వ్యాఖ్యలపై నిప్పులు చెరిగిన సీఎం
- శాసనసభలో గంభీర వాతావరణం

3లో



బంద్ సందర్భంగా తిరుపతి గాంధీ రోడ్డులోని నాలుగు కాళ్ల మండపం రోడ్డు వద్ద కబడ్డీ ఆడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, తదితరులు

# రాష్ట్ర బంద్ ప్రశాంతం

- పాల్గొన్న వామపక్షాలు, ప్రత్యేకహోదా సాధన సమితి, విద్యార్థి సంఘాలు
- నల్లబ్యాడ్జీలతో తెదేపా శ్రేణుల ప్రదర్శనలు

16లో






# సంప్రదాయానికి భిన్నంగా బడ్జెట్

- రైతులకు అందించే సాయం పాత బడ్జెట్ కాలం నుంచి అమలు
- సంక్షేమానికి నిధులు సమస్యే!
- ఉన్నత విద్యారంగానికి చాలీ చాలని కేటాయింపులు



లోక్‌సభలో శుక్రవారం బడ్జెట్ ప్రవేశపెడుతున్న కేంద్ర ఆర్థిక శాఖ తాత్కాలిక మంత్రి పీయూష్ గోయల్

ఈనాడు, దిల్లీ: నాలుగేళ్లలో తాయిలాలకు దాదాపు దూరంగా ఉంటూ వచ్చిన కేంద్ర ప్రభుత్వం చివరి మధ్యంతర బడ్జెట్‌లో వరాలు గుప్పించినట్లు చూపించే ప్రయత్నం చేసింది. సూక్ష్మంలో మోక్షం పొందాలనే ఉద్దేశంతో తక్కువ నిధులతో ఎక్కువ రాజకీయ ప్రయోజనం పొందే ఎత్తులు వేసింది. సన్న-చిన్నకారు రైతుకు రూ. 6000 సాయం, రూ.5 లక్షల ఆదాయం వరకు పన్ను మినహాయింపు వంటివే దానికి ఉదాహరణ. సాధారణంగా ఏ బడ్జెట్‌లో చెప్పిన అంశాలైనా కొత్త ఆర్థిక సంవత్సరం నుంచి అమలు కావడం రివాజు. మోదీ సర్కారు మాత్రం రైతులకు ప్రకటించిన సాయంలో తొలి విడతను పాత బడ్జెట్ నుంచే మొదలుపెట్టడం అందర్నీ ఆశ్చర్యపరుస్తోంది. ఇప్పుడు ప్రకటించిన ఆదాయపు పన్ను మినహాయింపు సయితం కొత్తదేమీ కాదని, ఇదివరకు యూపీయే ప్రభుత్వం ఇచ్చిన రాయితీని మరో పదివేల రూపాయల మేర పెంచడం మినహా పన్ను చెల్లింపుదారులకు పెద్దగా ఒరిగిందేమీ ఉండదన్న వాదనలు వినిపిస్తున్నాయి. తాత్కాలిక ఆర్థికమంత్రి పీయూష్ గోయల్ బడ్జెట్ ప్రసంగం బుధవారం పార్లమెంటు ఉభయసభల నుద్దేశించి రాష్ట్రపతి చేసిన ప్రసంగాన్ని గుర్తుకు తెచ్చింది. అయిదేళ్లలో మోదీ ప్రభుత్వం చేసిన పనులను రాష్ట్రపతి తరహాలోనే గోయల్ వల్లెవేశారు. కొన్ని పంక్తులు యథాతథంగా రాష్ట్రపతి ప్రసంగంలోనూ ఉన్నాయంటూ కొందరు సభ్యులు అభ్యంతరం చెప్పారు. ఆర్థికమంత్రి బడ్జెట్ ప్రసంగం ప్రకారం ప్రభుత్వ ఆర్థిక లోటు నియంత్రణలో లేదు. ఈ ఏడాది రైతులకిచ్చే రూ. 20,000 కోట్లను బయటి నుంచి రుణంగా తెచ్చుకోవాల్సిందే. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఇచ్చే రూ. 75,000 కోట్లను ఎక్కడినుంచి సమకూరుస్తారన్నదీ ప్రశ్నార్థకమే.

### రైతుకు సాయంపై కొరవడిన స్పష్టత

మహాత్మాగాంధీ గ్రామీణాభివృద్ధి పథకానికి ఈ ఏడాది నిధులు చాలక రాష్ట్రాలు సొంత బడ్జెట్ నుంచి పెట్టుకుంటే తాము తిరిగి చెల్లిస్తామని కేంద్రం చెబుతూ వచ్చింది. అలాంటి పథకానికి అదనపు నిధులు సమకూర్చకుండా కొత్తగా ప్రకటించిన పీఎం కిసాన్ పథకానికి ఈ ఏడాదే రూ. 20,000 కోట్లు కేటాయించడం వెనుక ఎన్నికల కోణమే కనిపిస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పీఎం కిసాన్ పథకంలో స్పష్టత కొరవడింది. ఎకరా నుంచి అయిదెకరాల వరకు ఉన్న వారందరికీ ఒకే రకంగా రూ. 6000 చొప్పునే ఇవ్వడం ఏంటన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. రైతు కుటుంబానికి రూ. 6000 ఇవ్వడమంటే నెలకు రూ. 500, రోజుకు రూ. 17 ఇవ్వడం మాత్రమేనన్న విమర్శ సర్వత్రా వ్యక్తమవుతోంది.

### ఉన్నత విద్యా రంగానికి 7 శాతమే

ఉన్నత విద్యారంగాన్ని కేంద్ర ప్రభుత్వం గ్రాంట్ల ప్రాతిపదిక నుంచి రుణం వైపు మళ్లించిందన్న ఆరోపణలున్నాయి. ఈసారి బడ్జెట్ పద్దుల్లో ఉన్నత విద్య ఆర్థిక సంస్థకు అప్పులు, వడ్డీలు చెల్లించడానికి నిధులు కేటాయించడం దీనికి బలాన్ని చేకూరుస్తోంది. పన్ను ఆదాయం 17% మేర పెరిగినప్పటికీ ఉన్నత విద్యారంగానికి కేటాయింపులు మాత్రం 7% మాత్రమే పెంచడంవల్ల ఏం ప్రయోజనం కలుగుతుందన్న ప్రశ్న వ్యక్తమవుతోంది. హామీలు పెద్దగా ప్రకటించుకున్న ప్రభుత్వం వాటికి బడ్జెట్ కేటాయింపులను మాత్రం చెప్పలేదని, ఏ పన్నుల రూపంలో ఎంత ఆదాయం సమకూరుతుందో చెప్పలేని పరిస్థితుల్లో ఉందన్న విమర్శ వ్యక్తమవుతోంది. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన వల్ల రైతుల కంటే బీమా కంపెనీలకే ఎక్కువ ప్రయోజనం కలిగిందని, ఇప్పుడు అసంఘటిత కార్మికులకు ప్రకటించిన బీమా పథకం ద్వారానూ బీమా కంపెనీలే అధిక ప్రయోజనం పొందే అవకాశం కనిపిస్తోందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. భారతీయ సగటు ఆయుర్దాయం 68 ఏళ్లుగా ఉంటోందని, 60 ఏళ్లనుంచి అసంఘటిత కార్మికులకు పింఛన్ ఇవ్వడం మొదలుపెడితే గరిష్ఠంగా 8 ఏళ్లకు మించి ఇచ్చే పరిస్థితి ఉండదని, దానివల్ల బీమా కంపెనీలకు భారీ లబ్ధి చేకూరుతుందని పేర్కొంటున్నారు. పింఛను వయస్సును తగ్గిస్తేనే కార్మికులకు మేలు జరుగుతుందని సూచిస్తున్నారు. సాధారణంగా బడ్జెట్‌లలో అంతకుముందు సంవత్సరంలో సాధించిన ప్రగతి, ఆ ఏడాది చేయబోయే పనుల గురించి మాత్రమే చెబుతారు. అలా కాకుండా వచ్చే దశాబ్దకాల లక్ష్యాల గురించి చెప్పడం ద్వారా కొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టినట్లయిందన్న భావన వ్యక్తమవుతోంది.

## సీబీఐ కొత్త డైరెక్టర్ ఎంపిక సశేషం

### ఎటూ తేల్చకుండానే ముగిసిన నియామక కమిటీ రెండో భేటీ

దిల్లీ: కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కు కొత్త డైరెక్టర్‌ను ఎంపిక చేసేందుకు సమావేశమైన అత్యున్నత స్థాయి నియామక కమిటీ మరోసారి ఏ నిర్ణయం తీసుకోకుండానే భేటీని ముగించింది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వం వహిస్తున్న ఈ కమిటీలో లోక్‌సభలోని అతిపెద్ద ప్రతిపక్ష పార్టీ (కాంగ్రెస్) నేత మల్లికార్జున్ ఖర్గే, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయి సభ్యులుగా ఉన్నారు. శుక్రవారం ప్రధాని నివాసంలో ఈ కమిటీ సమావేశం గంటకుపైగా సాగినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. సీబీఐ డైరెక్టర్ పదవికి కేంద్రం కొందరు అధికారుల పేర్లను సూచించగా ఖర్గే అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు పేర్కొన్నాయి. సీనియర్ ఐపీఎస్ అధికారులు జావీద్ అహ్మద్, రజనీకాంత్ మిశ్ర, ఎస్ఎస్ దేశ్వాల్, శివానంద్ ఝూల పేర్లు ప్రధానంగా పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఖర్గే అభ్యంతరాలు తెలుపుతున్నప్పటికీ త్వరలోనే కొత్త డైరెక్టర్ పేరును కేంద్రం ప్రకటించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు వ్యాఖ్యానించాయి. కొత్త డైరెక్టర్ ఎంపిక అంశంపై నియామక కమిటీ సమావేశం కావడం ఇది రెండోసారి. గత నెల 24న జరిగిన తొలి సమావేశంలోనూ ఏ నిర్ణయమూ వెలువడలేదు. గత నెల 11 నుంచి సీబీఐ తాత్కాలిక డైరెక్టర్‌గా నాగేశ్వరరావు పనిచేస్తున్నారు. డైరెక్టర్ పదవి నుంచి ఆలోక్‌వర్మ తొలగింపు అనంతరం ఆయన ఈ బాధ్యతలు తీసుకున్నారు.

### తక్షణమే పూర్తిస్థాయి నియామకం చేపట్టాలి: సుప్రీం

దిల్లీ: సీబీఐకి తక్షణమే పూర్తి స్థాయి డైరెక్టర్‌ను నియమించాలని సుప్రీం కోర్టు కేంద్రానికి సూచించింది. తాత్కాలిక డైరెక్టర్‌తో సంస్థను సుదీర్ఘ కాలం నడపడం మంచిది కాదని వ్యాఖ్యానించింది. "సీబీఐ డైరెక్టర్ పదవి చాలా కీలకమైనది, సున్నితమైనది. ఇంతవరకూ పూర్తి స్థాయి డైరెక్టర్‌ను ఎందుకు నియమించలేదు" అంటూ జస్టిస్ అరుణ్ మిశ్ర, జస్టిస్ నవీన్ సిన్హాలతో కూడిన ధర్మాసనం కేంద్రాన్ని ప్రశ్నించింది. నాగేశ్వరరావు నియామకాన్ని సవాలు చేస్తూ 'కామన్ కాజ్' అనే స్వచ్ఛంద సంస్థ వేసిన పిటిషన్‌ను విచారిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది.

# వరాల వీచిక.. రాజకీయ పాచిక



ఈనాడు, దిల్లీ: మరోసారి అధికారాన్ని దక్కించుకోవడమే లక్ష్యంగా నరేంద్ర మోదీ ప్రభుత్వం తాత్కాలిక బడ్జెట్‌లో భారీగా తాయిలాలు ప్రకటించింది. ముఖ్యంగా దేశంలోని 12 కోట్ల మంది సన్న, చిన్నకారు రైతులకు రూ. 75,000 కోట్లు లబ్ధి కలిగించేలా కొత్త పథకాన్ని ప్రకటించింది. సాగవుతున్న భూమి రెండు హెక్టార్ల కన్నా తక్కువగా ఉన్న రైతులకు ఏటా రూ. 6,000 నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయనుంది. అసంఘటిత రంగంలోని కార్మికులకూ నెలకు రూ. 3000 పింఛన్ ఇవ్వబోతున్నట్లు ప్రకటించింది. ఆదాయపు పన్ను పోటుతో నలిగిపోతున్న మూడు కోట్ల మంది మధ్యతరగతి వారికి రూ. 18,500 కోట్లు మేర ఉపశమనం కలిగించాలని ప్రతిపాదించింది. ఆర్థిక శాఖ బాధ్యతల్ని తాత్కాలికంగా చేపట్టిన రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్ శుక్రవారం లోక్‌సభలో రూ. 27.84 లక్షల కోట్ల వ్యయ అంచనాలతో 2019-20 ఆర్థిక సంవత్సర బడ్జెట్టును ప్రవేశపెట్టారు. పేరుకైతే ఇది తాత్కాలిక బడ్జెట్టే అయినా ఎన్నికల దృష్ట్యా జనాకర్షకంగా ఉంచే రూపొందించే ప్రయత్నం చేశారు. హిందీలో 100 నిమిషాలకు పైగా గోయల్ బడ్జెట్ ప్రసంగం కొనసాగింది. ప్రధానంగా ప్రభుత్వ విజయాలను వివరిస్తూ, మునుపటి ప్రభుత్వాలకు చురకలు వేస్తూనే భవిష్యత్తు దార్శనికతను ఆవిష్కరించేందుకు ఆయన ప్రయత్నం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ పలు సందర్భాల్లో బల్లపై చరిచి హర్షం వ్యక్తం చేశారు. లోక్‌సభ తర్వాత రాజ్యసభలోనూ గోయల్ బడ్జెట్ ప్రతిపాదనలను సమర్పించారు.

### దశ దిశల దార్శనికత..

రాబోయే దశాబ్దికి దార్శనికతను విజన్-2030 పేరుతో నూతన బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రతిపాదించింది. దీనికోసం పది ముఖ్యమైన దృక్కోణాలను ఆవిష్కరించింది. పేదరికం, పోషకాహార లోపం, నిరక్షరాస్యత, అపారిశుద్ధ్యం వంటివేవీ లేని భారత్‌ను సాధించాలని లక్ష్యంగా పెట్టుకొంది. రాబోయే అయిదేళ్లలో 5 ట్రిలియన్ డాలర్ల స్థాయికి (రూ. 360 లక్షల కోట్లు), ఆ తర్వాత మూడేళ్లలో 10 ట్రిలియన్ డాలర్లకు (రూ. 720 లక్షల కోట్లు) మన ఆర్థిక రంగం ఎదుగుతుందని గోయల్ చెప్పారు. దానికి తగ్గట్టుగా మౌలిక సదుపాయాలు, సులభతర జీవనాలను కల్పించే చర్యలు చేపడతామని తెలిపారు.

# పేదల ఇంట వెలుగుల పంట

- ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రాలతో సత్ఫలితాలు

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రాలు పేదల ఇంట వెలుగులు నింపుతున్నాయి. కంటికి సంబంధించిన సమస్యలపై నేటికీ చాలా మందికి సరైన అవగాహన ఉండక నడి వయసులోనే చూపు పోగొట్టుకుంటున్నారు. ఈ సమస్యకు విరుగుడుగా ప్రభుత్వం ఈ-ఐ కేంద్రాలను ఏర్పాటు చేసి రోగులకు బాసటగా నిలిచింది. దీంతో కంటి సమస్య ఉన్నవారు పరీక్షలు చేయించుకొని చికిత్సలకు సిద్ధపడుతున్నారు.

● జీవనశైలి మారిన నేపథ్యంలో రక్తపోటు, మధుమేహం వ్యాధులతో బాధపడేవారి సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. వీరిలో ఎక్కువ మంది కంటి పరీక్షలను సకాలంలో చేయించుకోవడం లేదు. దీనివల్ల కంటిచూపు మందగించడం తదితర సమస్యలు ఎక్కువైపోతున్నాయి. వీటిని ఎదుర్కొంటున్న ప్రతి ఒక్కరికీ వైద్య సదుపాయం అందించడంతోపాటు కళ్లద్దాలు సమకూర్చడం, అవసరమైతే శస్త్ర చికిత్సలు చేయించడం ఈ-ఐ కేంద్రాల ముఖ్య ఉద్దేశం.

● రోగుల కంటిలోపలి భాగాల చిత్రాలను, చూపులో వచ్చిన వ్యత్యాసాలను ఆన్‌లైన్ ద్వారా చెన్నైలోని హబ్ (వైద్యులు ఉండే కేంద్రం)కు పంపిస్తారు. వీటిని అక్కడి నేత్ర వైద్యులు పరిశీలించి సమస్య వివరాలను నివేదిస్తారు. కంటి చూపును అనుసరించి ఎటువంటి అద్దాలు వాడాలో ఈ కేంద్రాలకు సమాచారం వస్తుంది. అందుకు అనుగుణంగా ఈ-ఐ కేంద్రాల్లో కళ్లజోళ్లు అందజేస్తారు.

### నమోదు, పరీక్షలు, చికిత్స

గత ఏడాది ఫిబ్రవరి 1న రాష్ట్రవ్యాప్తంగా 115 కేంద్రాల్లో ప్రారంభించిన ఈ పథకానికి సంవత్సర కాలంలో 7,52,632 మంది నమోదు చేయించుకోవడం గమనార్హం. వీరిలో 7,07680 పరీక్షలు చేయించుకున్నారు. 5,76,183 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. మధుమేహులకు వచ్చే రెటినోపతి సమస్య ఉన్న 3,087 మందిని గుర్తించారు. 1,146 మందికి కంట్లో నీటికాసుల (గ్లకోమా) సమస్య ఉన్నట్లు తెలుసుకున్నట్లు పథకం రాష్ట్ర సమన్వయ కర్త ప్రసన్నకుమార్ తెలిపారు. సమస్య తీవ్రత ఉన్న వారిని మెరుగైన చికిత్స కోసం బోధనాసుపత్రులకు పంపుతున్నామని వివరించారు.



**ఇదీ సూత్రం**

జీవితంలో.. ఇవాళే ఆఖరి రోజన్నట్టుగా పనిచేయాలి!
ఎప్పటికీ జీవించే ఉంటామన్నట్టుగా నేర్చుకోవాలి!!

– మహాత్మా గాంధీ

# మట్టి, నీళ్లు ముఖాన కొడతారా?

(మొదటి పేజీ తరువాయి)

సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) పంపితే ఆమోదించరు? 57,967 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పని 24 గంటల్లో పూర్తి చేసి గిన్నిస్ రికార్డు సృష్టించినా కనికరం లేదు. సందేహాల నివృత్తికి దిల్లీకి నాలుగు టన్నుల పేపర్లు పంపా. ఆంధ్రప్రదేశ్ బాగు పడుతుందంటే మీకు అసూయ. తమిళనాడుకు నీళ్లిస్తామంటే ఓర్వలేరు. ప్రాజెక్టుకు ఒక వైపు అవార్డులిస్తూ మరోవైపు అవాకులుచవాకులు మాట్లాడతారా? మీకూ, బ్రిటీషువాళ్లకు తేడా ఏమిటి? వాళ్లే నయం. కాటన్‌దొర ఇచ్చిన నీళ్లయినా తాగుతున్నాం. మేము మీ బానిసలమా? రాజధానిని ఏభై ఏళ్లకు నిర్మిస్తారా? అప్పటివరకు ఇలాగే చావాలా?' అని సీఎం చంద్రబాబు ప్రధాని మోదీపై అసెంబ్లీలో శుక్రవారం నిప్పులు చెరిగారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం అమలుపై స్వల్ప వ్యవధి చర్చ సందర్భంగా సీఎం ఆవేశంగా ప్రసంగించారు. ప్రధాని తీరుపై మరోసారి విరుచుకుపడ్డారు. మోదీతో కలిసి వైకాపా, తెరాస రాష్ట్రానికి ద్రోహం చేస్తున్నాయని మండిపడ్డారు.

### సీనియర్ నాయకుణ్ని నల్లచొక్కా వేసుకున్నానంటే అర్థం చేసుకోవాలి

'ఇదో చీకటి రోజు. నాలాంటి సీనియర్ నాయకుడు నల్లచొక్కా వేసుకున్నారంటే వీళ్లు ఎంత దుర్మార్గంగా వ్యవహరించారో ప్రజలు అర్థం చేసుకోవాలి. 2002లో మోదీ, నిన్న అమిత్‌షా రాజకీయాల్లోకి వచ్చారు. 1978లోనే నేను ఎమ్మెల్యేనయ్యా. రాష్ట్రానికి మేలు జరుగుతుందని ప్రధాని మోదీని సార్ అంటూ అనేకసార్లు గౌరవిస్తే అమరావతికి మట్టి, నీరు ముఖాన కొట్టిపోతారా? ఇదేనా మాకిచ్చే బహుమతి? ఏ రాష్ట్రానికీ ప్రత్యేక హోదా ఇవ్వబోమంటే.. హోదాకు తగిన ప్రయోజనాలు ఆంధ్రప్రదేశ్‌కు కల్పిస్తే ఏ పేరు పెట్టుకున్నా అభ్యంతరం లేదన్నా. ఈశాన్య రాష్ట్రాలకు పారిశ్రామిక రాయితీలు, ఇతర అనేక ప్రత్యేక ప్యాకేజీలిచ్చి మాకు అన్యాయం చేస్తారా? ఇది ప్రధానికి తగునా?' అని చంద్రబాబు మండిపడ్డారు.

### వెంకయ్యనాయుడిపై కోపంతోనే ఉపరాష్ట్రపతిని చేశారు

'దక్షిణ భారతదేశంలో ఎవరికీ కేంద్రంలో మంత్రి పదవులివ్వరు. ఒకరిద్దరికి ఇచ్చినా కీలక మంత్రిత్వశాఖలు కేటాయించరు. అలాంటపుడు ప్రజల మనోభావాలెలా ప్రతిబింబిస్తాయి? వెంకయ్యనాయుడిపై కోపంతో ఉపరాష్ట్రపతిని చేశారు. ఆయనకు పదోన్నతో, శిక్షనో తెలియని పరిస్థితి. దత్తాత్రేయను మంత్రివర్గం నుంచి తొలగించారు. తమిళనాడు, కర్ణాటకలో నాయకులపై.. మా ఎంపీలపై ఐటీ, ఈడీ దాడులు చేయించి దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారు. దక్షిణ భారతంలో ప్రజలెలా మీకు ఓట్లేస్తారు? రైల్వేజోన్ ఇవ్వకుండా ప్రధాని విశాఖ పర్యటనకు ఎలా వస్తారు? కడప ఉక్కు పరిశ్రమ ఇవ్వకుండా రాయలసీమ డిక్లరేషన్ పెడతారా? ఇదెక్కడి విడ్డూరం? 50 అసెంబ్లీ సీట్లు పెంచితే ఎక్కడ బలపడతామోనని భావిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం(పీపీపీ)తో మీరు ప్రాజెక్టులు చేపడతారు? మేము చేస్తే తప్పు పడతారా?' అని చంద్రబాబు కేంద్రంపై ఆగ్రహించారు.

### పరిణతి అంటే ప్రధానికి ఊడిగం చేయాలా?

'అవినీతి ఉచ్చులో ప్రధాని మోదీ పడ్డారు. జగన్‌పై కేసులు నీరుగార్చుతున్నారు. నాకు పరిణతి అంటే ప్రధానికి ఊడిగం చేయాలా? నా జీవితంలో ఎప్పుడూ అలా జరగదు. అవినీతిపరులకు చోటు లేదని అప్పట్లో ఎన్నికల ప్రచార సభల్లో చెప్పి ఇప్పుడు జగన్‌తో మోదీ కలిసిపోయారు. వైకాపా ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రారు, ప్రజాసమస్యలపై మాట్లాడరు. నెలనెలా జీతాలు మాత్రం తీసుకుంటారు. కేసుల మాఫీ కోసం మోదీ కాళ్లపై పడతారు' అని ముఖ్యమంత్రి మండిపడ్డారు. 'రాష్ట్రం కోసం ఏకపక్షంగా పోరాడిన పార్టీ కేవలం తెదేపాయే. కేంద్రంపై ఒక ప్రాంతీయ పార్టీ అవిశ్వాసం పెట్టడం తెదేపాకే సాధ్యమైంది. మొన్న ఉండవల్లి అరుణ్‌కుమార్ పెట్టిన సభకు మంత్రులను పంపా. ఈరోజు (శుక్రవారం) చలసాని శ్రీనివాస్ బంద్‌కు పిలుపునిస్తే సంఘీభావం తెలిపి నల్లచొక్కాలతో అసెంబ్లీకి హాజరయ్యాం' అని ముఖ్యమంత్రి వివరించారు.

### నాది రైట్ టర్నే

'నాది యూటర్న్ కాదు. రైట్ టర్నే. పెత్తందారీ వ్యవస్థకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారు. 11న దిల్లీలో దీక్ష, 12న రాష్ట్రపతిని కలుస్తాం. అప్పటికీ కేంద్ర వైఖరిలో మార్పు రాకపోతే వదిలిపెట్టబోం. రాష్ట్ర హక్కుల కోసం గట్టిగా పోరాడితే ఫినిష్ చేస్తామంటారా? కేసులు పెట్టి ఇబ్బంది పెడతారా?' అంటూ ప్రధానిపై విరుచుకుపడ్డారు. 'పోలవరంలోని ఏడు ముంపు మండలాలను ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలో ఏపీలో కలుపుతూ కేంద్రం ఆర్డినెన్స్ తెచ్చింది. ఇప్పుడైతే మోదీ ఒప్పుకోరేమో? అప్పుడే సహకరించకుండా ఉంటే ఇప్పటివరకు కథ వచ్చేది కాదు. అటో ఇటో తేలిపోయేది' అని వివరించారు. 'నాలుగున్నరేళ్ల పసిబిడ్డ ఆంధ్రప్రదేశ్‌కు పౌష్టికాహారం ఇస్తే తప్పు బతకదు. ఈ విషయం కేంద్రానికి తెలిసినా ఆంక్షలు పెడుతోంది. మా నిధులతో ప్రజలకు, రైతులకు న్యాయం చేయడం తప్పా? రాష్ట్రం నుంచి పన్ను చెల్లించబోమంటే కేంద్రం వద్ద సమాధానం ఉందా?' అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

## దేశంలో ఇద్దరే.. వారు తెలుగు తేజాలే

- జేఈఈలో 100 పర్సంటైల్ సాధించిన ఏపీ విద్యార్థులు
- మెయిన్-2(ఆర్కిటెక్చర్) ఫలితాల విడుదల

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, విజయవాడ సిటీ: జేఈఈ మెయిన్ పేపర్-2 (ఆర్కిటెక్చర్, ప్లానింగ్ కోర్సుల) ఫలితాల్లో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచారు. దేశవ్యాప్తంగా పేపర్-2 ఫలితాల్లో ఇద్దరు మాత్రమే 100 పర్సంటైల్ సాధించగా.. వారు ఏపీకి చెందినవారవడం గమనార్హం. గుంటూరు జిల్లా చెరుకుపల్లికి చెందిన గొల్లపూడి ఎస్.లక్ష్మీనారాయణ, అనంతపురం జిల్లా ధర్మవరానికి చెందిన గుడ్ల రఘునందన్ రెడ్డిలు ఈ ఘనత సాధించారు. జాతీయ పరీక్షల సంస్థ(ఎన్‌టీఏ) ఫలితాలను విడుదల చేసింది. బి.ఆర్క్, బి.ప్లానింగ్‌ల్లో ప్రవేశాలకు జనవరి 8న ఎన్‌టీఏ రెండు విడతలుగా పరీక్షలు నిర్వహించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల నుంచి సుమారు 15 వేల మంది హాజరయ్యారు. ఆన్‌లైన్‌లో ఒక్కసారి కంటే ఎక్కువ పరీక్షలు నిర్వహిస్తే ఫలితాలకు పర్సంటైల్ విధానాన్ని అవలంబిస్తారు. విద్యార్థులకు ఎలాంటి నష్టం జరగకుండా ఈ విధానాన్ని పాటిస్తున్నారు. ఈ ఏడాది నుంచి రెండు పర్యాయాలు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఏప్రిల్‌లో మరోసారి పరీక్షలు నిర్వహిస్తారు. రెండు పర్యాయాలు పరీక్షలు రాయాలన్నది తప్పని సరేమీ కాదు. ఏప్రిల్ ఫలితాలు విడుదల చేసిన తర్వాత జాతీయ స్థాయి ర్యాంకులను ప్రకటించే అవకాశం ఉంది.

### శాస్త్రవేత్త అవ్వాలనేది లక్ష్యం

"మాది అనంతపురం జిల్లా ధర్మవరానికి చెందిన మధ్యతరగతి కుటుంబం. మా నాన్న తిమ్మారెడ్డి చిరు వ్యాపారం చేసుకుంటూ చదివిస్తున్నారు. తరగతి గదిలో అధ్యాపకులు చెప్పే పాఠ్యాంశాలను శ్రద్ధగా వింటూ.. రోజూ రాత్రి 11 గంటల వరకు చదివాను. సందేహాలు ఉంటే మరుసటి రోజూ అధ్యాపకులను అడిగి నివృత్తి చేసుకుంటూ పక్కా ప్రణాళికతో సాధన చేశాను. అదే నేను మంచి ఫలితాలు సాధించడానికి దోహదపడింది. శాస్త్రవేత్త కావాలన్నదే నా లక్ష్యం"

– జి.రఘునందన్‌రెడ్డి

### సమయాన్ని సద్వినియోగం చేసుకున్నాను

"పాఠశాల స్థాయి నుంచే సమయాన్ని సద్వినియోగం చేసుకోవడమే నా విజయానికి కారణం. మాది గుంటూరు జిల్లా చెరుకుపల్లి గ్రామం. మా నాన్న శ్రీనివాసరావు చిరు వ్యాపారి. తల్లి అరుణ కుమారి గృహిణి. మా అమ్మ బీఈడీ వరకు చదువుకుంది. అమ్మ వల్లే నాకు చదువు అంటే ఆసక్తి పెరిగింది. తల్లిదండ్రుల ప్రోత్సాహం.. నాలో పట్టుదలను పెంచింది. పేపరు-1లో 99.91 పర్సంటైల్, పేపరు-2లో 100 పర్సంటైల్ సాధించాను. ఐఐటీ ముంబైలో కంప్యూటర్ సైన్సులో సీటు సాధించాలనేది లక్ష్యం'.

– జి.ఎస్.లక్ష్మీనారాయణ

## గ్రహం అనుగ్రహం

**2-2-2019 శనివారం**

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
హేమంత రుతువు; పుష్య మాసం; బహుళ పక్షం
త్రయోదశి: రా. 9.42 తదుపరి చతుర్దశి
పూర్వాషాఢ నక్షత్రం: రా. 12.30 తదుపరి ఉత్తరాషాఢ
అమృత ఘడియలు: రా. 7.20 నుంచి 9.03 వరకు
వర్జ్యం: ఉ. 8.59 నుంచి 10.42 వరకు
దుర్ముహూర్తం: ఉ. 6.36 నుంచి 8.06 వరకు
రాహుకాలం: ఉ. 9.00 నుంచి 10.30 వరకు
సూర్యోదయం: ఉ.6-36; సూర్యాస్తమయం: సా.5-52
శని త్రయోదశి

## చలి - పులి

| ప్రాంతం | కనిష్ఠ | గరిష్ఠ |
|---|---|---|
| గుంటూరు | 15.9 | 29.4 |
| శ్రీకాకుళం | 16.0 | 26.0 |
| కడప | 17.0 | 32.0 |
| తిరుపతి | 17.4 | 30.9 |
| విశాఖపట్నం | 17.6 | 28.6 |
| అనంతపురం | 17.6 | 30.4 |
| హైదరాబాద్ | 17.7 | 29.6 |
| రాజమహేంద్రవరం | 18.0 | 31.0 |
| తాడేపల్లిగూడెం | 19.1 | 27.1 |
| విజయవాడ | 19.1 | 29.5 |
| నరసాపురం | 19.4 | 28.3 |
| కర్నూలు | 19.5 | 31.5 |
| నెల్లూరు | 21.0 | 29.0 |
| ఒంగోలు | 21.2 | 28.7 |

## గ్రూప్-I పరీక్షలకు ఉచిత శిక్షణ

### కాపు కార్పొరేషన్ ఎండీ వెల్లడి

ఈనాడు డిజిటల్, అమరావతి: ఎన్టీఆర్ విద్యోన్నతి పథకం కింద గ్రూప్-1 పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఏపీ కాపు కార్పొరేషన్ ఎండీ కోట్ల శివశంకరరావు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 8వ తేదీలోగా జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు.



# ఎన్నికల్లో బ్యాలెట్లే కావాలి

(మొదటి పేజీ తరువాయి)

దాన్ని సోమవారం సాయంత్రం కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పిస్తాం. ఈవీఎం వ్యవస్థ గురించి చాలామంది ప్రజలకు అనుమానాలు ఉన్నాయి. దాన్ని పరిష్కరించడానికి ఒక బ్యాకప్ వ్యవస్థ ఏర్పాటుచేయాలి. అప్పుడే ఏం జరుగుతోందన్న విషయం ప్రజలకు తెలుస్తుంది. ఓటర్లకు ఎన్నికల వ్యవస్థపై విశ్వాసం కల్పించాల్సిన అవసరం ఉంది" అని పేర్కొన్నారు. కనీసం 50% వీవీప్యాట్‌లనయినా లెక్కించాలన్నదే మీ డిమాండా? అన్న ప్రశ్నకు... దానిపైనే చర్చిస్తున్నామన్నామని సమాధానమిచ్చారు. ఈరోజు బడ్జెట్‌తో ప్రతిపక్షాల ముందు సమస్యలు లేకుండా పోయాయన్న అధికారపక్ష విమర్శను రాహుల్ తిప్పికొట్టారు. రైతాంగం, నిరుద్యోగం, వ్యవస్థల విధ్వంసం, రఫేల్ కుంభకోణాలు ఎక్కడికీ పోలేదని, ఇవన్నీ ఎన్నికల అంశాలుగా ఉంటాయని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వంపై రెండునెలల తర్వాత ప్రజలే మెరుపుదాడిచేస్తారన్నారు. అవినీతి అతిపెద్ద ఎన్నికల అంశమని పేర్కొన్నారు.




దిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో నిర్వహించిన విపక్షాల సమావేశానికి హాజరైన 23 పార్టీల నాయకులు

### 15 రోజుల తర్వాత మరోసారి భేటీ

అన్ని రాజకీయపార్టీలు 15 రోజుల తర్వాత మరోసారి సమావేశం కావాలని నిర్ణయించినట్లు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఈవీఎంల సమస్యపై ఎన్నికల సంఘానికి వినతిపత్రం సమర్పించిన తర్వాత వారి స్పందనను బట్టి తదుపరి కార్యాచరణ చేపడతామన్నారు. 23 పార్టీల సమావేశంలో వ్యవసాయ సంక్షోభంపై కూడా చర్చించినట్లు చెప్పారు. నాలుగేళ్లలో రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న ప్రభుత్వం ఏమీ చేయలేదన్నారు. వ్యవసాయ వృద్ధి ఇప్పటిలా 2.4%తో సాగితే 20 ఏళ్లయినా సంక్షోభం తీరదన్నారు. నిరుద్యోగం 45 ఏళ్లలో ఎన్నడూలేనంత స్థాయికి చేరిన అంశంపై నివేదిక రూపొందించిన అధికారులతోనే... దాన్ని ట్యాంపర్ చేయించడానికి ఈ ప్రభుత్వం ఒత్తిడి తెచ్చిందని, అందుకు అంగీకరించలేక అధికారులు రాజీనామాలు చేశారని చంద్రబాబు అన్నారు. దానిపైకూడా సమావేశంలో చర్చించినట్లు చెప్పారు. ఇప్పటికే ధ్వంసమైన ఈడీ, సీబీఐ, సీవీసీ, ఆర్‌బీఐల స్థానంలో తాజాగా సెంట్రల్ స్టాటిస్టికల్ ఆఫీస్ చేరిందని చంద్రబాబు ఆవేదన వ్యక్తంచేశారు. చంద్రబాబు అమరావతికి తిరిగి వెళ్లేముందు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ సునీల్ అరోరా, దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌తో భేటీ అయ్యారు.

## ఇదీ సంగతి!



# ఎవరబ్బ సొమ్ము



**• తెలుగువాళ్లకు పౌరుషం లేదనుకుంటున్నారా? • విష్ణుకుమార్‌రాజు వ్యాఖ్యలపై నిప్పులు చెరిగిన చంద్రబాబు**

ఈనాడు - అమరావతి

తెలుగువాళ్లకు పౌరుషం లేదనుకుంటున్నారా? ఎవరి కోసం నిధులిస్తారు? ఎవరబ్బ సొమ్ము అనుకుంటున్నారు?' అని ముఖ్యమంత్రి చంద్రబాబు భాజపా నేతలపై నిప్పులు చెరిగారు. శాసనసభ వేదికగా శుక్రవారం భాజపా శాసనసభాపక్ష నేత విష్ణుకుమార్‌రాజు రాష్ట్రానికి చెప్పినదానికంటే కేంద్రం ఎక్కువే చేసిందని చెప్పగానే సీఎం తీవ్రంగా స్పందించిన తీరు సహచరులను సైతం నివ్వెరపరిచింది. రాష్ట్రానికి కేంద్రం చేసిన సాయమేంటో చెప్పాలని విష్ణుకుమార్‌రాజును సీఎం నిలదీశారు. అప్పటివరకు వాద ప్రతివాదాలతో గందరగోళంగా ఉన్న సభ చంద్రబాబు తీవ్రస్వరంతో మాట్లాడటం ప్రారంభించగానే గంభీర వాతావరణాన్ని సంతరించుకుంది. సీఎం తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ...'కేంద్రం ఎవరి కోసం నిధులిస్తుంది? ఎవరబ్బ సొమ్ము అనుకుంటున్నారు? వినేవాళ్లు ఉంటే మీ ఇష్టప్రకారం మాట్లాడతారు. సాధారణ పౌరుడికి ఉండే ఆసక్తి కూడా మీలో లేదు. ప్రజాప్రతినిధిగా ఉండే అర్హత మీకు లేదు. రక్తం పొంగుతోంది. రాష్ట్రంలో ఎవరికి ఊడిగం చేస్తారు? అడిగేవారు లేరనుకుంటున్నారు. మమ్మల్ని ఏం చేస్తారు? జైల్లో పెడతారా? తమాషాలు చేస్తున్నారు. కొత్త రాష్ట్రానికి సహకరించాల్సిందిపోయి సిగ్గు విడిచి మాట్లాడుతున్నారు. లోగడ భాజపాతో ఎన్నికలకు వెళ్లి ఓడినా అన్నీ దిగమింగా. భాజపాతో కలిసి ఉన్నప్పటికీ సెక్యులరిజం వదల్లేదు. బలం లేకపోయినా 2014 శాసనసభ ఎన్నికల్లో 14 సీట్లు ఇచ్చి సహకరించా. అందులో నాలుగే గెలిచారు' అని ధ్వజమెత్తారు.



సచివాలయంలోని తన ఛాంబర్‌లో నల్లచొక్కాతో ముఖ్యమంత్రి చంద్రబాబు

**మీ బ్యాంకు ఖాతాకు డబ్బులేసి వెనక్కి తీసుకుంటే ఒప్పుకుంటారా?**

ముఖ్యమంత్రి చంద్రబాబు, భాజపా ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, మాణిక్యాలరావుల మధ్య ఆగ్రహావేశాలతోపాటు ఆసక్తికర సంభాషణలూ చోటుచేసుకున్నాయి. వెనకబడిన జిల్లాలకు ఇచ్చిన నిధులు మళ్లీ వెనక్కి తీసుకోవడాన్ని ముఖ్యమంత్రి తప్పుపట్టారు.

**ముఖ్యమంత్రి:** ఏం మాణిక్యాలరావుగారు.. మీ బ్యాంకు ఖాతాకు నేను డబ్బు వేశాక నిబంధనల ప్రకారం అది మీదే అవుతుంది కదా? నేను వెనక్కి తీసుకుంటే ఒప్పుకుంటారా?

**మాణిక్యాలరావు:** మీరు పొరపాటున వేశారనుకుంటే తీసుకోను. మీకే వదిలేస్తా.

**ముఖ్యమంత్రి:** మీరు చెప్పింది రైట్ కాదు. వెనకబడిన జిల్లాలకు మొదట నిధులిచ్చి తరువాత ప్రధాని కార్యాలయం జోక్యంతో వెనక్కి తీసుకున్నారు. మళ్లీ పంపాలని ప్రధానికి లేఖ రాస్తే ఇప్పటికీ స్పందన లేదు. మీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు రాయబారం చేస్తామంటున్నారు? అసలెందుకు వెనక్కి తీసుకున్నారు? మీ ఇంట్లో డబ్బులిస్తున్నారా? రాష్ట్ర ప్రజల జీవితాలతో ఆడుకోడానికి మోదీ ఎవరు? విష్ణుకుమార్ గారూ! రాష్ట్ర ప్రజల్లో మీరొకరు. అంటే మీరూ బాధితులే. దీనిపై ప్రధానిని ప్రశ్నించండి? విశాఖ రైల్వేజోన్ ఇచ్చి ప్రధానిని విశాఖకు రమ్మనండి. కేంద్రం చేయాల్సిన సాయం కోసం మళ్లీ మీకు ఏం లెటర్ కావాలి? ప్రజలు మిమ్మల్ని ఉతికి ఆరేస్తారు. ఏమనుకుంటున్నారో?

**23 మంది ఎమ్మెల్యేల రాజీనామాలు ఎందుకు ఆమోదించలేదు**

కేంద్రం నిర్లక్ష్య వైఖరిపై పలువురు తెదేపా సభ్యులు మాట్లాడాక భాజపా పక్ష నేత విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ 'పసుపురంగు పవిత్రతను దెబ్బతీసేలా నల్లచొక్కాలు ధరించారు. మాకు మిత్రద్రోహం చేశారు. జనసేన పవన్‌కు ప్రేమబాణాలు వదులుతున్నారు' అని వ్యాఖ్యానించారు. భాజపా ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ ఎందుకు రాజీనామా చేశారో చెప్పాలని మంత్రి అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు. దీనిపై విష్ణుకుమార్ స్పందిస్తూ.. మిగిలిన 23 మంది ఎమ్మెల్యేల రాజీనామాలను ఎందుకు ఆమోదించలేదని ప్రశ్నించారు.

'మాకూ రోషం ఉంది. కానీ రాజకీయ రోషం లేదు' అని మాజీ మంత్రి, భాజపా సభ్యుడు మాణిక్యాలరావు అన్నారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం సహకరిస్తూనే ఉందని తెలిపారు.

**ముగ్గురు ఎమ్మెల్యేల రాజీనామాల ఆమోదం**

తెదేపా ఎమ్మెల్యేలు మేడా మల్లికార్జునరెడ్డి, రావెల కిషోర్‌బాబు, భాజపా సభ్యుడు ఆకుల సత్యనారాయణ రాజీనామాలను ఆమోదించినట్లు సభాపతి కోడెల ప్రకటించారు.

## జగన్ తలెక్కడ పెట్టుకుంటారు?

- కోడికత్తి కేసులో డ్రామా బయటపడింది
- మనం ఏం చెప్పామో... ఎన్ఐఏ అదే చెప్పింది: సీఎం

ఈనాడు, అమరావతి: 'కోడికత్తి కేసులో జగన్ ఆడుతున్నది డ్రామా అని తేలిపోయింది. దీనిపై రాష్ట్ర దర్యాప్తు సంస్థలు ఏం చెప్పాయో ఎన్ఐఏ కూడా అదే చెప్పింది. జగన్ ఇప్పుడు తల ఎక్కడ పెట్టుకుంటారు?' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజమెత్తారు. జగన్ ఒక డ్రామా చేస్తుంటే.. ఆయన సోదరి మరో డ్రామా చేస్తున్నారని, రాజకీయంగా దిగజారిపోయారని మండిపడ్డారు. జగన్‌కు నరేంద్రమోదీ, కేసీఆర్ వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. వాళ్ల పన్నాగాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పార్టీ నాయకులకు సూచించారు. ఎలక్షన్ మిషన్-2019లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తెదేపా నాయకులతో 22వ టెలికాన్ఫరెన్స్‌ను ఆయన శుక్రవారం ఉదయం నిర్వహించారు. 'జాతీయ స్థాయిలో భాజపా ఆడని నాటకాల్లేవు. దొంగసర్వేలు చేయించి వచ్చే ఎన్నికల్లో మనకు సీట్లేమీ రావని చెబుతూ బలహీనపరచాలని చూస్తున్నారు. మీరెందుకు చంద్రబాబు మాట వింటున్నారని మనతో కలసి వస్తున్న నాయకులకు అలా చెప్పాలనుకుంటున్నారు' అని వివరించారు. 'దేశంలో ఎక్కడా జరగని అభివృద్ధి మనం చేశాం. ప్రతిపక్షాలు కావాలనే మనం గెలవబోమన్న ప్రచారం చేస్తున్నాయి. ప్రతి కార్యకర్త దీన్ని సవాలుగా తీసుకుని రాత్రింబవళ్లు పనిచేసి పార్టీకి ఘనవిజయం చేకూర్చాలి' అని పేర్కొన్నారు. 'ప్రస్తుత చివరి బడ్జెట్ వరకు ఎదురుచూసినా రాష్ట్రానికి అన్యాయమే మిగిలింది. పార్లమెంటు సమావేశాల తొలిరోజు ప్రధాని మోదీ మాట్లాడుతూ... ఈ సమావేశాలు సుహృద్భావ వాతావరణంలో జరగాలని అన్నారు. మోదీ వంటి వ్యక్తి ఆ మాటలనడం దుర్మార్గం. మొన్న అఖిలేష్‌పై, నిన్న మాయావతిపై దాడులు చేశారు. రాష్ట్రపతి ప్రసంగం చాలా చప్పగా ఉంది' అని చంద్రబాబు ధ్వజమెత్తారు.

**నిరసనలు హోరెత్తాలి**

కేంద్రం రాష్ట్రానికి చేస్తున్న అన్యాయానికి నిరసనగా ఫిబ్రవరి 1 నుంచి 10 వరకు రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో తెదేపా నాయకులు, కార్యకర్తలు నల్లజెండాలతో నిరసన నిర్వహించాలని చంద్రబాబు సూచించారు. 11 నుంచి 14 వరకు దిల్లీలో ధర్మపోరాటం చేస్తామని అన్నారు. 11న తాను దిల్లీలో దీక్ష చేస్తానని, 12న రాష్ట్రపతిని కలసి వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. ఆ తర్వాత ప్రజాక్షేత్రంలో అమీతుమీ తేల్చుకుంటామని తెలిపారు. కాపులకు ఐదు శాతం రిజర్వేషన్, అగ్రిగోల్డ్ బాధితులకు రూ.250 కోట్లు, సమైక్యాంధ్ర, ప్రత్యేక హోదా ఉద్యమాల్లో పాల్గొన్నవారిపై కేసుల ఎత్తివేత వంటి పలు నిర్ణయాలను మంత్రివర్గ సమావేశంలో తీసుకున్నామని, వాటిని విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. పింఛన్లు, డ్వాక్రా మహిళలకు ఆర్థిక సాయం పంపిణీ శనివారం నుంచి సోమవారం వరకు పండగలా నిర్వహించాలన్నారు. పింఛన్ల పంపిణీలో ఎక్కడా చిన్న పొరపాటుగానీ, అవినీతిగానీ జరగడానికి వీల్లేదని హెచ్చరించారు.

**తెలుగు విద్యార్థులకు అండ**

అమెరికాలోని డెట్రాయిట్‌లో అరెస్టయిన తెలుగు విద్యార్థులకు అండగా ఉంటామని, ఆ సమస్యను చట్టపరంగా ఎలా ఎదుర్కోవాలో చూస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ భవన్ అధికారులు ఇప్పటికే మాట్లాడుతున్నారని, ఏపీఎన్ఆర్‌టీ కూడా సమన్వయం చేస్తోందని తెలిపారు. ప్రతి రోజూ ఉదయం కొన్ని వేల మంది పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడటం కుటుంబసభ్యులతో మాట్లాడినంత ఆనందం కలిగిస్తుందని.. అది రోజంతా తనకు అవసరమైన శక్తినిస్తోందని చంద్రబాబు తెలిపారు. 'ఇన్నాళ్లూ కష్టపడ్డామని, ఇప్పుడు అప్రమత్తంగా లేకపోతే ప్రతిఫలం ఉండదు' అని ఉద్బోధించారు. కార్యకర్తల్ని పార్టీపరంగా ఆదుకుంటామని, రూ.200 కోట్లతో నిధిని ఏర్పాటుచేసి కార్యకర్తల్లో ఉత్సాహం ఉన్నవారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతామని చంద్రబాబు తెలిపారు.

# నల్ల చొక్కాలతో నిరసన

- ప్రత్యేక హోదా కోసం రాష్ట్రబంద్‌కు సంఘీభావం

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు సహా మంత్రులు, తెదేపా ఎమ్మెల్యేలు నలుపురంగు చొక్కాలతో శుక్రవారం శాసనసభకు వచ్చారు. ప్రత్యేక హోదా, రాష్ట్ర విభజన హామీల అమల్లో కేంద్రం తీరును నిరసిస్తూ నిర్వహించిన రాష్ట్రబంద్‌కు సంఘీభావంగా వారు నిరసన తెలిపారు. పార్టీపరంగా నిరసన తెలిపేందుకు శుక్రవారం శాసనసభకు నల్లరంగు వస్త్రాలతో రావాలని గురువారం జరిగిన తెదేపా శాసనసభాపక్ష సమావేశంలోనే ముఖ్యమంత్రి సూచించారు. ఇదే క్రమంలో వచ్చిన ముఖ్యమంత్రిని గమనించి సాధారణ వస్త్రాలతో సభకు వచ్చిన కొందరు ఎమ్మెల్యేలు అప్పటికప్పుడు సహాయకులను తుళ్లూరుకు పంపి నల్లచొక్కాలు తెప్పించుకున్నారు. హోంమంత్రి చినరాజప్ప, మంత్రులు శిద్దా రాఘవరావు, యనమల రామకృష్ణుడు అప్పటికప్పుడు నల్ల కండువాలు తెప్పించుకున్నారు. సాధారణ దుస్తుల్లోనే సభకు వచ్చిన ఎమ్మెల్యే మోదుగుల వేణుగోపాలరెడ్డిని లాబీల్లో విలేకరులు నల్లచొక్కా వేసుకోలేదేమిటని సరదాగా ప్రశ్నించగా.. కేంద్రం చేస్తున్న అన్యాయంపై అసెంబ్లీలో తమ తీర్మానమే వజ్రాయుధమని అన్నారు. సభాపతి కోడెల శివప్రసాదరావు నల్ల బ్యాడ్జీ ధరించి సభను నిర్వహించారు. అంతకు ముందు సీఎం నివాసానికి వెళ్లిన ఓ ఎమ్మెల్సీ, నెల్లూరు జిల్లాకు చెందిన ఎమ్మెల్యే నలుపురంగు చొక్కా వేసుకోకపోవడాన్ని గమనించి సీఎం మందలించినట్లు సమాచారం.

**మోదీ, జైట్లీలే హోదా ఇవ్వలేమన్నారు: యనమల**

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వబోమని తొలుత చెప్పింది ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీలేనని మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. భాజపా సభ్యుడు పీవీఎన్ మాధవ్ వ్యాఖ్యలపై స్పందిస్తూ...'ఏ రాష్ట్రానికీ హోదా ఇవ్వొద్దని 14వ ఆర్థికసంఘం సిఫార్సు చేయకపోయినప్పటికీ.. అలా చేసిందంటూ ఏపీకి అన్యాయం చేశారని ఆరోపించారు.

- 2007-09 మధ్య శాసనమండలి సభ్యుడిగా పనిచేసిన కిడారి సర్వేశ్వరరావు మృతికి శాసనమండలి సంతాపం ప్రకటించింది.

**తీర్మాన ప్రతులను చించేస్తారా?**

మంత్రి లోకేశ్ ప్రశ్న

'ఓ వైపు కేంద్రం రాష్ట్రానికి న్యాయం చేయడం లేదు. మాకు న్యాయం చేయండంటూ అసెంబ్లీలో తీర్మానించిన ప్రతులను ఇక్కడి భాజపా ఎమ్మెల్సీలు చించేస్తారా? ఉమ్మడి రాష్ట్రం నుంచి ఏపీని చించేసినట్లు తీర్మాన ప్రతులను చింపివేశారు' అని రాష్ట్ర పంచాయతీరాజ్, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఇచ్చిందేమిటని ప్రశ్నించారు. అసెంబ్లీ లాబీల్లో ఆయన విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌పై స్పందిస్తూ..'ఉద్యోగాల కల్పన ప్రస్తావనే లేదు. అసంఘటిత రంగ కార్మికులకు పింఛనుపైనా స్పష్టత లేదు. రైతులకు ఆర్థిక సాయంపై ఘనంగా ప్రకటించినప్పటికీ దానిపైనా స్పష్టత లేదు. వారు చెప్పిన లెక్కల ప్రకారమైతే ఒక్క ఏపీకే రూ.15 వేల కోట్ల వరకు అవసరమవుతాయి. ఒక్క రాష్ట్రానికే ఇంత మొత్తం అవసరమైతే ఈ పథకానికి కేటాయించిన రూ.75వేల కోట్లు దేశమంతటికీ ఎలా సరిపోతాయి? రాష్ట్రంలో సాంకేతికతను అమలుచేస్తున్నందున రైతు ఖాతా వివరాలను సేకరించడం సులువే. సాంకేతికత వినియోగించని రాష్ట్రాల్లో వారిని ఎలా ఎంపిక చేస్తారు?' అని ప్రశ్నించారు.



నల్లచొక్కాలు ధరించి శాసనసభ సమావేశాలకు హాజరైన మంత్రి నారా లోకేశ్, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు పల్లె రఘునాథరెడ్డి, కూన రవికుమార్

## తెదేపా, భాజపా సభ్యుల మధ్య వాగ్వాదం, ఘర్షణ

విభజన చట్టం అమలుపై శాసనమండలిలో లఘుచర్చ తెదేపా, భాజపా సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం, ఘర్షణలకు దారితీసింది. ఒకానొక సందర్భంలో రెండు పార్టీల సభ్యులు వెల్‌లోకి వెళ్లి ఒకరిపై మరొకరు దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. తొలుత భాజపా సభ్యుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ.. ప్రత్యేక హోదా రాకపోవడానికి చంద్రబాబే కారణమని, ఆయనే హోదా వద్దంటూ ప్యాకేజీకి అంగీకరించారని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై తెదేపా సభ్యులు మంతెన సత్యనారాయణరాజు, బీద రవిచంద్రయాదవ్ తదితరులు అభ్యంతరం చెబుతూ వెల్‌లోకి దూసుకెళ్లి.. మాధవ్ వ్యాఖ్యలను రికార్డులనుంచి తొలగించాలని డిమాండు చేశారు. భాజపా సభ్యులు మాధవ్, సోమువీర్రాజు కూడా తెదేపా, రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదిస్తూ వెల్‌లోకి ప్రవేశించారు. ఇరువర్గాల మధ్య వాదోపవాదాలు పెరిగి ఘర్షణ తలెత్తే పరిస్థితి నెలకొంది. చీఫ్ విప్ పయ్యావుల కేశవ్, విప్ డొక్కా మాణిక్య వరప్రసాద్ తదితరులు సభ్యులను సముదాయించడంతో పరిస్థితి కాస్త సద్దుమణిగింది.

**ఆశలు ఆవిరి చేశారు: జగన్**

ఈనాడు, అమరావతి: 'నాలుగు నెలల కోసం ప్రవేశపెట్టాల్సిన బడ్జెట్‌లో వరాలు, పథకాలు ప్రకటించారంటేనే ప్రజలను మోసం చేయడంలో అటు కేంద్రం, ఇటు రాష్ట్ర పెద్దలు పీహెచ్‌డీ తీసుకున్నారని అర్థమవుతోంది. దీన్నిబట్టి రాజకీయాలు ఎంతగా దిగజారిపోయాయో స్పష్టమవుతోంది. కేంద్రం ప్రవేశపెట్టిన చివరి, అయిదో బడ్జెట్‌లోనైనా ఏపీకి న్యాయం చేసి ఎన్నికలకు వెళతారన్న ఆశలను దూరం చేశారు. ఎలాంటి ప్రకటనా చేయలేదు. కేంద్రం ప్రవేశపెట్టిన నాలుగు బడ్జెట్లలో రాష్ట్రానికి ఏమీ చేయకపోయినా చప్పట్లు కొట్టిన చంద్రబాబు ఇప్పుడు మాట్లాడుతున్నారు. రాష్ట్రానికి అన్యాయం చేసిన పార్టీలకు గుణపాఠం తప్పదు.'

**హత్యచేసి శాంతి ర్యాలీ చేసినట్లుంది..**

హత్యచేసిన వ్యక్తి అదే హత్యకు వ్యతిరేకంగా శాంతి ర్యాలీ చేస్తే ఎలా ఉంటుందో కేంద్ర బడ్జెట్ నేపథ్యంలో ముఖ్యమంత్రి అసెంబ్లీలో చేసిన విమర్శలు, ప్రకటనలు అలాగే ఉన్నాయని జగన్ విమర్శించారు. 'ప్రత్యేక హోదా కాదని, ప్యాకేజీ ఇస్తామన్న కేంద్రానికి అసెంబ్లీలో ముఖ్యమంత్రి ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానాలు చేయించారు. అది తప్పని మేం ఆరోజు నల్లచొక్కాలతో అసెంబ్లీకి వస్తే మమ్మల్ని నానామాటలన్న చంద్రబాబే ఈ రోజు నల్లచొక్కా వేసుకొచ్చారు' అని పేర్కొన్నారు.

- జగన్ 4న దిల్లీ వెళ్లనున్నారు. రాష్ట్రంలో ఓట్లను గల్లంతు చేస్తున్నారని, వైకాపా సానుభూతిపరులు, తటస్థుల ఓట్లే లక్ష్యంగా ముందుకెళ్తున్నారని ఎన్నికల సంఘాని(ఈసీ)కి ఫిర్యాదు చేసేందుకు దిల్లీకి వెళుతున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.
- జగన్ తన జిల్లాల పర్యటన షెడ్యూల్‌లో మార్పు చేశారు. ఈ నెల నాలుగుకు బదులు 6నుంచి ఆయనపర్యటనలు మొదలుపెట్టనున్నారు.
- నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో జగన్ స్వగృహ ప్రవేశం చేయనున్నారు. తాడేపల్లిలో ఇల్లు, పక్కనే కార్యాలయాన్ని నిర్మించారు. ఇంటి నిర్మాణం పూర్తవడంతో ఈ నెల 14న ఉదయం 8:27గంటలకు జగన్ గృహప్రవేశానికి ముహూర్తం ఖరారు చేసినట్లు తెలిసింది.

# ఆంధ్రులకు ఆవేదనే

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేక హోదా లేదు... దుగరాజపట్నం పోర్టూ లేదు... విభజన హామీల్ని అమలు చేయాలన్న బాధ్యతను మోదీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది.

రాష్ట్ర ప్రజలు చేస్తున్న పోరాటాన్ని, ఆవేదనను కేంద్రం పట్టించుకోలేదు. రాష్ట్రానికి ఇంకా రూ.1.16 లక్షల కోట్లు ఇవ్వాల్సి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు తాజాగా రాసిన లేఖనూ పరిగణనలోకి తీసుకోలేదు. విదేశీ ఆర్థిక సహాయంతో చేపట్టే ప్రాజెక్టుల కేటగిరీలో.. విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్, డిజాస్టర్ రికవరీ ప్రాజెక్టుల వంటికి మాత్రం కంటితుడుపు కేటాయింపులతో సరిపెట్టింది. విభజన హామీలపై కేంద్రం కనీస దృష్టి సారించకపోవడం ఐదు కోట్ల ఆంధ్రులకు అంతులేని ఆవేదన మిగిల్చింది.

**సగం ఇచ్చినా బాగుండేది..!**

విభజన హామీ ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు ఐదేళ్ల పాటు ప్రత్యేక హోదా ఇస్తే కేంద్ర గ్రాంట్‌లు, రాయితీల రూపంలో రూ.16,447 కోట్ల మేర రాష్ట్రానికి లబ్ధి చేకూరేదని అంచనా. కానీ కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక హోదాపై మాట మార్చింది. హోదాతో సమానమైన ప్రయోజనాలతో ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని ప్రకటించింది. ఆపై దాన్ని అటకెక్కించింది. రాష్ట్ర ప్రభుత్వం కోరినట్లు దేశీయ ఆర్థిక సంస్థల నుంచి నేరుగా నిధులు సమకూర్చినా, రెవెన్యూ లోటు కింద రాష్ట్రానికి ఇవ్వాల్సిన మొత్తంలో కనీసం సగం ఇచ్చినా కొంత వెసులుబాటు లభించి ఉండేది. కానీ కేంద్రం మొండి వైఖరిని వీడలేదు. రాష్ట్రంలోని ఏడు వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ఈ బడ్జెట్‌లోనూ కేటాయింపులు జరపలేదు. మొత్తంగా 2017-18, 2018-19 సంవత్సరాలకు ఏపీకి ఇవ్వాల్సిన రూ.700 కోట్లు వెంటనే విడుదల చేయాలని నీతి ఆయోగ్ సిఫారసు చేసినా కేంద్రం పట్టించుకోలేదు.

**రాజధాని నిర్మాణానికి ఇచ్చిన హామీ ఏమైంది?**

ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్రం సహకరిస్తుందని విభజన చట్టంలో హామీ ఇచ్చారు. రాజధానిలో మౌలిక వసతుల కల్పనకు రూ.62,623 కోట్లతో కేంద్రానికి రాష్ట్రం సమగ్ర ప్రాజెక్టు సమర్పించింది. కానీ ఇంతవరకు కేంద్రం ఇచ్చింది కేవలం రూ.1500 కోట్లు. మరో రూ.వెయ్యి కోట్లు ఇస్తామని చెప్పినా... ఇంతవరకు అమలు కాలేదు.

**రెవెన్యూ లోటు పట్టించుకోరా?**

2014-15 ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ లోటు రూ.16,078.76 కోట్లుగా కాగ్ ధ్రువీకరించింది. లోటును పూర్తిగా చెల్లిస్తామన్న హామీని విస్మరించి కేంద్రం మాత్రం రూ.3,979.50 కోట్లు మాత్రమే చెల్లిస్తామని చెప్పింది. మిగతా రూ.12,099.26 కోట్లు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా... కేంద్రం పట్టించుకోలేదు. రాష్ట్రానికి ఐదేళ్ల పాటు జీఎస్టీ (కేంద్రం వాటా) రీయంబర్స్‌మెంట్, మొదటి ఐదేళ్ల ఆదాయపన్నులో కేంద్రం వాటా రీయంబర్స్‌మెంట్ వంటి రాయితీలు కోరినా... కేంద్రం ఇవ్వలేదు. విభజన చట్టం ప్రకారం రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం ఒక మేజర్ పోర్టును అభివృద్ధి చేయాలి.

**విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్‌పైనా నిర్లక్ష్యం**

విశాఖ-చెన్నై పారిశ్రామిక నడవా (వీసీఐసీ) అభివృద్ధి ప్రాజెక్టును జాతీయ పారిశ్రామిక నడవాల అభివృద్ధి, అమలు ట్రస్ట్ (ఎన్ఐసీడీఐటీ) పరిధిలోకి తీసుకురావాలని, డీఎంఐసీ తరహాలో వీసీఐసీకి కూడా నూరుశాతం నిధుల్ని గ్రాంట్ రూపంలో ఎన్ఐసీడీఐటీ నుంచి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని 2017 జూన్‌లో కోరింది. ఇంత వరకు స్పందన లేదు. ఈ ప్రాజెక్టుకు ఈ బడ్జెట్‌లో కేంద్రం రూ.675 కోట్లు మాత్రమే కేటాయించింది. విశాఖ, విజయవాడల్లో మెట్రో రైల్ ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తామన్న హామీనీ కేంద్రం విస్మరించింది.

- జాతీయ ప్రాజెక్టు పోలవరానికి కేంద్రమే పూర్తిగా నిధులు కేటాయించాల్సి ఉండగా నాబార్డు ద్వారా వాటిని అందిస్తామని మోదీప్రభుత్వం చెప్పింది. అయితే పూర్తయిన పనుల బిల్లులు ఆమోదించకపోవడంతో ఆ నిధులు విడుదల కావడం లేదు. ఈ ప్రాజెక్టుపై రాష్ట్రప్రభుత్వం ఇప్పటికే ఖర్చు చేసిన రూ.3500 కోట్ల నిధులనూ కేంద్రం విడుదల చేయడంలేదు. తాజా బడ్జెట్‌లో ఈ ప్రస్తావనలేవీ లేవు.

**కేసులకు భయపడే..**

ఈనాడు డిజిటల్, అమరావతి: కేసులకు భయపడి జగన్ ప్రధాని మోదీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర హక్కుల కోసం తెదేపా నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటుంది. విభజన హామీలను నెరవేర్చకుండా తప్పు చేశామని ప్రధాని మోదీ ఒప్పుకుని రాష్ట్రంలో అడుగుపెట్టాలి. ఈ నెల 10న మోదీ రాష్ట్రానికి రానున్న నేపథ్యంలో.. అదే రోజు 5 కోట్ల మంది రాష్ట్ర ప్రజలతో కలిసి నల్లరిబ్బన్లతో నిరసన తెలపబోతున్నాం. - **మీడియా పాయింట్‌లో మంత్రి జవహర్, ఎమ్మెల్యేలు బొండా ఉమా, నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు**

**బడ్జెట్ నిరాశాజనకం**

చివరి బడ్జెట్‌లో అయినా ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం న్యాయం చేస్తుందని ఆశించిన రాష్ట్ర ప్రజలకు నిరాశే మిగిలింది. నాడు పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన విభజన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత కేంద్రానికి ఉన్నా పట్టించుకోకుండా వ్యవహరించింది.

–ఎమ్మెల్సీలు కత్తి నరసింహారెడ్డి, శ్రీనివాసులరెడ్డి

**హోదా రాకుండా చేసింది బాబే**

రాష్ట్రానికి ప్రత్యేక హోదా రాకుండా చేసింది చంద్రబాబే. శాసనసభ, శాసనమండలిలో విభజన హామీలపై చర్చ సందర్భంగా ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది. ముఖ్యమంత్రి భాజపా ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజును ఉద్దేశించి మాట్లాడిన తీరుపై తీవ్రంగా ఖండిస్తున్నాం. పోలవరానికి సీఎంకు ఏం సంబంధం ఉంది. ఈ ప్రాజెక్టుకు కేంద్రం నిధులు విడుదల చేస్తుంటే నేనే చేయిస్తున్నానని సీఎం ఎలా చెబుతారు. –సోము వీర్రాజు, మాధవ్

# జనసేన మహిళా దళం

- 22 కమిటీల ఏర్పాటు
- తొలి జాబితాలో అంతా ఆడపడుచులే
- 200 మందికి అవకాశమిచ్చాం జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్



వీరమహిళ విభాగం ఛైర్‌పర్సన్ రేఖ జవ్వాజి



విధానాల విభాగం ఛైర్‌పర్సన్ యామిని జ్యోత్స్న

ఈనాడు–అమరావతి: జనసేన పార్టీ 200 మహిళలతో రాష్ట్రస్థాయి కమిటీలను నియమించింది. కమిటీల ఛైర్‌పర్సన్లు, వైస్ ఛైర్‌పర్సన్లు, పార్టీ అధికార ప్రతినిధులు, తదితరుల పోస్టులన్నింటినీ ఆడపడుచులతోనే భర్తీ చేసింది. కమిటీల తొలి జాబితాను పార్టీ అధినేత పవన్ కల్యాణ్ శుక్రవారం హైదరాబాద్‌లో ప్రకటించారు.

ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ... జనసేన పార్టీ మహిళలకు చట్ట సభల్లో 33శాతం రిజర్వేషన్లు కల్పించాలని గట్టిగా చెబుతోందని, పార్టీ పదవుల్లో వారికి సముచిత స్థానం ఇచ్చి నిబద్ధత చాటుకున్నామని అన్నారు. తమ పార్టీకి చెందిన దాదాపు 40 విభాగాల్లో మహిళలు బలమైన పాత్ర పోషించేలా చేస్తామన్నారు. ఆయా విభాగాలకు సంబంధించిన తొలి జాబితాలో 200 మంది మహిళలకు స్థానం కల్పించినట్లు చెప్పారు. డాక్టర్లు, లెక్చరర్లు, న్యాయవాదులు, ఐటీ నిపుణులతో పాటు గృహిణులకు కూడా ఈ కమిటీల్లో స్థానం కల్పించారు. పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీలోకి పలాసకు చెందిన పాండా సుజాతను తీసుకున్నారు. 'వీర మహిళ' కమిటీకి ఛైర్‌పర్సన్‌గా కర్నూలు చెందిన రేఖ జవ్వాజి, పార్టీ విధానాల కమిటీకి ఛైర్‌పర్సన్‌గా డాక్టర్ యామిని జ్యోత్స్న కంబాల (రాజమహేంద్రవరం)ను నియమించారు. తొలి జాబితాలో దాదాపు 22 కమిటీలను ప్రకటించారు. మలి జాబితాలు రెండు మూడు రోజుల్లో విడుదల కానున్నాయి.

**విద్యార్థులను విడుదల చేయండి...**

అమెరికాలో ఇమ్మిగ్రేషన్ అధికారుల అదుపులో ఉన్న భారతీయ విద్యార్థులకు అవసరమైన న్యాయసహాయం అందించి విడుదల చేయించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం చర్యలు తీసుకోవాలని పవన్‌కల్యాణ్ డిమాండ్ చేశారు. ఈ విషయంలో విద్యార్థులకు సహకరించాలని ఎన్నారై జనసేన ప్రతినిధులను ఒక ప్రకటనలో కోరారు.

(జనసేన పార్టీ కమిటీల్లో నియమితులైన మహిళల వివరాలు... ఈనాడు.నెట్‌లో)

ఈనాడు

# ఎన్నికల పద్దు

సార్వత్రిక ఎన్నికలకు ముందు ఎన్డీయే ప్రభుత్వ చివరి, మధ్యంతర బడ్జెట్ ప్రతిపాదనల్ని తాత్కాలిక ఆర్థికమంత్రి పీయూష్ గోయల్ పార్లమెంటుకు నిన్న సమర్పించారు. వివిధ సామాజిక వర్గాలకు తలా కొన్ని వరదానాలు దట్టించి మెప్పించే కూర్పుల్లో, ఈ కసరత్తు నిర్వహించిన మొట్టమొదటి ఛార్టర్డ్ అకౌంటెంట్‌గా ఆయన తన శక్తి యుక్తుల్ని గరిష్ఠంగా వినియోగించారు. ఇటీవలి అసెంబ్లీ ఎలెక్షన్ల భంగపాటు నేపథ్యంలో, కేంద్రంలో పునరధికారానికి పీయూష (అమృత) భాండం కొల్లగొట్టడమే ఏకైక 'గోల్'గా అనామతు పద్దును చాకచక్యంగా తీర్చిదిద్దారు! ఏడాదిక్రితం రూ.24.42 లక్షల కోట్ల బడ్జెట్లో సేద్యాన్ని గ్రామీణార్థికాన్ని పునరుత్తేజపరచి, మౌలిక రంగాన్ని బలోపేతం చేసి, ఆర్థికంగా బలహీనవర్గాలకు ఆరోగ్య రక్షణ చేకూర్చడమే ధ్యేయమని అరుణ్ జైట్లీ వెల్లడించారు. అప్పటితో పోలిస్తే రూ.3.42 లక్షల కోట్ల పెంపుదల నమోదైన తాజా బడ్జెట్లో రక్షణకు మూడులక్షల కోట్లు కేటాయించి, తక్షిన ప్రతిపాదనల్లో ఎన్నికల 'జోష్' నింపడానికి పీయూష్ శ్రమించారు. తెలంగాణ సర్కారు నిరుడు ప్రవేశపెట్టిన 'రైతుబంధు' తరహా పథకాన్ని కేంద్రం రూపొందించిందన్న అంచనాలను నిజం చేస్తూ 'ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్' తెరపైకి వచ్చింది. అందుకోసం కేటాయించిన రూ.75వేల కోట్ల నిధినుంచి అయిదెకరాల లోపు భూమి కలిగిన రైతులకు మూడు విడతల్లో ఏటా ఆరువేల రూపాయలు అందుకుంటారని అమాత్యులు చెబుతున్నారు. నష్టజాతకానికి పర్యాయపదమైన కౌలురైతుల సంగతేమిటో బడ్జెట్ ప్రసంగంలో ఎక్కడా ప్రస్తావనే లేదు. లక్షన్నర మేర పొదుపు పథకాల్లో మదుపు చేస్తే, ఆరున్నర లక్షల రూపాయల దాకా వార్షికాదాయం కలిగినవారు పన్ను చెల్లించనక్కర్లేదనడం- దిగువ శ్రేణి వేతనజీవులకు గొప్ప ఊరట. తద్వారా మూడుకోట్లమందికి లబ్ధి చేకూరనుందన్న ఆర్థిక శాఖామాత్యులు దేశంలో వ్యవసాయం తరవాత అత్యధికంగా సుమారు 12 కోట్లమందికి ఉపాధి కల్పిస్తున్న లఘు పరిశ్రమల సహేతుక డిమాండ్లపై శీతకన్నేశారు. ఉన్నంతలో 'కిసాన్ సమ్మాన్' అల్ప సంతోషం ముఖాలపై నవ్వులు పూయిస్తున్నా- రైతుకు జీవనభద్రతను, జాతికి ఆహారభద్రతను చేకూర్చే పకడ్బందీ కార్యాచరణ నేటికీ ఎండమావినే తలపిస్తోంది. పండించే ప్రతి గింజకూ సరైన గిట్టుబాటు దక్కిన పక్షంలో, వార్షిక తోడ్పాటును ఏ శ్రమజీవీ ఆశించనక్కర్లేని ఆ ఒక్కరోజు తొలిపొద్దులేని యధార్థం!

బిబేక్ దెబ్రాయ్ సారథ్యంలోని ఆర్థిక సలహా మండలి సామాజికార్థిక పురోగతిని లక్షించి అనుసరించదగ్గ శ్రేయోమార్గమేమిటో వారం క్రితం వివరణాత్మక నివేదికలో పొందుపరచింది. వ్యవసాయ, ఆర్థిక రంగాల్లో కీలక సంస్కరణలతోపాటు సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమ (ఎమ్ఎస్ఎమ్ఈల)లు, నైపుణ్యాభివృద్ధి, రుణపరమైన అంశాలు, డిజిటల్ చెల్లింపులు తదితరాల్లో సత్వర దిద్దుబాటు చర్యల ఆత్యావశ్యకతను ప్రముఖంగా ప్రస్తావించింది. పోషకాహారం, పారిశుద్ధ్యం, వాయుకాలుష్య నియంత్రణ, వ్యాధుల కట్టడికి సంబంధించి కేటాయింపులు రెండింతలు కావాలన్న సూచనలూ గట్టిగా వినవచ్చాయి. రహదారులు, వాయు రైలు జల రవాణా పద్ధతులు మౌలిక వ్యయం 22శాతంనుంచి 30శాతానికి పెరగాలని తమవంతుగా పర్యాటక సంస్థలు అభ్యర్థనలు సమర్పించాయి. వాటన్నింటినీ 2030 సంవత్సరానికి ఆచరణలోకి తేదగిన దశ సూత్ర ఆకాంక్షల అజెండాలో పొందుపరచిన విత్తమంత్రి- స్వస్థ భారత్, సేంద్రియ సేద్యాల వంటి ఆశల మాలికలు అల్లారు. భారత్‌లో తయారీ (మేకిన్ ఇండియా) నుంచి నాణ్యమైన విద్యవరకు పలు అంశాల్ని స్పృశించినా- మధ్యతరగతిపై వరాల జల్లు కురిపించడానికే అమాత్యులు అధిక సమయం వెచ్చించారు. షెడ్యూల్డు కులాలు, తెగల సంక్షేమ నిధికి 35శాతం పెంపుతో రూ.76,800 కోట్ల కేటాయింపులు అనుగ్రహించారు. అటు ఈశాన్య భారతానికి సుమారు రూ.58 వేల కోట్లు ప్రసాదించిన బడ్జెట్ ఈసారీ తెలుగు రాష్ట్రాల ఆకాంక్షలకు చెవొగ్గలేదు. యాభైకోట్ల జనావళికి 'ఆయుష్మాన్ భారత్' ఆపన్న మనదగ్గ రీతిలో మేలు చేయగలదంటున్నా- గ్రామ స్థాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్ని పస్తు పెట్టినన్నాళ్ళు, రోగార్తులకు నికర ఊరట దక్కదు. దేశ జనాభాలో మూడింట రెండొంతులున్న యువతకు సొంత కాళ్లపై నిలబెట్టగల యోజనలకు బడ్జెట్లో చోటు దక్కనేలేదు. తయారీ, ఆరోగ్యం, మౌలిక వసతుల రంగాలపై ఇతోధిక పెట్టుబడులు ఉపాధి కల్పనను ఉరకలెత్తిస్తాయని నిపుణులెందరు హితవు పలుకుతున్నా అటువైపు దృష్టి సారించకపోవడం నిన్నటి బడ్జెట్ వంటకంలో ప్రధాన లోపమనే చెప్పాలి.

'ఇది ఓటాన్ అకౌంట్ కాదు... సొంత అకౌంట్లో ఓట్లు వేయించుకునే విన్యాస'మని మాజీ ఆర్థికమంత్రి చిదంబరం నిన్న తృణీకరించారు. క్రితంసారి సార్వత్రిక ఎన్నికలకు ముందు 2014-15 మధ్యంతర బడ్జెట్ ప్రసంగంలో పరోక్ష పన్నుల విధానానికి సంబంధించి ఆయనే పలు మార్పులు ప్రతిపాదించారు. అప్పట్లో రక్షణ బలగాల కోసం 'ఒకే ర్యాంకు-ఒకే పింఛను' సూత్రానికి ఆమోదం తెలిపింది యూపీఏ అమాత్యులే. అంతకు మునుపు 2009-10 తాత్కాలిక బడ్జెట్లో ప్రణబ్ ముఖర్జీ సైతం కొన్ని కీలక ప్రకటనలు చేశారు. తాము చేస్తే ఒప్పు, అదే ఇతరులు చేస్తే తప్పు అన్న చందంగా విచిత్ర భాష్యాలకు ఎవరేగా తెగబడినా- అంతిమంగా నిర్ణయాక పట్టంలో తీర్పివ్వాల్సింది ఓటర్లే! నవభారత నిర్మాణం కోసం తమ ప్రభుత్వం కంకణబద్ధమైనట్లు పదహారో లోక్‌సభ చివరి సమావేశాల ప్రారంభం సందర్భంగా రాష్ట్రపతి కోవింద్ నోట పలికించిన ఎన్డీయే సర్కారు, నిన్నటి బడ్జెట్లోనూ సర్వతోముఖ వికాస సాధనకే గట్టిగా ఓటేసింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుకోసం కేటాయింపులు పెంచామని, పేదల రైతులు శ్రామికులు పింఛన్‌దారులకు లబ్ధి చేకూర్చేలా బడ్జెట్ రూపొందించామని కేంద్రం సగర్వంగా చాటుకుంటోంది. తాత్కాలికంగా ఒనగూడే ప్రయోజనాలు, జీవన పోరాటంలో డస్సిపోతున్న వర్గాల స్థితిగతుల్ని శాశ్వతంగా మార్చలేవు. దేశార్థికానికి వెన్నెముక అయిన గ్రామీణ భారత ముఖచిత్రాన్ని తేటపరచలేవు. 'ప్రధానమంత్రి శ్రమ యోగి మాన్‌ధన్' పేరిట నెలనెలా వంద రూపాయలు కడితే అరవై ఏళ్ల వయసు వచ్చాక నెలకు మూడు వేల రూపాయల పింఛను అందిస్తామనడం- అసంఘటిత రంగాన నిజంగా ఎన్ని జీవితాల్ని నిలబెడుతుంది? సేద్యరంగాన, పల్లెపట్టుల్లో నెలకొన్న నైరాశ్యాన్ని తరిమికొట్టాలి. వచ్చే అయిదేళ్లలో లక్ష డిజిటల్ గ్రామాల్ని అవతరింపజేస్తామనడం కాదు- ఉన్న ఊళ్లోనే విద్య, వైద్యం, ఉపాధి, వినోదం, వికాసం సమకూర్చే ప్రణాళికతో వలసల్ని సైతం అరికట్టాలి. కోట్లాది భారతీయుల జీవన ప్రమాణాల మెరుగుదలకు దోహదపడాల్సిన బడ్జెట్ భారీ కసరత్తు అర్థసత్యాల మాటున 'అనామతు'గా మిగిలిపోకూడదు. ఎన్నికల అనంతరం కొలువుతీరే ఏ పార్టీ ప్రభుత్వమైనా ఆ స్ఫూర్తికి నిబద్ధతతో గొడుగు పట్టడమే జాతి సమగ్ర వికాసానికి తొలిమెట్టు కాగలదు!

# విరజిమ్మని విద్యుత్ వెలుగులు

దేశంలో విద్యుదుత్పత్తి సామర్థ్యం రికార్డుస్థాయిలో పెరుగుతోంది. గత నెలాఖరునాటికి విద్యుదుత్పత్తి కేంద్రాల స్థాపిత సామర్థ్యం 3.49 లక్షల మెగావాట్లను దాటిపోయిందని కేంద్రీయ విద్యుత్ మండలి (సీఈఏ) తాజా నివేదిక వెల్లడించింది. కానీ గత నెలలో రోజూవారీ గరిష్ఠ గిరాకీ 1.63 లక్షల మెగావాట్లే ఉండటం గమనార్హం. అంటే మొత్తం అందుబాటులో ఉన్న విద్యుదుత్పత్తి సామర్థ్యంలో గరిష్ఠ డిమాండు 47 శాతానికి సమానం. సంప్రదాయేతర విద్యుత్ (ఆర్ఈ) ఉత్పత్తి ఏటికేడు అధికం అవుతున్నందువల్ల థర్మల్ కేంద్రాలు తీవ్ర ఒత్తిడిలో ఉన్నాయి. వినియోగం ఇనుమడిస్తేనే వాటికి మనుగడ అని తాజా నివేదికలు ఘోషిస్తున్నాయి. దేశంలో విద్యుదుత్పత్తి పెరుగుదల వృద్ధిరేటు నిరుటితో పోలిస్తే 3.63 శాతమే ఉంది. దేశవ్యాప్తంగా 2017 డిసెంబరులో 9,700 కోట్ల యూనిట్లను ఉత్పత్తి చేయగా, ఏడాది తరవాత 2018 డిసెంబరులో 10,000 కోట్ల యూనిట్ల ఉత్పత్తి జరిగింది. ప్రస్తుతం అన్ని రకాల ఇంధన ఉత్పత్తిలో సంప్రదాయేతర విద్యుత్ వాటా 21.2 శాతానికి చేరినట్లు సీఈఏ వెల్లడించింది. కానీ దాన్ని సర్దుబాటు చేయడానికి థర్మల్ కేంద్రాలను



ఉత్పత్తి శాతం 20 లోపే ఉంటోంది. దాన్ని 24 గంటలూ పొందడం సాధ్యం కానందువల్ల థర్మల్ కేంద్రాలను నడపక తప్పదు. కానీ, కనీస ఉత్పత్తి సామర్థ్యంకన్నా తక్కువకు నడపటం వల్ల అవి నష్టపోతున్నాయి. ఈ నష్టాలనూ ఏడాది చివరికి ప్రజలపైనే రుద్దుతున్నాయి. దేశంలో విద్యుదుత్పత్తి గణనీయంగా పైకెగబాకిందని ఘనంగా చెబుతున్నారు. కానీ వినియోగం ఎంత పెరిగిందనే దానిపైనే అభివృద్ధి ఎలా ఉందనేది అర్థమవుతుంది. దేశ ప్రజల తలసరి విద్యుత్ వినియోగాన్ని బట్టి అక్కడి అభివృద్ధి ఎలా ఉందో చెప్పవచ్చు. ఉదాహరణకు కెనడాలో తలసరి వినియోగం ఏటా 16 వేల యూనిట్లు ఉంటే భారత్‌లో గత ఆర్థిక సంవత్సరంలో 1,149 యూనిట్లే ఉంది. ఇందులోనూ రాష్ట్రాల మధ్య చాలా వ్యత్యాసం ఉంటోంది. తెలంగాణలో తలసరి వినియోగం 1,500 యూనిట్లు దాటిపోగా కొన్ని రాష్ట్రాల్లో అందులో రెండొంతులే ఉంటుంది. అందరికీ విద్యుత్ అంటే ఒక ఇంటిలో ఒక్క విద్యుత్ దీపమైనా వెలిగితే చాలు, అదే అభివృద్ధి అని పాలకులు ప్రచారం చేసుకుంటున్నారు. కానీ అభివృద్ధి అంటే విద్యుత్ అధికంగా వినియోగించే పరిశ్రమలు రావాలి. ఉత్పత్తి సామర్థ్యం పెరిగినంత వేగంగా వినియోగ వృద్ధిరేటూ ఇనుమడిస్తేనే విద్యుత్కేంద్రాలు నిలదొక్కుకుంటాయి.

మూసివేయాల్సి వస్తోందని పలు విద్యుత్ సంస్థలు చెబుతున్నాయి. 12వ ప్రణాళికలో థర్మల్ కేంద్రాలంత వేగంగా జల, అణు విద్యుత్కేంద్రాల నిర్మాణం పూర్తి కాలేదు. ఈ ప్రణాళికలో 72,340 మెగావాట్ల సామర్థ్యమున్న థర్మల్ కేంద్రాలను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకోగా 91,730 సామర్థ్యం గలవాటిని నిర్మించారు.

## ఉత్పత్తిలో మందగమనం

మరోవైపు జల, అణు విద్యుత్కేంద్రాలు 11,197 మెగావాట్లకు గాను 7479 మెగావాట్లవే పూర్తయ్యాయి. వాస్తవానికి థర్మల్‌కన్నా జల విద్యుత్ చౌక. అయినా ఖరీదైన థర్మల్ కేంద్రాల నిర్మాణాలు పూర్తవుతున్నా వాటిలో ఉత్పత్తి మాత్రం పెద్దగా జరగడం లేదు. ఉదాహరణకు రోజుకు వెయ్యి మెగావాట్ల థర్మల్ విద్యుత్కేంద్రాన్ని నిర్మిస్తే అందులో 'సాంకేతిక కనిష్ఠ లోడు' (టీఎమ్ఎల్) ప్రకారం 60 శాతం (600 మెగావాట్ల) విద్యుదుత్పత్తి ప్రతి రోజూ సాధ్యపడాలి. దీన్ని ప్లాంటు లోడు ఫ్యాక్టర్ (పీఎల్ఎఫ్) అని వ్యవహరిస్తారు. కానీ తక్కువ సామర్థ్యంతోనే చాలా థర్మల్ కేంద్రాలను నడుపుతున్నారు. 2017 జనవరి నుంచి డిసెంబరు వరకూ దేశవ్యాప్తంగా థర్మల్ కేంద్రాల పీఎల్ఎఫ్ 58.72 శాతం. 2018 ఏడాది మొత్తం కలిపి 60.48కి చేరింది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన థర్మల్ కేంద్రాల పీఎల్ఎఫ్ 73 శాతముంటే, ప్రైవేటు రంగానివి 48.51, రాష్ట్ర ప్రభుత్వాలవి 57.96 శాతమే ఉన్నాయి. థర్మల్ కేంద్రాల టీఎమ్ఎల్ ఒక్కో శాతం తగ్గేకొద్దీ బొగ్గుతో పాటు 'భారీ ఫర్నేస్ ఆయిల్' (హెచ్ఎఫ్ఓ) సైతం కలిపి వాడాలి. లేకపోతే థర్మల్ కేంద్రంలో బాయిలర్ మంట సరిగ్గా ఉండక విద్యుత్ సక్రమంగా ఉత్పత్తి కాదు. ప్రస్తుతం హెచ్ఎఫ్ఓ ధర లీటరుకు రూ.42 వరకూ ఉంది. విద్యుత్ గిరాకీ లేక ఉత్పత్తి తగ్గిస్తే ఇలా అదనంగా ఆయిల్ కొనేందుకు అయ్యే అదనపు వ్యయం విద్యుత్కేంద్రాలపై పడుతుంది. దీనివల్ల అంతిమంగా యూనిట్‌కు గరిష్ఠంగా రూపాయిన్నర దాకా అదనపు భారం మోయాల్సి వస్తుంది.

దేశంలో ప్రస్తుతం సంప్రదాయేతర ఇంధన ఉత్పత్తికి కేంద్రం ప్రోత్సాహకాలు ఇస్తోంది. సౌర, పవన, జల విద్యుదుత్పత్తి పెరిగేకొద్దీ దాన్ని విద్యుత్ లైన్లలోకి తీసుకోవడానికి థర్మల్ కేంద్రాల్లో ఉత్పత్తి తగ్గించక తప్పదు. సౌర విద్యుత్ పగలు ఎండ ఉన్న సమయంలోనే అధికంగా వచ్చి రాత్రి సమయంలో ఆగిపోతుంది. మధ్యాహ్నం థర్మల్ కేంద్రాల్లో తగ్గించి

**2018లో ఉత్పత్తి శాతం**

| నెల | విద్యుదుత్పత్తి |
|---|---|
| జనవరి | 62.88 |
| ఫిబ్రవరి | 62.85 |
| మార్చి | 65.58 |
| ఏప్రిల్ | 64.58 |
| మే | 65.54 |
| జూన్ | 59.17 |
| జులై | 55.45 |
| ఆగస్టు | 56.39 |
| సెప్టెంబరు | 61.09 |
| అక్టోబరు | 65.24 |
| నవంబరు | 61.58 |
| డిసెంబరు | 60.48 |

## ఇబ్బందుల్లో 'థర్మల్' కేంద్రాలు

తిరిగి రాత్రిపూట ఉత్పత్తి పెంచాలి. ఈ సమయంలో టీఎమ్ఎల్ నిర్వహణకు హెచ్ఎఫ్ఓ వాడక తప్పదు.

ఐరోపా దేశాల్లో సంప్రదాయ, సంప్రదాయేతర ఇంధన ఉత్పత్తి కేంద్రాల మధ్య సమతుల్యత కోసం 2017లో నిర్ణీత లోడుకన్నా అదనంగా విద్యుత్ వాడుకుంటే వినియోగదారులకే డబ్బు చెల్లిస్తున్నారు. అంటే విద్యుత్ వాడుకుంటే వినియోగదారుడు కాకుండా విద్యుత్ కంపెనీలే ఎదురు డబ్బు ఇచ్చాయి. కానీ భారత్‌లో అలాంటి పరిస్థితి రాదని, పెరుగుతున్న వినియోగం వల్ల విద్యుత్ గిరాకీ, వృద్ధిరేటుకు సైతం రెక్కలొస్తాయని అంచనా. ఓ వైపు సంప్రదాయేతర ఇంధన ఉత్పత్తి వ్యయం నానాటికీ తగ్గుతుంటే, మరోవైపు కొత్త థర్మల్ కేంద్రాల నిర్మాణ వ్యయం ఆకాశాన్ని అంటుతోంది. దేశంలో కొత్తగా ఏర్పాటవుతున్న సౌరవిద్యుత్ కేంద్రాల నుంచి యూనిట్‌ను మూడు రూపాయల లోపే ఇస్తామని ప్రైవేటు కంపెనీలు ముందుకొస్తున్నాయి. కానీ కొత్త థర్మల్ కేంద్రం నిర్మించి విద్యుత్ ఇవ్వాలంటే యూనిట్‌కు కనీసం ఆరేడు రూపాయల వరకూ చెల్లించాలని గణాంకాలు ఘోషిస్తున్నాయి. తక్కువ ధరకు వస్తుంది కదా అని పూర్తిగా సంప్రదాయేతర ఇంధనంపైనే ఆధారపడటమూ సాధ్యం కాదు. సౌరవిద్యుత్ కేంద్రాల

## మెరుగుపడని పంపిణీ వ్యవస్థలు



దేశంలో ప్రతి ఇంటికీ విద్యుత్ సదుపాయం కల్పించడానికి 'సౌభాగ్య' పథకాన్ని కేంద్రం అమలు చేస్తోంది. తొలుత పేర్కొన్న లక్ష్యం మేరకు గత నెలాఖరునాటికే ఈ పథకం కింద ప్రతి ఇంటిలో విద్యుత్ దీపం వెలగాలి. కానీ లక్ష్యం నెరవేరనందువల్ల ఈ ఏడాది మార్చి వరకూ గడువు పొడిగించారు. దాదాపు మూడు కోట్ల ఇళ్లకు అదనంగా విద్యుత్ సదుపాయం ఏర్పడితే దేశంలో వినియోగం, గిరాకీ పెరుగుతాయని కేంద్రం అంచనా. అందుకు అనుగుణంగా సరఫరా లైన్ల నిర్మాణం మాత్రం జరగడం లేదు. 2017 ఏప్రిల్-డిసెంబరు మధ్యకాలంలో 16,236 క్యూబిక్ కిలోమీటర్ల (సీకేఎం) విద్యుత్ లైన్లు నిర్మితమైతే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అదే తొమ్మిది నెలల్లో 14,974 సీకేఎంలే పూర్తయ్యాయి. ఫలితంగా విద్యుత్ అదనపు సరఫరా సామర్థ్యం పెరగలేదు. దేశంలో విద్యుదుత్పత్తి కేంద్రాలు నిర్మించినంత వేగంగా సరఫరా, పంపిణీ వ్యవస్థలు మెరుగుపడకపోవడం వల్ల సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి.

## వినియోగంలో వెనకబాటు

గిరాకీ ఎక్కువ కానందువల్ల 45 వేల మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యమున్న కొత్త థర్మల్ కేంద్రాలు అప్పుల ఊబిలో చిక్కుకున్నాయి. వాటి నిర్మాణ అంచనా వ్యయాల కన్నా తక్కువకే వేలంలో అమ్మేయడానికి వాటికి అప్పులిచ్చిన బ్యాంకులు సిద్ధపడుతున్నాయి. సంప్రదాయేతర ఇంధన ఉత్పత్తి కేంద్రాల స్థాపనలో రికార్డులు సృష్టించామని చెబుతున్న కేంద్రం, ఈ థర్మల్ కేంద్రాలు ఎందుకు ఆర్థిక సంక్షోభంలో ఉన్నాయనే దానికి సమాధానం చెప్పాల్సి ఉంటుంది. దేశంలో కొత్తగా అందుబాటులోకి వస్తున్న సంప్రదాయేతర ఇంధన వనరులను సక్రమంగా వాడుకోవాలంటే అందుకు అనుగుణంగా దేశవ్యాప్తంగా సరఫరా, పంపిణీ వ్యవస్థలను తక్షణం మెరుగుపరచాలి. పగలు సౌరవిద్యుత్ ఉత్పత్తి అధికమయ్యే సమయంలో థర్మల్ కేంద్రాలు మూతపడరాదంటే, అదే నిష్పత్తిలో వినియోగం ఉండాలి. కొన్ని జల విద్యుత్ కేంద్రాల్లో 'రివర్సిబుల్ పంపింగ్' విధానంలో విద్యుత్ వాడుతున్నారు. అంటే జల విద్యుత్ ఉత్పత్తి సమయంలో ప్రాజెక్టు నుంచి కిందకు వదిలిన నీటిని తిరిగి జలాశయంలోకి వెనక్కు పంపడానికి విద్యుత్ కేంద్రాన్ని నడుపుతున్నారు. ఇలా నీటిని వెనక్కి తీసుకురావడానికి విద్యుత్ వినియోగమవుతుంది. ఇలా అధిక వినియోగం వల్ల థర్మల్ కేంద్రాలు మూతపడకుండా అక్కడ ఉత్పత్తి చేసే విద్యుత్‌ను జల విద్యుత్‌కేంద్రాల్లో వాడుకోవడానికి వీలవుతుంది. ప్రస్తుతం దేశంలో కొత్తగా నిర్మించే జలవిద్యుత్ కేంద్రాల్లో రివర్సిబుల్ పంపులను తప్పనిసరి చేయాలని కేంద్రం యోచిస్తోంది. దీనివల్ల విద్యుత్ వినియోగాన్ని పెంచవచ్చు. అయితే ఇది అభివృద్ధికి సూచిక కాదు. పరిశ్రమలు, ఇళ్లలో వినియోగం పెరిగితే అభివృద్ధి పథంలో పయనిస్తున్నట్లు అర్థం. ప్రజల తలసరి వినియోగం అధికం కానంత కాలం విద్యుదుత్పత్తి సామర్థ్యం ఎంత పెరిగినా పెద్దగా ఫలితాలు ఉండవు. యూనిట్ విద్యుత్ ఉత్పత్తికి ఆరేడు రూపాయలు ఖర్చయ్యే స్థాయిలో ప్లాంట్లు నిర్మించి, వాటిని పూర్తిస్థాయిలో నడపకుండా మూతపెట్టడం ఏ స్థాయి ప్రగతి అనేది పాలకులకే తెలియాలి!

**దేశంలో తలసరి వినియోగం**

| సంవత్సరం | యూనిట్లు |
|---|---|
| 2007-08 | 717 |
| 2008-09 | 733 |
| 2009-10 | 778 |
| 2010-11 | 818 |
| 2011-12 | 883 |
| 2012-13 | 914 |
| 2013-14 | 957 |
| 2014-15 | 1,010 |
| 2015-16 | 1,075 |
| 2016-17 | 1,122 |
| 2017-18 | 1,149 |

– మంగమూరి శ్రీనివాస్

# బలపడనున్న బంధం

డొనాల్డ్ ట్రంప్ హయాములో అమెరికా ప్రపంచ అధినాయక పాత్రను వదులుకొంటున్నందున, చైనా, ఐరోపా సమాఖ్య (ఈయూ)లు క్రమంగా ప్రాబల్యం పెంచుకోవడానికి రంగం సిద్ధమవుతోంది. దీనితో రేపు అవతరించనున్న త్రిధ్రువ ప్రపంచంలో భారత్‌కు కొత్త అవకాశాలు చేజిక్కనున్నాయి. భారత్‌ను అమెరికా ఇప్పటికే సైనిక వ్యూహపరమైన భాగస్వామిగా గుర్తించగా, ఈయూ సైతం భారత్‌తో బంధాన్ని బలపరచుకోవడానికి గత నవంబరులో వ్యూహపత్రం విడుదల చేసింది. వివిధ రంగాల్లో ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లు, భద్రతపరమైన ముప్పులను కలసికట్టుగా ఎదుర్కోవడం, ఐక్యరాజ్య సమితి, ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ)లు కేంద్రంగా నియమబద్ధ, బహుళపక్ష ప్రపంచ వ్యవస్థ నిర్మాణం, సుస్థిర ఆధునికీకరణ తమ లక్ష్యాలని ఆ పత్రం పేర్కొంది. వీటిని సాధించడానికి భారత్‌తో చేతులు కలుపుతామని ఉద్ఘాటించింది. తదనుగుణంగా జనవరి 22- 24 మధ్య ఈయూ సైనిక ప్రతినిధులు ముంబయి, దిల్లీలలో భారతీయ రక్షణాధికారులతో సమావేశమయ్యారు. ఫ్రెంచి యుద్ధనౌక కాసార్డ్ ముంబయి రేవుకు వచ్చినపుడు సముద్రాలలో చౌర్యాన్ని అరికట్టి నౌకారవాణాకు భద్రత కల్పించడంపై చర్చించారు. హిందూ మహాసముద్రంలో ఈయూ, భారత్ రక్షణ సహకారాన్ని బలోపేతం చేయాలని నిర్ణయించారు.

## వ్యూహపత్రం... దిశానిర్దేశం

దక్షిణ చైనా సముద్రం మొదలుకొని హిందూ మహాసముద్రం వరకు, ఆర్కిటిక్ మొదలుకొని అట్లాంటిక్ మహా సముద్రం వరకు చైనా నౌకల సంచారం పెరిగిన దృష్ట్యా భారత్‌తో రక్షణ బంధాన్ని పటిష్ఠపరచుకోవాలని ఈయూ వ్యూహపత్రం ఉద్దేశిస్తోంది. సోమాలియా ప్రజలకు ఐక్యరాజ్య సమితి ప్రపంచ ఆహార సహాయ కార్యక్రమం కింద ఆహార ధాన్యాలు సరఫరా చేసే నౌకలకు ఈయూ నౌకా బలగం (ఈయూ నావ్‌ఫోర్) రక్షణ కల్పిస్తోంది. ఈ బలగం ప్రతినిధులు కాసార్డ్ నౌకలో ముంబయి వచ్చి భారత రక్షణ ప్రతినిధులతో సంభాషించారు. భారత నౌకాదళం గతేడాది డిసెంబరు 24, 25లలో నావ్‌ఫోర్‌తో కలసి ఆహార నౌకలకు రక్షణ కల్పించింది. సముద్రంలో సరకుల రవాణా నౌకలను అడ్డగించి ఆహారం, తదితర వస్తువులను దోపిడీ చేసే సోమాలీ బందిపోట్ల ఆట కట్టించడానికి ఈయూ నావ్‌ఫోర్‌తో భారత్ చేతులు కలుపుతోంది. హిందూ మహాసముద్రానికి సంబంధించిన సమాచారాన్ని సేకరించి విశ్లేషించే భారత నౌకాదళ సమాచార కేంద్రం (ఐ.ఎఫ్.సి-ఐఓఆర్)కు బ్రిటన్‌లోని ఈయూ మారిటైమ్ సెక్యూరిటీ సెంటర్‌తో ఇప్పటికే అనుసంధానం ఏర్పడింది. భారత్‌తో పాటు ఈయూ దేశాల మీద కూడా ఉగ్రవాదుల దాడులు పెరిగిన నేపథ్యంలో ఉగ్రవాద భావజాలాన్ని నిరోధించే కార్యక్రమాలను ఉమ్మడిగా చేపట్టాలని ఈయూ వ్యూహపత్రం నిర్దేశించింది. అంతర్జాలంలో ఉగ్రవాద, తీవ్రవాద ప్రచారాంశాలను తొలగించడం, ఉగ్రవాదులకు నిధులు అందకుండా నిరోధించడంతోపాటు, సైబర్ దాడులను అడ్డుకోవడానికీ సహకరించుకోవాలన్నది ప్రధాన లక్ష్యాలు.

భారత్, ఐరోపా సమాఖ్య (ఈయూ)ల మధ్య వాణిజ్యం దినదినాభివృద్ధి చెందుతోంది. చాలా ఏళ్ల నుంచి భారత్‌కు ఈయూయే అతిపెద్ద వ్యాపార భాగస్వామి. చైనా, అమెరికా ఆ తరవాతి స్థానాల్లో ఉన్నాయి. 2017లో



## భారత్, ఈయూ సంబంధాలు

భారత్ అంతర్జాతీయ వాణిజ్యంలో 13.1 శాతం ఈయూతో, చైనాతో 11.4 శాతం, అమెరికాతో 9.5 శాతం వ్యాపారం జరిగింది. ఈయూకు ఐటీ తదితర సేవల ఎగుమతిలోనూ భారత్ ముందంజ వేస్తోంది. ఐరోపా సమాఖ్యకు సేవల ఎగుమతిదారులలో భారతదేశానిది నాలుగో స్థానం.

ఈయూ నుంచి దేశానికి భారీగా పెట్టుబడులు ప్రవహిస్తున్నాయి. భారత్‌లో వివిధ రంగాల్లో ఈయూ పెట్టుబడులు 7,300 కోట్ల యూరోలకు చేరాయి. 2016లో భారత్ సైతం ఈయూలో 490 కోట్ల యూరోలు పెట్టుబడి పెట్టింది. భారత్‌లో దాదాపు 6,000 ఈయూ కంపెనీలు ఉత్పత్తి, వ్యాపారం సాగిస్తూ 12 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. పరోక్షంగా మరో 50 లక్షల మందికి ఉపాధి చూపుతున్నాయి. భారత్-ఈయూ ఆర్థిక, వ్యాపార సంబంధాలు ఇంతకన్నా ఎన్నో రెట్లు మిన్నగా వృద్ధి చెందగలవు. మౌలిక వసతులు, రవాణా, టెలి కమ్యూనికేషన్లు, పరిశ్రమల రంగాల్లో ఈయూకు చెందిన అనేక కంపెనీలు అగ్రగాములుగా రాణిస్తున్నాయి. ఈ రంగాల్లో కొత్త పెట్టుబడులతోపాటు సాంకేతికతను, అనుభవాన్ని భారతీయ కంపెనీలకు అందించి తామూ వ్యాపారాన్ని విస్తరించుకోగలుగుతామని ఈయూ కంపెనీలు భావిస్తున్నాయి.

## పెట్టుబడులకు సుముఖం

పారిస్ వాతావరణ ఒప్పందం నుంచి అమెరికా వైదొలగినా ఈయూ, భారత్ దానికి నిబద్ధులై ఉన్నందున పర్యావరణ రక్షణ, హరిత ఇంధనాల రూపకల్పన, హరిత నగరాల విస్తరణకు సంబంధించి కొత్త సాంకేతికతల సృష్టిలో భాగస్వామ్యం పెంపొందించుకోనున్నాయి. హరిత వ్యాపారాల వృద్ధికి చెట్టపట్టాల్‌గా ముందుకు సాగాలని ఈయూ వ్యూహపత్రం లక్షిస్తోంది. పర్యావరణహితమైన ఆధునిక సాంకేతికతలతో సుస్థిరాభివృద్ధి సాధించాలని ఉద్దేశిస్తోంది. సుస్థిర ఆధునికీకరణకు పెట్టుబడులు అందించడానికి ఐరోపా పెట్టుబడి బ్యాంకు (ఈఐబి) సుముఖంగా ఉంది. ఈ బ్యాంకు భారత్‌లో మౌలిక వసతుల కల్పన, పునరుత్పాదక వనరులతో విద్యుదుత్పాదన, వాతావరణహిత ప్రాజెక్టులలో ఇప్పటికే 2.500 కోట్ల యూరోల పెట్టుబడి పెట్టింది. భారత్‌తోపాటు మిగతా ఆసియా దేశాలతో కలసి పర్యావరణపరంగా, సాంఘిక, ఆర్థిక పరంగా సుస్థిరాభివృద్ధి సాధనకు ఈయూ కట్టుబడి ఉంది. భారతదేశ సముద్ర తీరంలో ప్రప్రథమ పవన విద్యుత్కేంద్ర నిర్మాణానికి ఈయూ సాంకేతిక సహకారం అందిస్తోంది. సౌరపార్కుల ప్రాజెక్టుకూ తోడ్పడుతోంది. భారత్, ఈయూల మధ్య వ్యక్తులు, సంస్థల సమాచార (డేటా) రక్షణకు వ్యూహపత్రం నిబద్ధత చాటింది. ఈ డిజిటల్ యుగంలో డేటా ఆధారంగా కొత్త వ్యాపారాలు విస్తరిస్తాయి. అందువల్ల సహకారాన్ని వృద్ధి చేసుకుందామని పిలుపు ఇచ్చింది. ఇందుకు భారత్ సముచిత చట్టంతో సిద్ధంగా ఉండాలన్నది.

రక్షణపై తగినంత వ్యయం చేయకుండా ఉత్తర అట్లాంటిక్ సైనిక కూటమి (నాటో) భారమంతా అమెరికా మీదనే మోపుతోందని ట్రంప్ విమర్శించడం ఐరోపా దేశాలను ముల్లులా సలుపుతోంది. అందుకే ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ ఐరోపా దేశాలు సొంత సైన్యాన్ని ఏర్పాటు చేసుకోవాలని పిలుపు ఇవ్వగా జర్మనీ దాన్ని సమర్థించింది. ఈ ప్రతిపాదన ఇప్పుడప్పుడే సాకారం కాకపోయినా నాటో రానురానూ రక్షణ వ్యయాన్ని పెంచుకొంటూ తన కాళ్లపై తాను నిలబడటానికి ప్రయత్నిస్తోంది. నాటోలో ఫ్రాన్స్, జర్మనీ సభ్యదేశాలే. అమెరికా, బ్రిటన్‌లను కలుపుకొని మొత్తం 29 దేశాలు నాటో సభ్యులుగా ఉన్నాయి. నాటోతో భారత్ రక్షణ బంధం క్రమక్రమంగా పటిష్ఠం కానున్నదని ఈయూ వ్యూహపత్రం సూచిస్తోంది!

– ఆర్య

# మొగలి చెండు

అపురూపమైనదాన్నీ మనం అనివార్యంగా వదులుకోవలసి వచ్చినప్పుడు దేనికోసం అలా చేస్తున్నామో, అందులో ఏమైనా అధిక ప్రయోజనం ఉందా అని మళ్ళీ పరిశీలిస్తాం. పదిసార్లు ఆలోచిస్తాం. అంటే మనకు ప్రయోజనమే పరమావధి- ప్రతి పనిలో, ప్రతి త్యాగంలో! నిష్కామకర్మకు ప్రత్యామ్నాయమైన త్యాగమూ ప్రయోజనకారకమే అయిఉండాలని అంతర్లీనంగా ఉండే ఆశ. ప్రయోజన శూన్యమైన పనిని, ఫలశ్రుతి లభించని పనిని మనం చేయంగాక చేయం- ఏ హరిశ్చంద్రుడో, శిబి చక్రవర్తి లాంటివాళ్లో తప్ప! ఇది కర్మ యోగానికి పూర్తిగా విరుద్ధమైన విధానం.

ఫలశ్రుతి అంటే ఏమిటి, ప్రయోజనమంటే ఏమర్థం? ధనమా, బలమా, కీర్తిప్రతిష్ఠలా? ఈ అన్నింటికీ అతీతంగా మరొకటుంది. అదే, భగవదనుగ్రహం. ఏ పనిలోనైనా, ఏ పరిశ్రమలోనైనా, ఏ త్యాగంలోనైనా, భగవదనుగ్రహాన్ని మించిన ప్రయోజనం ఏముంటుంది? పరమార్థాన్ని మించిన ఫలశ్రుతి ఏముంటుంది? కానీ మనకు ప్రత్యక్ష ప్రయోజనమే ముఖ్యం. సత్వర లాభమే ప్రాముఖ్యం. విచక్షణతో ఆలోచిస్తే పరిణామక్రమ ప్రయోజనంలో ఉన్న ప్రమాణం, ప్రాముఖ్యం ఎంత గొప్పవో అర్థమవుతుంది. మనిషి మరీ అంత మూర్ఖుడేమీ కాదు. తొందరపాటు, కొంత అమాయకత్వం... అంతే. మామిడిటెంకను నాటితే వెంటనే మానై ఫలాలనివ్వదు. ఆ విషయం మనిషికి తెలుసు. అయినా నాటుతాడు. దానికి సేవ చేస్తాడు. రక్షిస్తాడు. పదేళ్లు నిరీక్షిస్తాడు. ఇదే ఓపిక, పరమార్థం విషయంలో ఎందుకు ఉండకూడదు? ఎప్పుడూ ఆయనంటూ ఒకడు ఉన్నాడా లేదా అనే మీమాంస దగ్గరే ఆగిపోతున్నాడుగాని, అనాది నుంచీ భగవంతుడికై పరితపించిపోయిన అసంఖ్యాక భక్తులు, సాధకులు, జ్ఞానుల అనుభవాల్ని పరిగణనలోకి తీసుకోవడంలేదు. మిడిమిడి జ్ఞానంతో డోలాయమాన స్థితిలో ఉన్న తన అసందిగ్ధ అనుభవానికే, తనకే తృప్తినివ్వని నిర్ణయానికే కట్టుబడుతున్నాడు. పలాయన వాదానికే ప్రాముఖ్యతనిస్తూ ఆగిపోతున్నాడు. ఉన్నాడేమో, ఉంటే... నిజంగా ఉంటే ఎంత అపురూపమైన అవకాశాన్ని మానవ జన్మ మాత్రమే చేసే, చేయగలిగే అవకాశాన్ని కోల్పోతామేమో అనే ఆలోచన చేయలేకపోతున్నాడు.




న్యాయవ్యవస్థలో అమూల్యమైన నానుడి ఉంది 'వందమంది దోషులు తప్పించుకున్నా ఫరవాలేదుగాని- ఒక్క నిర్దోషి శిక్షకు గురికాకూడదు' అని. అలాగే అపురూపమైన మానవ జన్మ ఎట్టి పరిస్థితుల్లోనూ జన్మోద్దేశం నుంచి గాడి తప్పకూడదు. లౌకిక సుఖాలు, సౌకర్యాలు, సంతోషాలు ఏ జీవరాశి అయినా అనుభవించగలదు... సాధన చేసి తరించటంతప్పు. ఆ అవకాశం ఉన్న ఒకేఒక్క ప్రాణి మానవుడు. అర్థంలేని, నిర్ధారణ కాని అనుమానాలతో అమూల్యావకాశాన్ని కోల్పోకూడదు. అనుమానం ఉంటే ఉండనీ గాక. అయినాసరే... మనం చేయబోయేది భగవత్ సాధన. అనేకానేక పవిత్రమైన క్రియలు, ప్రక్రియలతో కూడిన అత్యుత్తమ సాధనా విశేషం. దానివల్ల భగవంతుడు కనిపిస్తాడా అనేది వేరే అంశం. ఎంత గొప్ప జీవన విధానం? జీవితం పునీతమైపోదూ!

మనం తోటలోకి వెళ్తామా లేదా అనేది ప్రధానం కాదు. తోటచుట్టూ తిరిగితే చాలు. ఆ సుగంధం మనసుతోపాటు మన నిలువెల్లా అలముకుంటుంది. మనసు ప్రఫుల్లమైపోతుంది. సుగంధ సమీర స్పర్శతో శరీరం పులకించిపోతుంది. పారమార్థిక సాధనలూ అంతే. కలకండ ఎటువైపు కొరికినా మాధుర్యమే అన్నట్లు భగవంతుడి సాధకుల పేరుచెబితే చాలు... భగవంతుడా, ఆయన కోసం చేసే సాధనలా అన్నది సమస్యే కాదు. అవును... ఆయన పేరు చెబితేచాలు- స్మరణైనా, సాధనైనా, దర్శనమైనా, స్పర్శకైనా పూలు అల్లిన దండలా మొగలిచెండు విరిచిన తోటలా పరిమళం వ్యాపిస్తుంది. పువ్వు ఎక్కడుంటే మనకెందుకు? దాని పరిమళం మనవరకూ వస్తుంది. అది చాలు!

– చక్కిలం విజయలక్ష్మి



దిల్లీలోని ఏపీ భవన్‌లో ఏర్పాటుచేసిన చేనేత వస్త్రాల ప్రదర్శనను శుక్రవారం తిలకిస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

## చేనేత వస్త్రాల ప్రదర్శన తిలకించిన సీఎం చంద్రబాబు

**ఈనాడు, దిల్లీ:** సామూహిక పేరుతో ఏపీ భవన్‌లో నిర్వహిస్తున్న చేనేత వస్త్రాల ప్రదర్శనను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తిలకించారు. శుక్రవారం దిల్లీ పర్యటనకు వచ్చిన చంద్రబాబు.. ప్రదర్శనలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించి నిర్వాహకులను అభినందించారు. అంతకుముందు ప్రదర్శనను ఏపీ ఈడీబీ ప్రత్యేక కమిషనర్ భావనా సక్సేనా ప్రారంభించారు.

## ఏపీ భవన్‌లో నాటకోత్సవాలు ప్రారంభం

**ఈనాడు, దిల్లీ:** దిల్లీలోని ఏపీభవన్‌లో నాటకోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఏపీ భవన్ ఆధ్వర్యంలో తెలుగు ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్, శ్రీ కృష్ణ తెలుగు థియేటర్ ఆర్ట్స్ సంయుక్తంగా ఈ నాటకోత్సవాలను నిర్వహిస్తున్నాయి. ఏపీ భవన్ సంయుక్త కమిషనర్ సూర్యనారాయణ, తెలంగాణ భవన్ డిప్యూటీ కమిషనర్ రామ్మోహన్‌రావు, ఏపీ భవన్ సహాయ కమిషనర్ లింగరాజు, ప్రముఖ రచయిత ప్రభల జానకి, ప్రముఖ నటుడు, రచయిత కామేశ్వరరావులు జ్యోతి వెలిగించి కార్యక్రమం ప్రారంభించారు. పలువురు నాటక ప్రియులు హాజరయ్యారు.

## ఓటుకు నోటు కేసులో వేంనరేందర్‌రెడ్డికి ఈడీ నోటీసులు

**ఈనాడు, హైదరాబాద్:** సంచలనం సృష్టించిన ఓటుకు నోటు కేసులో స్టీఫెన్‌సన్‌కు ఇవ్వచూపిన నగదు ఎక్కడి నుంచి వచ్చిందన్న విషయమై ఈడీ దృష్టి సారించింది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న కాంగ్రెస్ నాయకుడు వేంనరేందర్‌రెడ్డికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) నోటీసులు జారీ చేసింది. విచారణ కోసం వారం రోజుల్లోగా హైదరాబాద్ ఈడీ అధికారుల ఎదుట హాజరు కావాలని అందులో ఆదేశించింది. ఈడీ అధికారులు ఆయన ఇంటికి వెళ్లి నోటీసులు అందజేశారు.

## ఉపాధి అవకాశాలు కల్పించాలి

### ఫార్మాడీ అసోసియేషన్ సభ్యుల డిమాండ్

**ఈనాడు, దిల్లీ:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ఫార్మాడీ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. వివిధ రాష్ట్రాలకు చెందిన ఫార్మాడీ సంఘాల సభ్యులు దిల్లీలోని జంతర్‌మంతర్‌లో శుక్రవారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ.. ఆరేళ్ల పాటు వైద్యవిద్యను అభ్యసించి పట్టాలు పొందినా తమకు భవిష్యత్తు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు అవకాశం కల్పిస్తే మారుమూల ప్రాంతాలకు వెళ్లి వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. తమ అర్హతకు తగ్గట్లు క్లినికల్ ఫార్మాసిస్ట్ క్యాడర్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు.

## టెలికాం సంస్థలకు ఆప్టికల్ గ్రౌండ్ వైర్ లీజు

**ఈనాడు డిజిటల్- అమరావతి:** ఆప్టికల్ గ్రౌండ్ వైర్(ఓపీడబ్ల్యూ)ను టెలికాం సంస్థలకు వాణిజ్యపరమైన అవసరాల కోసం లీజుకు ఇవ్వడం ద్వారా ఆదాయ మార్గాలను పెంచుకోవాలని ఏపీ ట్రాన్స్‌కో భావిస్తున్నట్లు రాష్ట్ర ఇంధన శాఖ తెలిపింది. తొలి దశలో భాగంగా కేంద్ర ప్రభుత్వ సంస్థ భారత్ బ్రాడ్‌బ్యాండ్ నెట్‌వర్క్ లిమిటెడ్‌కు 2,765 కిలోమీటర్ల ఆప్టికల్ గ్రౌండ్ వైర్‌ను లీజుకు ఇచ్చేందుకు ఆసక్తి వ్యక్తీకరించినట్లు వివరించింది. 'ఆప్టికల్ వైర్‌ను టెలికాం సంస్థలకు లీజుకు ఇవ్వడం ద్వారా సంస్థ ఆదాయం పెరగడంతో పాటు చిట్ట చివరి ప్రాంతాలకు ఇంటర్నెట్ సేవలు అందే వెసులుబాటు కలుగుతుంది. రెండో దశలో 5 వేల కిలోమీటర్లు, మూడో దశలో 10 వేల కిలోమీటర్ల కేబుళ్లను లీజుకు ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి విజయానంద్ వివరించినట్లు అందులో వెల్లడించింది.

## నిరాశపర్చిన కేంద్ర బడ్జెట్

### సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

**ఈనాడు, అమరావతి:** కేంద్ర బడ్జెట్ తెలుగువారిని పూర్తిగా నిరాశపరిచిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, కడప ఉక్కు పరిశ్రమ, రాజధానికి నిధులు, పోలవరం నిధుల కేటాయింపుపై చెప్పకపోవడం బాధాకరమని వ్యాఖ్యానించారు. ఇది ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లా లేదని, అకౌంట్ ఫర్ ఓట్స్‌లా ఉందని అభివర్ణించారు. నిజంగా రైతులను ఆదుకునే చిత్తశుద్ధి ఉంటే స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## నిరుద్యోగంపై వాస్తవ ప్రకటన చేయాలి: సురవరం

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** కేంద్రం పార్లమెంటులో అవాస్తవాలను రాష్ట్రపతి ద్వారా చెప్పించే ప్రయత్నం చేసిందని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి విమర్శించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే నిరుద్యోగ అంశంపై వాస్తవాలతో కూడిన నివేదికను పార్లమెంటులో ప్రవేశపెట్టాలని శుక్రవారం హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో డిమాండ్ చేశారు.

## 'బదిలీ పొందినా.. డిప్యూటేషన్‌పై పనిచేయాలి'

**ఈనాడు, అమరావతి:** బదిలీలు పొందిన పురపాలక ఉపాధ్యాయులు శనివారం విధుల నుంచి రిలీవ్ అయి కొత్త పాఠశాలలో చేరి, తిరిగి నాలుగో తేదీన డిప్యూటేషన్‌పై పాత పాఠశాలల్లో చేరాలని పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఏప్రిల్ 23న బదిలీ పొందిన పాఠశాలలో చేరాలని పేర్కొంది.

# నిధుల బాధ్యత పీసీబీదే!

- రూ.320 కోట్లు విడుదల చేయనుండటంపై వివరాలివ్వండి
- ఏపీ సర్కారు, పీసీబీకి హైకోర్టు ఆదేశం
- విచారణ సోమవారానికి వాయిదా

ఈనాడు – అమరావతి

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ)కి చెందిన రూ.320 కోట్ల సొమ్మును రుణసాయం పేరుతో ఏపీ పట్టణాభివృద్ధి ఆర్థిక, మౌలిక వసతుల సంస్థకు(ఏపీయూడీఎఫ్ఐసీ) బదిలీ చేయనున్నారని పేర్కొంటూ దాఖలైన వ్యాజ్యంలో పూర్తి వివరాలు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వం, పీసీబీని హైకోర్టు ఆదేశించింది. పీసీబీ బోర్డు శుక్రవారం తీసుకునే ఏ నిర్ణయమైనా వచ్చే సోమవారం తాము జారీచేసే ఉత్తర్వులకు లోబడి ఉంటాయని స్పష్టం చేసింది. హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్, జస్టిస్ టి.సునీల్‌చౌదరితో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈమేరకు మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. విచారణను సోమవారానికి వాయిదా వేసింది.

'రుణసాయం పేరుతో 7శాతం వడ్డీతో మూడేళ్లకు సొమ్ము తిరిగి చెల్లించే నిమిత్తం ఏపీపీసీబీకి చెందిన రూ.320 కోట్ల సొమ్మును ఏపీయూడీఎఫ్ఐసీకి ఇచ్చే అంశంపై నిర్ణయం తీసుకునేందుకు శుక్రవారం పీసీబీ సమావేశం కాబోతోంది. ఈ నేపథ్యంలో తన వ్యాజ్యంపై అత్యవసరంగా విచారణ జరపాలని పేర్కొంటూ గుంటూరుకు చెందిన కొలగాని రాజేష్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వైఎస్ మూర్తి వాదనలు వినిపిస్తూ.. పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి, పర్యావరణశాఖ ముఖ్య కార్యదర్శి ఆదేశాల మేరకు పీసీబీ రూ.320 కోట్ల సొమ్మును రుణసాయంగా ఇవ్వబోతోందన్నారు. పీసీబీకి చెందిన రూ.200 కోట్ల సొమ్మును మచిలీపట్నం పట్టణాభివృద్ధి సంస్థకు విడుదల చేయకుండా గతంలో హైకోర్టు ఆదేశాలిచ్చిందని గుర్తుచేశారు. పీసీబీ నిధులు ఇతర సంస్థలకు ఇవ్వడం కాలుష్య నియంత్రణ చట్ట నిబంధనలకు విరుద్ధమన్నారు. సొమ్ము విడుదలను నిలువరిస్తూ మధ్యంతర ఉత్తర్వులివ్వాలని కోరారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) రమేశ్ వాదనలు వినిపిస్తూ.. ఈ వ్యవహారంపై బోర్డు ముందు ప్రతిపాదన ఉందని, బోర్డు నిర్ణయం తీసుకోకుండానే వ్యాజ్యం దాఖలు చేయడం సరికాదన్నారు. వ్యాజ్యం దాఖలు చేసే అర్హత పిటిషనర్‌కు లేదన్నారు.

### బోర్డు తిరస్కరించొచ్చుకదా?

ఇరువైపు న్యాయవాదుల వాదనలు విన్న ధర్మాసనం.. బోర్డు చర్చించి సొమ్ము ఇవ్వాలనే ప్రతిపాదనను తిరస్కరించొచ్చుకదా? అని పిటిషనర్‌ను ప్రశ్నించింది. ఇదంతా ఊహాగానంలా ఉందని వ్యాఖ్యానించింది. సరిపడ నిధులు దగ్గర ఉంచుకోవాల్సిన బాధ్యత పీసీబీ అధికారులదేనని.. అలా ఉంచుకోకపోతే దాని పరిణామాల్ని బోర్డు ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది స్పందిస్తూ.. ఒకసారి నిధులు బదిలీ అయ్యాక ఈ వ్యాజ్యం దాఖలు చేసినా ప్రయోజనం ఉండదన్నారు. కనీసం సోమవారం వరకైనా నిధులు విడుదల చేయకుండా పీసీబీని నిలువరించాలని కోరారు. ధర్మాసనం స్పందిస్తూ.. బోర్డు తీసుకునే నిర్ణయం ఏదైనా సోమవారం తాము జారీచేసే ఉత్తర్వులకు లోబడి ఉంటాయని పేర్కొంటూ విచారణను వాయిదా వేసింది.

## మంచు ఫౌంటెయిన్



అమెరికాలోని తూర్పు తీర ప్రాంతాలను కమ్మిన మంచు తెరలు వీడటం లేదు. మూడు రోజుల నుంచీ ఇక్కడ పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు మైనస్‌లలో నమోదవుతున్నాయి. న్యూయార్క్ నగరంలోని బ్రైంట్ పార్క్‌లో అయితే ఫౌంటెయిన్ నుంచి వెలువడిన నీరు ఇలా గడ్డకట్టుకుపోయింది.

## మహారాష్ట్రలో భూప్రకంపనలు

### ప్రమాదవశాత్తు రెండేళ్ల చిన్నారి మృతి

**పాల్ఘర్:** మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో శుక్రవారం స్వల్ప భూప్రకంపనలు సంభవించాయి. భయంతో స్థానికులు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఈ గందరగోళ పరిస్థితుల్లోనే ధుందల్‌వాడీ ప్రాంతంలో వైభవి రమేశ్ భూయల్ అనే రెండేళ్ల చిన్నారి ప్రమాదవశాత్తు కింద పడింది. తలకు తీవ్ర గాయం కావడంతో ప్రాణాలు కోల్పోయింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ కనీసం ఆరు సార్లు ప్రకంపనలు వచ్చినట్లు జిల్లా అధికారులు తెలిపారు. వీటితీవ్రత రిక్టర్ స్కేల్‌పై 3 నుంచి 4.1గా నమోదైనట్లు పేర్కొన్నారు. కొన్ని చోట్ల గోడలు కూలినట్లు తమకు నివేదికలు అందాయని తెలిపారు.



అగ్నిప్రమాదంలో దగ్ధం అవుతున్న కేబుల్స్

## తిరుపతి రైల్వేస్టేషన్ ఆవరణలో అగ్నిప్రమాదం

**తిరుపతి, న్యూస్‌టుడే:** తిరుపతి రైల్వేస్టేషన్ వద్ద అదనపు ప్లాట్‌ఫాం కోసం ఖాళీ ప్రదేశంలో ఉంచిన కమ్యూనికేషన్స్ కేబుల్ పరికరాలకు శుక్రవారం నిప్పంటుకుని అగ్నిప్రమాదం జరిగింది. తిరుపతి రైల్వేస్టేషన్ 6వ నెంబర్ ప్లాట్‌ఫాం పనుల నిమిత్తం 4 నెలల క్రితం కోట్లాది రూపాయలు విలువ చేసే కేబుల్, ప్లాస్టిక్ పైపులను పెద్దఎత్తున ఖాళీ ప్రదేశంలో డంప్ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం 1గంట సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో అక్కడే షెడ్డులో ఉన్న కూలీలు పరుగులు తీస్తూ బయటకు వచ్చారు. సమాచారం అందుకున్న అధికారులు, సిబ్బంది రెండు అగ్నిమాపక వాహనాల్లో వచ్చి వెంటనే మంటలను అదుపు చేశారు. రైల్వే ఆస్తులకు ఎటువంటి నష్టం లేనప్పటికీ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్‌కు రూ.కోటి ఆస్తినష్టం జరిగినట్లు సమాచారం. అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడంతో భారీ నష్టం తప్పింది.

## నేటి నుంచి 'పసుపు-కుంకుమ' చెక్‌ల పంపిణీ

**ఈనాడు డిజిటల్, అమరావతి:** రాష్ట్రంలోని 94 లక్షల మంది డ్వాక్రా మహిళలకు రెండో విడత 'పసుపు-కుంకుమ'లో భాగంగా తొలి దఫా అందించనున్న ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం శుక్రవారం బ్యాంకుల్లో జమ చేసింది. ఈ పథకం కింద ఒక్కో డ్వాక్రా మహిళకు రూ.10 వేల చొప్పున మూడు విడతల్లో సాయం అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో ప్రకటించిన విషయం విదితమే. మొదటి విడతగా రూ.2,500ను ఫిబ్రవరి 1న, రెండో విడతగా రూ.3,500ను మార్చి 8న, రూ.4 వేలును మూడో విడతగా ఏప్రిల్ 5న అందిస్తామన్న సీఎం హామీకు అనుగుణంగా. . తొలి విడత మొత్తం పంపిణీకిగాను రూ.2,354 కోట్లను అధికారులు బ్యాంకుల్లో జమ చేశారు. డ్వాక్రా మహిళలు ఖాతాలు ఉన్న 37 బ్యాంకులకు ఈ మొత్తాన్ని బదిలీ చేశారు. సంబంధిత సాయం పొందేందుకు వీలుగా అవసరమైన చెక్‌లను గ్రామ పంచాయతీల వారీగా డ్వాక్రామహిళలకు ఈ నెల 2, 3, 4 తేదీల్లో పంపిణీ చేయనున్నారు. మహిళలు ఈ చెక్‌లను బ్యాంకులకు అందజేసిన వెంటనే ఆయా బ్యాంకు అధికారులు ప్రభుత్వ సాయాన్ని అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

## ఫలించిన వెంకయ్యనాయుడి జోక్యం

**దిల్లీ:** ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో రాజ్యసభలో ఆరు బిల్లులను ప్రవేశపెట్టడంపై ప్రభుత్వం, ప్రతిపక్షాలు ఒక అవగాహనకు వచ్చాయి. రాజ్యసభ ఛైర్మన్ ఎం.వెంకయ్యనాయుడి జోక్యంతో ఇరుపక్షాల మధ్య ఈ మేరకు ఏకాభిప్రాయం కుదిరినట్లు తెలుస్తోంది. వచ్చే సార్వత్రిక ఎన్నికలకు ముందు పార్లమెంటు సమావేశాలు జరగనుండటం ఇదే చివరిసారి అని వెంకయ్యనాయుడు శుక్రవారం గుర్తుచేశారు. సభా కార్యకలాపాలు సజావుగా సాగేలా చిత్తశుద్ధితో కృషి చేయాలని ప్రభుత్వం, విపక్షాలను ఆయన కోరారు. వెంకయ్యనాయుడి జోక్యం నేపథ్యంలో రాజ్యసభలో ప్రతిపక్ష నేత గులాం నబీ ఆజాద్ సహా పలు పార్టీల నేతలతో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి నరేంద్ర సింగ్ తోమర్, ఆయన సహాయ మంత్రి విజయ్ గోయల్ అరగంటపాటు భేటీ అయ్యారు. దీంతో వ్యక్తుల అక్రమ రవాణా(నివారణ, రక్షణ, పునరావాసం) బిల్లు, మధ్యవర్తిత్వం-రాజీ(సవరణ) బిల్లు, దిల్లీ అంతర్జాతీయ మధ్యవర్తిత్వ కేంద్రం బిల్లు-2019, వైయక్తిక(పర్సనల్) చట్టాల బిల్లు-2019, ఆధార్-ఇతర చట్టాల(సవరణ) బిల్లు-2019, అత్యవసర ఆదేశం(ఆర్డినెన్స్) స్థానంలో కంపెనీల(సవరణ) బిల్లును ఎగువ సభలో ప్రవేశపెట్టేందుకు ఇరుపక్షాల మధ్య ఏకాభిప్రాయం కుదిరింది.

# రూ.161.96 కోట్లు అదనపు సాయం చేయండి

- కేంద్ర బృందానికి రాష్ట్ర ప్రభుత్వం వినతి


**తాడేపల్లి, న్యూస్‌టుడే:** పెథాయ్ తుపానుతో జరిగిన నష్టాన్ని భర్తీ చేసేందుకు రూ.161.96 కోట్లు అదనంగా సాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేత కేంద్ర బృందాన్ని కోరారు. వివిధ శాఖలకు జరిగిన నష్టాన్ని కలిపి తాత్కాలిక పునర్నిర్మాణం, పెట్టుబడి రాయితీలకు అదనపు సాయం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. సచివాలయంలో జరిగిన సమావేశంలో చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనపై కేంద్ర బృందం సానుకూలంగా స్పందించింది. త్వరలో ఉన్నతస్థాయి కమిటీకి నివేదిక సమర్పిస్తామని బృందం పేర్కొంది. వ్యవసాయశాఖకు పెట్టుబడి రాయితీ రూ.60.17 కోట్లు, ఉద్యాన శాఖకు రూ.5.12 కోట్లు, నిత్యావసర వస్తువుల సరఫరాకు రూ.30.12 కోట్లు, పునరావాస నిర్వహణ కేంద్రం కోసం రూ.3.67 కోట్లు, పురపాలక శాఖకు రూ.33.78 కోట్లు, రహదారులు, భవనాల శాఖకు రూ.22.17 కోట్లు, విద్యుత్తు శాఖకు రూ.4.17 కోట్లు, గ్రామీణ నీటి సరఫరాకు రూ.0.97 కోట్లు, దెబ్బతిన్న ఇళ్లకు పరిహారం నిమిత్తం రూ.0.92 కోట్లు, మత్స్యశాఖకు రూ.0.45 కోట్లు, వైద్య ఆరోగ్య శాఖ శిబిరాల నిర్వహణకు రూ.0.13 కోట్లు, అటవీశాఖకు కోరింగ్, తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన నష్టం నిమిత్తం రూ.0.20 కోట్లు, దేవదాయశాఖ ధ్వజస్తంభాల నష్టం నిమిత్తం రూ.0.09 కోట్లు అదనపు సాయం కావాలని కోరింది.

**రెండు జిల్లాల్లో పర్యటన:** పెథాయ్ తుపాను నష్టంపై క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు ఐదుగురు సభ్యులతో కూడిన కేంద్ర బృందం కృష్ణా, గుంటూరు జిల్లాల్లో శుక్రవారం పర్యటించింది. కేంద్ర గృహ నిర్మాణ మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి సంజీవ్‌కుమార్ జిందాల్, వ్యవసాయశాఖ సంచాలకులు బీకే శ్రీవాత్సవ్, రహదారుల శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ అభినవ కుమార్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉప కార్యదర్శి మాణిక్ చంద్ర పండిట్, ఆర్‌బీ కౌల్‌తో కూడిన బృందం రెండు రోజులు పర్యటించింది. పంటతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు జరిగిన నష్టాన్ని జిల్లాల కలెక్టర్లు వివరించారు. రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో పరిశీలించారు. ఉద్యాన పంటలు, రహదారులు, దెబ్బతిన్న ఇళ్లను, తాగునీటి వనరులను బృందం పరిశీలించింది.

## పాక్ చెరలోని జాలర్ల నుంచి కుటుంబీకులకు ఉత్తరాలు

- తమ విడుదలకు ప్రయత్నించాలని కోరిన మత్స్యకారులు

**ఎచ్చెర్ల, న్యూస్‌టుడే:** గుజరాత్ సమీపంలోని వీరావల్ వద్ద సముద్రంలో చేపల వేట చేస్తూ గత ఏడాది నవంబరు 27న పాకిస్థాన్ తీరప్రాంత దళాలకు చిక్కిన శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం డి.మత్స్యలేశం పంచాయతీలోని ఇద్దరు మత్స్యకారులు రాసిన ఉత్తరాలు శుక్రవారం వారి కుటుంబ సభ్యులకు అందాయి. నాటి ఘటనలో మొత్తం 22 మంది జాలర్లు పాకిస్థాన్ కోస్ట్‌గార్డు దళాలకు చిక్కిన విషయం తెలిసిందే. వీరిలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన వారు 15 మంది ఉన్నారు. రెండు నెలలు గడుస్తున్నా వారి నుంచి ఎటువంటి సమాచారం, యోగక్షేమాలు తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనలో మునిగిపోయారు. పాక్‌లోని చెరసాలలో మగ్గుతున్న సంబంధిత జాలర్ల నుంచి ప్రస్తుతం వచ్చిన ఉత్తరాలు వారికి ఊరట కలిగించాయి. బందీలుగా ఉన్న 22 మందిని ఒకే గదిలో ఉంచారని, అంతా క్షేమంగా ఉన్నామని.. తాము తెలిపిన చిరునామాకు ఆధార్ కార్డులు, రేషన్‌కార్డుల నకలు ప్రతులను వెంటనే పంపించాలని ఉత్తరాల్లో వారు పేర్కొన్నారు. పాక్ చెర నుంచి తమకు విముక్తి కల్పించేందుకు రాజకీయ నాయకులతోనూ, ప్రభుత్వ అధికారులతోనూ సంప్రదించాలని కుటుంబీకులకు వారు సూచించారు. ఆయా ఉత్తరాలపై పాకిస్థాన్‌లోని కరాచీ, మాలిర్ లాండ్ జైలు, ఈఎస్‌టీ: 34, సర్కిల్-1 అనే చిరునామా రాసి ఉంది.



పాకిస్థాన్ జైలులో మగ్గుతున్న శ్రీకాకుళం జిల్లా మత్స్యకారుడి నుంచి వచ్చిన ఉత్తరం

## 'విభజన హామీలను విస్మరించిన ఎన్డీయే'

**మంగళగిరి, న్యూస్‌టుడే:** కేంద్రంలోని భాజపా ప్రభుత్వం ఇంటికి వెళ్లే పరిస్థితి దగ్గరలోనే ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో శుక్రవారం రాత్రి సీపీఐ, సీపీఎం, జనసేన ఆధ్వర్యంలో జరిగిన రాజకీయ ప్రత్యామ్నాయ సభలో ఆయన ప్రసంగించారు. విభజన చట్టంలోని హామీలను అమలు చేయకుండా ఎన్డీయే ప్రభుత్వం ఏపీ ప్రజలను మోసం చేసిందని ధ్వజమెత్తారు. రానున్న ఎన్నికల్లో సీపీఎం, సీపీఐ, జనసేన పార్టీలు కలిసి రాష్ట్రంలోని తెదేపా, వైకాపాలను ఓడించటమే ధ్యేయంగా పనిచేస్తాయని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా వైకాపా అధినేత జగన్ వైఖరిని మధు తీవ్రంగా దుయ్యబట్టారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ.. కేంద్రంలోని భాజపా సర్కారు, రాష్ట్రంలోని తెదేపా ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత కనిపిస్తోందని చెప్పారు. ముఖ్యమంత్రి కావాలని జగన్ తన సొంత పత్రికతో తప్పుడు సర్వే చేయించి తప్పుడు లెక్కలు చెప్పిస్తున్నారని రామకృష్ణ విమర్శించారు. సభలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సీపీఎం గుంటూరు తూర్పు జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు జేవీ రాఘవులు, జనసేన రాష్ట్ర కో-కన్వీనర్ చిల్లపల్లి శ్రీనివాసరావులు తదితరులు పాల్గొన్నారు.

## 4 నుంచి భాజపా బస్సు యాత్ర

**కాశీబుగ్గ, న్యూస్‌టుడే:** శ్రీకాకుళం జిల్లా పలాసలో ఈ నెల 4 నుంచి బస్సు యాత్రను ప్రారంభిస్తున్నట్లు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఈ బస్సు యాత్ర కోసం కాశీబుగ్గలో శుక్రవారం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ.. 'మా పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా పలాస-కాశీబుగ్గ నుంచి బస్సు యాత్రను ప్రారంభిస్తారు. దీన్ని 4, 5 తేదీల్లో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో నిర్వహిస్తాం. ప్రధానమంత్రి మోదీ 10న గుంటూరు, 16న విశాఖపట్నంలలో నిర్వహించే బహిరంగ సభల్లో పాల్గొంటారు. అమిత్‌షా రాష్ట్రంలో ఈ నెలలో ఐదు చోట్ల జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు' అని వివరించారు.

## 4న ధ్రువపత్రాల పరిశీలన!

**ఈనాడు, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలోని ఆస్పత్రుల్లో గైనకాలజీ, మత్తు, చిన్నపిల్లల వైద్యుల పోస్టుల భర్తీకి ఈ నెల 4వ తేదీన ధ్రువపత్రాల పరిశీలన విజయవాడ గొల్లపూడి కార్యాలయంలో జరగనుంది. 155 పోస్టుల భర్తీ కోసం గతనెల 21వ తేదీన కౌన్సెలింగ్ జరిపారు. చివరికి 89 పోస్టులు భర్తీ కాలేదు. నిరీక్షణ జాబితా అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన సోమవారం జరుగుతుందని కమిషనర్ డాక్టర్ దుర్గాప్రసాద్ తెలిపారు. కౌన్సెలింగ్ మరుసటిరోజు జరుగుతుంది.





నిప్పంటుకుని కాలిపోతున్న విమానం.. చివరికిలా మిగిలింది★ దుర్ఘటన జరిగిన ప్రదేశం వద్ద సహాయక చర్యలు చేపడుతున్న సిబ్బంది

## శిక్షణ విమానం కూలి ఇద్దరి దుర్మరణం

- బెంగళూరులో దుర్ఘటన

**ఈనాడు డిజిటల్, బెంగళూరు:** లోహ విహంగాల నగరిగా పేరొందిన బెంగళూరులో మరో విమాన దుర్ఘటన దిగ్భ్రాంతి గొలిపింది. స్థానిక యమలూరు శివార్లలో హెచ్ఏఎల్ నిర్వహించే విమానాశ్రయంలో శుక్రవారం శిక్షణ విమానం కూలి పోయింది. సాంకేతిక సమస్యలు తలెత్తిన ఈ విమానం తక్కువ ఎత్తు నుంచే కూలిపోవటంతో మంటలు చెలరేగి అందులో ఉన్న ఇద్దరు పైలట్‌లు మృతి చెందారు ఒకరు ప్రమాద స్థలంలోనే మృతి చెందగా మరొకరు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు, రక్షణ శాఖ అధికారులు వెల్లడించారు. శుక్రవారం ఉదయం 10:30 గంటలకు భారతీయ వైమానిక దళానికి వినియోగించే నిమిత్తం మిరాగ్- 2000 యుద్ధ విమానాన్ని పరీక్షించేందుకు ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన స్క్వాడ్రాన్ లీడర్లు సమీర్ అబ్రోల్, సిద్ధార్థ్ నేగి ఆకాశయానానికి బయలుదేరారు. విహార వేళ ఎజెక్ట్ బటన్‌ను నొక్కినట్లు గుర్తించారు. ఆ మీట ఉన్న ప్రాంతం నుంచి మంటలు రావటంతో విమానం పేలిపోయింది. ఈ ప్రమాదంలో సిద్ధార్థ్ నేగి అక్కడికక్కడే మృతి చెందగా సమీర్ అబ్రోల్‌ను స్థానిక కమాండ్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స ఫలించక ఆయన కూడా మృతి చెందారు. కూలిన సమయంలో హెచ్ఏఎల్ విమానాశ్రయం పరిసరాల్లో దట్టమైన పొగలు వ్యాపించినట్లు స్థానికులు తెలిపారు. భద్రతా సిబ్బంది మంటలను ఆర్పి అందులో చిక్కుకున్న వారిని బయటకు తీశారు. ఫ్రాన్స్‌కు చెందిన డస్సాల్ట్ ఏవియేషన్ సంస్థతో చేసుకున్న ఒప్పందం మేరకు మిరాగ్-2000 యుద్ధవిమానాలు తయారయ్యాయి. ఈ ప్రాజెక్టులోని 49 విమానాల్లో తొలి రెండు విమానాలను డస్సాల్ట్ సంస్థ అభివృద్ధి చేయగా మిగిలిన వాటిని హెచ్ఏఎల్ తయారు చేసింది. ప్రమాదానికి కారణాలపై విచారణ చేపట్టనున్నట్లు ఆ శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది.

## రాష్ట్రానికి ద్రోహం

### సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు

**ఈనాడు, అమరావతి:** బడ్జెట్‌లో కేంద్రం రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందని, మరోసారి మోదీ ప్రభుత్వం తెలుగు ప్రజలకు ద్రోహం చేసిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పెనుమల్లి మధు ఓ ప్రకటనలో విమర్శించారు. విభజన హామీలకు ఒక్క పైసా కేటాయించలేదని, ప్రత్యేక హోదా ప్రస్తావనే లేదని మండిపడ్డారు.

## అక్రమంగా ఉన్నామని భావిస్తే అమెరికా నుంచి వచ్చేయండి

### ఏపీఎన్ఆర్టీ సొసైటీ అధ్యక్షుడు వేమూరి రవికుమార్

**తాడేపల్లి, న్యూస్‌టుడే:** అమెరికాలో అక్రమంగా ఉంటున్నామని భావించే వారంతా తిరిగి వచ్చేయడమే మంచిదని ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఏపీఎన్ఆర్టీ సొసైటీ) అధ్యక్షుడు వేమూరి రవికుమార్ తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచనపల్లిలో సీఈవో భవానీ శంకర్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమ పిల్లలు ఫోన్లు కూడా తీయటం లేదని ఏమైనా అరెస్టులు జరిగి ఉంటాయా? అని తల్లిదండ్రుల నుంచి తమకు ఫోన్లు వస్తున్నాయని తెలిపారు. 52 మందిని అరెస్టు చేసి డిటెన్షన్ సెంటర్ (విచారణ కేంద్రం)లో ఉంచినట్లు సమాచారం వచ్చిందని, మిగిలిన వారు భయంతో ఫోన్లు నిలిపివేసి ఉండవచ్చని చెప్పారు. భయంతో ఉన్నవారు ఏపీఎన్ఆర్టీ కోఆర్డినేటర్లను సంప్రదిస్తే సహాయం చేస్తామని చెప్పారు. విద్యార్థుల కోసం 24 గంటల పాటు పనిచేసే హాట్‌లైన్ ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా టోల్‌ఫ్రీ నెంబర్ 8632340678లో సంప్రదించవచ్చని చెప్పారు.

రైతుకు రొక్కం



### జాతీయ రహదారులకు రూ.83,000 కోట్లు

**దిల్లీ:** దేశంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఊతమిచ్చే దిశగా కేంద్ర బడ్జెట్లో ప్రతిపాదనలు చేర్చారు. జాతీయ రహదారులకు రూ.83,000 కోట్లు. ప్రధానమంత్రి గ్రామసడక్ యోజన కింద కేటాయింపులు రూ.15,500 కోట్ల నుంచి రూ.19,000 కోట్లకు పెంపు. సాగరమాల కార్యక్రమాన్ని వేగవంతం చేయడంతో పాటు దేశీయంగా నదీ మార్గాల్లో రవాణాను సత్వరం అభివృద్ధికి చర్యలు.

### 'లోక్‌పాల్'కు పెరగని కేటాయింపులు

**దిల్లీ:** లోక్‌పాల్ వ్యవస్థ నిర్వహణకు బడ్జెట్ కేటాయింపులో ఎటువంటి పెంపుదల లేదు. గత సంవత్సరం(2018-19)లో రూ.4.29 కోట్లు కేటాయించగా.. వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ అంతే మొత్తం కేటాయించారు. అదే సమయంలో కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ)కు కేటాయింపులు స్వల్పంగా పెరిగాయి. 2018-19 సంవత్సరంలో ఆ సంస్థకు రూ.34 కోట్లు కేటాయించగా.. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఈ మొత్తాన్ని 35.5 కోట్లకు పెంచారు.




# పెట్టుబడి సాయం

## అన్నదాతల కోసం 'పీఎం-కిసాన్' పథకం


**దిల్లీ:** తాజా బడ్జెట్‌లో రైతుల సంక్షేమం కోసం కొత్త పథకం తీసుకొచ్చారు. విత్తనాలు, ఎరువులు, పనిముట్లు, కూలీలు వంటి పెట్టుబడి వ్యయాలు సమకూర్చుకునేందుకు పేద రైతులకు ఆదాయ మద్దతు కల్పించాల్సిన అవసరం నెలకొన్న పరిస్థితుల్లో 'ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి' పేరిట ప్రత్యేక పథకాన్ని రూపొందించారు. రైతులు అప్పుల బారిన పడకుండా పరిహరించడం, రుణదాతల వలలో చిక్కుకోకుండా చూడటం ఈ పథకం ఉద్దేశం.

### ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్)

చిన్న, మధ్యతరహా రైతులకు ఆర్థిక సహకారం అందజేయడమే ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) పథకం లక్ష్యం. ఈ కార్యక్రమం కింద 2 హెక్టార్ల దాకా సాగుభూమి ఉండే రైతులకు ఏడాదికి రూ.6 వేలు అందజేస్తారు. ఈ మొత్తాన్ని నేరుగా లబ్ధిదారులైన రైతుల బ్యాంకు ఖాతాల్లోకే బదిలీ చేస్తారు. విడతకు రూ.2 వేల చొప్పున మూడు విడతల్లో అందిస్తారు.

ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వమే నిధులు సమకూరుస్తుంది.

- సుమారు 12 కోట్ల మంది సన్న, మధ్యతరహా రైతు కుటుంబాలకు ప్రయోజనం అందుతుంది.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుంచే వర్తిస్తుంది.
- 2018 డిసెంబరు 1 నుంచి అమలవుతుంది.
- మొదటి విడతలో రూ.2 వేలు మార్చినెల లోపు రైతుల ఖాతాలకు జమ.
- ఈ పథకంతో కేంద్ర ప్రభుత్వంపై 75 వేల కోట్ల రూపాయల భారం పడనుంది.
- పీఎం-కిసాన్ పథకం బాధిత రైతు కుటుంబాలకు అదనపు ఆదాయ హామీని ఇవ్వడమే కాకుండా పంట సీజన్‌కు ముందే అత్యవసర ఖర్చులకు చేదోడుగా నిలుస్తుంది. ఈ పథకం రైతులు డబ్బులు సంపాదించుకోవడానికి, గౌరవంగా జీవించేందుకు మార్గం సుగమం చేస్తుంది.




- పీఎం-కిసాన్ పథకానికి 2019-20 ఆర్థిక సంవత్సరంలో రూ.75 వేల కోట్లు కేటాయించారు.

### గోవుల కోసం 'కామధేను ఆయోగ్'

గోవుల పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. గో సంపదను జన్యుపరంగా తీర్చిదిద్దేందుకు, ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచేందుకు 'రాష్ట్రీయ కామధేను ఆయోగ్' ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్థికమంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. గోవులకు సంబంధించి చట్టాలు, సంక్షేమ పథకాల్ని ప్రభావశీలంగా అమలు చేసేలా ఆయోగ్ పర్యవేక్షిస్తుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 'రాష్ట్రీయ గోకుల్ మిషన్' కోసం కేటాయింపుల్ని రూ.750 కోట్లు పెంచారు.

- 2018-19 ఆర్థిక సంవత్సరంలో సవరించిన అంచనాల కింద ఈ పథకం కోసం రూ.20 వేల కోట్లు అదనంగా కేటాయించారు.
- 22 గుర్తించిన పంటలకు కనీస మద్దతు ధరను పంట ఉత్పత్తి వ్యయంకన్నా 50 శాతం ఎక్కువగా నిర్ణయం.

### వడ్డీ రాయితీలు

- మత్స్య రంగం అభివృద్ధి కోసం నిరంతరంగా, నిర్దిష్టంగా దృష్టిసారించేందుకు వీలుగా ప్రత్యేకంగా మత్స్యశాఖ ఏర్పాటు
- పశుపోషణ, చేపల పెంపకం చేపట్టిన రైతులకు 2 శాతం వడ్డీ రాయితీ. కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రుణాలు పొందిన వారికి ఇది వర్తిస్తుంది.
- సకాలంలో రుణాలు చెల్లించిన వారికి అదనంగా 3 శాతం వడ్డీ రాయితీ లభిస్తుంది.
- రుణప్రక్రియను సరళతరం చేయడం, రాయితీలతో కూడిన రుణాల్ని అందించడం కోసం రైతులందరినీ కిసాన్ క్రెడిట్ కార్డు పరిధిలోకి తీసుకొచ్చేందుకు వీలుగా సరళతరమైన దరఖాస్తు సమగ్ర కార్యక్రమాన్ని చేపడతారు.
- తీవ్రస్థాయి ప్రకృతి విపత్తులతో నష్టపోయిన రైతులకు జాతీయ విపత్తు సహాయ నిధి(ఎన్డీఆర్ఎఫ్) ద్వారా సహాయం అందజేయాలని నిర్ణయం.
- ప్రకృతి విపత్తు బాధిత రైతులకు 2 శాతం వడ్డీ రాయితీ. సకాలంలో రుణాలు చెల్లించిన వారికి 3 శాతం అదనపు రాయితీ ప్రయోజనాన్ని కల్పించారు.

### 2019-20 ఆర్థిక సంవత్సరంలో కేటాయింపులిలా..

- ★ వ్యవసాయ, అనుబంధ రంగాలకు — రూ.1,49,981 కోట్లు
- ★ ఎరువుల సబ్సిడీ — రూ.74,986 కోట్లు

### రైతులకిచ్చేది రోజుకు 17 రూపాయలా!



**దిల్లీ:** గత ఐదేళ్లలో ప్రభుత్వం రైతుల జీవితాలను నాశనం చేసిందని, బడ్జెట్‌లో వారిని అవమానించిందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ దుయ్యబట్టారు. తాత్కాలిక బడ్జెట్‌లో మంత్రి పీయూష్ గోయల్ రైతులకు కేంద్ర పథకం కింద ఏటా రూ.6,000 ఆర్థికసాయాన్ని 3 వాయిదాల కింద అందించనున్నట్లు ప్రకటించారు. ఈ లెక్కన రైతులకు అందించేది 'రోజుకు 17 రూపాయలు' అని, ఇది అన్నదాతలను అవమాన పరచడమేనని రాహుల్ విమర్శించారు. దీన్ని 'ఆఖరి జుమ్లా (గారడీ) బడ్జెట్'గా ఆయన ఎద్దేవా చేశారు.

### అన్ని వర్గాలపై ఉన్న అంకితభావాన్ని ప్రతిబింబిస్తోంది



'సమాజంలోని అన్ని వర్గాల వారికి బడ్జెట్ వల్ల లబ్ధి చేకూరనుంది. దేశంలోని యువత, అన్నదాతలు, పేదల పట్ల మోదీ ప్రభుత్వానికున్న అంకితభావం ఈ బడ్జెట్‌లో ప్రతిబింబిస్తోంది. పన్ను మినహాయింపును రూ.5 లక్షలకు పెంచడం చరిత్రాత్మక నిర్ణయం. 2022 నాటికి అన్నదాతల ఆదాయం రెట్టింపు చేయాలనే కేంద్ర ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకోవడంలో భాగంగా... రైతులకు ఏడాదికి రూ.6 వేలు ఇవ్వాలని నిర్ణయించారు. రక్షణ రంగానికి భారీగా నిధులు కేటాయించడం ద్వారా దేశ భద్రతకు ఎన్డీయే ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను తెలియజేస్తోంది.

–అమిత్ షా, భాజపా జాతీయాధ్యక్షుడు

### 20% పెంపు
### మహిళా శిశు సంక్షేమానికి పెరిగిన కేటాయింపులు

**దిల్లీ:** మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖకు కేంద్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో రూ.29 వేల కోట్లను కేటాయించింది. గత ఏడాదితో పోలిస్తే ఈ దఫా కేటాయింపులను 20 శాతం పెంచింది. ప్రసూతి కార్యక్రమాలకు కేటాయింపులను రెట్టింపు చేస్తూ నిర్ణయం తీసుకుంది.

- ★ ప్రధానమంత్రి మాతృవందన యోజన (పీఎంఎంవీవై)కు రూ.2,500 కోట్ల కేటాయింపు.
- ★ సమగ్ర శిశు అభివృద్ధి సేవల(ఐసీడీఎస్) కింద చిన్నారుల సంరక్షణ సేవా కార్యక్రమాలకు రూ.1500 కోట్ల కేటాయింపు.
- ★ మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖకు రూ.29,164.90 కోట్ల కేటాయింపు.
- ★ 'బేటీ బచావో బేటీ పఢావో' పథకానికి రూ.280 కోట్లు.
- ★ 'జాతీయ పౌష్టికాహార కార్యక్రమాని(ఎన్ఎన్ఎం)'కి రూ.3,400 కోట్లు.
- ★ 'మహిళా శక్తికేంద్రాల'కు రూ.150 కోట్లు.
- ★ ఉద్యోగినులు కార్యాలయాల నుంచి తిరిగి వచ్చే వరకూ వారి పిల్లల ఆలనాపాలనా చూసే కేంద్రాలకు సంబంధించిన జాతీయ క్రెచ్ పథకానికి రూ.50 కోట్ల కేటాయింపు.
- ★ వర్కింగ్ విమెన్స్ హాస్టల్ పథకానికి రూ.165 కోట్లు.
- ★ అక్రమ రవాణా బాధితుల పునరావాస కార్యక్రమం 'ఉజ్వల'కు రూ.30 కోట్ల కేటాయింపు.
- ★ వితంతు శరణాలయాలకు బడ్జెట్ కేటాయింపులు రూ.15 కోట్లు.

### వీవీఐపీ విమానాల నిర్వహణకు భారీగా పెరిగిన అంచనాలు

**దిల్లీ:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కోసం దేశంలోని అత్యంత ప్రముఖ (వీవీఐపీ)ల ప్రయాణాలకు ఉద్దేశించిన ఎయిర్ ఇండియా విమానాల నిర్వహణ వ్యయం అంచనాను కేంద్ర ప్రభుత్వం భారీగా పెంచింది. గత ఏడాది బడ్జెట్‌లో ఈ పద్దు కింద విదేశాంగ శాఖకు రూ.141 కోట్లు కేటాయించగా ఇప్పుడు దాన్ని రూ.420 కోట్లుగా సవరించింది. వీవీఐపీ విభాగంలో రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాన మంత్రి ఉంటారు.

### తాత్కాలిక బడ్జెట్ 2019-20 సమగ్ర స్వరూపం

(రూ.కోట్లలో)

| | 2017-18 వాస్తవ గణాంకాలు | 2018-19 బడ్జెట్ అంచనాలు | 2018-19 సవరించిన అంచనాలు | 2019-20 బడ్జెట్ అంచనాలు |
|---|---|---|---|---|
| రెవెన్యూ వసూళ్లు | 14,35,233 | 17,25,738 | 17,29,682 | 19,77,693 |
| మూలధన వసూళ్లు | 7,06,742 | 7,16,475 | 7,27,553 | 8,06,507 |
| మొత్తం వసూళ్లు | 21,41,975 | 24,42,213 | 24,57,235 | 27,84,200 |
| మొత్తం వ్యయం | 21,41,975 | 24,42,213 | 24,57,235 | 27,84,200 |
| రెవెన్యూ లోటు | 4,43,602 | 4,16,034 | 4,10,930 | 4,70,214 |
| కోశ లోటు | 5,91,064 | 6,24,276 | 6,34,398 | 7,03,999 |
| ప్రాథమిక లోటు | 62,112 | 48,481 | 46,828 | 38,938 |

### 4 రాష్ట్రాల్లో కౌలు రైతు చట్టాల మార్పు

**ఈనాడు, హైదరాబాద్:** కౌలు రైతులకు ఉపయోగపడేలా నూతన భూ కౌలుదారు చట్టం-2016 ప్రకారం ఇప్పటికే 4 రాష్ట్రాలు అమలు చేశాయని కేంద్రం కొత్త బడ్జెట్‌లో ప్రకటించింది. గతేడాది ఇచ్చిన హామీల అమలుకు తీసుకున్న చర్యలను పేర్కొంది. కొత్త చట్టం ముసాయిదాను నీతి ఆయోగ్ అన్ని రాష్ట్రాలను సంప్రదించి గతంలో విడుదల చేసింది. దీనిప్రకారం కౌలు రైతులకు పంట రుణాలు అందే వ్యవస్థను ఏర్పాటు చేస్తామని కేంద్రం గత బడ్జెట్‌లో పేర్కొంది. ఆ మేరకు ఇప్పటికే ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు నిబంధనలను సవరించాయి. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు ఈ చట్టాన్ని అమలు చేసేందుకు శాసనసభల్లో బిల్లులను ఆమోదించాయి. మిగతా రాష్ట్రాలను ఇలాగే చేయాలని కోరినట్లు కేంద్రం వివరించింది.

#### కేంద్రం వెల్లడించిన ఇతర అంశాలు

- ★ దేశవ్యాప్తంగా 22 వేల గ్రామ సంతలను 'గ్రామీణ వ్యవసాయ మార్కెట్'లుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు ప్రారంభించాం. 9477 గ్రామాల్లో ఇప్పటికే అధ్యయనం పూర్తయింది. వ్యవసాయ మార్కెట్లలో మౌలిక సదుపాయాల వృద్ధికి రూ.2 వేల కోట్ల నిధి ఏర్పాటు చేయడానికి కేంద్ర ఆర్థిక శాఖ అనుమతించింది.
- ★ ఉద్యాన పంటల అభివృద్ధికి దేశవ్యాప్తంగా 99 క్లస్టర్లు ఏర్పాటయ్యాయి. పంటల సాగు, శుద్ధి, మార్కెటింగ్ వంటివన్నీ ఈ క్లస్టర్‌లో ఉంటాయి. సేంద్రియ పంటల సాగును, ఈ పంటల అమ్మకాలను చేపట్టేందుకు మహిళా స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహిస్తున్నారు. ఈ ఏడాది 28 రాష్ట్రాల్లోని 23,679 గ్రామాల్లో 1646 క్లస్టర్లు ఏర్పాటు చేశారు. మొత్తం 5816 మహిళా సంఘాల్లోని 52,270 మంది మహిళలను సేంద్రియ పంటల సాగుకు ఎంపిక చేశారు. ఔషధ, అలంకరణ మొక్కల సాగుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశాం.

### ఇది 'అకౌంట్ ఫర్ ఓట్స్' బడ్జెట్



తాత్కాలిక బడ్జెట్‌కు బదులు ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఇది 'ఓట్ ఆన్ అకౌంట్' కాదు, 'అకౌంట్ ఫర్ ఓట్స్' (ఓట్ల కోసం చేసిన కేటాయింపులు). ఇది ఎన్నికల ప్రచార ప్రసంగంతో కూడిన పూర్తిస్థాయి బడ్జెట్. దీంతో ప్రభుత్వం చాలాకాలంగా వస్తున్న సంప్రదాయాలను తుంగలో తొక్కింది. ఈ బడ్జెట్‌తో భవిష్యత్తులో ఆర్థిక స్థిరత్వం బలహీనపడుతుంది. 90 రోజుల్లో దిగిపోనున్న ప్రభుత్వం ఆఖరి ప్రయత్నం చేసింది. ఈ ప్రభుత్వానికి రూ.5 లక్షల ఆదాయం వరకు పన్ను లేదంటూ మినహాయింపులు ఇచ్చే అధికారం ఉండదు.

–చిదంబరం, కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి



## కోరమాండల్ వ్యూహం!

- మత్స్యకారులు, పాడి రైతుల మనసు దోచేందుకే...
- తీర ప్రాంత, ఈశాన్య రాష్ట్రాల్లో బలపడేందుకు భాజపా ఎత్తుగడ

**ఈనాడు, దిల్లీ:** హిందీ రాష్ట్రాల్లో తన పట్టు సడలుతోందని భావిస్తున్న భాజపా... కేంద్రంలో మళ్లీ అధికారం దక్కించుకునేందుకు కొత్త వ్యూహాన్ని అమలు చేస్తోంది. తీరప్రాంత, ఈశాన్య రాష్ట్రాల్లో స్వయంగా బలపడటం; కాంగ్రెసేతర పక్షాల మద్దతును కూడగట్టుకోవడం ద్వారా మరోసారి కేంద్రంలో పగ్గాలు చేపట్టాలని యోచిస్తోంది. ఇందుకు అనుగుణంగా ఆయా రాష్ట్రాల్లో భారీగా ఓట్లున్న మత్స్యకారులు, పాడి రైతులను ప్రసన్నం చేసుకునేందుకు తాజా బడ్జెట్‌లో కేటాయింపులు ప్రకటించిందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. భారత ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయ రంగమే పునాది. సాగు రైతులకు రూ.6 వేల చొప్పున వార్షిక పెట్టుబడులను సమకూర్చుతామని ప్రకటించిన ప్రభుత్వం... కీలకమైన మత్స్య, పాడి పరిశ్రమలకూ బడ్జెట్‌లో ప్రాధాన్యమిచ్చింది.


#### ఎందుకీ నిర్ణయం?

భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ఏడాది కిందట ఖరారుచేసిన 'కోరమాండల్' ప్రణాళికకు అనుగుణంగానే గోయల్ బడ్జెట్ ప్రకటనలు ఉండటం గమనార్హం. గోవుల రక్షణకు ప్రాధాన్యమిచ్చే హిందీ రాష్ట్రాల్లో కాషాయ పార్టీ పట్టు సడలుతోందన్న సర్వేల నేపథ్యంలో... తీరప్రాంత (కోరమాండల్), ఈశాన్య రాష్ట్రాల వ్యూహాన్ని షా సిద్ధం చేశారు. ఇప్పటికే గుజరాత్, మహారాష్ట్ర, గోవా, కర్ణాటకల్లో బలం చాటుకున్న పార్టీని... మిగిలిన తీరప్రాంత రాష్ట్రాలైన కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, పశ్చిమబెంగాల్‌లో కూడా బలోపేతం చేయడం; లేదంటే అక్కడి కాంగ్రెసేతర పక్షాల మద్దతు కూడగట్టుకోవడం- ఈ ప్రణాళిక లక్ష్యం. తదనుగుణంగా ఈ రాష్ట్రాల్లో 150 ఎంపీ సీట్లు సమీకరించుకోవాలని షా 2018 జనవరిలోనే నిర్దేశించారు.

#### అక్కడ 25 సీట్ల గెలుపే లక్ష్యం?

కోరమాండల్ ప్రణాళికలో- అసోం సహా 8 ఈశాన్య రాష్ట్రాల నుంచి 25 వరకూ పార్లమెంటు స్థానాలను గెలుచుకోవాలన్న లక్ష్యం కూడా ఉంది. నిజానికి ఈ ప్రణాళికకు మొదట అడుగులు పడింది ఈశాన్య రాష్ట్రాల్లోనే. 2014 ఎన్నికలకు ముందు అక్కడ అంతంత మాత్రంగానే ఉన్న భాజపా... ఇప్పుడు స్వయంగా, ఇతర పార్టీల మద్దతుతో మొత్తం 8 రాష్ట్రాల్లోనూ పాలన సాగిస్తోంది. 2015లో అంకురించిన 'ఈశాన్య ప్రజాస్వామ్య కూటమి' ఆలోచనే...ఇప్పుడు తీరప్రాంత ప్రణాళిక అమలుకు బాటలు పరిచిందని ఆపార్టీ వర్గాలు చెబుతున్నాయి. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఈశాన్యంలో మరింత బలపడేలా భాజపా సర్కారు చర్యలు తీసుకుంటోంది. తొలిసారిగా అరుణాచల్‌ప్రదేశ్‌కు విమాన సేవలను; మేఘాలయ, త్రిపుర, మిజోరంలకు రైల్వే సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఇప్పుడు బడ్జెట్‌లో ఈప్రాంతానికి 21% మేర పెంచుతూ రూ.58,166 కోట్లు కేటాయించింది. బ్రహ్మపుత్ర నదిలో సరకు రవాణాకు అనుమతిస్తున్నట్టు ప్రకటించింది.

### దేశంలో కనీస మద్దతు ధరల (ఎంఎస్‌పీ) పెరుగుదల తీరు ఇలా..






## గృహ నిర్మాణానికి దన్ను

దిల్లీ: గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల శాఖకు బడ్జెట్‌లో ప్రాధాన్యం లభించింది. గతసారితో పోల్చితే 2019-20లో 17% మేర నిధులు పెరిగాయి. ఈ శాఖకు ప్రభుత్వం మొత్తం రూ. 48,000 కోట్లు కేటాయించింది. ఇందులో పధాన మంత్రి పట్టణ ఆవాస్ యోజనకు రూ. 6,853.26 కోట్లు; అమృత్ పథకానికి రూ. 7,300 (6,000) కోట్లు; ఆకర్షణీయ నగరాలకు రూ. 6,600 (6,169) కోట్లు; స్వచ్ఛభారత్ మిషన్‌కు రూ. 2,750 (2,500) కేటాయించారు.

## పన్నుల నుంచే 70పైసలు

దిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ ఖజానాకు వచ్చే ప్రతి రూపాయిలో 70పైసలు ప్రత్యక్ష, పరోక్ష పన్నుల నుంచే లభించనున్నాయి. అదే సమయంలో ప్రభుత్వం ఖర్చుచేసే ప్రతి రూపాయిలో 23 పైసలు పన్నులు, సుంకాల్లో రాష్ట్రాల వాటాగా ఉంది. దీని తర్వాత రెండోస్థానంలో 18పైసలు వడ్డీ చెల్లింపుల రూపంలో ఖజానా నుంచి తరలిపోనున్నాయి. ఒక్క జీఎస్‌టీ నుంచే ప్రతి రూపాయిలో 21పైసల ఆదాయం లభించనుంది.

## 24 గంటల్లోనే ఐటీ రిఫండ్

దిల్లీ: భవిష్యత్తులో ఆదాయం పన్ను(ఐటీ) చెల్లింపులు, మదింపు, రిఫండ్‌లను ఎక్కువగా ఆన్‌లైన్‌లోనే నిర్వహించనున్నారు. పన్ను చెల్లింపుదారుడు సమర్పించిన రిటర్నులను కేవలం 24గంటల్లోనే పరిశీలించి, ఏమైనా రిఫండ్ ఇవ్వాల్సి వస్తే ఒక్కరోజులోనే నగదును జమ చేయనున్నారు. వచ్చే రెండేళ్లలో ఐటీ అధికారితో పన్ను చెల్లింపుదారుడు సంప్రదించాల్సిన అవసరం లేకుండా ఎలక్ట్రానిక్ పద్ధతిలోనే నిర్వహించనున్నారు.

## పన్ను శాతాలు ఇలా


2019-20 ఆర్థిక సంవత్సరంలో 60 ఏళ్ల లోపు వారికి పన్ను శ్లాబులు

| | |
|---|---|
| రూ.2,50,000 | పన్ను లేదు |
| రూ.2,50,0001-రూ.5,00,000 | 5% |
| రూ.5,00,001-రూ.10,00,000 | 20% |
| రూ.10,00,001 ఆ పైన | 30% |

(పన్ను వర్తించే ఆదాయం రూ. 5,00,000 లోపు ఉన్నప్పుడు రూ. 12,500 పన్ను చెల్లించాలి. ఈ మొత్తానికే కొత్త బడ్జెట్‌లో రిబేటును ప్రకటించారు. కొన్ని సంస్థల్లో ఈ రిబేటును నేరుగా ఇస్తారు. మరికొన్ని సంస్థల్లో పన్ను మొత్తాన్ని టీడీఎస్ చేస్తారు. ఇలాంటి సందర్భాల్లో తప్పనిసరిగా రిటర్నులు దాఖలు చేయాలి. అప్పుడే రిఫండు రూపంలో ఈ మొత్తం వెనక్కి వస్తుంది.)

# రిబేటే పెంచారు

## శ్లాబులు యథాతథం



### ఆదాయపు పన్నులో మధ్యతరగతిపై కరుణ

ఆదాయపు పన్ను శ్లాబుల్లో ఎలాంటి మార్పులు చేయకుండానే మధ్య తరగతి వర్గాలకు ఉపశమనం కలిగించే చర్యల్ని బడ్జెట్‌లో ప్రతిపాదించారు.. తాత్కాలిక ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్. కనీస ఆదాయపు పరిమితిని పెంచకుండా.. రిబేటు మొత్తాన్ని పెంచడం ద్వారా ప్రయోజనం చేకూర్చారు. బడ్జెట్‌లో ప్రతిపాదించిన పన్ను మార్పుల్లో చెప్పుకోదగ్గ అంశం ఇదొక్కటే...

ఇప్పుడు అమల్లో ఉన్న ఆదాయ పన్ను నిబంధనల ప్రకారం కనీస ఆదాయ పరిమితులు మూడు రకాలుగా ఉన్నాయి. 60 ఏళ్లలోపు వారందరికీ రూ. 2,50,000 వరకూ, 60-80 ఏళ్ల లోపు వారికి రూ. 3,00,000 వరకూ, 80 ఏళ్ల ఆపైన వారికి రూ. 5,00,000 వరకూ ఆదాయ పన్ను వర్తించదు. ప్రస్తుత బడ్జెట్‌లో ఈ పరిమితుల్లో ఎలాంటి సవరణలూ చేయలేదు. అయితే, రిబేటు పరిధిని మాత్రం సవరించారు. గతంలో రూ. 3,50,000లోపు పన్ను వర్తించే వార్షికాదాయం ఉన్న వారికి సెక్షన్ 87ఏ ప్రకారం రూ. 2,500 రిబేటు లభించేది. ఈ పన్ను వర్తించే ఆదాయ పరిమితిని ఇప్పుడు రూ. 5,00,000లకు పెంచారు. దీంతో రూ. 12,500 రిబేటు లభిస్తుందన్నమాట. ఈ రిబేటు పొందాలంటే ఈ నిబంధనలకు లోబడి పొందవచ్చు..

- వార్షిక పన్ను వర్తించే ఆదాయం రూ. 5,00,000 లోపు ఉండాలి. (మొత్తం ఆదాయం నుంచి సెక్షన్ 80సీ కింద రూ. 1,50,000ల మినహాయింపు, సెక్షన్ 80డీ, ప్రామాణిక తగ్గింపు, గృహ రుణ వడ్డీ తదితర మినహాయింపులన్నీ తీసేసిన తర్వాత వచ్చే పన్ను వర్తించే ఆదాయం రూ. 5,00,000 దాటకూడదు)
- ఒక్కమాటలో చెప్పాలంటే.. మినహాయింపులన్నీ పోను రూ. 5లక్షలకు మించి పన్ను వర్తించే ఆదాయం ఉంటే.. ఎలాంటి రిబేటు వర్తించదు. వారికి ప్రస్తుతం అమల్లో ఉన్న పన్ను నిబంధనలే వర్తిస్తాయి.




### ప్రామాణిక తగ్గింపు రూ.50వేలు

గత బడ్జెట్‌లో ఉద్యోగులకు ప్రామాణిక తగ్గింపు రూ. 40,000 ప్రతిపాదించారు. ఇది రవాణా భత్యం రూ. 19,200; వైద్య భత్యం రూ. 15,000లకు బదులుగా ఈ ప్రామాణిక తగ్గింపును తీసుకొచ్చారు. ఈ కొత్త బడ్జెట్‌లో ఈ మొత్తాన్ని రూ. 50,000 చేశారు. దీనివల్ల పన్ను చెల్లింపుదారుడికి వర్తించే శ్లాబులను గరిష్ఠంగా రూ. 3వేల వరకూ పన్ను మినహాయింపు లభించనుంది.

- ఇప్పటి వరకూ పన్ను చెల్లింపుదారుడు ఒక ఇంటిని మాత్రమే సొంత నివాసానికి ఎలాంటి ఆదాయం చూపించాల్సిన అవసరం లేకుండా ఎంచుకోవచ్చు. మారిన పరిస్థితుల నేపథ్యంలో ఈ సెక్షన్ 23కి కొత్త బడ్జెట్‌లో సవరణ చేశారు. దీని ప్రకారం ఇకపై రెండు ఇళ్లను సొంతంగా నివాసం ఉంటున్నట్లుగా చూపించుకోవచ్చు. ఇది కొంత ప్రయోజనం చేకూర్చే అంశమే. ఉదాహరణకు మీకు ఉద్యోగం చేసే చోట ఒక ఇల్లు, మీ సొంత ఊరిలో మరో ఇల్లు ఉందనుకోండి. ఈ రెండు ఇళ్లనూ సొంతంగా నివాసం ఉంటున్నట్లు చూపించుకునే వెసులుబాటు కల్పించారు.
- బ్యాంకులు, పోస్టాఫీసులు ఇతర చోట్ల డిపాజిట్లు చేసినప్పుడు వచ్చిన వార్షిక వడ్డీ రూ. 10,000 దాటినప్పుడు సెక్షన్ 194 ఏ కింద మూలం వద్ద పన్ను వర్తిస్తుంది. ఇప్పుడు ఈ మొత్తాన్ని రూ. 40,000లకు పెంచారు.
- ఇంటిని వాణిజ్య అవసరాల కోసం అద్దెకు ఇచ్చినప్పుడు సెక్షన్ 194-ఐ ప్రకారం అద్దె మొత్తం రూ. 1,80,000 దాటినప్పుడు మూలం వద్ద పన్ను కోత (టీడీఎస్) విధించాలి. కొత్త ప్రతిపాదనల ప్రకారం ఈ కనీస మొత్తం రూ. 2,40,000లకు పెంచారు.
- అమల్లో ఉన్న సెక్షన్ 54 ప్రకారం పన్ను చెల్లింపుదారుడు ఇల్లు అమ్మినప్పుడు వచ్చిన దీర్ఘకాలిక మూల ధన లాభాన్ని నిర్ణీత సమయంలో మరో ఇంటిపై పెట్టుబడి పెట్టి, మినహాయింపు పొందవచ్చు. కొత్త ప్రతిపాదనల ప్రకారం నివాసయోగ్యమైన ఇల్లు అమ్మినప్పుడు రూ. 2 కోట్ల లోపు దీర్ఘకాలిక మూల ధన లాభం ఉంటే, ఆ మొత్తంతో రెండు ఇళ్లలో పెట్టుబడి పెట్టి, మినహాయింపు పొందే వీలు కల్పించారు.

– జి.సాంబశివ రావు, ప్రత్యక్ష పన్నుల నిపుణులు

**ఉద్యోగికి ఊరట**

### మినహాయింపు అంటే


ఆదాయపు పన్ను భారం తగ్గించుకోవడానికి చట్టం కొన్ని వెసులుబాట్లు కల్పించింది. స్థూల ఆదాయం నుంచి గృహ రుణం వడ్డీ, సెక్షన్ 80సీ, 80డీ తదితర సెక్షన్ల కింద మినహాయింపు కోరవచ్చు. ఒక్కమాటలో చెప్పాలంటే.. స్థూల ఆదాయంలో నుంచి ఈ నిర్ణీత మొత్తాలను తగ్గించిన తర్వాతే పన్ను వర్తించే మొత్తం ఆదాయం వస్తుంది. ఈ మొత్తానికే వర్తించే శ్లాబుల ప్రకారం ఆదాయపు పన్ను చెల్లించాలి.

### రిబేటు అంటే

పన్ను వర్తించే ఆదాయం లెక్క తేలితే.. ఎంత పన్ను చెల్లించాలన్నది స్పష్టత వస్తుంది. సెక్షన్ 87ఏ ప్రకారం.. చెల్లించాల్సిన పన్ను మొత్తంలో నుంచి ఇచ్చే రాయితీని రిబేటు అంటారు.

## కొనుగోలు శక్తి పెరుగుతుంది: జైట్లీ

ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని రూ. 5 లక్షలకు పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఘనత వహించిన భారత మధ్యతరగతికి ప్రయోజనం చేకూరుస్తుందని కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ అభిప్రాయపడ్డారు. దేశ భవిష్యత్తుకు కీలకమైన మధ్యతరగతి ప్రజల కొనుగోలు శక్తి ఈ నిర్ణయంతో బలోపేతమవుతుందని సూచించారు. ఆర్థిక వ్యవస్థ విశాల ప్రయోజనాల కోసం అత్యవసర చర్యలు అవసరమని జైట్లీ ఉద్ఘాటించారు. 2009, 2014ల్లోనూ తాత్కాలిక బడ్జెట్‌లలో పన్ను విధానాల్లో కీలక మార్పులు చేసిన సంగతిని గుర్తుచేశారు.



ఉద్యోగాల సృష్టి విషయంలో తలెత్తిన వివాదంపై ఫేస్‌బుక్ పోస్ట్‌లో జైట్లీ స్పందిస్తూ.. గత ఐదేళ్లుగా స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ) సగటున 7.5 శాతం చొప్పున పెరిగిందన్నారు. ఉద్యోగాల కల్పన లేకుండా అంతటి వృద్ధిరేటు సాధ్యమేనా అని ప్రశ్నించారు. పెద్ద నోట్ల రద్దు వల్ల జీడీపీ వృద్ధి రెండు శాతం పడిపోతుందని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చెప్పారని.. ఆ అంచనా తప్పని తేలిపోయిందని పేర్కొన్నారు. జైట్లీ అమెరికాలో చికిత్స పొందుతుండటంతో ఆయన స్థానంలో ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టిన గోయల్ బడ్జెట్ ప్రవేశపెట్టారు.

## ప్రలోభపెట్టే బడ్జెట్

కేంద్ర బడ్జెట్ భాజపా ఎన్నికల ప్రణాళిక (మ్యానిఫెస్టో)లా ఉంది. లోక్‌సభ ఎన్నికల ముందు ప్రభుత్వం ఓటర్లను ప్రలోభపెట్టింది. బడ్జెట్‌లో అన్నీ ఎన్నికల తాయిలాలు, గిమ్మిక్కులు. ఈ ఏడాది మే వరకే పాలించే భాజపా వాటిని నెరవేర్చలేదు. ఇంతవరకు ఏమీ చేయలేని వాళ్లు భవిష్యత్తులో ఏదో చేస్తామని చెప్పడం గిమ్మిక్కే. బడ్జెట్‌లో దళితులకు చేసింది చాలా తక్కువ.



– మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ లోక్‌సభాపక్ష నేత

## అంకెల గారడీ!

కొద్ది నెలల్లో జరిగే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన బడ్జెట్ ఇది. ఇది ప్రగతిదాయకం కాదు. ప్రభుత్వం ఆర్థిక రంగంలో చేసిన పెద్ద తప్పులను కప్పిపుచ్చుకోవడానికే ఇదంతా. పేదరికాన్ని తగ్గించేందుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారో ప్రకటించలేదు. రైతుల కోసం ప్రకటించిన వార్షికాదాయ పథకంలోనూ స్పష్టత లేదు. కౌలు రైతులు, వ్యవసాయ కూలీలకు ఈ పథకం ఉపయోగపడదు. వ్యక్తిగత ఆదాయపు పన్ను మినహాయింపు విషయంలో ప్రభుత్వం విరుద్ధ వైఖరిని అవలంబించింది. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు కోటా ఇచ్చేందుకు వార్షికాదాయ పరిమితిని రూ. 8 లక్షలుగా ప్రకటించిన ప్రభుత్వం, పన్ను మినహాయింపులు మాత్రం సంవత్సరానికి రూ. 5 లక్షలు, రూ. 6.5 లక్షలు ఉన్నవారికే వర్తింపజేసింది. ఇదంతా అంకెల గారడీ.



– డి.రాజా, సీపీఐ

## ఇక 'బ్యాలెట్'తో మెరుపుదాడి

ఇది మరో మెరుపు దాడి (సర్జికల్ స్ట్రైక్) అవుతుంది. సరిహద్దు వద్ద మన సైనికులు గతంలో తొలి మెరుపు దాడి చేశారు. అప్పుడు 'బుల్లెట్'తో చేస్తే ఈసారి ప్రతిపక్షాలపై 'బ్యాలెట్'తో జరుగుతుంది. ఈ బడ్జెట్ రైతులకు ప్రయోజనకరం. వచ్చే ఎన్నికల్లో 2/3వ వంతు ఆధిక్యంతో తిరిగి అధికారంలోకి వస్తాం. ఇలాంటి బడ్జెట్‌ను ఇంతకుముందు చూసి ఉండరు. ప్రతి రంగాన్ని పరిగణలోకి తీసుకున్నారు.



– రామ్‌విలాస్ పాసవాన్, ఆర్కే సింగ్, కేంద్ర మంత్రులు

## కొత్త పన్ను ప్రతిపాదనలు

(రూపాయల్లో)

| పన్ను వర్తించే ఆదాయం | ఇప్పటి వరకూ పన్ను | కొత్త పన్ను | మిగులు |
|---|---|---|---|
| రూ.2.5లక్షల వరకూ | పూర్తి మినహాయింపు | పూర్తి మినహాయింపు | ---- |
| రూ.3లక్షల వరకూ | 2,600 | 0 | 2,600 |
| రూ.4.5లక్షల వరకూ | 10,400 | 0 | 10,400 |
| రూ.5లక్షల వరకూ (పన్ను..సెస్సుతో కలిపి) | 13,000 | 0 | 13,000 |

(పన్ను వర్తించే ఆదాయం రూ.5,00,000 దాటినప్పుడు ప్రస్తుతం వర్తించే పన్ను శ్లాబులే వర్తిస్తాయి. తేడా ప్రామాణిక తగ్గింపు రూ.40వేలకు బదులు రూ.50వేలు చేశారు.)

# గ్రాట్యుటీని రూ.20 లక్షలకు పెంచాం

ఈనాడు, హైదరాబాద్, దిల్లీ: ఉద్యోగుల గ్రాట్యుటీ పరిమితిని రూ. 20లక్షలకు పెంచినట్లు ప్రభుత్వం వెల్లడించింది. రూ. 10లక్షలుగా ఉన్న గ్రాట్యుటీ పరిమితిని గత ఏడాది మార్చిలో ప్రభుత్వం రూ. 20 లక్షలకు పెంచిన విషయాన్ని పీయూష్ గోయల్ బడ్జెట్ ప్రసంగం సందర్భంగా గుర్తు చేశారు.

**గత ఐదేళ్లలో కార్మికుల వేతనం 42% మేర పెరిగింది –పీయూష్‌గోయల్**

### ఎవరు అర్హులు?

ఏదేని సంస్థలో ఐదేళ్లపాటు పనిచేసిన ఉద్యోగులు గ్రాట్యుటీకి అర్హులు. ఉద్యోగి పదవీ విరమణ చేసినా, ఉద్యోగాన్ని వదిలివేసినా గ్రాట్యుటీ చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ ఉద్యోగి సర్వీసులో ఉండి దివ్యాంగులైనా, చనిపోయినా పదవీ విరమణనాటికి వచ్చే సర్వీసును లెక్కించి వారసులకు నగదు చెల్లిస్తారు. ఉద్యోగి ఉద్యోగం మానేసినపుడు, పదవీ విరమణ చేసినపుడు చివరినెల వేతనంలోని మూలవేతనం, కరవు భత్యం కలిపి వేతనంగా లెక్కిస్తారు.

### రూ.85వేలకు పైబడి జీతం ఉంటే మేలు

గ్రాట్యుటీ పెంపుతో అధిక వేతనాలు పొందే వారికి ఎక్కువ ఆర్థిక ప్రయోజనం చేకూరనుంది. తక్కువ వేతనాలు పొందేవారికి వచ్చే గ్రాట్యుటీ చాలా తక్కువ. ఉదాహరణకు ఒక వ్యక్తి 18ఏళ్లకు ఉద్యోగంలో చేరాడనుకుందాం. పదవీ విరమణనాటికి వేతనం (మూలవేతనం, కరవుభత్యం) రూ. 45వేలపైన ఉంటే గ్రాట్యుటీ కింద అధిక మొత్తంలో పెంపుఫలం అందుతుంది. అంటే ఆ వ్యక్తికి వచ్చే గ్రాట్యుటీ రూ. 10,38,461 అవుతుంది. గతంలో రూ. పదిలక్షల కంటే గ్రాట్యుటీ అర్హత ఎక్కువగా ఉన్నా, రూ. పదిలక్షలకు పరిమితం చేసేవారు. ఒకవేళ వేతనం రూ. 85వేలకు పైబడి ఉంటే పూర్తిగా మేలు జరుగుతుంది. ఆ ఉద్యోగికి రూ. 19,61,538 చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుత పెంపుతో ఆ ఉద్యోగికి రూ. 9.61లక్షల అదనపు లాభం చేకూరుతుందన్నమాట.

## ద్రవ్య లోటుపై వ్యూహం..

లోటును తగ్గించడానికి అనుసరించనున్న వ్యూహాన్ని ఆర్థికమంత్రి బడ్జెట్‌లో పొందుపరిచారు. వచ్చే ఆర్థిక సంవత్సరం (2020-21) నాటికి ద్రవ్యలోటును జాతీయ స్థూల ఉత్పత్తి (జీడీపీ)లో 3 శాతానికి పరిమితం చేయాలని, ప్రాథమిక లోటు పూర్తిగా లేకుండా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆదాయం కన్నా వ్యయం అధికంగా ఉన్నప్పుడు దాన్ని ద్రవ్య లోటు అంటారు. దీన్ని భర్తీ చేయడానికి రుణాలు తీసుకోవాల్సి ఉంటుంది. ద్రవ్య లోటు నుంచి చెల్లించిన వడ్డీలను తీసివేస్తే వచ్చే మొత్తాన్ని ప్రాథమిక లోటుగా పిలుస్తారు. చేసిన అప్పులను తీర్చడానికి మళ్లీ రుణాలు తీసుకోవాల్సి వస్తే ఆ పరిస్థితిని కూడా ప్రాథమిక లోటు అని అంటారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రాథమిక లోటును 'సున్నా'కు పరిమితం చేయాలని ప్రతిపాదించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు 3.4 శాతంగా ఉండగా, 2019-20లోనూ 3.4 శాతంగా ఉంది. లోటును 3.3 శాతానికి పరిమితం చేయాలని అనుకున్నా, కానీ రైతు సంక్షేమం కోసం అధికంగా నిధులు ఖర్చు చేయడం వల్ల పెరిగిందని ఆర్థిక మంత్రి గోయల్ తెలిపారు. గత బడ్జెట్‌లో రూ. 20 వేల కోట్లు కేటాయించగా, ప్రస్తుతం రూ. 75,000 కోట్లు కేటాయించామని చెప్పారు.




## విపక్ష సభ్యుల ఆందోళనల మధ్యే..

ఎన్డీయే ప్రభుత్వం తన ఆఖరు బడ్జెట్‌ను విపక్ష సభ్యుల ఆందోళనలు, గందరగోళం మధ్యే ప్రవేశపెట్టింది. ఆర్థికమంత్రి పీయూష్ గోయల్ తన తొలి బడ్జెట్ ప్రసంగాన్ని ప్రారంభించకముందే ఆందోళనలు ఎదురయ్యాయి. నిరుద్యోగిత రేటుపై వచ్చిన కథనాలపై ఆందోళన వ్యక్తం చేశారు. కొంతమంది వామపక్షాల సభ్యులు సైతం నిరసన తెలిపారు. తాత్కాలిక బడ్జెట్ పత్రాలు పార్లమెంటులో ప్రవేశపెట్టకముందే మీడియాకు పొక్కాయని విపక్ష సభ్యులు ఆరోపించారు. నిరుద్యోగిత రేటుకు సంబంధించిన అంశంపై కొంతమంది సభ్యులు ప్లకార్డులు ప్రదర్శించారు. ఏపీకి ప్రత్యేక హోదా కల్పించాలంటూ తెదేపా సభ్యులు నినాదాలు చేశారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామంటూ పీయూష్ తన ప్రసంగంలో ప్రస్తావించినప్పుడు విపక్ష సభ్యులు పరిహసించగా, అధికార పక్ష సభ్యులు బల్లలు చరిచారు. బడ్జెట్ సమర్పిస్తున్న సమయంలోనే కాంగ్రెస్ సభ్యుడు రాజీవ్ సతవ్ ఆర్థికమంత్రి వద్దకు వెళ్లి బల్లపై కాగితాలు ఉంచారు. ప్రధాని బల్లపై కూడా కాగితాన్ని పెట్టారు. బడ్జెట్ సమర్పిస్తుండగానే కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ సభ నుంచి వెళ్లిపోవడంతో, 'రాహుల్ బాబా పారిపోయారు' అని అరిచారు. కొద్దిసేపటి తర్వాత రాహుల్ తన సీటులోకి వచ్చారు. లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ తంబిదురై, యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ, జమ్మూకశ్మీర్ మాజీ సీఎం ఫరూక్ అబ్దుల్లా సభకు హాజరు కాలేదు.



బడ్జెట్ ప్రతులను పార్లమెంటులోకి తీసుకెళ్తున్న సిబ్బంది

## తాత్కాలిక బడ్జెట్ 2019-20






### వర్గీకరణకు ప్రత్యేక కమిటీ

**దిల్లీ:** మనదేశంలో ఇప్పటివరకు వర్గీకరణకు నోచుకోని విముక్త(డీ నోటిఫైడ్), సంచార, పాక్షిక సంచార(సెమీ నొమాడిక్) జాతుల గుర్తింపు ప్రక్రియను పూర్తిచేసేందుకుగాను నీతి ఆయోగ్ కింద ఓ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. ఆ జాతుల ప్రజలకు ప్రయోజనాలు చేకూర్చేలా ప్రత్యేక వ్యూహాలు రూపొందించేందుకు సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ పరిధిలో సంక్షేమాభివృద్ధి మండలిని కూడా ఏర్పాటుచేయనుంది.

### వినోదానికి 'ఏకగవాక్షం'

**దిల్లీ:** ప్రధాన ఉపాధి కల్పనరంగాల్లో ఒకటైన వినోదపరిశ్రమను ప్రోత్సహించేందుకు శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేంద్రం ఏకగవాక్ష పద్ధతిని ప్రకటించింది. సినిమా షూటింగ్‌లకు ఇప్పటిదాకా కేవలం విదేశీయులకు మాత్రమే పరిమితమైన ఏకగవాక్ష అనుమతుల విధానం ఇప్పుడిక భారత సినిమా తయారీదారులకు వర్తిస్తుంది. పైరసీని అరికట్టేందుకు సినిమాటోగ్రాఫ్ చట్టంలో మార్పులు చేస్తామని కూడా ప్రభుత్వం చెప్పింది.




# అసంఘటిత కార్మికులకు రూ.3000 పింఛను

- 60వ ఏట నుంచి నెలనెలా చెల్లింపు
- 'ప్రధాన్‌మంత్రి శ్రమ్ యోగి మాన్‌ధన్' పేరుతో పథకం

ఈనాడు–హైదరాబాద్, దిల్లీ

అసంఘటిత రంగంలో ఉన్న కోట్లాదిమంది కార్మికులకు నెలనెలా రూ.3000 పింఛను అందించే మెగా పింఛను పథకాన్ని కేంద్రప్రభుత్వం ప్రకటించింది. "ప్రధాన్‌మంత్రి శ్రమ్ యోగి మాన్‌ధన్- పీఎంఎస్‌వైఎం" అనే ఈ సరికొత్త పథకంతో వచ్చే ఐదేళ్లలో సుమారు పదికోట్లమంది ప్రయోజనం పొందనున్నారని అంచనా. రూ.15వేల వరకు నెలవారీ ఆదాయం పొందేవారు ఈ పథకానికి అర్హులు. కార్మికుడు తన వంతుగా రూ.వంద నెలనెలా చెల్లిస్తే, కేంద్రప్రభుత్వం మరో రూ.వంద జత చేస్తుంది. కార్మికుడి 60వ ఏట నుంచి రూ.3000 పింఛను పొందవచ్చు.




#### ఎంత చిన్నవయస్సులో ప్రారంభిస్తే అంత మేలు!

60వ ఏట నుంచి రూ.3000 నెలవారీ పింఛను పొందాలంటే, కార్మికుడు ఎంత చిన్నవయస్సులో పథకంలో చేరితే అంత తక్కువగా తన వంతు నగదు జమ చేయాల్సి ఉంటుంది. కార్మికుడి వయస్సు పెరిగిన కొలదీ నగదు కూడా పెరుగుతుంది. ఉదాహరణకు 29ఏళ్ల వ్యక్తి నెలనెలా రూ.వంద చొప్పున పథకంలో జమ చేయాలి. అదే 18ఏళ్ల వ్యక్తి అయితే రూ.55 చెల్లిస్తే చాలు. కనిష్ఠ, గరిష్ఠ పరిమితుల గురించి ప్రభుత్వం పూర్తి వివరాలు వెల్లడించలేదు.

#### అసంఘటిత కార్మికులకు మెగా పింఛను పథకం

మనదేశంలో అసంఘటిత రంగంలో పనిచేసే ఎంతోమంది కార్మికులు, దినసరి కూలీలకు సాంఘిక భద్రత లేదు. జీవితాంతం కష్టపడి పనిచేసినా వృద్ధాప్యంలో ఎటువంటి ఆసరా లేక, అప్పటి అవసరాలకు తగిన ఆదాయం లేక నానా కష్టాలు పడవలసిన పరిస్థితి. అలాగని యుక్తవయస్సు నుంచీ పొదుపు చేసి, ఆసొమ్ముతో బతకాలనుకున్నా... పొదుపు చేసే స్థాయి ఆదాయం ఉండదు. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని కేంద్రం తాజాగా ఈ మెగా పింఛను పథకాన్ని ప్రతిపాదించింది. 'ప్రధాన్‌మంత్రి శ్రమ-యోగి మాన్‌ధన్' పేరుతో ప్రతిపాదించిన ఈ పథకం ఎంతోమందికి అండగా నిలుస్తుందని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. మనదేశంలోని కోట్లమంది అసంఘటిత రంగం కార్మికుల కోసం ఇప్పటికే "పీఎం జీవన్ జ్యోతి బీమా యోజన, పీఎం సురక్షా బీమా యోజన, ఆయుష్మాన్ భారత్" పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోంది.

#### పది కోట్ల మందికి లబ్ధి

రిక్షా కార్మికులు, ఆటోడ్రైవర్లు, భవన నిర్మాణ కార్మికులు, వ్యవసాయ కూలీలు, ఇతర ఎన్నో రకాలైన పనులు చేసి జీవనం సాగించే ఎంతోమందికి ఈ పథకం వల్ల మేలు జరుగుతుందని ప్రభుత్వం చెబుతోంది. ఈ పథకంలో వచ్చే అయిదేళ్లలో దాదాపు పదికోట్ల మంది కార్మికులు చేరతారని అంచనా. అదే జరిగితే ప్రపంచంలో ఇదే అతిపెద్ద పింఛను పథకం అవుతుంది. దీనికి ప్రస్తుత బడ్జెట్‌లో కేంద్రప్రభుత్వం రూ.500 కోట్లు కేటాయించింది. అవసరమైతే ఇంకా అధిక నిధులు ఇస్తారు. అసంఘటిత రంగానికి కార్మికులు ఇటీవల దేశవ్యాప్తంగా రెండు రోజుల పాటు సమ్మె చేశారు. తమకు నెలకు రూ.18,000 కనీస వేతనం ఉండాలని, రూ.3,000 పింఛను ఇవ్వాలని డిమాండు చేశారు. దీన్ని పరిగణనలోకి తీసుకున్న కేంద్రం.. ఈ కొత్త పింఛను పథకాన్ని తీసుకువచ్చినట్లు తెలుస్తోంది.

### నల్లధనం వెలుగులోకి

**దిల్లీ:** నల్లధనం నిరోధక చర్యల ప్రభావంతో గత నాలున్నరేళ్ల వ్యవధిలో దేశవ్యాప్తంగా బయటపడని రూ.1,30,000 కోట్ల ఆదాయాన్ని పన్ను పరిధిలోకి తేగలిగామని ఆర్థిక మంత్రి పియూష్ గోయల్ ప్రకటించారు. రూ.50వేల కోట్ల అక్రమ ఆస్తుల స్వాధీనానికి ఇది బాటవేసిందని చెప్పారు. పెద్దనోట్ల రద్దు, పేరుమోసిన ఆర్థిక నేరగాళ్ల ఆటకట్టించటం తదితర చర్యల ద్వారా ఇది సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. నల్లధనాన్ని అరికట్టడానికి తమ ప్రభుత్వం అన్ని విధాల కట్టుబడి ఉందని ఆర్థిక శాఖ బాధ్యతలను అదనంగా చూస్తున్న మంత్రి పియూష్ స్పష్టం చేశారు. అందులో భాగంగా గత నాలుగున్నర సంవత్సరాల వ్యవధిలో రూ.6,900 కోట్ల బినామీ ఆస్తులు, 1,600 కోట్ల విదేశీ ఆస్తులు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. 3,38,000 డొల్ల కంపెనీల ఆనుపానులు కనిపెట్టి వాటి గుర్తింపు రద్దు చేసినట్లు ఆయన వివరించారు.

### ఎస్సీ, ఎస్టీలకు పెద్దపీట

**దిల్లీ:** ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి నిధుల కేటాయింపును కేంద్రంగా భారీగా పెంచింది. 2018-19 బడ్జెట్ అంచనా(బీఈ)లో ఎస్సీల సంక్షేమం కోసం తొలుత రూ.56,619 కోట్లను కేటాయించారు. ఆ తరువాత సవరించిన అంచనా(ఆర్ఈ)ల్లో దీన్ని రూ.62,474 కోట్లకు పెంచారు. తాజాగా 2019-20 బడ్జెట్ అంచనాల్లో ఈ నిధులను రూ.76,801 కోట్లకు పెంచారు. అంటే 2018-19తో పోలిస్తే 35.6శాతం అధికంగా కేటాయించారు. ఇదేకాలావధికి ఎస్టీల సంక్షేమం కోసం కేటాయింపు ప్రతిపాదనలను సైతం 28 శాతం పెంచారు. గతంలో రూ.39,135 కోట్లు ఉన్న నిధులను రూ.50,086 కోట్లకు పెంచారు.

### కాలుష్య నిధులకు కోత

**దిల్లీ:** కాలుష్య నియంత్రణ బడ్జెట్‌లో 50 శాతం కోత పడింది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.20 కోట్లు ఉండగా, 2019-20లో రూ.10 కోట్లే కేటాయించారు. నూతన, పునరుత్పాదక ఇంధన వనరుల రంగానికి ఎలాంటి కేటాయింపులు జరపలేదు. వాతావరణ మార్పుల కార్యాచరణ ప్రణాళిక కోసం గత ఏడాదిలాగే రూ.40 కోట్ల కేటాయింపునే కొనసాగించారు. జాతీయ శుద్ధ వాయు కార్యక్రమం(ఎన్‌సీఏపీ) కేటాయింపుల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించలేదు. కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డుకు రూ.100 కోట్లు కేటాయించారు. కాలుష్య నియంత్రణకు కేటాయింపులో కోత విధించడంపై పర్యావరణ నిపుణులు, ఉద్యమకారుల నుంచి విమర్శలు వ్యక్తమయ్యాయి. జంతు సంరక్షణ బోర్డుకు రూ.12 కోట్లు, జాతీయ హరిత భారత్ కమిషన్‌కు రూ.240 కోట్లు కేటాయించారు.

#### పర్యావరణానికి 20% పెంపు

పర్యావరణ మంత్రిత్వ శాఖకు 2019-20 సంవత్సరానికి రూ.3,111.20 కోట్లు కేటాయించారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.2,586.67 కోట్లు కేటాయించగా ఈసారి 20.27 శాతం పెరిగింది. ప్రాజెక్టు టైగర్‌కు గత ఏడాది రూ.350 కోట్లు, ప్రాజెక్టు ఎలిఫెంట్‌కు రూ.30 కోట్లు కేటాయించగా, ఈసారి కేటాయింపుల్లో మార్పేమీ లేదు. జాతీయ పులుల సంరక్షణ ప్రాధికార సంస్థకు రూ.10 కోట్లు కేటాయించారు.



### ఈశాన్యానికి 5,600 కోట్లు

ప్రత్యేక హోదా ఉన్న ఈశాన్య, హిమాలయ ప్రాంత రాష్ట్రాలకు కేంద్రం సుమారు రూ.5,600 కోట్ల ప్రయోజనాలు కల్పిస్తోంది. ఇందులో పారిశ్రామిక ప్రోత్సాహకాల కింద రూ.2608 కోట్లు, మౌలిక వసతుల కల్పనకు రూ.3వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పారిశ్రామిక పన్ను రాయితీలు అడిగితే, ఎవరికీ ఇవ్వలేదని చెప్పే కేంద్ర ప్రభుత్వం... ఈశాన్య, హిమాలయ రాష్ట్రాలకు మాత్రం ఈ పద్దు కింద రూ.1700 కోట్లు ఇచ్చేందుకు సిద్ధమైంది.

# 'ఆయుష్మాన్ భారత్'కు 6400 కోట్లు

- ఆరోగ్యరంగానికి రూ.61,398 కోట్ల కేటాయింపు
- గతేడాది కంటే 16 శాతం ఎక్కువ

**దిల్లీ:** కేంద్ర ప్రభుత్వం రూ.61,398 కోట్లను ఆరోగ్యరంగానికి కేటాయించింది. అందులో రూ.6400 కోట్లను ప్రతిష్ఠాత్మక 'ఆయుష్మాన్ భారత్ - ప్రధాన్‌మంత్రి జన్‌ఆరోగ్య యోజన'కు ప్రత్యేకించింది. 2018-19 కేటాయింపుల కంటే ఇవి 16 శాతం ఎక్కువ.

☛ గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన వైద్య సేవల కోసం ఆయుష్మాన్ భారత్ కింద వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటుకు రూ.250 కోట్లు

☛ జాతీయ పట్టణ ఆరోగ్య మిషన్ కింద వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటుకు రూ.1,350.01 కోట్లు. 2022 కల్లా 1.5 లక్షల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయి పెంపు. ఈ కేంద్రాల్లో రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్, వృద్ధాప్య సంబంధ వ్యాధులకు చికిత్సలు

☛ జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్‌ఎం)కు రూ.31,745 కోట్లు. గత బడ్జెట్‌లో ఈ కేటాయింపు రూ.30,129 కోట్లు

☛ ఎన్‌హెచ్‌ఎం ఆధ్వర్యంలో నడిచే రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజనకు నిధుల్లో భారీ కోత వేశారు. రూ.156 కోట్లు మాత్రమే కేటాయించారు. గతేడాది కేటాయింపు కంటే ఇది రూ.1844 కోట్లు తక్కువ కావడం గమనార్హం


☛ ఎయిడ్స్, ఎస్‌టీడీ నియంత్రణ కార్యక్రమాలకు గతేడాది కంటే రూ.400 కోట్లు ఎక్కువగా రూ.2500 కోట్లు కేటాయించారు.

☛ జిల్లా ఆసుపత్రులు, రాష్ట్ర ప్రభుత్వ వైద్య కళాశాలల(పోస్టు గ్రాడ్యుయేట్ సీట్లు) ఆధునికీకరణ, వసతుల విస్తరణకు రూ.800 కోట్లు, నర్సింగ్ సేవల ఆధునికీకరణ, బలోపేతానికి రూ.64 కోట్లు, ఫార్మసీ కళాశాలల అభివృద్ధికి రూ.5 కోట్ల కేటాయింపు.

☛ ప్రభుత్వ వైద్య కళాశాలలు(గ్రాడ్యుయేట్ సీట్లు), కేంద్ర ప్రభుత్వ అధీనంలోని ఆరోగ్య సంస్థల బలోపేతానికి రూ.1,361 కోట్లు

☛ కొత్త వైద్య కళాశాలల ఏర్పాటుకు రూ.2 వేల కోట్ల కేటాయింపు.

## బడ్జెటే మేనిఫెస్టో



**ఈనాడు, దిల్లీ:** కేంద్ర ఆర్థిక శాఖ తాత్కాలిక మంత్రి పీయూష్ గోయల్ ఓ రకంగా భాజపా ఎన్నికల మేనిఫెస్టో కమిటీ పనిని సులభతరం చేశారు. శుక్రవారం ఆయన ప్రవేశపెట్టిన సాధారణ బడ్జెట్టుకు కాస్త మార్పులు చేర్పులు చేస్తే సార్వత్రిక ఎన్నికల్లో అదే పార్టీ మేనిఫెస్టో (ఎన్నికల ప్రణాళిక) అయ్యేలా ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సార్వత్రిక ఎన్నికల కోసం మేనిఫెస్టో రూపొందించే పనిని కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ నేతృత్వంలోని కమిటీ చేపట్టింది. శుక్రవారం నాటి బడ్జెట్టును చూస్తే కాస్త అటూఇటూగా పార్టీ మేనిఫెస్టోను ముందుగా ఆవిష్కరించినట్లయింది.

#### నాలుగు వర్గాలే లక్ష్యం

బడ్జెట్టును పరిశీలిస్తే నాలుగు వర్గాలను ప్రధానంగా లక్ష్యంగా చేసుకున్నట్లు కనిపిస్తోంది. పట్టణ ప్రాంత మధ్య తరగతి, వ్యాపారులు, అసంఘటిత కార్మికులు, రైతులు... ఈ నాలుగు వర్గాలను ప్రసన్నం చేసుకునేందుకు వివిధ పథకాలను బడ్జెట్లో ప్రకటించారు. ఏకంగా 2030 నాటికి 'దశ దిశల దార్శనికత'ను ఆయన ఆవిష్కరించారు. దేశంలోని 543 లోక్‌సభ నియోజకవర్గాల్లో 177 చోట్ల కనీసం 50% మంది ప్రజలు పట్టణ ప్రాంతాలవారే. దీంతో వారికి సానుకూల సంకేతాలు పంపించేలా పన్నుల విషయంలో నిర్ణయాలు ప్రకటించారు.

## ఉపాధికి ఊతం



**దిల్లీ:** మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేంద్రం రూ.60వేల కోట్లు కేటాయించింది. 2018-19 బడ్జెట్ కేటాయింపులైన రూ.55వేల కోట్లతో పోలిస్తే ఇవి 11శాతం ఎక్కువ. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే రూ.61,084 కోట్లు వ్యయం చేసినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. తాజాగా రూ.2019-20 బడ్జెట్ అంచనాల్లో రూ.60 వేల కోట్లు కేటాయించినా, వాస్తవంలో ఈ వ్యయం మరింత పెరిగే అవకాశం ఉంది. ఏ ఒక్క కుటుంబం కూడా తినకుండా నిద్రపోకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం అధిక వ్యయానికి వెనుకాడటం లేదని కేంద్ర ఆర్థికమంత్రి పీయూష్‌గోయల్ పేర్కొన్నారు. పేదలు, మధ్యతరగతి ప్రజలకు ఆహార ధాన్యాలు అందించడానికి 2013-14లో రూ.92వేల కోట్లు వ్యయం చేయగా, 2018-19లో రూ.1,70,000 కోట్లు వ్యయం చేసినట్లు చెప్పారు.

- "ప్రధాన్‌మంత్రి గ్రామీణ ఆవాస్ యోజన-గ్రామీణ" పథకానికి 2018-19తో పోలిస్తే రెండు వేల కోట్లు తక్కువగా రూ.19 వేల కోట్లు మాత్రమే కేటాయించారు.
- "ప్రధాన్‌మంత్రి గ్రామ్ సడక్ యోజన పథకం" కేటాయింపులో మార్పు లేదు. రూ.19 వేల కోట్లకు పరిమితం చేశారు.
- పలు ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న "జాతీయ సామాజిక సహాయక పథకానికి" కేటాయింపులను తగ్గించారు. 2018-19లో రూ.9975 కోట్లు కేటాయించగా, ఈసారి రూ.9200 కోట్లుకు తగ్గించారు.

## ఎన్నికలకు సిద్ధం



**ఈనాడు, దిల్లీ:** తెలుగు రాష్ట్రాల్లోని రెండు భారీ ప్రభుత్వరంగ సంస్థలైన సింగరేణి బొగ్గు గనులు, విశాఖ ఉక్కు కర్మాగారానికి ఈ బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం వరసగా రూ.1850 కోట్లు, రూ.1,400 కోట్లు కేటాయించింది. సింగరేణి కాలరీస్‌కు 2018-19 ఆర్థిక సంవత్సరంలో కేంద్రం రూ.2వేల కోట్లు కేటాయించినా, అంచనాల సవరణ నాటికి అందులో రూ.900 కోట్లకు కోతపడింది. చివరకు రూ.1,100 కోట్లకే పరిమితమైంది. విశాఖ ఉక్కు కేటాయింపులు యథాతథంగా ఉన్నాయి.

- లోక్‌సభ ఎన్నికల కోసం రూ.వెయ్యికోట్లు, ఖర్చుల కోసం రూ.339.54 కోట్లు ఇస్తున్నట్లు పేర్కొన్నారు.
- దేశంలోని మెట్రో రైల్ ప్రాజెక్టులన్నింటికీ కలిపి రూ.19,152 కోట్లు ఇస్తున్నట్లు ప్రస్తావించారు. ఆ పద్దు కింద విజయవాడ, విశాఖపట్నం మెట్రోలతో పాటు దిల్లీ, బెంగళూరు, చెన్నై తదితర ప్రాజెక్టులను చేర్చారు. ఇందులో వేటికెంత అన్నది స్పష్టం చేయలేదు. 2017 మెట్రో విధానం ప్రకారం ఏపీ ప్రభుత్వం విశాఖపట్నం, విజయవాడ మెట్రో ప్రాజెక్టుల డీపీఆర్‌లే ఇంతవరకూ సమర్పించలేదు. కాబట్టి వాటికి ఈ బడ్జెట్‌లో నిధులు రావడం కష్టమే.
- హైదరాబాద్‌లోని ఆటమిక్ మినరల్స్ డైరెక్టరేట్ ఫర్ ఎక్స్‌ప్లొరేషన్ అండ్ రీసెర్చ్ సంస్థకు రూ.319.39 కోట్లు కేటాయించారు.
- విశాఖపట్నం పోర్టు ట్రస్ట్‌కి రూ.131.12 కోట్లు, డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌కు రూ.20కోట్లు కేటాయించారు.

## మరింత 'రక్షణ'



**దిల్లీ:** ఈ దఫా రక్షణ శాఖ బడ్జెట్ 6.87 శాతం మేర పెరిగింది. తొలిసారిగా రూ.3 లక్షల కోట్లు దాటింది. ఈ పద్దు కింద గత ఏడాది బడ్జెట్‌లో సవరించిన అంచనాలు రూ.2.98 లక్షల కోట్లుగా ఉండగా.. ఈసారి కేటాయింపులు రూ.3.18 లక్షల కోట్లకు పెంచారు.

- రక్షణ బడ్జెట్‌ను రూ.3,05,296 కోట్లు తొలుత 'ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో' (పీఐబీ) పేర్కొంది. అయితే అది రూ.3,18,931 కోట్లుగా రక్షణ శాఖ ఆ తర్వాత తెలిపింది.
- తాజా కేటాయింపుల్లో కొత్త ఆయుధాలు, యుద్ధవిమానాలు, యుద్ధనౌకలు, ఇతర సైనిక హార్డ్‌వేర్ కొనుగోలుకు ఉద్దేశించిన పెట్టుబడి వ్యయం కోసం రూ.1,08,248 కోట్లు ప్రత్యేకించారు. గత ఏడాది ఈ పద్దు కింద రూ.93,982 కోట్లు కేటాయించారు.
- పింఛన్ల చెల్లింపు కోసం రూ.1,12,079 కోట్లను ప్రతిపాదించారు.
- పెట్టుబడి వ్యయం కింద సైన్యానికి రూ.29,447 కోట్లు, నౌకా దళానికి రూ.23,156 కోట్లు, వైమానిక దళానికి రూ.39,302 కోట్లు కేటాయించారు.
- వేతనాల చెల్లింపు, సైనిక వ్యవస్థల నిర్వహణ కోసం ఉద్దేశించిన రెవెన్యూ వ్యయాన్ని రూ.2,10,682 కోట్లుగా ఖరారు చేశారు. గత బడ్జెట్‌లో ఈ పద్దు కింద రూ.1,88,118 కోట్లు ఇచ్చారు.




లోక్‌సభలో శుక్రవారం బడ్జెట్ ప్రతిపాదనలను చదువుతున్న కేంద్ర ఆర్థిక శాఖ తాత్కాలిక మంత్రి పీయూష్ గోయల్

## 'లక్ష'ణంగా భద్రత



**దిల్లీ:** కేంద్ర హోంశాఖకు బడ్జెట్ కేటాయింపులు తొలిసారిగా రూ.లక్ష కోట్ల మార్కు దాటింది. ఈ శాఖకు గత బడ్జెట్‌తో పోలిస్తే 2019-20 సంవత్సరంలో కేటాయింపులు 4.9 శాతం మేర పెంచి, రూ.1,03,927 కోట్లను కేటాయించారు. గత బడ్జెట్‌లో హోంశాఖకు రూ.99,034 కోట్లు ఇచ్చారు.

- దిల్లీ పోలీసులకు రూ.7,496.91 కోట్లు.
- భారత్-పాక్, భారత్-చైనా సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో సరిహద్దు మౌలిక వసతుల అభివృద్ధికి రూ.2వేల కోట్లు కేటాయింపు.
- సీఆర్పీఎఫ్‌కు రూ.23,742.04 కోట్లు ప్రతిపాదించారు. 2018-19 బడ్జెట్‌లో ఈ దళానికి రూ.22,646.63 కోట్లు ఇచ్చారు.
- భారత్-పాక్, భారత్-బంగ్లాదేశ్ సరిహద్దులను పరిరక్షించే బీఎస్ఎఫ్‌కు రూ.19,647.59 కోట్లు కేటాయించారు.
- సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్, ఐటీబీపీ, సీఐఎస్ఎఫ్, సశస్త్ర సీమా బల్, అసోం రైఫిల్స్, జాతీయ భద్రతా దళం (ఎన్ఎస్‌జీ)తో కూడిన కేంద్ర సాయుధ పోలీసు బలగాలకు రూ.71,618.70 కోట్లు ఇచ్చారు.
- పోలీసుల మౌలిక వసతులు, క్వార్టర్ల నిర్మాణం; వాహనాలు, ఆయుధాలు, మందుగుండు సామగ్రి కొనుగోలుకు రూ.5117 కోట్లు కేటాయింపు.
- 'నిర్భయ నిధి' కింద మహిళల భద్రతా పథకానికి రూ.50 కోట్లు.



రైలు నిదానం

> రైల్వేల చరిత్రలో ఇది సురక్షితమైన సంవత్సరం. బ్రాడ్‌గేజ్ మార్గంలో కాపలా లేని లెవల్ క్రాసింగ్‌లు అంటూ ఏవీ లేవు.'దేశంలో వినియోగంలో ఉన్న విమానాశ్రయాల సంఖ్య వందకు దాటింది. విమాన ప్రయాణికుల సంఖ్య గత అయిదేళ్లలో రెట్టింపయింది. ప్రపంచంలోనే రహదారులను వేగంగా నిర్మిస్తున్న దేశంగా గుర్తింపు లభించింది. ప్రతి రోజూ 27 కి.మీ.ల మేర రహదారులను నిర్మిస్తున్నాం. అంతర్గత జలమార్గాల్లో సరకు రవాణా ప్రారంభమయింది.
>
> - పీయూష్ గోయల్




## కీలక ప్రతిపాదనలు హిందీలో

- ★ తాత్కాలిక బడ్జెట్‌ను శుక్రవారం ప్రవేశపెట్టిన కేంద్ర ఆర్థికమంత్రి పీయూష్ గోయల్...కొన్ని కీలక ప్రతిపాదనలను మాత్రం హిందీలో వివరించారు. దీంతో, అధికారపక్ష సభ్యులు పెద్ద ఎత్తున హర్షధ్వానాలు చేశారు. సాధారణంగా ఆర్థికమంత్రులు ఆంగ్లంలో రాసుకున్న ఉపన్యాసానికి పరిమితమవుతారు. పీయూష్ గోయల్ మాత్రం వంద నిమిషాల వ్యవధి ఉన్న తన ప్రసంగంలో పలు సందర్భాల్లో హిందీలో మాట్లాడారు.
- ★ మధ్యతరగతికి పన్ను తాయిలాలు.... రక్షణ రంగానికి బడ్జెట్ కేటాయింపుల బలాన్ని గురించి హిందీలో వివరిస్తున్నప్పుడు పాలకపక్షం సభ్యులు బెంచ్‌లపై గట్టిగా చరుస్తూ ఆనందం వ్యక్తం చేస్తుండటం కనిపించింది.
- ★ ఓ దశలో ఆయన బడ్జెట్‌ప్రతిపాదనలను ప్రకటిస్తున్నప్పుడు ఓ ప్రతిపక్ష సభ్యుడు బిగ్గరగా నవ్వారు. అందుకు పీయూష్‌గోయల్ స్పందిస్తూ ఈ పరిస్థితి తనకు 'రాంలీల'ను గుర్తు తెస్తోందని వ్యాఖ్యానించారు.
- ★ నల్లని కుర్తా....బూడిదరంగు జాకెట్ ధరించి వచ్చిన పీయూష్ గోయల్ సభా కార్యక్రమాలు మొదలవడానికి అయిదు నుంచి ఏడు నిముషాల ముందే సభలోకి అడుగుపెట్టారు. రాగానే ఆయన నేరుగా వెళ్లి అక్కడే ఉన్న మంత్రులు నితిన్ గడ్కరీ, ఉమా భారతి, భాజపా సీనియర్ నేత శాంత కుమార్‌లకు పాదాభివందనం చేశారు.
- ★ బడ్జెట్ ప్రసంగం మొదలుపెట్టిన వెంటనే ఆయన అరుణ్‌జైట్లీ గురించిన ప్రస్తావన చేశారు. ప్రస్తుతం అమెరికాలో చికిత్స పొందుతున్న ఆయన ఈ రోజు సభలో లేని లోటు తనకు స్పష్టంగా కనిపిస్తోందని పీయూష్ అన్నారు.
- ★ గోయల్ ప్రసంగం ముగిసిన వెంటనే పలువురు ఎంపీలు ఆయనను అభినందించారు. వారి అభినందనలు అందుకుంటూ వెళుతున్న ఆయన అక్కడే సందర్శకుల గ్యాలరీలో ఆసీనులై ఉన్న భార్య సీమాగోయల్, ఇతర కుటుంబసభ్యులను చూసి చేయి ఊపుతూ ముందుకు వెళ్లారు. వారు కూడా ప్రతిగా చేతులు ఊపారు.
- ★ ఆయన ఆదాయపన్ను మినహాయింపు పరిమితి పెంపు గురించి ప్రకటించగానే....పాలపక్ష సభ్యులు 'మోదీ... మోదీ' అంటూ అదేపనిగా నినదిస్తూ బల్లలపై చరుస్తూ హర్షం వ్యక్తం చేశారు. వారి హర్షాతిరేకం సద్దుమణిగేదాకా గోయల్ ఓ నిమిషం పాటు మౌనంగా ఉండిపోయారు.
- ★ ప్రసంగం సమయంలో పలుమార్లు మోదీ బల్లపై చరచడం కనిపించింది. ప్రసంగం ముగియగానే గోయల్ ముకుళిత హస్తాలతో ప్రధాని వైపు తిరిగారు. వెంటనే మోదీ గోయల్ వద్దకు వెళ్లి ఆప్యాయంగా భుజం తట్టారు.

# కొత్తవి లేవు..




కొత్త లైన్లు, రైళ్ల జోలికి వెళ్లకుండా.. పాత ప్రాజెక్టులను పూర్తి చేయడానికే రైల్వే శాఖ ప్రాధాన్యతనిచ్చింది. సౌకర్యాల కల్పనకూ పెద్ద పీట వేసింది. కేంద్రం ప్రకటించిన మధ్యంతర బడ్జెట్‌లోని రైల్వే కేటాయింపుల్లో దక్షిణ మధ్య రైల్వేకు సమకూరిన నిధుల వివరాలను ద.మ. రైల్వే అదనపు జనరల్ మేనేజర్ జాన్ థామస్ శుక్రవారం విలేకరులకు వివరించారు. 2019-20 ఆర్థిక సంవత్సరానికి ద.మ. రైల్వే పరిధిలోని రైల్వే అభివృద్ధికి రూ.5,924 కోట్లు సమకూరాయన్నారు. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చితే రూ.172 కోట్లు అదనపు కేటాయింపులు జరిగాయన్నారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేలా నిధులు కేటాయించారని, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి బడ్జెట్‌లో రైల్వే మంత్రిత్వ శాఖ ప్రాధాన్యమిచ్చిందన్నారు. ఇప్పటికే ప్రకటించిన మార్గాల్లో కొత్త లైన్లు వేసేందుకు రూ.834 కోట్లు కేటాయించిందన్నారు. ఇప్పటికే ఉన్న మార్గాల్లో రెండో లైను వేయడానికి రూ.1,905 కోట్లు, రైల్వేపరంగా మౌలిక వసతుల కల్పనకు రూ.138 కోట్లు సమకూరాయని చెప్పారు. ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడానికి రూ.229 కోట్లు కేటాయించారన్నారు. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చితే ఇది రూ.120 కోట్లు అదనమని జాన్ థామస్ చెప్పారు.

### కొంతమేర పూర్తయినవి

- ఆంధ్రప్రదేశ్ పరిధిలోని నడికుడి- శ్రీకాళహస్తి మార్గంలో కొత్త లైను వేయడానికి రూ.700 కోట్లు కేటాయించారు. 309 కిలోమీటర్ల ఈ లైను పనులను 2011-12లో ప్రారంభించారు. రూ,2,450 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 50 శాతం వ్యయాన్ని భరిస్తోంది. ఇప్పటి వరకు రూ.414 కోట్లు ఖర్చు చేశారు. పిడుగురాళ్ల- శావల్యపురం మధ్య 46 కిలోమీటర్ల మేర కొత్త లైను అందుబాటులోకి రానుంది.
- తెలంగాణలోని మనోహరాబాద్- కొత్తపల్లి కొత్తగా రైల్వే లైను నిర్మాణానికి ఈ బడ్జెట్‌లో రూ.200 కోట్లు కేటాయించారు. 150 కి.మీ. మేర కొత్త లైను నిర్మించేందుకు 2006-07లో ఆమోదం లభించింది. రూ.1,160 కోట్ల అంచనాతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో ఇప్పటి వరకు రూ.137 కోట్లను వెచ్చించారు. ఈ ప్రాజెక్టులో మొదటి దశ కింద మనోహరాబాద్- గజ్వేల్ మార్గంలో 32 కి.మీ. మేర కొత్త లైనును ఈ జూన్‌కల్లా పూర్తి చేయాలన్నది లక్ష్యం.
- తెలంగాణలోని మునిరాబాద్- మహబూబ్‌నగర్ మార్గంలో కొత్త లైను నిర్మాణానికి రూ.275 కోట్లు కేటాయించారు. మొత్తం 246 కి.మీ. రైల్వే నిర్మాణానికి 1997-98లో అమోదం లభించింది. రూ.645 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టారు. ఈ మార్గంలో 66 కి.మీ. మార్గం తెలంగాణ పరిధిలోకి, మిగిలినది కర్ణాటక పరిధిలోకి వస్తుంది. దేవరకద్ర- జక్లైర్ మధ్య 29 కి.మీ.లైను నిర్మాణం పూర్తయింది. గత నాలుగేళ్లలో ఈ ప్రాజెక్టు కింద రూ.508 కోట్లు వెచ్చించారు.
- ఎంఎంటీఎస్ రెండో దశ పొడిగింపులో భాగంగా ఘట్‌కేసర్- యాదాద్రి మధ్య 33 కిలోమీటర్ల మేర రైలు మార్గం నిర్మాణానికి రూ.20 కోట్లు కేటాయించారు. 2016-17లో మొత్తం రూ.412 కోట్ల అంచనాతో ఈ పనులను ఆమోదించారు.

### తెలుగు రాష్ట్రాల్లో ఇతర కేటాయింపులు

- ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర పరిధిలోని బైపాస్ లైన్ల నిర్మాణానికి రూ.143 కోట్లు
- హైదరాబాద్‌కు సమీపంలోని చర్లపల్లిలో శాటిలైట్ టెర్మినల్ నిర్మాణానికి రూ.5 కోట్లు
- మౌలాలిలో రైల్వే ఫైనాన్స్ ఇన్‌స్టిట్యూట్ నిర్మాణానికి రూ.1.5 కోట్లు
- కాజీపేటలోని రైల్వే వర్క్‌షాపునకు రూ.10 కోట్లు
- కర్నూలులో మిడ్‌లైఫ్ రిహాబిలిటేషన్ ఫ్యాక్టరీ నిర్మాణానికి రూ.80 కోట్లు
- తిరుపతి రైల్వేస్టేషన్‌లో రెండోవైపు ప్రవేశమార్గానికి రూ.12.45 కోట్లు
- తిరుచానూర్ రైల్వేస్టేషన్ అభివృద్ధికి రూ.6 కోట్లు
- మహారాష్ట్ర పరిధిలోని ముద్‌ఖేడ్- పర్భనీ మధ్య రెండో లైను నిర్మాణానికి రూ.34.50 కోట్లు

### భారీ ప్రాజెక్టులకు కేటాయింపులు (రూ. కోట్లలో)

| పరిధి | ప్రాజెక్టు | నిడివి (కి.మీ.) | అంచనా వ్యయం | ఇప్పటివరకు ఖర్చు | ఈ బడ్జెట్‌లో కేటాయింపు |
|---|---|---|---|---|---|
| తెలంగాణ | భద్రాచలం- సత్తుపల్లి కొత్త లైను | 56 | 704 | 119 | 405 |
| తెలంగాణ, మహారాష్ట్ర | కాజీపేట- బల్లార్షా మూడో లైను | 202 | 2,063 | 360 | 265 |
| తెలంగాణ | మనోహరాబాద్- కొత్తపల్లి రైల్వే లైను | 150 | 1,160 | 137 | 200 |
| ఆంధ్రప్రదేశ్, కర్ణాటక | కడప- బెంగళూరు కొత్త లైను | 255 | 2,030 | 165 | 210 |
| ఆంధ్రప్రదేశ్ | గుంటూరు- గుంతకల్ రెండో లైను | 443 | 3,631 | 215 | 280 |
| ఆంధ్రప్రదేశ్ | విజయవాడ- భీమవరం- నిడదవోలు రెండో లైను | 221 | 1,504 | 795 | 175 |
| ఆంధ్రప్రదేశ్ | గుంతకల్- కల్లూరు రెండో లైను | 40.60 | 323 | 210 | 15 |
| ఆంధ్రప్రదేశ్ | కోటిపల్లి- నర్సాపూర్ కొత్త లైను | 57 | 2,120 | 323 | 200 |
| తెలంగాణ | సికింద్రాబాద్- మహబూబ్‌నగర్ రెండో లైను | 85 | 728 | 135 | 200 |
| ఆంధ్రప్రదేశ్ | గుత్తి- ధర్మవరం రెండో లైను | 90 | 636 | 185 | 126 |
| ఆంధ్రప్రదేశ్, తెలంగాణ | కాజీపేట- విజయవాడ మూడో లైను | 219 | 1,857 | ------ | 110 |
| ఆంధ్రప్రదేశ్ | విజయవాడ- గూడూరు మూడో లైను | 287 | 3,246 | 284 | 350 |

### ముఖ్యమైన ప్రాజెక్టులవారీ కేటాయింపులు ఇలా..

- తెలంగాణలోని అక్కంపేట- మెదక్ మధ్య 17 కి.మీ. కొత్త మార్గం నిర్మాణానికి రూ.10 కోట్లు కేటాయించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం సగం వ్యయం భరిస్తోంది. గత నాలుగేళ్లలో రూ.89 కోట్లు ఖర్చు చేశారు.
- ఆంధ్రప్రదేశ్‌లోని ఓబులవారిపల్లె- కృష్ణపట్నం కొత్త లైను నిర్మాణానికి రూ.30 కోట్లు ఈ బడ్జెట్‌లో కేటాయించారు. 113 కిలోమీటర్ల ఈ లైను నిర్మాణానికి 2005-06లో ఆమోదం లభించింది. రూ.733 కోట్ల అంచనాతో ఈ పనులు చేపట్టారు. ఈ మార్గంలో వెంకటాచలం -ఓబులవారిపల్లె మధ్య 93 కిలోమీటర్ల మార్గాన్ని 2019-20 ఆర్థిక సంవత్సరంలో పూర్తి చేయాలన్నది లక్ష్యం.
- గుంటూరు- తెనాలి మార్గంలో 24 కిలోమీటర్ల రెండో లైను వేసేందుకు రూ.5 కోట్లు కేటాయింపు. నాలుగున్నరేళ్ల క్రితం మంజూరైన ఈ రెండో లైను నిర్మాణ పనులను రూ.197 కోట్లతో చేపట్టారు. ఇప్పటికే రూ.164 కోట్లను వెచ్చించి కొంతవరకూ నిర్మాణాన్ని పూర్తి చేశారు.

### ఏప్రిల్, మే నెలల్లో ఎంఎంటీఎస్ రెండో దశ


ఎంఎంటీఎస్ రెండో దశకు రైల్వే బడ్జెట్‌లో రూ.10 లక్షలు కేటాయించారు. 2012-13లో మంజూరైన ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.817 కోట్లు. గత నాలుగేళ్లలో రూ.540 కోట్లు వెచ్చించారు. తెల్లాపూర్- రామచంద్రాపురం మధ్య 5.75 కిలోమీటర్లు, మౌలాలి- ఘట్‌కేసర్ మధ్య 12.5 కిలోమీటర్ల లైనును అందుబాటులోకి తీసుకువచ్చారు. ఏప్రిల్, మే నెలల్లో ఎంఎంటీఎస్ రెండో దశ అందుబాటులోకి వస్తుందని జాన్ థామస్ తెలిపారు.


- ఈనాడు, హైదరాబాద్

## అధికారుల శిక్షణకు రూ.241 కోట్లు

**దిల్లీ:** ప్రభుత్వ ఉన్నతాధికారులకు దేశ, విదేశాల్లో శిక్షణ ఇప్పిచ్చేందుకుగాను సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖకు రూ.241.81 కోట్లు కేటాయించారు. 2018-19 సవరించిన బడ్జెట్ కేటాయింపుల కంటే ఇది 24శాతం ఎక్కువ. ఇందులో భాగంగా దిల్లీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్రటేరియట్ ట్రైనింగ్ అండ్ మేనేజ్‌మెంట్, ముస్సోరిలోని లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌లకు రూ.79కోట్లు కేటాయించారు.

## తాత్కాలిక బడ్జెట్ 2019-20 రైల్వే బడ్జెట్ సమగ్ర స్వరూపం



# రైలు టికెట్లు యథాతథం

**దిల్లీ:** రైల్వేశాఖకు కేంద్ర తాత్కాలిక బడ్జెట్‌లో పెద్దపీట లభించింది. ప్రయాణికుల టికెట్లు, సరకు రవాణా రుసుములను ఈసారి కూడా యథాతథంగా ఉంచారు. 2014 తర్వాత వీటిని పెంచలేదు. మునుపెన్నడూ లేని రీతిలో రూ.1.58 లక్షల కోట్లను మూలధన ఖర్చు రూపేణా ఈ శాఖకు కేటాయించారు. 2014తో పోలిస్తే ఈసారి ప్రతిపాదించిన ప్రణాళిక వ్యయం 148% ఎక్కువ. 2019-20 కోసం 'బడ్జెట్ పరమైన మద్దతు' కింద మరో రూ.64,587 కోట్లు కేటాయించారు. గత ఏడాది సాధారణ బడ్జెట్లో రైల్వేకు మూలధన ఖర్చు కింద రూ.1.48 లక్షల కోట్లు, బడ్జెట్ మద్దతు కింద రూ.55,088 కోట్లు కేటాయించారు. ఆర్థిక శాఖ బాధ్యతల్ని తాత్కాలికంగా నిర్వర్తిస్తున్న రైల్వేశాఖ మంత్రి పీయూష్ గోయల్ తన సొంత మంత్రిత్వశాఖకు చేసిన కేటాయింపుల్ని బడ్జెట్లో వివరించారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో ఇంతవరకు రైల్వేశాఖ సురక్షితంగా ఉందని, బ్రాడ్‌గేజ్ వ్యవస్థలో కాపలాదారుల్లేని అన్ని లెవెల్ క్రాసింగ్‌లను ఎత్తివేశామని చెప్పారు. 'దేశీయంగా రూపొందించిన సెమీ హైస్పీడ్ రైలు 'వందే భారత్ ఎక్స్‌ప్రెస్' మన ప్రయాణికులకు ప్రపంచశ్రేణి అనుభూతిని అందించబోతోంది. ఒక్కొక్కటి రూ.97 కోట్లు చొప్పున ట్రైన్-18 (వందే భారత్ ఎక్స్‌ప్రెస్)లు ఆరింటిని నూతన ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తి చేయబోతున్నాం. పూర్తిగా మన ఇంజినీర్లే అభివృద్ధి చేసిన సాంకేతికతతో 'భారత్‌లో తయారీ' కార్యక్రమానికి ఊతం లభించనుంది. ఇది అనేక ఉద్యోగాలనూ కల్పించనుంది' అని వివరించారు. రైలు పెట్టెల తయారీకి కేటాయింపును 64% పెంచుతున్నట్లు ప్రకటించారు. వస్తున్న ఆదాయాన్ని తిరిగి రైల్వే వ్యవస్థ కోసమే ఖర్చు చేస్తున్నామని చెప్పారు. సిబ్బంది జీతభత్యాల రూపేణా ప్రస్తుత ఏడాది కంటే రూ.14,000 కోట్లు ఎక్కువగా ఖర్చు కానుంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో దాదాపు లక్ష మంది కొత్త ఉద్యోగుల్ని తీసుకోనున్నారు. వారిపై రూ.4500 కోట్లు వ్యయమవుతుందని అంచనా.

### ఇవీ ముఖ్యాంశాలు...

- 2019-20 ఆర్థిక సంవత్సరంలో రైల్వే స్థూల ఆదాయం: రూ. 2,72,705.68 కోట్లు. (ఇది 18-19 సంవత్సర సవరించిన అంచనాల కంటే రూ.22,854.67 కోట్లు అధికం.)
- 2019-21 మధ్య ఉత్పత్తి కానున్న రైలు పెట్టెలు: 15,000
- 2019-20లో జీతాలు సహా రెవెన్యూ వ్యయం :రూ. 85,800 కోట్లు
- నూతన మార్గాల నిర్మాణం :రూ. 7255 కోట్లు
- గేజ్ మార్పిడి పనులు :రూ. 2200 కోట్లు
- జంట మార్గాల (డబ్లింగ్) పనులు : రూ. 700 కోట్లు.
- రైలు పెట్టెలు, బోగీలు వంటి రోలింగ్ స్టాక్‌కు :రూ. 6114.82 కోట్లు
- సిగ్నల్-టెలికాం పనులు : రూ. 1750 కోట్లు
- ప్రయాణికుల సదుపాయాలు :రూ. 3422 కోట్లు.

## ప్రధాన పథకాలకు కేటాయింపులు రూ.కోట్లలో

| పథకం | 2017–18 వాస్తవ కేటాయింపులు | 2018–19 బడ్జెట్ అంచనాలు | 2018–19 సవరించిన అంచనాలు | 2019–2020 బడ్జెట్ అంచనాలు |
|---|---|---|---|---|
| 1. ఉపాధి హామీ | 55166 | 55000 | 61084 | 60000 |
| 2. ఎస్సీ అభ్యున్నతి కార్యక్రమం | 5061 | 5183 | 7609 | 5395 |
| 3. ఎస్టీ అభ్యున్నతి కార్యక్రమం | 3573 | 3806 | 3778 | 3810 |
| 4. మైనారిటీల అభ్యున్నతి | 3948 | 1440 | 1440 | 1551 |
| 5. ప్రధానమంత్రి క్రిషి సంచాయీ యోజన | 6613 | 9429 | 8251 | 9516 |
| 6. ప్రధానమంత్రి గ్రామసడక్ యోజన | 16862 | 19000 | 15500 | 19000 |
| 7. ప్రధానమంత్రి ఆవాస యోజన | 31164 | 27505 | 26405 | 25853 |
| 8. జాతీయ గ్రామీణ తాగునీటి పథకం | 7038 | 7000 | 5500 | 8201 |
| 9. స్వచ్ఛ భారత్ కార్యక్రమం | 19427 | 17843 | 16978 | 12750 |
| 10. జాతీయ ఆరోగ్య కార్యక్రమం | 32000 | 30634 | 31187 | 32251 |
| 11. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం | 9092 | 10500 | 9949 | 11000 |
| 12. మహిళా భద్రత, సాధికారత, శిశు సంక్షేమం | 20179 | 24454 | 24513 | 28914 |
| 13. ఉద్యోగ, నైపుణ్యాభివృద్ధి | 2723 | 5071 | 6830 | 7511 |
| 14. అమృత్, స్మార్ట్ సిటీలు | 9463 | 12169 | 12569 | 13900 |
| 15. పోలీసు దళాల ఆధునికీకరణ | 2546 | 3157 | 3192 | 3378 |
| 16. శ్యామాప్రసాద్ ముఖర్జీ రూర్బన్ | 553 | 1200 | 451 | 800 |
| 17. రాష్ట్రీయ గ్రామ్ స్వరాజ్ అభియాన్ | ...... | ........ | 675 | 831 |
| 18. పంటల బీమా | 9419 | 13000 | 12976 | 14000 |
| 19. రైతులకు స్వల్ప కాల రుణాలపై వడ్డీ రాయితీ | 13046 | 15000 | 14987 | 18000 |
| 20. మార్కెట్ జోక్యం, మద్దతు ధర | 701 | 200 | 2000 | 3000 |
| 21. ఆదాయ మద్దతు పథకం | ....... | ..... | 20000 | 75000 |
| 22. యూరియా, సూక్ష్మ పోషకాల రాయితీ | 66467 | 70090 | 70085 | 64996 |
| 23. ధరల స్థిరీకరణ నిధి | 3500 | 1500 | 1500 | 2000 |
| 24. ఎఫ్‌సీఐకి ఆహార ధాన్యాల రాయితీ | 61982 | 138123 | 140098 | 151000 |
| 25. రక్షణ సేవల మూలధన కేటాయింపులు | 90445 | 94011 | 93992 | 103394 |
| 26. సిక్కిం సహా ఈశాన్య రాష్ట్రాలకు కేంద్ర వాటా | 861 | 1000 | 781 | 931 |
| 27. పోలీసు మౌలిక సదుపాయాలు | 4545 | 4750 | 4836 | 5117 |
| 28. ఉద్యోగుల పింఛను పథకం,1995 | 5111 | 4900 | 4900 | 4500 |
| 29. ప్రత్యక్ష నగదు బదిలీ | 13097 | 16478 | 16478 | 29500 |
| 30. పేదలకు ఎల్పీజీ కనెక్షన్లు | 2252 | 3200 | 3200 | 2724 |
| 31. ఎన్‌హెచ్ఏఐ | 23892 | 29663 | 37321 | 36691 |
| 32. శాస్త్రసాంకేతిక రంగ సంస్థలు, మానవ వనరుల అభివృద్ధి | 990 | 1109 | 1002 | 1085 |
| 33. అంతరిక్ష సాంకేతికత | 5948 | 6576 | 6993 | 7483 |
| 34. రైల్వే పథకాలకు బడ్జెట్ మద్దతు | 43418 | 53060 | 53060 | 64587 |





## జాతీయ విద్యా సంస్థలకు అంతంతే..!

**ఈనాడు, అమరావతి:** కేంద్ర బడ్జెట్‌లో జాతీయ విద్యా సంస్థలకు నిధుల కేటాయింపును ప్రత్యేకంగా చూపకుండా హయ్యర్ ఎడ్యుకేషన్ ఫైనాన్స్ ఏజెన్సీ(హెఫా) ద్వారా ఇస్తున్నట్లు సూచించారు. దీంట్లో ఎంతవరకు వస్తుందనే దానిపై స్పష్టత లేదు. గతంలో ఐఐటీ తిరుపతికి రూ.976కోట్లు రుణ సహాయం అందించనున్నట్లు పేర్కొంది. ఇప్పటివరకు అన్ని బడ్జెట్‌లు, రుణాల కింద దాదాపు రూ.200కోట్లు వరకు మాత్రమే కేంద్రం మంజూరు చేసింది. ఐసర్ నిర్మాణాలకు రూ.1,491కోట్లకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపగా ఇప్పటి వరకు సుమారు రూ.130కోట్లు ఇచ్చింది. కర్నూలు ట్రిపుల్ ఐటీకి రూ.40కోట్లు ఇచ్చింది.

## అణుశక్తి విభాగానికి తగ్గిన కేటాయింపులు

**దిల్లీ:** తాజా బడ్జెట్‌లో అంతరిక్ష విభాగానికి స్వల్ప స్థాయిలో రూ.338 కోట్ల మేర పెంచారు. అణుశక్తి విభాగానికి కేటాయింపులు గత బడ్జెట్‌తో పోలిస్తే రూ.240 కోట్ల మేర తగ్గాయి. వ్యూహాత్మకంగా కీలకమైన ఈ రెండు సంస్థలు మానవ సహిత అంతరిక్ష యాత్ర (గగన్‌యాన్), కొత్తగా అణు విద్యుత్ కర్మాగారాల నిర్మాణం వంటి భారీ ప్రాజెక్టులను చేపడుతున్న నేపథ్యంలో ఈ కేటాయింపులకు ప్రాధాన్యం ఏర్పడింది.

★ అణుశక్తి విభాగానికి రూ.16,725 కోట్లు కేటాయించారు. ఇందులో అణు విద్యుత్ కర్మాగారాలకు రూ.4,547 కోట్లు ప్రతిపాదించారు. ప్రస్తుతం దేశంలో దాదాపు 15 అణు విద్యుత్ కర్మాగారాలు నిర్మాణంలో ఉన్నాయి.



## మత్స్య, పాడిపరిశ్రమలకు
# మహర్దశ

**ఈనాడు, అమరావతి:** మత్స్య, పాడిపరిశ్రమ రైతులకు 2 శాతం వడ్డీ రాయితీ, గడువులోగా చెల్లిస్తే అదనంగా 3 శాతం వడ్డీ రాయితీ వర్తింపజేస్తామని కేంద్రం బడ్జెట్‌లో ప్రకటించడంతో ఈ రంగాలకు మహర్దశ పట్టనుంది. రాష్ట్రంలో వీటిపై ఆధారపడి ఏటా రూ.9,500 కోట్ల మేర రుణం పొందుతున్న వారికి వడ్డీ రూపంలో రూ.475 కోట్ల ప్రయోజనం దక్కనుంది. వ్యవసాయ పంటలకు వర్తింపజేస్తున్న విధంగా వీటికి కూడా 9 శాతం వడ్డీకి రుణం ఇచ్చి.. చెల్లింపు సమయంలో 2 శాతం రాయితీ వర్తింపజేస్తే 7 శాతం వడ్డీకే రుణాలందుతాయి. సకాలంలో చెల్లించే వారికి 3శాతం వడ్డీ మినహాయింపు ఇవ్వడం వల్ల చివరకు వీరికి 4శాతం(పావలా వడ్డీ) వడ్డీకే రుణం దక్కినట్లవుతుంది. రాష్ట్రంలో 90 వేల మంది రైతులు ఆక్వా సాగులో ఉన్నారు.

***తాజా నిర్ణయంతో వీరికీ..***

నిబంధనల ప్రకారం విపత్తు ప్రాంతాల్లో రుణాలు రీషెడ్యూల్ చేయాల్సి ఉన్నా తొలి ఏడాదే 2 శాతం వడ్డీ రాయితీ వర్తింపజేసి తర్వాత ఏడాదిలో అధికశాతం వడ్డీ వేస్తున్నారు. దీంతో రైతులు రీషెడ్యూల్‌కు ముందుకు రావడం లేదు. తాజా నిర్ణయం కారణంగా రీషెడ్యూల్ రుణాలకు కూడా 2 శాతం వడ్డీ రాయితీ, అదే ఏడాదిలో చెల్లిస్తే మరో 3 శాతం అదనంగా లభించనుంది.

# చదువులమ్మ చతికిల




- ఆంధ్రప్రదేశ్ విద్యాసంస్థల నిధుల లెక్క తేల్చని కేంద్రం

ఈనాడు – దిల్లీ

ఆంధ్రప్రదేశ్‌లో విభజన చట్టంలోని హామీల కింద ఏర్పాటుచేసిన జాతీయ విద్యాసంస్థలకు కేంద్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపులు జరపలేదు. గత ఏడాది వరకు ఐఐటీ, ఐఐఎం, ఐఐఎస్ఈఆర్, ట్రిపుల్ ఐటీలకు ప్రత్యేక కేటాయింపులు జరుపుతూ వచ్చిన కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ ఈసారి దేశవ్యాప్తంగా ఉన్న అన్ని విద్యాసంస్థలకు జరిపిన కేటాయింపుల్లో ఆంధ్రప్రదేశ్‌ను కలిపేసింది. దీనివల్ల రాష్ట్రానికి వాస్తవంగా ఎంత వచ్చింది, ఇంకా ఎంత కావాల్సి ఉంటుందన్న విషయం కనుక్కోవడం ఇకమీదట కష్టంకానుంది. అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీకి రూ.13కోట్లు, ఏపీ, తెలంగాణల్లో ఏర్పాటుచేయనున్న గిరిజన విశ్వవిద్యాలయాలు రెండింటికీ కలిపి రూ.8 కోట్లు మినహాయిస్తే మిగతా వాటికి ఎంత కేటాయించారన్నది బడ్జెట్‌లో పొందుపరచలేదు. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ఐఐఎంలకూ కలిపి ఇచ్చిన రూ.415.41 కోట్లలోనే ఏపీ ఐఐఎంకి ఎంతో కొంత పొందాల్సి ఉంటుంది. అన్ని ఎన్ఐటీలకూ కలిపి కేటాయించిన రూ.3,730.50 కోట్లలోనే తాడేపల్లి గూడెం ఎన్ఐటీ ఎంతో కొంత దక్కించుకోవాల్సి ఉంటుంది. ఐఐఎస్ఈఆర్‌లు అన్నింటికీ కలిపి రూ.660 కోట్లు కేటాయించారు. అందులో తిరుపతి భాగమెంతో దేవుడికే తెలియాలి. ట్రిపుల్ఐటీలన్నింటికీ కలిపి రూ.203.34 కోట్లు కేటాయించారు. అందులో కర్నూలు ట్రిపుల్ఐటీకి ఎంతో తెలియదు. బడ్జెట్ పద్దుల్లో ఏపీ విద్యాసంస్థల పేర్లు ప్రత్యేకంగా చూపినప్పటికీ కేటాయింపులు మాత్రం చేయలేదు. దేశవ్యాప్తంగా అన్ని విద్యాసంస్థలకు జరిపిన కేటాయింపుల్లోనే వీటికి వాటా దక్కుతుందని చెప్పడం మినహా దేనికెంత అన్న స్పష్టత ఇవ్వలేదు. ప్రత్యేకంగా చెప్పడంవల్ల ఏపీకి జరుపుతున్న కేటాయింపులపై పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమైన నేపథ్యంలోనే కేంద్రం ఈ ఎత్తు వేసినట్లు కనిపిస్తోంది. రెండు తెలుగురాష్ట్రాలకు కల్పిస్తున్న పారిశ్రామిక రాయితీలదీ ఇదే పరిస్థితి. క్రితం సంవత్సరం వరకు కేంద్ర వాణిజ్యమంత్రిత్వశాఖ పద్దుల కింద ఈ మొత్తం పెడుతూ వచ్చారు. ఈ సారి దాన్ని ఆర్థికశాఖలో కలిపేసినట్లు చెప్పారు.

- ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ఏర్పాటుచేసే పారిశ్రామిక యూనిట్లకు వడ్డీరాయితీ కింద 2018-19లో కేటాయించిన రూ.100 కోట్ల వడ్డీ రాయితీ మొత్తాన్ని తాజా బడ్జెట్‌లో ఎత్తేశారు. సవరించిన అంచనాల్లోనూ రూపాయి కూడా పెట్టలేదు. ఈ మొత్తాన్ని ఆర్థిక శాఖ ద్వారా ఇవ్వబోతున్నందున ఈ ఏడాది వాణిజ్యశాఖ పద్దుల్లో పెట్టలేదని వివరణ ఇచ్చారు.
- ఏపీ కేంద్ర విశ్వవిద్యాలయానికి రూ.13 కోట్లు కేటాయించారు. ఇందులో బడ్జెట్ సపోర్ట్ కింద రూ.12.25 కోట్లు సమకూరుస్తారు. హయ్యర్ ఎడ్యుకేషన్ ఫైనాన్స్ ఏజెన్సీ(హెఫా) నుంచి తీసుకున్న రుణంపై వడ్డీ కింద రూ.25 లక్షలు, అసలు కింద రూ.50 లక్షలు చెల్లిస్తారు.
- ఏపీ, తెలంగాణ గిరిజన విశ్వవిద్యాలయాలకు కలిపి రూ.8 కోట్లు కేటాయించారు. అందులో బడ్జెట్ సపోర్ట్ కింద రూ.7.50 కోట్లు సమకూరుస్తారు. మిగిలిన రూ.50 లక్షలను హెఫా రుణం, వడ్డీ కింద చెల్లిస్తారు. ఈ రెండు యూనివర్శిటీలకు 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.20 కోట్లు కేటాయించినా అంచనాల సవరణ సమయానికి దాన్ని కేవలం రూ.కోటికే పరిమితం చేశారు. అంటే క్రితం బడ్జెట్‌లో రూ.19కోట్లమేర కోతపెట్టారు.
- ఆంధ్రప్రదేశ్ ఐఐటీకి ప్రత్యేకంగా ఈ ఏడాది ఏమీ కేటాయించలేదు. 2018-19 బడ్జెట్‌లో రూ.50 కోట్లు కేటాయించినా అంచనాల సవరణనాటికి అది రూ.86 కోట్లకు చేరింది. దాదాపు రూ.36 కోట్లు అధికంగా ఖర్చుపెట్టారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా అన్ని ఐఐటీలకు కలిపి రూ.6,143.02 కోట్లు కేటాయించారు. అందులోనే ఏపీ ఐఐటీకీ సర్దుబాటుచేయనున్నట్లు బడ్జెట్ పద్దుల్లో చెప్పారు. అయితే ఎంత అన్నది మాత్రం స్పష్టంచేయలేదు.
- ఏపీ ఐఐఎంకీ ఈ బడ్జెట్‌లో ఏమీ కేటాయించలేదు. 2018-19 బడ్జెట్‌లో రూ.42 కోట్లు కేటాయించి, చివరకు దాన్ని రూ.36 కోట్లకు తగ్గించారు.
- తాడేపల్లిగూడెం ఎన్ఐటీకి ఏమీ కేటాయించలేదు. 2018-19 బడ్జెట్ అంచనాలు రూ.54 కోట్లను అంచనాల సవరణ నాటికి రూ.98 కోట్లకు పెంచారు.
- తిరుపతి ఐఐఎస్ఈఆర్‌కీ ఈ ఏడాది సున్నా చుట్టారు. 2018-19లో కేటాయించిన రూ.49 కోట్లను మాత్రం అంచనాల సవరణ సమయానికి రూ.70.40 కోట్లకు పెంచారు.
- కర్నూలులో ఏర్పాటుచేస్తున్న ట్రిపుల్ఐటీకీ ఈ బడ్జెట్‌లో ఏమీ కేటాయించలేదు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన రూ.30 కోట్లనుకూడా చివరకు రూ.27కోట్లకు తగ్గించారు.
- పెట్రోలియం యూనివర్శిటీకి రూ.31.82 కోట్లు కేటాయించారు. 2018-19లో రూ.32 కోట్లు కేటాయించి చివరకు రూ.24 కోట్లకే పరిమితం చేశారు.
- హైదరాబాద్ ఐఐటీకి (ఈఏపీ) కింద ఈ ఏడాది రూ.80 కోట్లు కేటాయించారు. 2018-19లో రూ.75 కోట్లు కేటాయించినా అంచనాల సవరణ నాటికి అది జీరో అయింది.

## కృషి సించయి యోజన నిధులకు మోక్షం కలిగేనా!

- ఇవ్వాల్సిన చిన్న మొత్తాలూ రావడం లేదు

**ఈనాడు–అమరావతి:** ప్రధాన మంత్రి కృషి సించయి యోజన కింద ఆంధ్రప్రదేశ్‌లోని పలు సాగునీటి ప్రాజెక్టులకు కేంద్రం నుంచి నిధులు విడుదల కావాల్సి ఉంది. కేంద్ర బడ్జెట్‌లో ఈ విభాగం కింద పెద్ద మొత్తంలోనే నిధులు కేటాయించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ ప్రాజెక్టులకు కేంద్రం నుంచి రూ.15.23 కోట్లు రావాల్సి ఉండగా..ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ప్రస్తుత, వచ్చే ఆర్థిక సంవత్సరం నిధులు కూడా కలిపితే దాదాపు రూ.33.83 కోట్లు రావాల్సి ఉంది. గుండ్లకమ్మ రిజర్వాయర్, తాడిపూడి ఎత్తిపోతల, తోటపల్లి, తారకరామతీర్థ, ముసురుమిల్లి, పుష్కర ఎత్తిపోతల, ఎర్రకాలువ జలాశయం ప్రాజెక్టులు ఈ విభాగం కింద ఉన్నాయి. ఇందులో మద్దిగడ్డ రిజర్వాయర్ పథకం పూర్తయింది.

★ ప్రధానమంత్రి కృషి సించయి యోజన(పీఎంకేఎస్‌వై) పథకం ఏర్పాటు సమయంలోనే కేంద్రం వివిధ నిబంధనలు రూపొందించింది. ఆ ప్రకారం గుండ్లకమ్మ జలాశయం, ముసురుమిల్లి జలాశయం, తారకరామతీర్థ ప్రాజెక్టులకు మాత్రమే ఈ పథకం కింద కేంద్ర సాయం అందుతుందని తేల్చారు.

## రైల్వేజోన్ ఊసేది?

**ఈనాడు, అమరావతి:** విశాఖ రైల్వే జోను, రాజధాని అమరావతిని అనుసంధానించే లైన్ల గురించి కేంద్ర బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. విభజన చట్టంలో పొందుపరిచిన ఈ కీలక ప్రాజెక్టుల అమలుపై అయిదేళ్లుగా అదిగో ఇదిగో అంటూ ప్రకటనలు, ఊరడింపు మాటలు చెప్పిన ఎన్డీయే ప్రభుత్వం... తన చివరి బడ్జెట్‌లో రాష్ట్రానికి నిరాశే మిగిల్చింది. దీంతో రైల్వే చిత్రపటంలో రాజధాని అమరావతికి చోటు లేకుండా పోయింది. దేశంలోని ఏ రాష్ట్ర రాజధానికీ ఈ పరిస్థితి లేదు. రాష్ట్రంలోని ఇతరత్రా రైల్వే ప్రాజెక్టులకు సైతం తూతు మంత్రం కేటాయింపులే చేసింది. ఏపీ విభజన చట్టంలోని షెడ్యూల్ 13లో రైల్వేజోన్ ప్రస్తావన ఉంది. చివరి బడ్జెట్‌లోనైనా రైల్వేజోన్ ప్రకటిస్తారని ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఆశించినప్పటికీ వారి ఆశలు అడియాశలే అయ్యాయి. ఏపీ కొత్త రాజధాని నుంచి హైదరాబాద్, తెలంగాణలోని ఇతర ముఖ్య నగరాలకు వేగవంతమైన రైలు అనుసంధానం ఏర్పాటు చేసేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటుందని విభజన చట్టంలోని షెడ్యూల్ 13లో పొందుపరిచింది. అమరావతి అనుసంధానించే రైలు ప్రాజెక్టుల్లో ప్రధానమైన ఎర్రుపాలెం-నంబూరు మధ్య ప్రతిపాదించిన డబుల్ లైన్ మార్గాన్ని గతంలోనే రైల్వేశాఖ సింగిల్ లైనుకు పరిమితం చేసింది. తాజా బడ్జెట్‌లో ఆ సింగిల్ లైనుకు కూడా కేటాయింపులు చేయలేదు.

## 75 లక్షల మంది రైతులకు
# పెట్టుబడి సాయం

- తొలి విడతలో జమకానుంది రూ.1,509 కోట్లు

**ఈనాడు–అమరావతి:** రైతులకు 2018 డిసెంబరు నుంచి పెట్టుబడి సాయం అందిస్తామనే కేంద్ర నిర్ణయం వల్ల రాష్ట్రంలో 75 లక్షల మందికి ప్రయోజనం కలగనుంది. తొలి దశలో రూ.2 వేల చొప్పున ప్రయోజనం కలిగిస్తే మార్చిలోగా రైతుల ఖాతాల్లో రూ.1,509.80 కోట్లు జమకానున్నాయి. ఏడాదికి రూ.6 వేల ప్రకారం రూ.4,529.40 కోట్లు ఆంధ్రప్రదేశ్ రైతులకు అందనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 85.24 లక్షల మంది రైతులున్నారు. ఇందులో 75.49 లక్షల మంది కేంద్రం ప్రకటించిన 'ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి' అందుకునేందుకు అర్హులవుతున్నారు.

***మూడింట ఒక వంతే మహిళలు***

మొత్తం 85.24 లక్షల మంది రైతుల్లో 59.55 లక్షల మంది పురుషులు, 25.65 లక్షల మంది మహిళలు ఉన్నారు. అర్హత సాధించిన సన్న, చిన్నకారు రైతుల్లో మహిళల వాటా 21.80 శాతంగా ఉంది. మొత్తంగా చూస్తే పురుషులు 59.05 లక్షలు, మహిళలు 16.46 లక్షల చొప్పున ఏడాదికి రూ.6 వేల చొప్పున అందుకోనున్నారు.

# కౌలు రైతులను మరిచారు!

- భూ హక్కుల్లేని, పోడు వ్యవసాయం చేసేవారికి 'పీఎం–కిసాన్' దక్కేనా..!
- రాష్ట్రంలో లక్షల్లోనే వీరి సంఖ్య

**ఈనాడు, అమరావతి:** పెట్టుబడి సాయం పథకం (ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి) కింద ఎకరాకు రూ.6వేలు ఇవ్వాలని కేంద్రం నిర్ణయించిన నేపథ్యంలో.. కౌలు రైతులు, గిరిజన ప్రాంతాల్లో పోడు భూములు సాగు చేసే వారు, భూ వివాదాలతో పట్టాదారు పాసుపుస్తకాలు లేని వారి పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది. అయిదెకరాల లోపు భూములున్న వారికే పీఎం-కిసాన్ పథకం దక్కుతుందని బడ్జెట్ ప్రసంగంలో ఆర్థికమంత్రి గోయెల్ ప్రకటించారు. దీనిప్రకారం పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్న రైతులకే సాయమందే పరిస్థితి ఉంది. భూ యాజమాన్య హక్కుల ఆధారంగా బ్యాంకు రుణాలు తీసుకునే రైతులకు కేంద్రం నేరుగా నగదు బదిలీ చేయొచ్చు. ఇవి లేనివారికి ఎలా మేలు చేస్తారనేదే ఇప్పుడు చర్చనీయాంశం అయింది.

***లక్షల్లోనే రైతులు***

సాగు చేస్తున్నా.. భూహక్కులు లేని వారి సంఖ్య రాష్ట్రంలో 25 లక్షలకు పైనే ఉంటుందని అంచనా. ప్రభుత్వ గణాంకాల ప్రకారం కౌలు రైతులే 16 లక్షల మంది వరకు ఉన్నారు. వాస్తవంగా వీరి సంఖ్య ప్రభుత్వ లెక్కలకు దాదాపు రెట్టింపు ఉంటుంది. ఎకరా రూ.8వేల నుంచి రూ. 30 వేల వరకు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. చుక్కల భూముల సమస్యలు, ఆన్‌లైన్ కానివారు, వివాదాస్పద కారణాలతో పట్టాదారు పాసుపుస్తకాలు పొందని వారి సంఖ్య లక్షల్లోనే ఉంది. గిరిజన ప్రాంతాల్లో పోడు వ్యవసాయం చేసేవారు లక్ష వరకుంటారని అంచనా.


***పెట్టుబడిసాయం.. వీరికే అవసరం***

కౌలు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది బ్యాంకుల నుంచి రూ.5వేల కోట్ల వరకూ రుణం ఇప్పించింది. అయినా 80శాతం మందికి పైగా కౌలు రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు రూ.100 అప్పులు తీసుకుంటున్నారు. వాస్తవానికి పైనే పేర్కొన్న వర్గాల వారికే పెట్టుబడి సాయం అవసరం ఎక్కువగా ఉంటుంది. కేంద్రం వీరికి కూడా సాయం అందించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# పన్నుల్లో వాటా 36 వేల కోట్లు

**2018–19తో పోలిస్తే 10% పెరుగుదల**

**ఈనాడు, దిల్లీ:** కేంద్ర పన్నుల నుంచి 2019-20 ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌కు రూ.36,360.26 కోట్లు రానుంది. 2018-19 కన్నా ఇది రూ.3,573.23 కోట్లు (10%) అధికం. 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం కేంద్రం రాష్ట్రానికి కేంద్ర పన్నుల్లో 4.305% వాటాను పంచుతోంది. కార్పొరేట్ ట్యాక్స్ రూపంలో అత్యధిక వాటా దక్కుతోంది. ఆ తర్వాత స్థానంలో సీజీఎస్‌టీ, ఆదాయపన్నులు ఉన్నాయి. గత బడ్జెట్‌లో రూ.31,726.05 కోట్లు వస్తుందని అంచనా వేయగా చివరకు అది రూ.32,786.03 కోట్లకు పెరిగింది. 2016-17, 2017-18లో రావాల్సిన మొత్తం రూ.1,060.98 కోట్లను 2018-19 బడ్జెట్‌లో కలిపి ఇవ్వడంతో అంచనాలకు మించి వచ్చినట్లయింది.




## ఇది.. సంఘ్‌పరివార్ మార్కు బడ్జెట్

'కేంద్ర బడ్జెట్‌ను ఆర్థిక నిపుణులతో కాకుండా ఆర్ఎస్ఎస్ ఇతర సంఘ్ పరివార్ నేతలతో తయారు చేయించారు. కర్ణాటకలో రుణ మాఫీకి సంబంధించి 22 లక్షల మంది రైతులకు రూ.48 వేల కోట్లు కేటాయిస్తే.. ప్రస్తుత కేంద్ర బడ్జెట్‌లో దేశవ్యాప్తంగా 12 కోట్ల మంది రైతుల కోసం రూ.75 వేల కోట్లు మాత్రమే కేటాయించారు. అరకొర బడ్జెట్ ప్రకటించిన నరేంద్ర మోదీ రైతులకు కాటన్ క్యాండి అందించారు'.

– కర్ణాటక సీఎం కుమారస్వామి(బెంగళూరులో విలేకరులతో)

## సామాజిక, ఆర్థిక స్థాయి పెంచేదిగా బడ్జెట్: కన్నా

**విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే:** కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద, బడుగుల సామాజిక, ఆర్థిక స్థాయిని పెంచేదిగా ఉందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు. విజయనగరంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 'బడ్జెట్ జీవిత భద్రతను పెంచేలా ఉంది. పేదరిక నిర్మూలన, సంపూర్ణ గ్రామీణాభివృద్ధి, దేశ రక్షణ, పారిశ్రామిక ప్రగతి ఇందులో కనిపిస్తోంది. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి. ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని గవర్నర్‌ను కోరుతాం' అని పేర్కొన్నారు.

# బహుమీనమే...

- ఆక్వా అభివృద్ధికి ఊతం
- ఆంధ్రప్రదేశ్‌కు మరింత ఆదాయం
- కేంద్ర మత్స్యశాఖ ఏర్పాటుతో పరిశోధన, సాంకేతికతకు అవకాశం

ఈనాడు – అమరావతి

కొత్తగా మత్స్యశాఖను ఏర్పాటు చేయాలనే కేంద్ర నిర్ణయం.. ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వారంగం అభివృద్ధికి ఊతమివ్వనుంది. త్వరితగతిన నిర్ణయాలతోపాటు కొత్త సంస్థల ఏర్పాటు, పరిశోధనలు సైతం ఊపందుకునే అవకాశం ఉంది. దేశంలోనే ఆక్వా ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉంది. గతేడాది దేశవ్యాప్తంగా రూ.45,107 కోట్ల విలువైన ఎగుమతులు జరగ్గా.. ఆంధ్రప్రదేశ్ నుంచే రూ.20,600 కోట్ల విలువైన రొయ్యలు, చేపలు ఎగుమతి అయ్యాయి. ఇప్పటివరకూ ఆక్వా వ్యవసాయ మంత్రిత్వశాఖ పరిధిలో ఉండటం వల్ల కొన్ని నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యం జరిగేది. ఇప్పుడు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పడనుండటంతో అధికారులకు వెంటనే నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుంది.

***తీరంలో ఎన్నో అవకాశాలు***

ఆంధ్రప్రదేశ్‌లో 9 జిల్లాల్లో 974 కిలోమీటర్ల తీరం ఉంది. ఇక్కడ కేజ్ కల్చర్ విధానంలో చేపలు పెంచుకోవచ్చు. అత్యాధునిక మరపడవల ద్వారా వేటాడవచ్చు. అయితే కేంద్రస్థాయిలో సరైన చర్యలు లేకపోవడంతో ప్రగతి అంతంతమాత్రంగానే ఉంది. జెట్టీల నిర్మాణంలో సమస్యలు ఎదురవుతున్నాయి. అనుమతుల కోసం ఏళ్లతరబడి ఎదురుచూడాల్సి వస్తోంది.

ఆధునిక సాంకేతికత వినియోగంలోనూ వెనకబడే ఉన్నాం. విదేశాలకు సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లోనూ ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 'కేంద్రంలో మత్స్యశాఖ ఏర్పడనుండటంతో ఆక్వా రంగంపై ప్రత్యేక దృష్టి సారించేందుకు వీలు కలుగుతుందని' ఆంధ్రప్రదేశ్ మత్స్యశాఖ కమిషనర్ రామ్‌శంకర్ నాయక్ తెలిపారు. ఆదాయం పదింతలు పెంచుకునే వీలుందన్నారు.

**అయిదేళ్లుగా సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు(రూ.కోట్లలో)**

| సంవత్సరం | భారతదేశం | ఆంధ్రప్రదేశ్ |
|---|---|---|
| 2014-15 | 33,441 | 15,000 |
| 2015-16 | 30,421 | 13,500 |
| 2016-17 | 37,821 | 17,000 |
| 2017-18 | 45,107 | 20,600 |
| 2018-19 (అక్టోబరుదాకా) | 29,007 | 11,196 |



## హర్షణీయ పరిణామం

కేంద్రంలో మత్స్యశాఖ ఏర్పాటు నిర్ణయం హర్షించదగ్గ పరిణామం. థాయ్‌లాండ్, వియత్నాం తదితర దేశాల్లో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఉంది. మంత్రిత్వశాఖ ఏర్పాటుతో మత్స్య రంగం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించవచ్చు. వివిధ పనులకు అనుమతులు కూడా వెంటనే వస్తాయి.

–ఎ.ఇంద్రకుమార్, అధ్యక్షుడు, ఆక్వా ఎగుమతిదారుల సంఘం

## బీమా, పన్ను రాయితీలు కల్పిస్తేనే..

ప్రత్యేకశాఖ ఏర్పాటు చేయడం వల్ల ఆక్వారంగం వేగంగా అభివృద్ధి చెందుతుంది. పరిశోధనా సంస్థల ఏర్పాటుకు అవకాశం ఏర్పడుతుంది. వ్యవసాయ పంటల తరహాలోనే ఆక్వా సాగుకు కూడా బీమా కల్పించి.. పన్ను రాయితీలు ఇవ్వాల్సిన అవసరం ఉంది.

– యు.కె.విశ్వనాథరాజు, అధ్యక్షుడు, ఆనంద గ్రూప్ ఛైర్మన్

## రూ.2లక్షల కోట్లకు పైనే రాష్ట్ర బడ్జెట్

### ఆర్థికమంత్రి యనమల వెల్లడి

**ఈనాడు, అమరావతి:** రాష్ట్ర బడ్జెట్ రూ.2లక్షల కోట్లకుపైగా ఉండబోతోందని ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. రైతులకు ఆర్థిక సాయం అందించడంపై బడ్జెట్‌లో ప్రతిపాదిస్తున్నట్లు తెలిపారు. భూమి యజమానులు, కౌలు రైతులకు నష్టం జరగకుండా చేయాలనే చూస్తున్నామన్నారు. మధ్యతరగతి వర్గం కూడా ఇబ్బందుల్లో ఉందని..ఆ వర్గానికి ఎలా న్యాయం చేయగలమని ఆలోచిస్తున్నామన్నారు. శుక్రవారం ఆయన అసెంబ్లీ లాబీల్లో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన కేంద్ర బడ్జెట్‌పై స్పందించారు. "కీలకమైన వ్యవసాయంతో సహా వివిధ రంగాల జాతీయ వృద్ధిరేటు పెద్దగా లేదు. ఆర్థిక వృద్ధిరేటు కూడా 7శాతానికి అటూఇటూగానే ఉంది. కొత్త ఉద్యోగాలు అటుంచి..ఉన్న ఉద్యోగాలే భారీగా పోతున్నాయి. రైతులకు అందిస్తామన్న ఆర్థిక సాయంపై మార్గదర్శకాలు వచ్చాకే స్పష్టత వస్తుంది. రాష్ట్ర విభజన హామీల గురించి కనీస ప్రస్తావనే లేద'ని వ్యాఖ్యానించారు. ఈ నెల 5న అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో ఏయే అంశాలను ఎంతమేర ప్రస్తావించాం... మార్పులేమైనా చేయాల్సి ఉందా అనే అంశాలపై ఆర్థిక మంత్రి యనమల, మంత్రులు కళా వెంకట్రావు, లోకేశ్, అచ్చెన్నాయుడు సమీక్షించారు.




## విదేశీ వ్యవహారాలకు రూ.వెయ్యి కోట్లు పెంపు

**దిల్లీ:** విదేశీ వ్యవహారాల శాఖకు తాజా బడ్జెట్‌లో కేటాయింపులు పెంచారు. ముందు సంవత్సరం కంటే రూ. 1,050 కోట్లు అధికంగా కేటాయించారు. 2018-19లో కేటాయింపులు దాదాపు రూ. 15 వేల కోట్లు కాగా, సవరించిన బడ్జెట్ ప్రకారం రూ. 15,582 కోట్లు ఖర్చు చేశారు. తాజాగా బడ్జెట్‌లో రూ. 16 వేల కోట్లకు పైగా కేటాయించారు. ఈసారి మారిషస్, మాల్దీవులు, ఆఫ్రికన్ దేశాలకు సహాయాన్ని భారీగా పెంపుదల చేశారు. మొత్తంగా వివిధ దేశాలకు సహాయాన్ని రూ. 5,545 కోట్ల నుంచి రూ. 6,447 కోట్లకు పెంచారు. ఈమేరకు రూ. 902 కోట్లు పెంపుదల జరిగింది.




# అగ్ర భారత్ లక్ష్యం

ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో వేగంగా అభివృద్ధిచెందుతున్న మన దేశం వచ్చే అయిదేళ్లలో రూ. 360 లక్షల కోట్ల (5 ట్రిలియన్ డాలర్) స్థాయికి చేరుకోనుందని తాత్కాలిక ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. ఇందుకు అవసరమైన పూర్వరంగాన్ని కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం సిద్ధం చేసిందని అన్నారు. ఈ లక్ష్య సాధనకు అవరోధాలుగా ఉన్న అనేక సమస్యలను ప్రభుత్వం పరిష్కరించిందని బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. అయితే, మన దేశానికి ఇంతకుమించిన శక్తి సామర్థ్యాలు ఉన్నాయని, వచ్చే దశాబ్దాని(2030)కి రూ. 720 లక్షల కోట్ల (10 ట్రిలియన్ డాలర్) స్థాయికి మన ఆర్థిక వ్యవస్థ చేరుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు వెల్లడించారు. ఈ లక్ష్య సాధన కోసం పది కీలకాంశాలతో కూడిన దశ దిశల దార్శనిక పత్రాన్ని రూపొందించినట్లు తెలిపారు. తన ప్రసంగంలో పీయూష్ గోయల్ వాటిని వివరించారు.

**1** "ప్రజల జీవన ప్రమాణాలను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు, రూ. 720 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థను రూపొందించేందుకు అవసరమైన భౌతిక, సామాజిక మౌలిక వసతుల కల్పన ఈ దార్శనిక పత్రంలోని తొలి అంశం. అత్యాధునికమైన రహదారులు, రైల్వేమార్గాలు, ఓడరేవులు, విమానాశ్రయాలు, పట్టణ రవాణా వ్యవస్థలు, సహజవాయువు, విద్యుత్తు సరఫరాలు, అంతర్గత జలమార్గాల ఏర్పాటు వంటివి దీనిలో భాగం. ఇక సామాజిక మౌలిక వసతులు.... ప్రతి కుటుంబం ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన, స్వచ్ఛమైన పరిసరాలను కలిగి ఉండేలా ఉంటాయి. అత్యున్నతమైన విద్యాసంస్థల ద్వారా ఉన్నతమైన నాయకత్వాన్ని అందించేలా నాణ్యమైన, విజ్ఞాన ఆధారిత విద్యావ్యవస్థను రూపొందిస్తాం.

**2** దేశంలోని మారుమూలలకూ, ఆర్థిక వ్యవస్థలోని ప్రతి రంగానికీ చేరుకొనేలా, ప్రతి పౌరుడి జీవితాన్ని ప్రభావితం చేసేలా డిజిటల్ ఇండియాను తీర్చిదిద్దటం. ఇటీవలి సంవత్సరాల్లో ప్రైవేటు, ప్రభుత్వ లావాదేవీలు డిజిటలీకరణ చేయటంలో సాధించిన విజయాల ఆధారంగా 2030నాటికి డిజిటల్ ఆర్థిక వ్యవస్థను, డిజిటల్ మౌలిక వసతులను నిర్మిస్తాం. మన యువత ప్రారంభిస్తున్న అసంఖ్యాక అంకుర సంస్థలు, వారు సృష్టిస్తున్న లక్షల ఉద్యోగాలు మనల్ని ఈ గమ్యం దిశగా నడిపిస్తాయి.

**3** భూమాతను సతత హరితంగా మలచుకోవటం, భారత్‌ను కాలుష్యరహిత దేశంగా తీర్చిదిద్దుకోవటం. విద్యుత్తు వాహనాలు, పునరుత్పాదక ఇంధనాల భారీ వినియోగం. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గిస్తూ, ప్రజలకు ఇంధన భద్రత కల్పిస్తూ.. . విద్యుత్తు నిల్వ ఉపకరణాలు, విద్యుత్తు వాహనాల వినియోగంలో విప్లవాత్మక విధానాలను అందిపుచ్చుకోవటంలో ప్రపంచానికి మన దేశం మార్గ నిర్దేశం చేస్తుంది.

**4** ఆధునిక డిజిటల్ సాంకేతికతల దన్నుతో గ్రామీణ పారిశ్రామికీకరణను విస్తరింపజేస్తూ పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు సృష్టించటం. మేకిన్ ఇండియా చూపిన మార్గంలో దేశంలోని మారుమూల ప్రాంతాల్లోనూ అంకుర సంస్థలను ప్రోత్సహించటం, మధ్య, చిన్నతరహా పరిశ్రమలను స్థాపించటం ద్వారా ఈ లక్ష్యాన్ని చేరుకుంటాం.

**5** నదులు, జలాశయాలే మన జీవనాధారం. గంగా నది శుద్ధికి ప్రభుత్వం ఎంతో కృషిచేస్తోంది. 2030 కల్లా పరిశుద్ధమైన నదులు, దేశ ప్రజలందరికీ సురక్షితమైన తాగునీరు అందుబాటులోకి తీసుకురావటం, సాగు రంగంలో సమర్థ నీటియాజమాన్య పద్ధతులు అనుసరించేలా చేయటం.




**6** సుదీర్ఘమైన సముద్రతీరం దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి వెన్నుదన్నుగా నిలుస్తుంది. తీర ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు సముద్ర సంపదను మనం పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి. సాగరమాల కార్యక్రమాన్ని వేగవంతం చేయటంతో పాటు ఇతర జలమార్గాలనూ సత్వరమే అభివృద్ధి చేసుకోవటం.

**7** మన అంతరిక్ష కార్యక్రమాన్ని మరింతగా విస్తరించుకోవటం. ఉపగ్రహాల ప్రయోగాలకు మన దేశం ప్రపంచ దేశాలకూ వేదికగా మారింది. ఇదే క్రమంలో 2022 నాటికి మన దేశ వ్యోమగామిని అంతరిక్షంలోకి పంపించడం.

**8** సేంద్రియ విధానాల్లో ఆహారోత్పత్తిని పెంచటం, ఈ రంగంలో స్వయంసమృద్ధిని సాధించటం. ప్రపంచ దేశాల ప్రజల అవసరాలు తీర్చేలా ఆహారోత్పత్తులను ఎగుమతి చేయటం. వ్యవసాయంలో అత్యాధునిక విధానాలు అనుసరించటం, అధికోత్పత్తిని సాధించటం, అదనపు విలువలు జోడించటం.. దీనిలో భాగంగానే ఆహారశుద్ధి, నిల్వ, ప్యాకింగ్, గొలుసుకట్టు విధానంలో శీతల గోదాముల నిర్మాణం తదితరాలపై దృష్టి సారించటం.

**9** ఆరోగ్య భారత్ నిర్మాణంలో భాగంగా ప్రజలందరికీ ఆరోగ్య భద్రత కల్పించటం. దీనికి అవసరమైన మౌలిక వసతులు సమకూర్చటం. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. 2030కల్లా ఆరోగ్య సంరక్షణకు సమగ్ర వ్యవస్థలను ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకురావటం. మహిళలకు సాధికారత, సమాన హక్కులు, పూర్తిస్థాయిలో భద్రత కల్పించటంతో పాటు వారిని సంపూర్ణ భాగస్వాములను చేయటం ద్వారా ఆరోగ్యకరమైన దేశ నిర్మాణం.

**10** 'కనిష్ఠ ప్రభుత్వం... గరిష్ఠ పాలన' అందించేలా దేశాన్ని మలచుకోవటానికి ప్రజా ప్రభుత్వాలతో కలసికట్టుగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. అందరి కృషితోనే లక్ష్యాలను సాధించుకోగలం. 2030కల్లా ప్రజల పట్ల స్నేహ పూర్వకంగా, బాధ్యతాయుతంగా, సానుకూల దృక్పథంతో స్పందించే అధికారయంత్రాంగాన్ని దేశంకలిగి ఉండాలి.

సమగ్రమైన ఈ పది అంశాల దార్శనికతతో... పేదరికం, పౌష్టికాహార లోపం, నిరక్షరాస్యత, అపరిశుభ్రతలు వంటివి గతించిపోయిన సమస్యలు అవ్వాలి. భారతదేశం అంటే అత్యాధునిక, సాంకేతికాధారిత, భారీ అభివృద్ధి, పారదర్శకమైన సమాజం కలిగిన దేశంగా గుర్తింపు పొందాలి".

## ఈ బడ్జెట్.. అభివృద్ధికి ట్రైలర్



**దిల్లీ:** రైతులు, మధ్యతరగతి ప్రజలు, అసంఘటిత రంగంలోని కోట్ల మంది కార్మికులు.. ఇలా సమాజంలోని అన్ని వర్గాలకు లాభం చేకూర్చేలా బడ్జెట్‌ను ప్రవేశపెట్టామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత తాము దేశాన్ని ఎలా అభివృద్ధి పథంలో నడపబోతున్నామో చెప్పడానికి ఈ బడ్జెట్ ఒక ట్రైలర్ మాత్రమేనని వ్యాఖ్యానించారు. లోక్‌సభలో మధ్యంతర బడ్జెట్‌ను ఆర్థిక శాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రవేశపెట్టిన అనంతరం మోదీ ప్రసంగించారు. 12 కోట్ల మంది రైతులు, మూడు కోట్ల మధ్యతరగతి కుటుంబాలు, 30 నుంచి 40 కోట్ల మంది అసంఘటిత రంగ కార్మికులు ఈ బడ్జెట్‌తో లాభం పొందబోతున్నారని ఆయన చెప్పారు. తమ ప్రభుత్వ కృషితో పేదరికం భారీగా తగ్గుముఖం పడుతోందన్నారు. బీదరికపు సంకెళ్ల నుంచి ఎక్కువ మంది ప్రజలు విముక్తులవడంపై ప్రధాని హర్షం ప్రకటించారు. 'నవ భారత్' లక్ష్యం కోసం తాము చేస్తున్న కృషిని 130 కోట్ల మంది భారతీయులకు వివరించడానికి ఈ బడ్జెట్ ఉపయోగపడుతుందన్నారు. ఎన్డీయే ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పు తీసుకొస్తున్నాయని మోదీ చెప్పారు. రైతుల నుంచి మధ్యతరగతి వరకు, ఆదాయపు పన్ను పరిమితి నుంచి మౌలిక వసతుల కల్పన వరకు, తయారీ రంగం నుంచి సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల వరకు.. గృహనిర్మాణం నుంచి వైద్య రంగం వరకు ఈ బడ్జెట్‌లో అన్ని రంగాలపైనా తాము చేసిన ప్రతిపాదనలు దేశ అభివృద్ధిని వేగవంతం చేయడానికి దోహదపడతాయని వివరించారు.

### పన్ను చెల్లింపుదార్లకు వందనం

వేతనజీవులైన మధ్యతరగతి ప్రజలు క్రమం తప్పక పన్ను చెల్లిస్తూ దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నారని మోదీ కొనియాడారు. ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితి పెంపుతో వారికి మేలు చేకూర్చామని వెల్లడించారు.

### రైతు సంక్షేమంలో చరిత్రాత్మక అడుగు

రైతు సంక్షేమానికి ఇంతకు ముందు ఎన్నో పథకాలు వచ్చినా ఎక్కువ మంది అన్నదాతలు లబ్ధి పొందలేకపోయారని మోదీ గుర్తు చేశారు. ఐదెకరాల్లోపు భూమి ఉన్న రైతులకు ఆర్థిక సాయం అందించేందుకు 'ప్రధాన్ మంత్రి కిసాన్ నిధి' ప్రారంభించడం రైతు సంక్షేమంలో 'చరిత్రాత్మక అడుగు' అని అభివర్ణించారు. పశుసంవర్ధక, మత్స్యరంగాల అభివృద్ధిపైనా బడ్జెట్‌లో ప్రత్యేక దృష్టి సారించామన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు మేలు చేసేందుకు (ప్రధాన్ మంత్రి శ్రమ్ యోగి మానధన్ యోజన'ను ప్రవేశపెట్టామన్నారు. ఆయుష్మాన్‌భారత్, సామాజిక భద్రతా పథకాలతో వారికి మరింత మేలు జరుగుతుందని ప్రధాని అన్నారు. అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాల వారికి చేరాల్సిన ఆవశ్యకతను మోదీ మరోసారి గుర్తు చేశారు. 'ఈ బడ్జెట్ పేదల అభివృద్ధికి, అన్నదాతకు చేయూతనందించడానికి తద్వారా దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుంది' అని పేర్కొన్నారు.

## గ్రామాలకూ కృత్రిమ మేధ ఫలాలు

**దిల్లీ:** నూతన సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేధస్సు ఫలాలను గ్రామీణులకు సైతం చేరువ చేయడానికి, నియంత్రించడానికి జాతీయ కృత్రిమ మేధస్సు కేంద్రాన్ని కేంద్రప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. వచ్చే ఐదేళ్లలో లక్ష గ్రామాలను డిజిటల్ గ్రామాలుగా అభివృద్ధి పరచనుంది. దేశవ్యాప్తంగా ఇప్పటికే మూడు లక్షల ఉమ్మడి సేవా కేంద్రాల(సీఎస్‌సీ) ద్వారా 12లక్షల మంది డిజిటల్ సేవలందిస్తున్నారు. వీరంతా గ్రామాలకు మౌలిక డిజిటల్ సేవలు అందించడం ద్వారా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని గ్రామాలకు చేరువచేయడానికి కృషి చేస్తారు.

### స్టార్టప్ కేంద్రంగా భారత్

మనదేశం స్టార్టప్ కంపెనీలకు హబ్‌గా ఆవిర్భవిస్తోంది. ప్రపంచంలోనే అత్యధికంగా ఏర్పాటైన స్టార్టప్ కంపెనీల రెండో దేశంగా నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగం అనేది తన స్వరూపాన్ని మార్చుకుంటోందని.. కేవలం ప్రభుత్వసేవలు, ఫ్యాక్టరీలకు పరిమితం కావడంలేదని కేంద్ర ఆర్థికమంత్రి పీయూష్‌గోయల్ పేర్కొన్నారు. ఒకప్పుడు ఉద్యోగాలు కావాలని తిరిగినవారు, ప్రస్తుతం ఉద్యోగాలు ఇస్తున్నారన్నారు.

## శాస్త్ర, సాంకేతిక రంగానికి ఒక మోస్తరు పెంపు

**దిల్లీ:** సైన్స్ వ్యవహారాలకు సంబంధించిన రెండు ముఖ్య శాఖలైన భూ విజ్ఞాన శాస్త్రాల మంత్రిత్వశాఖ; శాస్త్ర, సాంకేతిక శాఖకు తాజా బడ్జెట్‌లో ఒక మోస్తరు స్థాయిలో కేటాయింపులను పెంచారు. ఈ రెండింటికీ కలిపి రూ. 14,697 కోట్లను ప్రతిపాదించారు.

- భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వంటి కీలక సంస్థలు కలిగిన భూ విజ్ఞాన శాస్త్రాల మంత్రిత్వశాఖకు రూ. 1,901 కోట్లు దక్కాయి. గత బడ్జెట్‌లో ఇది రూ. 1800 కోట్లుగా ఉంది. కొత్త రాడార్లు, ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాలు, వాతావరణ పరిశోధనల నిర్వహణ కోసం విమానాన్ని కొనుగోలు చేయడానికి, సముద్ర గర్భంలో మైనింగ్‌పై పరిశోధన చేయడానికి సబ్‌మెర్సిబుల్ నౌకను సమకూర్చుకోవడానికి ఈ మొత్తాన్ని వెచ్చించనున్నట్లు ఈ శాఖ సీనియర్ అధికారి ఒకరు చెప్పారు.
- శాస్త్ర, సాంకేతిక వ్యవహారాల శాఖలో బయోటెక్నాలజీ విభాగం (డీబీటీ); శాస్త్ర, సాంకేతిక వ్యవహారాల విభాగం (డీఎస్‌టీ); శాస్త్రీయ, పారిశ్రామిక పరిశోధన మండలి (సీఎస్ఐఆర్) అంతర్భాగంగా ఉన్నాయి. ఈ మూడింటికీ కలిపి 70కిపైగా పరిశోధన సంస్థలు ఉన్నాయి.

## విద్యారంగానికి రూ.93,847 కోట్లు



**దిల్లీ:** విద్యారంగానికి కేంద్ర బడ్జెట్లో రూ. 93,847.64 కోట్లు కేటాయించారు. గత సంవత్సరం కేటాయించిన రూ. 85,010 కోట్లతో పోలిస్తే ఇది 10% ఎక్కువ. ప్రస్తుత కేటాయింపుల్లో పాఠశాల విద్యకు రూ. 56,386.63 కోట్లు, ఉన్నత విద్యకు రూ. 37,461.01 కోట్ల నిధులను నిర్దేశించారు.

- '2022 నాటికి విద్యావిధానం, మౌలిక వసతులను పునరుత్తేజితం' చేసే దిశగా ఒక పథకాన్ని ప్రతిపాదించారు. రానున్న నాలుగేళ్లలో ఈ పథకం కోసం రూ. లక్ష కోట్లు వెచ్చించనున్నట్లు పేర్కొన్నారు. విద్యా, వైద్య రంగాల్లో ప్రతిష్ఠాత్మక సంస్థల్లో పరిశోధన, మౌలిక వసతుల పెట్టుబడులకు ఈ నిధులను వ్యయం చేస్తారు.
- పరిశోధన, ఆవిష్కరణలకు తాజాగా కేంద్రం 608.87 కోట్లు కేటాయించింది. గత ఏడాదితో పోలిస్తే ఈ సారి కేటాయింపు గణనీయంగా పెరిగింది. నిరుడు ఈ రంగానికి రూ. 350 కోట్లు కేటాయించారు.
- రెండు పూర్తిస్థాయి 'స్కూల్స్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (స్పా)'లను ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేయనున్నట్లు గోయల్ చెప్పారు.
- దేశంలోని ఐఐటీలు, ఎన్ఐటీల్లో స్వయంప్రతిపత్తి ఉన్న సంస్థలుగా అదనంగా 18 ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ స్కూళ్లను ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఇందు కోసం ప్రతిపాదనలను సమర్పించాల్సిందిగా ఆయా సంస్థల డైరెక్టర్లను, రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులను కోరినట్లు కేంద్రమంత్రి తెలిపారు.
- పాఠశాలల్లో విద్య నాణ్యతను పెంచేందుకు నిర్దేశించిన ఆపరేషన్ డిజిటల్ బోర్డ్ కార్యక్రమ విధివిధానాలను రూపొందించేందుకు ఉన్నత విద్యాశాఖ ఒక కమిటీని ఏర్పాటు చేస్తుందన్నారు. 'బ్లాక్ బోర్డ్ నుంచి డిజిటల్ బోర్డు' దిశగా విద్యారంగాన్ని, ఉపాధ్యాయులను సంసిద్ధం చేసేందుకు 'దీక్ష' పేరుతో డిజిటల్ పోర్టల్‌ను ప్రారంభించడాన్ని గుర్తుచేశారు. ఉపాధ్యాయుల నైపుణ్యాలను పెంచేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని గణనీయంగా వినియోగించుకోనున్నట్లు చెప్పారు.

### ఐఐటీ ఐఐఎం ఐసర్‌ల నిధుల్లో కోత

దేశవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మక ఐఐటీలు, ఐఐఎంలు, ఐసర్‌లు.. చట్టబద్ధ సంస్థలైన యూజీసీ, ఏఐసీటీఈల కేటాయింపుల్లో కేంద్రం కోత విధించింది. 2019 నుంచి ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పిస్తున్న నేపథ్యంలో అన్ని ఉన్నత విద్యాసంస్థల్లో 25% సీట్లు పెంచనున్నారు. ఈ క్రమంలో నిధుల కేటాయింపులు తగ్గడం గమనార్హం. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లకు తాజాగా 415.41 కోట్లు కేటాయించారు. గత ఏడాది కేటాయింపులు రూ. 1,036 తో పోలిస్తే ఇది 59.9% తక్కువ. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)లకు ఈసారి 6,223 కోట్లు కేటాయించారు. క్రితం ఏడాది ఇచ్చిన నిధులు రూ. 6,326 కోట్లు. గత సంవత్సరం కూడా అంతకుముందు ఏడాదితో పోలిస్తే నిధుల్లో కోత విధించడం గమనార్హం.

# ప్రజా ఉద్యమంగా ప్రగతియాత్ర




"ఇది కేవలం తాత్కాలిక బడ్జెట్ కాదు. దేశ ప్రగతి యాత్రను తెలిపే సాధనం. దేశ ప్రజల ఆసక్తి కారణంగానే మనం చూస్తున్న ఈ మార్పు సాధ్యమయింది. ఈ ఘనత అంతా వారికే దక్కాలి. మన ప్రభుత్వ హయాంలో అభివృద్ధి ప్రజా ఉద్యమంగా మారింది. ప్రజల సహకారంతో దేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామి ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతున్నాం. ఇందుకు వారితో కలిసి పునాది రాయి వేశాం. ఘనమైన భవనాన్ని నిర్మిస్తాం. ఆలోచనల్లో స్పష్టత, విధానాల్లో పారదర్శకత, అంకితభావంలో సుస్థిరత గల నాయకత్వం ద్వారానే ఇది సాధ్యమయింది" అంటూ కేంద్ర తాత్కాలిక ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ ద్వారా తమ ప్రభుత్వ విజయాలను వివరించారు. బడ్జెట్ ప్రసంగాన్ని ముగిస్తున్న దశలో చేసిన ఈ వ్యాఖ్యలు బడ్జెట్ సారాంశానికి అద్దం పట్టాయి. ప్రసంగం ప్రారంభం నుంచి తమ ప్రభుత్వ పనితీరును మునుపటి ప్రభుత్వాలతో సరిపోల్చుతూ విజయాలను విశదపరిచేందుకు ప్రాధాన్యం ఇచ్చారు. విధానపరమైన లోపాలను సరిదిద్దుతూ దేశ ప్రతిష్ఠను మార్చే ప్రయత్నం చేశామని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ సమర్థ నాయకత్వం వల్లనే ఇది సాధ్యమయిందని అన్నారు. ప్రజల ఆలోచన విధానాన్ని మార్చడం, ఆత్మవిశ్వాసాన్ని జ్వలింపచేయడమే తమ ప్రభుత్వం సాధించిన ఘన విజయమని చెప్పేందుకు గర్వపడుతున్నానని అన్నారు.

2022లో 75వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకొనే నాటికి 'నూతన భారత్' నిర్మించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. నూతన భారతంలో అందరికీ విద్యుత్తు, నీరు, ఇళ్లు, మరుగుదొడ్డి వంటి సౌకర్యాలు ఉంటాయని, రైతులు రెట్టింపు ఆదాయం పొందుతారని తెలిపారు. యువకులు, మహిళలు తమ కలలను నిజం చేసుకోవడానికి అపారమైన అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఉగ్రవాదం, కులతత్వం, మతతత్వం, అవినీతి, బంధుప్రీతిలేని దేశం ఆవిష్కారమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ అయిదేళ్లలో సాధించిన విజయాలను అంశాల వారీగా వివరించారు.

"దేశం మళ్లీ పట్టాలెక్కింది. ప్రపంచంలో 'మెరుపు చుక్క'గా గుర్తింపుపొందింది. అయిదేళ్లలో అయిదు ట్రిలియన్ డాలర్ల (రూ. 360 లక్షల కోట్లు) ఆర్థిక వ్యవస్థగా ఎదగనుంది. అక్కడి నుంచి మరో ఎనిమిదేళ్లలో 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారనుంది. గత అయిదేళ్లలో స్థూల ఆర్థికవ్యవస్థలో సుస్థిరత సాధించాం. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రపంచంలోనే వేగవంతమైన వృద్ధి ఉన్న ఆర్థిక వ్యవస్థగా మారాం. 2013-14లో ప్రపంచంలో 11వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉండగా, ఇప్పుడు ఆరోర్యాంకులో ఉంది.

### దేశ వనరులపై తొలి హక్కు పేదలదే

దేశ వనరులపై తొలి హక్కు పేదలకే ఉంది. పల్లెలు- పట్టణాలు అన్న తేడాను చెరిపేస్తాం. గ్రామాల ఆత్మను కాపాడుతునే అక్కడ పట్టణాల్లోని సౌకర్యాలను కల్పించడానికి ప్రయత్నిస్తున్నాం. 98 శాతం గ్రామాల్లో స్వచ్ఛభారత్‌ను అమలు చేస్తున్నాం. బహిరంగ మల విసర్జన లేని ప్రాంతాలుగా 5.4 లక్షల గ్రామాలు గుర్తింపు పొందాయి. గ్రామీణ విద్యుదీకరణ లక్ష్యాలను దాదాపుగా పూర్తి చేశాం. ఇంకా 2.5 కోట్ల ఇళ్లకు విద్యుత్తు సౌకర్యం కలిగించవలసి ఉంది. ఇంటి యజమానులు ముందుకు వస్తే సౌభాగ్య పథకం కింద వచ్చే నెలాఖరు నాటికే విద్యుత్తు కనెక్షన్లు ఇస్తాం. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించడమూ ఇందులో భాగమే. వారి కోసం విద్యా సంస్థల్లో అదనంగా 2 లక్షల సీట్లను కల్పిస్తాం. ఆహార సబ్సిడీ కింద 2013-14లో రూ. 92వేల కోట్లు కేటాయించగా, ఇప్పుడు దాదాపు రెట్టింపుగా రూ. 1,70,000 కోట్లు ఇచ్చాం. ఉపాధి హామీకి రూ. 60 వేల కోట్లు ఇచ్చాం. తిండి లేకుండా ఎవరూ నిద్రపోకూడదన్న ఆశయంతో ఈ పథకానికి ఇంకా అవసరమైన నిధులు కూడా ఇస్తాం.

### 'ఫోన్ బ్యాంకింగ్' సంస్కృతికి స్వస్తి

రిజర్వు బ్యాంకు లెక్కల ప్రకారం 2008-2014 మధ్య కాలంలో బ్యాంకులు అధికంగా రుణాలు ఇచ్చాయి. రుణాలు ఇవ్వాలంటూ ఉన్నత స్థాయి నుంచి ఫోన్లు వెళ్లేవి. దాంతో పాటుగా రుణ ఎగవేతలు కూడా పెరిగాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులు ఇచ్చిన రుణాలు రూ. 18 లక్షల కోట్ల నుంచి రూ. 52 లక్షల కోట్లకు పెరిగాయి. అందులో 2014 నాటికి రూ. 5.4లక్షల కోట్లు మొండి బకాయిలుగా మిగిలాయి. అందువల్ల మేం 'ఫోన్ బ్యాంకింగ్' సంస్కృతికి స్వస్తి పలికాం. అవసరాలనుగుర్తించడం, తీర్మానం చేయడం, నిధులు సమకూర్చడం, సంస్కరణలు చేపట్టడం అన్న సిద్ధాంతాల ఆధారంగా క్లీన్ బ్యాంకింగ్ విధానానికి శ్రీకారం చుట్టాం. తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించాలని గతంలో చిన్నవ్యాపారులపైనే ఒత్తిళ్లు ఉండేవి. ఇప్పుడు పెద్ద వ్యాపారులపైనా ఒత్తిడి తేవడంతో రూ. 3లక్షల కోట్లు తిరిగి వసూలయ్యాయి."

### రూ.5 లక్షల ఆదాయం పైబడ్డవారికీ రాయితీలు

అనంతరం గోయల్ విలేకరులతో మాట్లాడుతూ రూ. 5 లక్షలకు పైబడ్డ వార్షికాదాయం ఉన్నవారికి రాయితీలు ఇచ్చే విషయమై పరిశీలిస్తామని చెప్పారు. 'తాత్కాలిక బడ్జెట్ కావడంతో నాకు పరిమితులు ఉన్నాయి. ప్రస్తుతం చిన్నతరహా పన్ను చెల్లింపుదార్లపై దృష్టి పెట్టాం. జులైలో పూర్తిస్థాయి బడ్జెట్ వచ్చినప్పుడు అప్పటి ఆర్థిక మంత్రి మిగిలిన వర్గాల అంశాలను చూస్తారు.' అని చెప్పారు.




వృద్ధి ఆధారిత బడ్జెట్ ఇది. దూరదృష్టితో తీసుకున్న నిర్ణయాల వల్ల ప్రతి ఒక్కరికి దీంతో ఏదో ఒక మేలు చేకూర నుంది. చిన్న, సన్నకారు రైతులకు పెట్టుబడి సాయాన్ని ప్రకటించడం స్వాగతించదగిన విషయం. మధ్యతరగతికి ప్రకటించిన ప్రోత్సాహకాల వల్ల డిపాజిట్లు, చిన్న మొత్తాల పొదుపులు పెరుగుతాయి.



- రజనీశ్ కుమార్, ఛైర్మన్, ఎస్‌బీఐ



జనాకర్షక ప్రతిపాదనలు చేస్తూనే ద్రవ్యలోటు లక్ష్యాన్ని సాధించేందుకు కట్టుబడి ఉన్నామనే సంకేతాలను ప్రభుత్వం ఇచ్చింది.

- కిరణ్ మజుందార్ షా, సీఎండీ, బయోకాన్




# ఇది F2 బడ్జెట్

ఈనాడు వాణిజ్య విభాగం

**చరిత్ర గురించి చెప్పాలంటే.. క్రీస్తు పూర్వం, క్రీస్తు శకం అని చెబుతాం.**

**అలాగే మగాడి జీవితం గురించి చెప్పాలంటే.. పెళ్లికి ముందు.. పెళ్లికి తర్వాత అని చెప్పాలి.**

**మార్కెట్ వర్గాల పరిస్థితి గురించి చెప్పాలంటే.. బడ్జెట్ ప్రసంగం అర్థం చేసుకోవడానికి ముందు.. ఆ తర్వాత అనే చెప్పాలేమో.**

ఎందుకంటే శుక్రవారం బడ్జెట్ అలానే అనిపించింది. ఎన్నికలకు ముందు బడ్జెట్ కావడంతో చాలా మంది దాని కోసం ఆసక్తిగా ఎదురుచూశారు. అనుకున్నట్లుగా అది తాయిలాలూ తీసుకొచ్చింది. ప్రారంభంలో వాటిని చూడగానే పెళ్లికి ముందు జీవితంలా హాయిగా.. సంతోషంగా అనిపించింది సగటు మదుపరికి. అయితే వాటి లోతు తెలిసే సరికి పెళ్లి తర్వాత కనిపించే ఇబ్బందులు కనిపించాయి. మొత్తం మీద చూస్తే మాత్రం పరిపూర్ణమైన మగాడి జీవితంలా.. తీపి చేదు కలయికల మధ్యంతర బడ్జెట్.. మధ్యేమార్గంలో ఉన్నట్లు అనిపించింది. అందుకేనేమో స్టాక్ మార్కెట్ కూడా అందుకు తగ్గట్లుగానే తొలుత భారీ లాభాలు.. ఆ తర్వాత స్వల్ప నష్టాలు.. చివరకు ఓ మోస్తరు లాభాలతో ముగిసింది.

ఇది వినియోగాన్ని పెంచే బడ్జెట్ అనే చెప్పాలి. శుక్రవారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మూడు కీలక మార్పులు కనిపించాయి. రూ.5 లక్షల వరకు పన్ను రిబేటు ఇచ్చారు. దీని వల్ల వ్యక్తిగతంగా ఖర్చు చేసే ఆదాయం కూడా పెరుగుతుంది. ఇక రెండోది రైతులకు ప్యాకేజీ, వడ్డీ మినహాయింపులు.. వీటి వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఖర్చు చేసే ఆదాయాలు కూడా పెరుగుతాయి. ఇక స్థిరాస్తి, గృహ రంగానికిచ్చిన తాయిలాలు కూడా మొత్తం ఆర్థిక వ్యవస్థకు ముఖ్యంగా వినియోగదారు రంగానికి కొంత మేలు చేస్తాయి. రెండో గృహం మీద పన్ను మినహాయింపు, రెండు గృహాలకూ మూలధన పన్ను మినహాయింపు, అమ్ముడుపోకుండా ఉన్న ఫ్లాట్లపై రెండేళ్ల వరకు పన్ను మినహాయింపు ఇవ్వడం వంటి నిజంగా స్థిరాస్తికి ఊరటనిచ్చేవే.

రైతులకు ప్రకటించిన 'ప్రధాన్ మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి'(పీఎమ్ కిసాన్) పథకం వల్ల 2 హెక్టార్ల వరకు భూమి ఉన్న రైతులకు ఏటా రూ.6,000 నగదు మద్దతు లభిస్తుంది. ఈ నగదు మూడు సమాన వాయిదాల్లో వారికి అందజేస్తారు. దీని వల్ల గ్రామీణ వినియోగదారుల చేతుల్లోకి మరింత నగదు వచ్చి పడుతుందన్నమాట. జీఎస్‌టీ, పెద్దనోట్ల రద్దు వల్ల గత రెండేళ్లుగా గ్రామీణ, మధ్య తరగతి వర్గాల కొనుగోలు శక్తి బాగా తగ్గిందనే చెప్పాలి. తాజా పరిణామం వల్ల వినియోగదారు గిరాకీ తిరిగి పెరుగుతుంది. అంటే డాబర్ వంటి ఎఫ్‌ఎమ్‌సీజీ కంపెనీలకు ప్రోత్సాహకరంగా ఉంటుందన్నమాట. అదే సమయంలో ఎమ్‌జీఎన్ఆర్ఈజీఏ, గ్రామాల విద్యుదీకరణ వంటి గ్రామీణ

## విశ్లేషణ



సంస్కరణలు కూడా వినియోగాన్ని పెంచుతాయి. ఇంకా కనీస మద్దతు ధరలో 50 శాతం పెంపు; చిన్న, మధ్యస్థాయి రైతులకు పీఎమ్ కిసాన్ నిధి ఏర్పాటు, రెండు హెక్టార్ల కంటే తక్కువ ఉన్న రైతులకు ఆదాయ మద్దతు; రూ.20 లక్షల వరకు గ్రాట్యుటీపై పన్ను మినహాయింపు వంటివి కూడా వినియోగాన్ని పెంచేవే.

**ఇవన్నీ చూసిన స్టాక్ మార్కెట్ కూడా ఒక దశలో 520 పాయింట్ల లాభంతో దూసుకెళ్లింది. పెళ్లికి ముందు మగాడి జీవితంలా.**

అవును ఇవన్నీ నిజమే.. రైతులకు ప్రకటించిన పథకం సరిగ్గా అమలైతే 12 కోట్ల కుటుంబాలకు మేలు జరుగుతుంది. చిన్న, మధ్య స్థాయి కంపెనీ(ఎస్ఎమ్ఈ)లు, ఇతరుల కోసం ప్రకటించిన సంస్కరణలు కూడా సమాజానికి మంచి చేసేవే. అయితే ఆర్థిక వ్యవస్థకు ఇవన్నీ ఎంత మేలు చేస్తాయన్న కోణంలో నుంచి ఇపుడు చూద్దాం. బడ్జెట్‌లో అనుకున్నట్లుగా 2019-20లో ద్రవ్యలోటును 3.4 శాతానికి పరిమితం చేయడానికి ఈ సంస్కరణలు ఉపయోగపడతాయా అన్నదే ప్రశ్నార్థకంగామారింది.

**ఈ విషయాన్ని గ్రహించిన స్టాక్ మార్కెట్ కాస్తంత వెనక్కి తగ్గింది. భారీ లాభాల నుంచి ఒక దశలో స్వల్ప నష్టాలను చవిచూసింది. పెళ్లికి తర్వాత మగాడి జీవితంలా నిస్సారంగా అనిపించింది. కానీ..**

ఇపుడు మరింత లోతుగా ఆలోచిద్దాం. ద్రవ్యలోటు పరిమితంగా ఉండాలంటే ఆదాయ వసూళ్లు పెరగాలి. ముఖ్యంగా జీఎస్‌టీ వసూళ్లు బాగా కలిసి రావాలి. నేరుగా నగదు బదిలీ, పన్ను ఊరటల వల్ల కొనుగోలు శక్తి పెరుగుతుంది. వాహన, ఎఫ్‌ఎమ్‌సీజీ, మన్నికైన వస్తువులు, జౌళి వంటి రంగాలకు ఇది మేలు చేస్తుంది. ఈ ఏడాది కూడా జీఎస్‌టీ వసూళ్లపై ఆర్థిక మంత్రి ఆశావహంగానే ఉన్నారు. అయితే లక్ష్యం చేరుతారా లేదా అన్న అనుమానాలు ఉండనే ఉన్నాయి. ఆర్థిక మంత్రి ఉద్దేశం ప్రకారం.. తక్కువ రేట్ల వల్ల ఆదాయం పెరుగుతుంది. వినియోగమూ పెరుగుతుంది. పన్ను ఊరట వల్ల ఎక్కువ మంది పన్నులు కట్టడానికి ముందుకు వస్తారు.. తద్వారా పన్ను వసూళ్లూ పెరుగుతాయి. ఆదాయ పన్ను వసూళ్లు రూ.91,000 కోట్ల మేర పెరుగుతాయని బడ్జెట్‌లో అంచనా వేశారు. ఇక పెట్టుబడుల ఉపసంహరణ కూడా ఏ ఏడాదికా ఏడాది లక్ష్యానికి దూరంగానే కనిపిస్తోంది. ఈ సారి బైబ్యాక్‌లు, కొనుగోళ్లు, విలీనాల ద్వారా రూ.90,000 కోట్ల నిధుల సమీకరణ సాధ్యమవుతుందో లేదో చూడాలి. విచిత్రం ఏమిటంటే.. ఆర్‌బీఐ ద్వారా వచ్చే డివిడెండు(పన్నుయేతర ఆదాయం) కూడా ఎక్కువగానే ఉంది.

**వీటన్నిటిని పరిగణనలోకి తీసుకున్న మార్కెట్ చివరకు లాభాలతో ముగిసింది. పరిపూర్ణ జీవితాన్ని చూసిన మగాడిలా మీసం మెలేసింది.**

కానీ.. ఇవన్నీ పక్కన పెడితే.. స్థూల రుణాలు రూ.7.1 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఇది మార్కెట్‌పై ఒత్తిడిని తెచ్చే అంశం. వీటన్నిటిని పరిగణనలోకి తీసుకుని.. సంస్కరణల అమలును బట్టి.. వెలువడే స్థూల ఆర్థిక గణాంకాలను బట్టి స్టాక్ మార్కెట్ కదలికలు ఆధారపడి ఉంటుందని వేరే చెప్పనక్కర్లేదు కదా.

**మొత్తం మీద చూస్తే ఈ బడ్జెట్ మాత్రం ఎవరినీ ఎక్కువ సంతోష పెట్టలేదు. అలాగని మరీ విచారంలో మునిగిపోయేలానూ చేయలేదు.**

# ఎంతో బాగుంది



"గత అయిదేళ్లలో కేంద్ర ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చింది. నల్ల ధనంపై పోరాటం, పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీ అమలు... కొన్ని ఉదాహరణలు. దీనివల్ల ప్రభుత్వానికి పన్ను ఆదాయం పెరిగింది. అయిదేళ్ల క్రితం ప్రత్యక్ష, పరోక్ష పన్నుల రూపేణా ప్రభుత్వానికి సుమారు నెలకు రూ.1 లక్ష కోట్ల ఆదాయం వచ్చేది. కానీ ఇప్పుడు అది రూ.2 లక్షల కోట్లకు పెరిగింది. అంటే పన్నుల ఆదాయమే ఏటా రూ.24 లక్షల కోట్లకు చేరుకునే పరిస్థితి వచ్చిందన్నమాట. దీనివల్ల ఆర్థిక లోటును 3.4% లోపునకు పరిమితం చేయటానికి, సంక్షేమ పథకాలు చేపట్టాటానికి అవకాశం వచ్చింది. దానికి తగ్గట్లుగా ఈ బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం ఎన్నో ప్రతిపాదనలు తీసుకువచ్చింది. రైతులకు రూ.6,000 చొప్పున నగదు చెల్లింపు, అసంఘటిత రంగంలోని కార్మికులకు పింఛను పథకం, ప్రకృతి వైపరీత్యాల్లో నష్టపోయిన రైతులకు 2% వడ్డీ మినహాయింపు, చిన్న- మధ్యతరహా పరిశ్రమలకు వడ్డీ రాయితీ... ఎంతో మేలు చేసే ప్రతిపాదనలు. ఆదాయపన్ను విషయంలోనూ మధ్యతరగతి ప్రజలకు మేలు చేసే ప్రతిపాదనలు పొందుపరిచారు. బ్యాంకు డిపాజిట్ల మీద, అద్దె ఆదాయం మీద టీడీఎస్ పరిమితి పెంచటం పెద్ద ఊరట. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకుంటే ఈ బడ్జెట్ జనరంజకంగా ఉందని చెప్పవచ్చు. కాకపోతే ఈ బడ్జెట్‌లో తెలుగు రాష్ట్రాలకు మేలు చేసే ఎటువంటి ప్రతిపాదనా కనిపించ లేదు. ఇది తెలుగు రాష్ట్రాల ప్రజానీకాన్ని నిరాశకు గురిచేసింది."

- కె. నరసింహమూర్తి, ఆర్థిక,బ్యాంకింగ్ వ్యవహారాల నిపుణుడు, చార్టర్డ్ అకౌంటెంట్



# ఇల్లు కొంటే..

## ఎంతవరకు ప్రయోజనం

- మూలధన లాభంతో రెండిళ్లపై పెట్టుబడికి వీలు
- రెండో ఇంటినీ వాడుకుంటే అద్దెపై పన్ను మాఫీ
- అందుబాటు ధర ఇళ్లకు మినహాయింపులు కొనసాగింపు

**స్థిరాస్తి రంగానికి ప్రతిపాదించిన రాయితీలు ఇల్లు కొనుగోలుదార్లు, అభివృద్ధిదార్లకూ ప్రయోజనకరంగా భావిస్తున్నారు. అభివృద్ధిదార్లతో పాటు ఏదైనా ఆస్తి అమ్మినపుడు వచ్చే మూలధన లాభంతో ఇల్లు కొనుగోలు చేయాలనుకున్న వారికి, రెండో ఇంటినీ సొంత అవసరాలకు వినియోగించుకుంటున్న వారికి ప్రోత్సాహకాలు ప్రతిపాదించారు.**

కేంద్ర ఆర్థిక మంత్రి తాజా బడ్జెట్‌లో స్థిరాస్తి రంగానికి పలు ప్రోత్సాహకాలను ప్రకటించారు. స్థిరాస్తి అమ్మకంపై లభించే రూ.2 కోట్ల వరకు మూలధన లాభంతో ఇప్పటివరకు ఒక ఇల్లు కొనుగోలుపైనే మినహాయింపు ఇస్తుండగా, ఇకపై రెండిళ్ల కొనుగోలుకు ఈ మొత్తాన్ని వినియోగించవచ్చని తాజా బడ్జెట్‌లో ప్రతిపాదించారు. అయితే జీవితకాలంలో ఒకసారి మాత్రమే ఈ ప్రయోజనం పొందవచ్చన్న నిబంధన విధించారు. అంటే ఇప్పటికే ఈ విధంగా చేసిన వారికి ప్రయోజనం ఉండదు. భవిష్యత్తులో ఏదైనా ఆస్తి విక్రయించి, మరొకటి కొందామనుకునే వారికీ ఒక్కసారికే వీలుంటుంది. అందువల్ల రూ.2 కోట్ల వరకు మూలధన లాభంపై రెండిళ్లు కొనుగోలు చేసుకునేందుకు వీలు కల్పిస్తున్నా, ప్రయోజనం పరిమితంగా ఉంటుందనే భావనను సీనియర్ ఛార్టర్డ్ అకౌంటెంట్ సీటీ చౌదరి వ్యక్తం చేశారు.

### ఈ కారణాల వల్లా..

స్థిరాస్తుల విక్రయంలో రిజిస్ట్రేషన్ విలువ, మార్కెట్ విలువ మధ్య తేడా అధికంగా ఉంటోంది. రిజిస్ట్రేషన్ విలువను మాత్రమే అధికారికంగా చూపుతుంటారు. అంటే ఎకరం భూమి లేదా ఇంటిని రూ.కోటికి విక్రయించినా, ఆ ప్రాంతంలోని రిజిస్ట్రేషన్ విలువ రూ.10 లక్షలుంటే, ఈ మొత్తాన్నే అధికారికంగా చూపుతుంటారు. ఇందు వల్ల కొత్తగా ఇళ్ల కొనుగోలుకు అధికారికంగా చూపలేకపోతున్నారు.

**పరిస్థితి మారుతుందేమో:** తాజా నిబంధన ప్రకారం, స్థిరాస్తుల విక్రయంపై లభించిన రూ.2 కోట్ల వరకు మూలధన లాభంతో రెండిళ్లు కొనుగోలు చేసుకునేందుకు/ నిర్మించుకునేందుకు కూడా వీలున్నందున, విక్రయమొత్తాన్ని అధికారికంగా చూపేందుకు ముందుకు వస్తే, ఈ రంగంలో పారదర్శకత పెరగొచ్చు.

### అద్దెపై పన్ను మాఫీ

రెండిళ్లు ఉన్న వారు, ఒక ఇంట్లో నివశిస్తూ, మరొకదాంట్లో తమ తల్లిదండ్రులు/కుటుంబీకులను ఉంచడమో చేస్తుంటారు. రెండో ఇంటినీ ఇలా సొంత అవసరాలకు వినియోగించుకుంటున్నా, దానిపై ఆదాయమేమీ పొందకున్నా, దీనిపై అద్దె వస్తున్నట్లే (ఆదాయంగా) పరిగణిస్తూ, పన్ను వసూలు చేస్తున్నారు. ఇందుకు ఆ ప్రాంత మున్సిపాలిటీ/నగర పాలక సంస్థ వంటి స్థానిక ప్రభుత్వాలు నిర్ణయించే అద్దె విలువను ప్రామాణికంగా తీసుకుంటున్నారు. ఈ పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలన్నది తాజా బడ్జెట్ ప్రతిపాదన.

✦ ఏ వర్గం వారికైనా ఇది మేలు చేసే అంశమే. ముఖ్యంగా ఒక ఇంటిలో తల్లిదండ్రులు/భార్యాపిల్లలను ఉంచి, బదిలీపై వెళ్లిన మరొక ప్రాంతంలో కూడా ఇల్లు/ఫ్లాట్ కొనుగోలు చేసుకుంటున్న మధ్యతరగతి వర్గీయులకు పన్ను భారం తగ్గుతుంది. తగిన వనరులుండి, కుటుంబ అవసరాల కోసం మరో ఇల్లు కొందామన్నా, పన్నుపై ఆందోళన చెందుతున్న కూడా ధైర్యంగా ముందడుగు వేసేందుకు ఉపకరిస్తుంది. తమ కుటుంబం కోసం వారుంటున్న ప్రాంతంలోనే ఇల్లు కొనిపెట్టేందుకు కారణమై, పరోక్షంగా చిన్న పట్టణాలు, నగరాలలోనూ ఇళ్లు/ఫ్లాట్ల అమ్మకాలకు దోహద పడుతుంది.

### వాణిజ్య సంస్థలకు అద్దెకిస్తేనే టీడీఎస్

వేరే వారికి బాడుగకు ఇచ్చిన ఇంటిపై అద్దె రూపంలో వచ్చే ఆదాయంపై, మూలం వద్దే పన్ను వసూలు చేసే (టీడీఎస్) పరిమితిని రూ.1.80 లక్షల నుంచి రూ.2.4 లక్షలకు పెంచారు. అంటే నెలకు రూ.20,000 వరకు అద్దె వచ్చినా, టీడీఎస్ వసూలు చేయాల్సిన అవసరం ఉండదు. అయితే ఇది గృహావసరాలకు అద్దెకు ఇచ్చే ఇంటిపై వర్తించదు. కేవలం వాణిజ్య సంస్థలకు అద్దెకు ఇచ్చినపుడు, మాత్రమే వార్షిక అద్దె పరిమితి మించినపుడు, టీడీఎస్ కోత విధించి, చెలించాల్సిన బాధ్యత అద్దెదారుడిపై ఉంటుంది. గృహావసరాల కోసం ఇచ్చిన ఇంటిపై అద్దెగా రూ.25 వేలు తీసుకున్నా, టీడీఎస్ మినహాయించ నవసరం లేదు. ఇంటి యజమానే పన్ను చెల్లించాలి.

### అందుబాటు ధర ఇళ్లకు ప్రోత్సాహకాలు

అందుబాటు ధర ఇళ్ల ప్రాజెక్టుల అభివృద్ధిదార్లకు ఆదాయపు పన్ను చట్టం, సెక్షన్ 80 ఐబీఏ కింద ప్రోత్సాహకాలు మరో ఏడాది పాటు కొనసాగనున్నాయి. 2019-20 మార్చి 31 వరకు ఆమోదం పొందే ప్రాజెక్టులకూ ప్రస్తుత రాయితీలు కొనసాగించాలని ప్రతిపాదించారు. మహా నగరాల్లో 30 చదరపు మీటర్లు, మిగిలిన ప్రాంతాల్లో 60 చదరపు మీటర్లలోపు కార్పెట్ ఏరియాలో నిర్మించే ఇళ్లు/ఫ్లాట్లు నిర్మించేవారు ఆర్జించే లాభాల్లో 100 శాతం మినహాయింపులు ఉన్నాయి. ఈ ఇళ్ల కొనుగోలుకు రుణం ఆధారిత సబ్సిడీతో పాటు, ఆదాయపు పన్ను మినహాయింపులూ దోహద పడనున్నాయి.

### విక్రయం కాని ఫ్లాట్ల అద్దె ఆదాయంపై

ఈ ప్రాజెక్టుల్లో అమ్ముడుపోని ఇళ్లు/ఫ్లాట్లపై అద్దెగా పరిగణించిన ఆదాయానికి పన్ను విధిస్తుండటం స్థిరాస్తి సంస్థలకు భారంగా మారింది. వాస్తవానికి వీటిని అద్దెకు ఇవ్వకున్నా, రాని ఆదాయంపై పన్ను చెల్లించాల్సి వస్తోంది. ఇలాంటి ఆదాయంపై పన్నుకు ఏడాది పాటు మినహాయింపు ఉండగా, రెండేళ్ల పాటు మినహాయింపు ఇవ్వాలని ప్రతిపాదించడం ఈ రంగానికి భారీ ఊరటే.


- ఈనాడు వాణిజ్య విభాగం

# పారిశ్రామిక వర్గాలు ఖుషీ



ఆర్థిక వ్యవస్థ వృద్ధికి ఉత్ప్రేరకంగా పనిచేసే కీలక అంశాలను బడ్జెట్ స్పృశించింది. ప్రధాన వినియోగ వర్గాలైన మధ్యతరగతి, రైతులు, అసంఘటిత వ్యవస్థలోని కార్మికుల ఆదాయ స్థితిని పెంచేలా బడ్జెట్లో నిర్ణయాలు ఉన్నాయి.

- చంద్రజిత్ బెనర్జీ, డైరెక్టర్ జనరల్, సీఐఐ



మధ్యతరగతి, రైతులు, లక్షలాది మంది వేతన జీవులకు ప్రకటించిన ఎన్నో ప్రోత్సాహకాల కలయిక ఈ బడ్జెట్. వినియోగదారు విశ్వాసం పెరిగి.. గిరాకీ పెరిగేందుకు ఇది తోడ్పడుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి చేసిన కేటాయింపులు, రైతుల ఆదాయ వృద్ధికి తీసుకున్న నిర్ణయాలు వ్యవసాయ ఆర్థిక స్థితికి ఉత్ప్రేరకంగా పనిచేస్తాయి.

- సునీల్ దుగ్గల్, సీఈఓ, డాబర్ ఇండియా



ఆర్థిక వ్యవస్థకు మేలు చేసే బడ్జెట్ ఇది. బడ్జెట్లో తీసుకున్న నిర్ణయాలు వినియోగం పుంజుకునేందుకు తోడ్పడుతాయి. ముఖ్యంగా రైతులు, గ్రామీణ ప్రాంత ప్రజలు, మధ్యతరగతి వర్గానికి మేలు జరుగుతుంది.

- సంజీవ్ పురి, ఎండీ, ఐటీసీ



బడ్జెట్లో తీసుకున్న నిర్ణయాలు వ్యవసాయ ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తాయి. రైతు పెట్టుబడి పథకం స్వాగతించాల్సిన విషయం. చిన్న, సన్నకారు రైతులకు ఇది మేలు చేకూరుస్తుంది. ఆదాయపు పన్ను రిబేట్‌ను పెంచడం వల్ల మధ్యతరగతిపై పన్ను భారం తగ్గడమే కాకుండా, పన్ను పరిధిలోకి మరింత మంది వచ్చేందుకు తోడ్పడుతుంది.

- సౌగటా గుప్తా, సీఈఓ, మారికో



వినియోగదారు ప్రాధాన్య బడ్జెట్ ఇది. ఎఫ్‌ఎమ్‌సీజీ రంగ వృద్ధికి అవసరమైన తోడ్పాటును ఇది అందిస్తుందని భావిస్తున్నాం. ద్రవ్యలోటుకు ఎలాంటి ఇబ్బంది కలగకుండానే వృద్ధికి, ప్రజలకు మేలు చేకూర్చడమే తమ అభిమతమని బడ్జెట్ నిర్ణయాలతో ప్రభుత్వం పునరుద్ఘాటించింది.

- వివేక్ గంభీర్, సీఈఓ, గోద్రేజ్ కన్జూమర్ ప్రోడక్ట్స్



ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని పెంచడంతో మధ్యతరగతి ప్రజల చేతిలో మరింత డబ్బు మిగులుతుంది. దీంతో వినియోగం పెరిగి రిటైల్ రంగానికి ప్రయోజనం కలుగుతుంది.

- కుమార్ రాజగోపాలన్, సీఈఓ, రిటైలర్స్ అసోసియేషన్

స్థిరాస్తి రంగానికి ప్రయోజనం కలిగేలా బడ్జెట్లో నిర్ణయాలు ఉన్నాయి. నిర్మాణదారులకే కాదు పన్ను చెల్లింపుదార్లు, పెట్టుబడిదార్లు ఇలా మూడు వర్గాలకు మేలు చేకూర్చేందుకు బడ్జెట్ ద్వారా ప్రభుత్వం ప్రయత్నించినట్లు కనిపిస్తోంది.

- అనుజ్ పురి, అనరాక్ ప్రోపర్టీ కన్సల్టెంట్



రైతుల ఆదాయ స్థితిని మెరుగుపర్చేలా బడ్జెట్లో ప్రతిపాదనలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతం, మధ్యతరగతి లాంటి సరైన వర్గాలపై బడ్జెట్ దృష్టి పెట్టింది.

- క్రిష్ అయ్యర్, సీఈఓ, వాల్‌మార్ట్ ఇండియా

# వైద్య రంగానికి ప్రోత్సాహం



"ఆరోగ్య భారత్‌ను నిర్మించే దిశగా వైద్య సేవల రంగం విస్తరణకు కట్టుబడినట్లు ఈ బడ్జెట్ స్పష్టం చేస్తోంది. నగరాల్లో ఎటువంటి వైద్య సేవలు లభిస్తున్నాయో... అదే స్థాయి సేవలు గ్రామీణ ప్రాంతాల్లోనూ కల్పించాలనేది తమ లక్ష్యమని... అందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వం వివరించింది. ఈ దిశగా ఆస్పత్రులను బలోపేతం చేయటం తప్పనిసరి. పట్టణాల్లో మాదిరిగానే గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు అందుబాటులోకి తీసుకురావటానికి ప్రైవేటు రంగ వైద్య సేవల సంస్థలను ప్రోత్సహించాల్సి ఉంటుంది. కృత్రిమ మేధను ప్రోత్సహించటానికి ప్రభుత్వం సిద్ధపడటం మరొక సానుకూలత. ప్రభుత్వ నిర్ణయం వైద్య రంగానికి ఎంతో మేలు చేసేదిగా చెప్పవచ్చు.

- సంగీతా రెడ్డి, సంయుక్త ఎండీ, అపోలో హాస్పిటల్స్

# కృత్రిమ మేధకు పెద్దపీట

## తెలుగు రాష్ట్రాల్లో ఐటీ, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలకు మేలు

ఐటీ రంగానికి మేలు చేసే ప్రతిపాదనలు కొన్ని ప్రస్తుత బడ్జెట్‌లో ఉండటంతో హైదరాబాద్, విశాఖ పట్టణం కేంద్రంగా ఐటీ రంగంలో కార్యకలాపాలు సాగిస్తున్న కంపెనీలకు లబ్ధి చేకూరుతుందని సంబంధిత వర్గాలు అంచనా వేస్తున్నాయి. ముఖ్యంగా ఐటీ రంగంలో హైదరాబాద్ క్రియాశీలకంగా ఉన్న విషయం విదితమే. ఎగుమతుల పరంగా బెంగుళూరు తర్వాత అగ్రస్థానంలో హైదరాబాద్ ఉంది. వార్షిక ఎగుమతులు రూ.1 లక్ష కోట్లకు చేరువయ్యాయి. ఎన్నో దేశ, విదేశీ ఐటీ కంపెనీలు ఇక్కడి నుంచి కార్యకలాపాలు సాగిస్తున్నాయి. మరోపక్క విశాఖపట్టణంలో ఐటీ కంపెనీల కార్యకలాపాలు విస్తరిస్తున్నాయి. అదే సమయంలో తిరుపతి చుట్టుపక్కల మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, విడిభాగాల తయారీ బాగా పెరిగింది. ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లోని ఐటీ, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ వర్గాలు ఈ బడ్జెట్‌ను తమదైన కోణంలో విశ్లేషిస్తున్నాయి.

### ఇవీ కొన్ని ఆకర్షణలు

- ✦ కేంద్ర ప్రభుత్వం డిజిటల్ విప్లవాన్ని గ్రామాలకు తీసుకువెళ్లాలని అనుకుంటోంది. ఇందులో భాగంగా వచ్చే అయిదేళ్లలో లక్ష గ్రామాలను డిజిటల్ గ్రామాలుగా అభివృద్ధి చేయనున్నట్లు కేంద్ర మంత్రి పియూష్ గోయల్ ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించారు.
- ✦ మేక్ ఇన్ ఇండియాకు పెద్దపీట వేసిన ఫలితంగా దేశంలో మొబైల్ ఫోన్లు, విడిభాగాలు తయారు చేసే సంస్థల సంఖ్య 2 నుంచి 268కి పెరిగినట్లు మంత్రి వివరించారు.
- ✦ దేశంలో 3 లక్షలకు పైగా కామన్ సర్వీస్ సెంటర్లు (సీఎస్ఈ) ప్రజలకు డిజిటల్ సేవలు అందిస్తున్నట్లు, ఈ సెంటర్లలో 12 లక్షల మంది ఉద్యోగులు ఉన్నట్లు పేర్కొన్నారు.
- ✦ డిజిటల్ విప్లవానికి ఇవి సంకేతాలని అభిప్రాయపడ్డారు.

**కృత్రిమ మేధ జాతీయ కేంద్రం:** కృత్రిమ మేధ, దానికి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానం శరవేగంగా విస్తరిస్తోంది. దీంతో ఈ సాంకేతిక పరిజ్ఞానం ఫలాలను సామాజ్య ప్రజల చెంతకు చేర్చాలని ప్రభుత్వం భావిస్తోంది. దీని కోసం కృత్రిమ మేధ జాతీయ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తన బడ్జెట్ ప్రసంగంలో మంత్రి పియూష్ గోయల్ వెల్లడించారు. ఇందులో భాగంగా కృత్రిమ మేధ జాతీయ కేంద్రాన్ని నెలకొల్పుతారు. దీనికి అనుబంధంగా మరికొన్ని 'సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ఏర్పాటు చేస్తారు. కృత్రిమ మేధకు సంబంధించి తొమ్మిది ప్రాధాన్యతాంశాలను గుర్తించారు. 'నేషనల్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ పోర్టల్' ను త్వరలో రూపొందిస్తారు.

- ఈనాడు, హైదరాబాద్

### సాంకేతిక పరిజ్ఞానానికి పెద్ద పీట

సాంకేతిక పరిజ్ఞానం అమలు, విస్తరణకు ఈ బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఒక లక్ష డిజిటల్ గ్రామాల అభివృద్ధి, ఎలక్ట్రానిక్ టాక్స్ రిటర్న్ ఎసెస్‌మెంట్ విధానం, కస్టమ్స్ లావాదేవీల డిజిటలీకరణ, డిజిటల్ సేవలు అందించే విధంగా కామన్ సర్వీస్ సెంటర్ల (సీఎస్ఈ) కు మద్దతు ఆహ్వానించదగ్గ ప్రతిపాదనలు. కృత్రిమ మేధ జాతీయ కేంద్రం ఏర్పాటు వల్ల కృత్రిమ మేధ సాంకేతిక పరిజ్ఞానం, అమలు, విస్తరణలో దేశం ఎంతో ముందంజ వేసే అవకాశం కలుగుతుంది.


- బీవీఆర్ మోహన్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్, సైయెంట్


### సరైన నిర్ణయం

నేషనల్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ పోర్టల్' ను రూపొందించాలనేది ఎంతో సరైన నిర్ణయం. ఐటీ రంగం అభివృద్ధికి దోహదపడే ఎన్నో ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో పొందుపరచింది. లక్ష డిజిటల్ గ్రామాల అభివృద్ధి, కృత్రిమ మేధ జాతీయ కేంద్రం ఏర్పాటు ఈ కోవలోనివే. అయితే ఈ నిర్ణయాలు ఏ విధంగా అమలు అవుతాయి, ఏమేరకు నిధులు కేటాయిస్తారు- అనేది చూడాలి. మొత్తం మీద ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగాన్ని ప్రోత్సహించేదిగా ఈ బడ్జెట్ ఉంది.

- ఇ.సుమన్‌రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్, పెగాసిస్టమ్స్ ఇండియా










ఎన్నికల వేళ జనాకర్షక పథకాలకు పెద్దపీట వేయొచ్చని ఊహించాను. ఆర్థిక వ్యవస్థ ద్రవ్యస్థితికి ఇబ్బంది కలగకుండా చూసుకుంటూనే.. కీలక వర్గాలైన రైతులు, మధ్యతరగతికి ఊరటనిచ్చే నిర్ణయాలు తీసుకోవడం హర్షణీయం.


– ఆనంద్ మహీంద్రా, ఛైర్మన్, మహీంద్రా గ్రూపు

దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి రైతులు, మధ్య తరగతి వర్గం, చిన్న వ్యాపారులే ప్రధానం. వీళ్ల ఆకాంక్షలను బడ్జెట్ ప్రతిబింబించింది. ఇందులో తీసుకున్న నిర్ణయాలతో కోట్లాది మంది ప్రజల కలలు నెరవేరుతాయని భావిస్తున్నాను.

– గౌతమ్ అదానీ, ఛైర్మన్, అదానీ గ్రూపు






# నచ్చినట్లే..!

## బడ్జెట్ తర్వాత సూచీల దూకుడు
## అనంతరం లాభాల స్వీకరణ
## 550 పాయింట్లు ఊగిసలాడిన మార్కెట్
## వాహన, ఎఫ్‌ఎమ్‌సీజీ షేర్ల మెరుపులు

**తాత్కాలిక బడ్జెట్ మార్కెట్లను మెప్పించింది. బడ్జెట్‌లో ప్రకటించిన నిర్ణయాలతో వినియోగం పెరగొచ్చన్న అంచనాలతో మార్కెట్లు పరుగులు తీశాయి. అయితే మార్కెట్ల లాభాల జోరుకు చివర్లో కళ్లెం పడింది. పన్ను ప్రోత్సాహకాలతో ద్రవ్యలోటు కట్టడి కష్టతరం కావొచ్చన్న విశ్లేషణలు లాభాల స్వీకరణకు దారితీసింది. ఒకదశలో మార్కెట్లు నష్టాల్లోకి సైతం చేరాయి. చివర్లో మళ్లీ పుంజుకుని లాభాల్లో ముగిశాయి. ముఖ్యంగా స్థిరాస్తి, వాహన, ఎఫ్‌ఎమ్‌సీజీ షేర్ల కొనుగోళ్లతో కళకళలాడాయి. అంతర్జాతీయంగా చూస్తే.. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగియగా, ఐరోపా షేర్లు లాభాల్లో ట్రేడయ్యాయి.**

### ● బడ్జెట్‌కు ముందు

సెన్సెక్స్ ఉదయం 36,311.74 పాయింట్ల వద్ద మెరుగ్గానే ప్రారంభమైంది. అనంతరం అదే జోరు కొనసాగించిన సూచీ.. ఉదయం 11 గంటలకు బడ్జెట్ ప్రసంగం ప్రారంభమయ్యే సమయానికి 130 పాయింట్ల లాభంతో ట్రేడవుతోంది.

### ● ప్రసంగ వేళ

పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రసంగం ప్రారంభమైన తర్వాత కూడా సెన్సెక్స్ దూకుడు కొనసాగింది. మధ్యతరగతికి ఉపశమనం లభించే విధంగా పీయూష్ గోయల్ ప్రకటించిన చర్యలు మదుపర్లను మెప్పించాయి. రూ.5 లక్షల లోపు ఆదాయంపై పన్ను మినహాయింపు, స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.40000 నుంచి రూ.50000కు పెంచడం కలిసొచ్చింది.

### ● అనంతరం

బడ్జెట్ అనంతరం సూచీలు లాభాలతో కళకళలాడాయి. 36,778.14 పాయింట్ల వద్ద సెన్సెక్స్ ఇంట్రాడే గరిష్ఠాన్ని తాకింది. అయితే చివరి గంటన్నర ట్రేడింగ్‌లో మదుపర్లు లాభాలను స్వీకరించడంతో సూచీ నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 36,221.32 పాయింట్లకు పడిపోయిన సెన్సెక్స్.. మళ్లీ కోలుకుంది. 212.74 పాయింట్ల లాభంతో 36,469.43 వద్ద ముగిసింది. ఇక సెన్సెక్స్ సైతం 62.70 పాయింట్లు పెరిగి 10,893.65 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,813.45- 10,983.45 పాయింట్ల మధ్య కదలాడింది.

**డీహెచ్‌ఎఫ్‌ఎల్ నష్టాల్లోనే:** డీహెచ్‌ఎఫ్‌ఎల్ షేర్లకు వరుసగా అయిదో రోజూ అమ్మకాలు వెల్లువెత్తాయి. ఇంట్రాడేలో 23.92 శాతం కోల్పోయిన షేరు రూ.103.35 వద్ద ఏడాది కనిష్ఠానికి చేరింది. చివరకు 17.96 శాతం నష్టంతో రూ.111.45 వద్ద ముగిసింది. గత 5 సెషన్లలో కంపెనీ మార్కెట్ విలువ రూ.3067.44 కోట్లు తగ్గింది.



- ✦ బలహీన త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో వేదాంతా షేర్లు కుప్పకూలాయి. ఇంట్రాడేలో 19.82 శాతం నష్టపోయిన షేరు రూ.158.35 వద్ద 52 వారాల కనిష్ఠానికి చేరింది. చివరకు 17.82 శాతం తగ్గి రూ.162.30 దగ్గర స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.13083.9 కోట్లు తగ్గి రూ.60,330.10 కోట్లకు చేరింది.
- ✦ బడ్జెట్‌లో పన్ను ప్రోత్సాహకాలు ప్రకటించడంతో స్థిరాస్తి షేర్లు రాణించాయి. ఫీనిక్స్ మిల్స్, ఒబెరాయ్ రియాల్టీ, ఐబీ రియల్ ఎస్టేట్, శోభా, గోద్రేజ్ ప్రోపర్టీస్, డీఎల్‌ఎఫ్ షేర్లు 3.66% వరకు లాభాలు నమోదు చేశాయి.

## ఏ నిర్ణయం ఏ షేర్లపై

| ప్రతిపాదన | | ప్రభావిత షేర్లు |
|---|---|---|
| ప్రధానమంత్రి కిసాన్ యోజన కింద రైతులకు ఏడాదికి రూ.6000 | ✔ | ఐటీసీ, హెచ్‌యూఎల్, మారికో, డాబర్ |
| రక్షణ రంగానికి రూ.3.05 లక్షల కోట్లు | ✔ | వాల్‌చంద్‌నగర్, భారత్ ఎలక్ట్రానిక్స్, బీఈఎంఎల్, భారత్ డైనమిక్స్ |
| ఏడాదికి రూ.2.4 లక్షల వరకు గృహాల అద్దెపై టీడీఎస్‌లేదు | ✔ | హెచ్‌డీఎఫ్‌సీ, ఐబీ హౌసింగ్, ఎల్‌ఐసీ హౌసింగ్, గృహ ఫైనాన్స్ |
| జాతీయ విద్యామిషన్‌కు రూ.38,572 కోట్లు | ✔ | ఎన్‌ఐఐటీ, జీ లెర్న్, ఆప్‌టెక్ |
| సాగరమాల ప్రాజెక్ట్ విస్తరణ | ✔ | ఎల్ అండ్ టీ, అదానీ పోర్ట్స్, సీమెన్స్ |
| విద్యుత్ వాహన వినియోగం పెంచడానికి ప్రాధాన్యం | ✔ | మారుతీ, మహీంద్రా, హిందూ మోటార్స్ |
| సినిమాల నిర్మాణం అనుమతికి ఏక గవాక్ష విధానం | ✔ | జీ ఎంటర్‌టైన్‌మెంట్, సన్‌టీవీ, పీవీఆర్ |
| ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజనకు రూ.19000 కోట్లు | ✔ | ఎన్‌సీసీ, దిలీప్ బిల్డ్‌కాన్, ఐఆర్‌బీ |
| గ్రామీణ భారత్‌లో 98% మరుగుదొడ్ల నిర్మాణం | ✔ | కజారియా, సెరా, హెచ్‌ఎస్‌ఐఎల్ |
| ఉజ్వల యోజన కింద మరో 8 కోట్ల ఎల్‌పీజీ కనెక్షన్లు | ✔ | రిలయన్స్, ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ |
| ప్రధానమంత్రి కిసాన్ సమన్ యోజన కింద రైతులకు రూ.75000 కోట్ల ప్యాకేజీ | ✔ | ఎస్కార్ట్స్, వీఎస్‌టీ టిల్లర్స్, హెచ్‌ఎంటీ |
| పశుసంవర్ధక, మత్స్య శాఖలకు 2% వడ్డీ రాయితీ | ✔ | అవంతీ ఫీడ్స్ |
| ఆయుష్మాన్ భారత్‌తో 10 లక్షల మందికి చికిత్స | ✔ | అపోలో, ఫోర్టిస్, నారాయణా హృదయాలయ |
| ఇళ్ల కొనుగోలుదార్లకు జీఎస్‌టీ మినహాయింపుపై సమీక్ష | ✔ | డీఎల్‌ఎఫ్, గోద్రేజ్ ప్రోపర్టీస్, ఒబెరాయ్ రియాల్టీ |
| డేటా వినియోగం 5 ఏళ్లలో 50 రెట్లు పెరిగింది | ✔ | భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్, టాటా కమ్యూనికేషన్స్ |

## ఎయిరిండియాకు రూ.3,900 కోట్లు

**దిల్లీ:** ఎయిరిండియా రుణాలు బదిలీ అయిన స్పెషల్ పర్పస్ వెహికల్‌కు బడ్జెట్లో రూ.3,900 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఎయిరిండియా రుణ పునర్‌వ్యవస్థీకరణ ప్రక్రియలో భాగంగా ఎయిరిండియా అసెట్ హోల్డింగ్ పేరుతో స్పెషల్ పర్పస్ వెహికిల్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. దీని కోసం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1,300 కోట్లు ఇవ్వాలని బడ్జెట్లో ప్రతిపాదించింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.2,600 కోట్లను ఇవ్వాలని నిర్ణయించింది. ఈ రెండింటికి కలిపి మొత్తంగా రూ.3,900 కోట్ల కేటాయింపులు చేయనుంది. ప్రస్తుతం ఎయిరిండియాకు రూ.55,000 కోట్ల మేర రుణ భారం ఉందని అంచనా. ఇందులో రూ.29,000 కోట్లను ఎయిరిండియా అసెట్ హోల్డింగ్‌కు బదిలీ చేశారు.

## ఎంఎస్ఎమ్ఈలకు..

**దిల్లీ:** వచ్చే ఆర్థిక సంవత్సరానికి సూక్ష్మ, చిన్న, మధ్య, తరహా సంస్థల (ఎంఎస్ఎమ్ఈ) మంత్రిత్వ శాఖకు రూ.7,011.29 కోట్లను బడ్జెట్లో కేటాయించారు. గతంలో ఎన్నడూ కూడా ఎంఎస్ఎమ్ఈ శాఖకు ఈ స్థాయిలో కేటాయింపులు చేయకపోవడం గమనార్హం. అలాగే ఎంఎస్ఎమ్ఈ మంత్రిత్వ శాఖ వ్యయ అంచనాలను రూ.6,552.61 కోట్లుగా సవరించారు. ప్రధాన మంత్రి ఉద్యోగ కల్పన పథకానికి (పీఎంఈజీపీ) కూడా రికార్డు స్థాయిలో రూ.2,327 కోట్లను కేటాయించారు. వ్యవసాయేతర రంగాల్లో సుస్థిర ఉద్యోగాల సృష్టిపై ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు ఇది నిదర్శనమని ఎంఎస్ఎమ్ఈ మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

## ఒకటే స్టాంప్ డ్యూటీ రేటు

**దిల్లీ:** ఆర్థిక సెక్యూరిటీల లావాదేవీలన్నింటికీ ఒకటే స్టాంప్ డ్యూటీ రేటు విధించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. మధ్యంతర బడ్జెట్ అనంతరం ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ ప్రవేశపెట్టిన 2019-20 ద్రవ్యబిల్లులో భాగంగా ఈ ప్రతిపాదన చేశారు. ఆర్థిక సెక్యూరిటీల లావాదేవీలపై విధించే, వసూలు చేసే స్టాంప్ డ్యూటీకి సంబంధించి సంస్కరణలు తీసుకొని వస్తామని గతేడాది ప్రభుత్వం హామీ ఇచ్చిందని మంత్రి గుర్తు చేశారు. ఈ ప్రతిపాదనకు తగ్గట్లుగా ఇండియన్ స్టాంప్ డ్యూటీలో సవరణలు చేశారు. ప్రతిపాదిత సవరణలు లావాదేవీలపై స్టాంప్ డ్యూటీ విధింపు, వసూలు ప్రక్రియను సులభతరం చేస్తాయని మంత్రి చెప్పారు. దేశవ్యాప్తంగా ఒకటే స్టాంప్ డ్యూటీ ఉంచాలని ప్రతిపాదించడం వల్ల వ్యవస్థాగత, విధానపరమైన చిక్కులు తొలుగుతాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ ఎండీ, సీఈఓ ధీరజ్ రెల్లి తెలిపారు. ఒకటే స్టాంప్ డ్యూటీ కోసం బ్రోకరేజీ పరిశ్రమ అడుగుతోందని చెప్పారు.

# ఉపసంహరణ లక్ష్యం రూ.90,000 కోట్లు!


### ● వచ్చే ఆర్థిక సంవత్సరంలో..

**దిల్లీ:** కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల్లో (సీపీఎస్ఈ), వాటాల విక్రయం ద్వారా వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.90,000 కోట్లు సమీకరించాలని తాత్కాలిక బడ్జెట్‌లో ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. వాస్తవానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.80,000 కోట్ల లక్ష్యాన్ని నిర్ణయించుకున్నా, ఇప్పటివరకు రూ.35,100 కోట్లు మాత్రమే సమకరించగలిగింది. మిగిలిన రూ.44,000 కోట్లు వచ్చే రెండు నెలల్లో సమీకరించగలమనే విశ్వాసాన్ని ప్రభుత్వం వ్యక్తం చేస్తోంది. ప్రజాధనంతో నడుస్తున్న సీపీఎస్ఈలు మరింత జవాబుదారీతనంతో వ్యవహరించేందుకు ఈ ప్రక్రియ ఉపయోగ పడుతుందని ప్రభుత్వం పేర్కొంటోంది. ప్రస్తుతం 57 సీపీఎస్ఈలు స్టాక్‌మార్కెట్లో నమోదై ఉన్నాయి. వీటి మొత్తం మార్కెట్ విలువ రూ.13 లక్షల కోట్లుగా ఉంది. 2017-18లో కొన్ని సంస్థల్లో వాటాల ఉపసంహరణ ద్వారా ప్రభుత్వం రూ.లక్ష కోట్లకు పైగా సమీకరించగలగడం గమనార్హం.

సీపీఎస్ఈల వాటాల విక్రయంలో 45-55 శాతం వాటా జనవరి-మార్చిలోనే జరిగిందని పెట్టుబడులు, ప్రజాఆస్తుల నిర్వహణ (దీపమ్) కార్యదర్శి అతాను చక్రవర్తి పేర్కొన్నారు. అందువల్ల ఈ ఆర్థిక సంవత్సర లక్ష్యమైన రూ.80,000 కోట్లను సమీకరించగలమనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

### ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో

- ✦ ఆర్ఐటీఈఎస్ (రూ.460 కోట్లు), ఇర్కాన్ ఇంటర్నేషనల్ (రూ.470 కోట్లు), గార్డెన్‌రీచ్ షిప్‌బిల్డర్స్ (రూ.345 కోట్లు) సంస్థలు తొలి పబ్లిక్ ఆఫర్‌కు వచ్చాయి.
- ✦ సీపీఎస్ఈ ఈటీఎఫ్ మూడోవిడత కింద రూ.17,000 కోట్లు, భారత్ 22 ఈటీఎఫ్‌పై రూ.8,300 కోట్లు సమీకరించారు.
- ✦ భెల్ (రూ.1628 కోట్లు), కొచ్చిన్ షిప్‌యార్డ్ (రూ.200 కోట్లు), నాల్కో (రూ.505 కోట్లు), ఎన్ఎల్‌సీ (రూ.1250 కోట్లు), కేఐఓసీఎల్ (రూ.214 కోట్లు) షేర్లను తిరిగి కొనుగోలు చేశాయి.



ఈనాడు బిజినెస్

# 45% పెరిగిన డాక్టర్ రెడ్డీస్ లాభం

**ఈనాడు, హైదరాబాద్:** డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ కన్సాలిడేటెడ్ ఖాతాల ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో 45 శాతం అధికంగా రూ.485.2 కోట్ల నికరలాభాన్ని ఆర్జించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదేకాలంలో నికరలాభం రూ.334.4 కోట్లు మాత్రమే. తద్వారా మార్కెట్ వర్గాల అంచనాలను మించినట్లు అయింది. అదే సమయంలో త్రైమాసిక ఆదాయం మాత్రం క్రితం ఆర్థిక సంవత్సరం ఇదేకాలంలో ఉన్న రూ.3,806 కోట్ల నుంచి 1% వృద్ధితో రూ.3,850 కోట్లుగా నమోదైంది. దేశీయంగా, ఇతర అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో అమ్మకాలు పెరగటం, కొత్త ఔషధాల విడుదల, వ్యయాలపై అదుపు కారణంతో ఈ త్రైమాసికంలో మెరుగైన లాభాలు ఆర్జించే పరిస్థితి వచ్చినట్లు కంపెనీ వెల్లడించింది.

**ఏ మార్కెట్లో ఎలా?**

- ✦ గత ఏడాదితో పోల్చితే ఉత్తర అమెరికా మార్కెట్లో అమ్మకాలు 8% తగ్గాయి. ప్రస్తుత మూడో త్రైమాసికంలో 10 ఔషధాలు విడుదల చేసినట్లు, అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) వద్ద 3 కొత్త ఔషధాలకు ఏఎన్‌డీఏ (అబ్రీవియేటెడ్ న్యూ డ్రగ్ అప్లికేషన్) దాఖలు చేసినట్లు కంపెనీ పేర్కొంది. గత ఏడాది డిసెంబరు 31 నాటికి కంపెనీ దాఖలు చేసిన 103 జనరిక్ ఔషధ దరఖాస్తులు యూఎస్ఎఫ్‌డీఏ అనుమతి కోసం ఎదురుచూస్తున్నాయి.
- ✦ అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అమ్మకాలు 31 శాతం పెరిగాయి. రష్యా, సీఐఎస్ దేశాలతో పాటు ఇతర దేశాల్లో అమ్మకాలు బాగా పెరిగినట్లు కంపెనీ వివరించింది.
- ✦ దేశీయ మార్కెట్లో అమ్మకాలు 10 శాతం పెరిగాయి. కొత్త ఔషధాలు ఇందుకు దోహదపడ్డాయి. ఐరోపా నుంచి మాత్రం 1 శాతం వృద్ధి నమోదైంది.

**9 నెలల కాలానికి..:** ఈ ఆర్థిక సంవత్సరం మొదటి 9 నెలల కాలానికి రూ.11,369 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది. దీనిపై రూ.1,445 కోట్ల నికరలాభం నమోదైంది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదేకాలంలో ఆదాయం రూ.10,668 కోట్ల ఆదాయం, రూ. 678 కోట్ల నికరలాభం ఉన్నాయి. 9 నెలల కాలానికి ఈపీఎస్ రూ.40.83 నుంచి రూ.86.97కు పెరిగింది.

# ఎస్‌బీఐ లాభం రూ.4,709 కోట్లు

**ముంబయి:** ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) రూ.4,709.15 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో బ్యాంకు రూ.1,886.57 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసింది. ఏకీకృత ప్రాతిపదికన మొత్తం ఆదాయం రూ.74,190.97 కోట్ల నుంచి రూ.84,350.11 కోట్లకు పెరిగింది. స్టాండలోన్ ప్రాతిపదికన బ్యాంకు నికర లాభం సమీక్షా త్రైమాసికంలో రూ.3,954.81 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో బ్యాంకు రూ.2,416.37 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించింది.

**ఆస్తుల నాణ్యత:** బ్యాంకు మొత్తం రుణాల్లో స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) 10.35 శాతం నుంచి 8.71 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు 5.61 శాతం నుంచి 3.95 శాతానికి తగ్గాయి. మొండి బకాయిలకు కేటాయింపులు రూ.17,963.77 కోట్ల నుంచి రూ.14,143.74 కోట్లకు తగ్గాయి. మొత్తం కేటాయింపులు రూ.19,097.52 కోట్ల నుంచి రూ.6,355.98 కోట్లకు పరిమితమయ్యాయి.

# వాహన విక్రయాలు అంతంత మాత్రమే

**దిల్లీ:** జనవరిలో దేశీయ వాహన విక్రయాలు మందకొడిగా నమోదయ్యాయి. గత నెల దేశీయ అమ్మకాల్లో మారుతీ సుజుకీ స్వల్ప వృద్ధిని నమోదు చేయగా.. హ్యుందాయ్, మహీంద్రా అండ్ మహీంద్రా విక్రయాల్లో ఒక అంకె వృద్ధిని నమోదు చేశాయి. హోండా కార్స్ విక్రయాల్లో రెండంకెల వృద్ధి నమోదైంది. టాటా మోటార్స్ అమ్మకాలు నిరాశపరిచాయి. ఆర్థిక వ్యవస్థ ప్రతికూలతలు ప్రభావం చూపాయని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. మారుతీ సుజుకీ దేశీయ అమ్మకాలు 1,40,600 నుంచి 1.1 శాతం వృద్ధి చెంది 1,42,150కు చేరాయి. గత నెలలో ఆల్టో, వ్యాగన్ఆర్‌లతో కూడిన మారుతీ చిన్నకార్ల విభాగం విక్రయాలు స్వల్పంగా పెరిగి 33,408గా నమోదయ్యాయి. గతేడాది జనవరిలో ఇవి 33,316గా ఉన్నాయి. సెలెరియో, బాలెనో, డిజైర్ మోడళ్ల అమ్మకాలు సైతం 3.5 శాతం క్షీణించాయి. విటారా బ్రెజా, ఎస్-క్రాస్, ఎర్టిగా వంటి యుటిలిటీ వాహన విక్రయాలు 8.4 శాతం పెరిగి 22,430కు చేరాయి. టాటా మోటార్స్ అమ్మకాలు మాత్రం 8 శాతం పడ్డాయి. వివిధ కంపెనీల విక్రయాల గణాంకాలు పట్టికలో..

**జనవరిలో వాహన విక్రయాలు**

| కంపెనీ | 2019 | 2018 | వృద్ధి/(క్షీణత)%లో |
|---|---|---|---|
| మారుతీ సుజుకీ | 1,42,150 | 1,40,600 | 1 |
| టాటా మోటార్స్ | 54,915 | 59,441 | (8) |
| మహీంద్రా అండ్ మహీంద్రా | 52,500 | 49,432 | 6 |
| హ్యుందాయ్ మోటార్ | 45,803 | 45,508 | 1 |
| హోండా కార్స్ ఇండియా | 18,261 | 14,838 | 23 |
| టయోటా కిర్లోస్కర్ మోటార్ | 11,221 | 12,351 | (9) |

# దివాలా ప్రక్రియకు ఆర్‌కామ్

**దిల్లీ:** దివాలా పరిష్కార ప్రక్రియకు వెళ్లాలని అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) నిర్ణయించింది. రుణాలు చెల్లించడానికి అవసరమైన ఆస్తులను విక్రయించడంలో విఫలం కావడమే ఇందుకు నేపథ్యం. ముకేశ్ అంబానీ నేతృత్వంలోని జియోకు స్పెక్ట్రమ్ విక్రయించడంలో సైతం ఆర్‌కామ్ విఫలమైన విషయం తెలిసిందే. నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ద్వారా రుణ పరిష్కార ప్రణాళిక అమలు చేయాలని ఆర్‌కామ్ డైరెక్టర్ల బోర్డు నిర్ణయించిందని కంపెనీ తెలిపింది. ఆర్‌కామ్‌పై దివాలా చర్యలు చేపట్టాల్సిందిగా తొలుత స్వీడన్ సంస్థ ఎరిక్‌సన్ ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించింది. బకాయిలు చెల్లించడానికి ఎన్‌సీఎల్‌టీ సమయం ఇచ్చినప్పటికీ.. ఆర్‌కామ్ చెల్లించలేకపోయింది. ప్రస్తుతం ఆర్‌కామ్‌కు రూ.46,000 కోట్ల రుణభారం ఉంది.

**అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలు**

(రూ.కోట్లలో)

| కంపెనీ | నికర లాభం/(నష్టం) 2018–19 | నికర లాభం/(నష్టం) 2017–18 | మొత్తం ఆదాయం 2018–19 | మొత్తం ఆదాయం 2017–18 |
|---|---|---|---|---|
| జాగరణ్ ప్రకాశన్ | 70.37 | 87.23 | 613.83 | 598.06 |
| టైటన్ | 411.09 | 281.61 | 5934.11 | 4384.40 |
| బీఎస్ఈ | 50.07 | 58.67 | 177.11 | 172.75 |
| బెర్జర్ పెయింట్స్ | 133.85 | 130.39 | 1631.82 | 1348.68 |
| జుబిలెంట్ లైఫ్ సైన్సెస్ | 267.52 | 212.84 | 2377.10 | 2067.76 |
| వెస్ట్‌లైఫ్ డెవలప్‌మెంట్ | 13.66 | 7.75 | 370.66 | 305.19 |
| మోన్‌శాంటో ఇండియా | 38.95 | 63.34 | 161.10 | 187.65 |
| డ్రెడ్జింగ్ కార్ప్ | 9.80 | (22.20) | 169.34 | 122.90 |
| కల్పతరు పవర్ | 92.00 | 75.23 | 1725.00 | ------- |
| థామస్‌కుక్ ఇండియా | 12.29 | 50.96 | 1555.56 | 3,005.57 |

**బోర్డు సమావేశాలు:** దివీస్ ల్యాబ్స్ ★ జిందాల్ స్టీల్ ★ బీఈఎంఎల్ ★ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ★ జేకే సిమెంట్ ★ ఎమ్‌ఓఐఎల్ ★ పరాగ్ మిల్క్ ఫుడ్స్ ★ రిలాక్సో ఫుట్‌వేర్



**1న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)** (100కు రూపాయలలో)

కోడిగుడ్లు

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 395 | వరంగల్ | 397 |
| చిల్లరగా(ఒక గుడ్డు) | 4.55 | విశాఖపట్నం | 395 |
| బెంగళూరు | 425 | చెన్నై | 430 |
| 2వ తేదీకి... | | చిత్తూరు | 423 |
| విజయవాడ/గోదావరి | 395 | నమక్కల్ | 420 |

# కోస్టల్ బ్యాంక్ డైరెక్టర్ హత్య?

- ఐతవరం వద్ద కారులో జయరామ్ మృతదేహం లభ్యం
- భిన్న కోణాల్లో పోలీసుల దర్యాప్తు

ఈనాడు-విజయవాడ, న్యూస్‌టుడే-నందిగామ

కోస్టల్ బ్యాంకు డైరెక్టర్, ప్రవాస భారతీయుడు చిగురుపాటి జయరామ్(55) అనుమానాస్పద స్థితిలో మృతిచెందడం సంచలనం సృష్టించింది. కృష్ణా జిల్లా నందిగామ మండలం ఐతవరం వద్ద హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారి పక్కన కారులో ఆయన మృతదేహాన్ని గుర్తించారు. రోడ్డు మార్జిన్ దిగి ఉన్న ఆయన కారు(ఏపీ16ఈజీ 0620)లో గురువారం అర్ధరాత్రి మృతదేహం కనిపించింది. వాహనంలో ఆయన ఒక్కరే ఉండటం, డ్రైవర్ లేకపోవటం, మృతదేహం పడి ఉన్న తీరును బట్టి హత్యగా భావిస్తున్నారు. ఆర్థిక లావాదేవీలు, కుటుంబ వివాదాలతో పాటు వివాహేతర సంబంధం కోణంలోనూ దర్యాప్తు సాగుతోంది. జయరామ్ బంధువయిన ఓ మహిళ పాత్ర గురించీ పోలీసులు ఆరా తీస్తున్నారు. అంబులెన్స్ సిబ్బంది రాత్రి 11.07 గంటలకు ఆయనను వైద్యశాలకు తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. అప్పటికే జయరామ్ మృతి చెందినట్లు నిర్ధరించారు. శుక్రవారం ఉదయం శవపరీక్షల నిమిత్తం నందిగామ ప్రభుత్వాసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. కృష్ణా జిల్లా ఎస్పీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి బంధువులు, కారు డ్రైవర్‌ను విచారిస్తున్నారు.



ఘటన స్థలంలో జయరామ్ కారు, అంతరచిత్రంలో సీట్ల మధ్యలో ఆయన మృతదేహం, మరోపక్క పాతచిత్రం

జయరామ్ ప్రస్తుతం హేమరిస్ ఫార్మా ఛైర్మన్‌గా ఉన్నారు. గతంలో ఎక్స్‌ప్రెస్ టీవీ ఛైర్మన్‌గానూ వ్యవహరించారు. మృతుడి భార్య పద్మశ్రీ, కుమార్తె, కుమారుడు అమెరికాలోని ఫ్లోరిడాలో ఉంటున్నారు. గత నెల 2న ఆయన అమెరికా నుంచి హైదరాబాద్‌కు వచ్చారు. 30న హైదరాబాద్‌లో హేమరిస్ బోర్డు సమావేశంలో పాల్గొన్నారు. అక్కడి నుంచి కారులో హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సొంతింటికి వెళ్లారు. కారు డ్రైవర్ సతీష్, వ్యక్తిగత గన్‌మ్యాన్‌లను ఇళ్లకు వెళ్లిపొమ్మన్నారు. గురువారం ఉదయం ఏడింటికి విజయవాడ వెళ్లాల్సి ఉందని, ఆ సమయానికి రమ్మని చెప్పారు. ఆ ప్రకారమే 31న ఉదయం వారిద్దరూ జయరామ్ ఇంటికి వెళ్లారు. అక్కడ ఆయన లేకపోవడంతో ఫోన్ చేశారు. అందుబాటులోకి రాకపోవటంతో వారక్కడే ఉండిపోయారు. ఈ పరిస్థితుల్లో జయరామ్ హత్యకు గురికావడంతో పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. జయరామ్ మామ గుత్తా పిచ్చయ్యచౌదరి ఫిర్యాదు ఆధారంగా నందిగామ పోలీసులు హత్య కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నారు.

హైదరాబాద్ నుంచి బయలుదేరిన జయరామ్ కారు గురువారం రాత్రి 8.38 గంటలకు నల్గొండ జిల్లాలోని పంతంగి టోల్‌గేట్ దాటింది. 10.22 ని.కు భీమవరం టోల్‌ప్లాజా దాటివెళ్లినట్లు సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు గుర్తించారు. భీమవరం టోల్‌గేట్ వద్ద తెల్లచొక్కా వేసుకున్న వ్యక్తి డ్రైవర్ సీటులో ఉండి రుసుము చెల్లించినట్లు సీసీ కెమెరా దృశ్యాల్లో నమోదైంది. ఎవరన్నది స్పష్టంగా లేదు. ఆ వ్యక్తి తర్వాత సంఘటనా స్థలంలో కనిపించలేదు. అతని గురించి తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

## ఆర్టీసీ ఉద్యోగుల డీఏ పెంపు

**ఈనాడు, అమరావతి:** ఏపీఎస్‌ఆర్టీసీ ఉద్యోగులకు కరవు భత్యాన్ని(డీఏ) 3.65 శాతం మేర పెంచుతూ ఎండీ ఎన్.వి.సురేంద్రబాబు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఇప్పటివరకూ ఉన్న 37.02 శాతం డీఏ 40.85 శాతానికి పెరిగింది. పెరిగిన డీఏ, జనవరి నెల బకాయిలను మార్చి ఒకటిన ఇచ్చే వేతనంలో కలిపి చెల్లిస్తారు.

**విజయవాడకు ఆర్టీసీ భవిష్యనిధి ట్రస్టు**

ఏపీఎస్‌ఆర్టీసీ భవిష్యనిధి ట్రస్టు కార్యకలాపాలు ఇకపై విజయవాడ నుంచి కొనసాగనున్నాయి. మార్చి ఒకటో తేదీ నుంచి నెహ్రూ బస్టాండు కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహించేలా ఇక్కడికి తరలిరావాలని ఆర్టీసీ ఎండీ ఎన్.వి.సురేంద్రబాబు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## విద్యుత్తుశాఖలో 206 ఉద్యోగాల భర్తీకి అనుమతి

విద్యుత్తుశాఖలో 206 ఉద్యోగాలను శాశ్వత ప్రాతిపదికన భర్తీచేయనున్నారు. ఏపీ ట్రాన్స్‌కో పరిధిలో 171 మంది, దక్షిణ ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ పరిధిలో 20, తూర్పుప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ పరిధిలో 15 మంది ఏఈల నియామకానికి ఇంధన, మౌలికవసతుల కల్పనశాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్ ఉత్తర్వులిచ్చారు.

# జస్టిస్ సునీల్ చౌదరికి ఘనంగా వీడ్కోలు

- న్యాయసేవలను కొనియాడిన ఏసీజే
- అపోహలు వీడండి.. విజయం మీదే
- యువ న్యాయవాదులకు జస్టిస్ సునీల్ చౌదరి ఉద్బోధ

**ఈనాడు, అమరావతి:** హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.సునీల్ చౌదరికి హైకోర్టు శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికింది. హైకోర్టు న్యాయమూర్తిగా ఈ నెల 3తో జస్టిస్ సునీల్ చౌదరి పదవీ కాలం ముగియనున్న నేపథ్యంలో శుక్రవారం హైకోర్టులో వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ సి.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. జస్టిస్ సునీల్ చౌదరి అందించిన న్యాయసేవలను గుర్తుచేశారు. హైకోర్టు న్యాయ పాలన విషయాల్లో పలు సూచనలు ఇచ్చేవారనీ.. న్యాయవాదులందరితో మంచి సంబంధాలు కలిగి ఉండేవారన్నారు. ఆయన 15వేలకు పైగా ప్రధాన కేసులు, 17వేల అనుబంధ పిటిషన్లు పరిష్కరించారని కొనియాడారు. జస్టిస్ సునీల్‌చౌదరి మాట్లాడుతూ.. విధి నిర్వహణలో తనకు సహకరించిన వారిని, తాను ఉన్నత స్థితికి చేరుకోవడానికి కారణమైన వారిని గుర్తుచేసుకుని కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు ఏపీ అడ్వొకేట్ జనరల్(ఏజీ)దమ్మాలపాటి శ్రీనివాస్ జస్టిస్ చౌదరి ప్రస్థానాన్ని వివరించారు. జస్టిస్ సునీల్ చౌదరి పదవీ విరమణతో హైకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 12కు చేరింది.

**న్యాయవాదుల సంఘం సన్మానం**

జస్టిస్ సునీల్ చౌదరి, ఆయన సతీమణి శైలజను హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. న్యాయవాదుల మండలి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జస్టిస్ సునీల్ చౌదరి మాట్లాడుతూ.. పల్లెటూరి నుంచి వచ్చామని, తెలుగు మీడియంలో విద్యను అభ్యసించామని న్యాయవాద వృత్తిలో తాము రాణించలేమనే అపోహలో కొంతమంది యువ న్యాయవాదులు ఉన్నారన్నారు. అపోహలు వీడి కష్టపడితే ఏదో ఒకరోజు విజయం వరిస్తుందన్నారు.





జస్టిస్ సునీల్ చౌదరికి శాలువా కప్పి సన్మానిస్తున్న ఏసీజే జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్

# హైదరాబాద్‌లో మార్చి 13న విగ్రహ ప్రతిష్ఠ

- 10 నుంచి అమరావతిలో శ్రీవారి ఆలయ నిర్మాణం ప్రారంభం
- 70 వేల ఆర్జిత సేవా టిక్కెట్ల విడుదల: ఈవో

**తిరుమల, న్యూస్‌టుడే:** హైదరాబాద్‌లో రూ.28 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న శ్రీవారి ఆలయంలో మార్చి 13న విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ వెల్లడించారు. తిరుమల నుంచి శుక్రవారం డయల్ తితిదే ఈవో కార్యక్రమాన్ని తిరుమల, తిరుపతి జేఈవోలు శ్రీనివాసరాజు, పోలా భాస్కర్‌తో కలిసి సింఘాల్ నిర్వహించారు. అమరావతిలో శ్రీవారి ఆలయ నిర్మాణం ఈనెల 10 నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 12న తిరుమలలో జరిగే రథసప్తమి పర్వదినానికి ఏర్పాట్లు ఘనంగా చేపడుతున్నామన్నారు. ఆ రోజున ఆర్జిత సేవలన్నీ రద్దు చేస్తున్నట్లు చెప్పారు. ఈనెల 5, 19 తేదీల్లో వయోవృద్ధులు, దివ్యాంగులను; 6, 20 తేదీల్లో ఐదేళ్లలోపు పిల్లలతో పాటు వారి తల్లిదండ్రులను సాధారణ రోజుల్లో కంటే ఎక్కువగా సంఖ్యలో శ్రీవారి ఆలయానికి ఉచితంగా అనుమతించనున్నట్లు పేర్కొన్నారు.

శ్రీవారి ఆర్జిత సేవలకు సంబంధించి మే నెల కోటా కింద 70,786 టిక్కెట్లను శుక్రవారం ఉదయం 10 గంటలకు విడుదల చేసినట్లు ఈవో తెలిపారు. ఆన్‌లైన్‌లో డిప్ విధానం కింద 11,486 టిక్కెట్లు జారీ చేయగా ఇందులో సుప్రభాతం 8,091, తోమాల 140, అర్చన 140, అష్టదళ పాదపద్మారాధన 240, నిజపాద దర్శనం 2,875 టిక్కెట్లు ఉన్నాయి. ఆన్‌లైన్ జనరల్ కేటగిరి కింద 59,300 టిక్కెట్లు విడుదల చేయగా వీటిలో విశేషపూజ 2 వేలు, కల్యాణోత్సవం 14,725, ఊంజలసేవ 4,650, ఆర్జిత బ్రహ్మోత్సవం 7,425, వసంతోత్సవం 14,300, సహస్రదీపాలంకరణ సేవ 16,200 చొప్పున ఉన్నాయి.

# బార్ కౌన్సిల్ సేవలకు సిద్ధం

తాత్కాలిక కార్యాలయాన్ని ప్రారంభించిన ఏసీజే

**ఈనాడు, అమరావతి:** విజయవాడ గవర్నర్‌పేటలోని సిటీ సివిల్ కోర్టు పక్కన ఆంధ్రప్రదేశ్ న్యాయవాదుల మండలి(బార్ కౌన్సిల్) సేవలు అందించేందుకు సిద్ధమైంది. బార్ కౌన్సిల్ తాత్కాలిక కార్యాలయానికి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి(ఏసీజే) జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్ శుక్రవారం ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యాలయం నుంచి బార్ కౌన్సిల్ సక్రమంగా న్యాయసేవలు అందిస్తుందని ఆకాంక్షించారు. బార్ కౌన్సిల్ ఛైర్మన్ గంటా రామారావు మాట్లాడుతూ.. కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవడానికి ప్రాంగణాన్ని ఇచ్చిన జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తులు, ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్, సెంట్రల్ బార్ కౌన్సిల్ సభ్యులు రామిరెడ్డి, బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.సత్యనారాయణరావు, పలువురు బార్ కౌన్సిల్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.



ఏపీ బార్ కౌన్సిల్ తాత్కాలిక కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఏసీజే జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్. పక్కన ఏపీ బార్ కౌన్సిల్ ఛైర్మన్ గంటా రామారావు తదితరులు

## జేఈఈ మెయిన్స్‌లో డాక్టర్ కేకేఆర్స్ విద్యార్థి ప్రతిభ

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: జేఈఈ మెయిన్స్ పేపర్-2 బీఆర్క్‌లో కృష్ణాజిల్లా ఆగిరిపల్లిలోని కేకేఆర్స్ హ్యాపీవ్యాలీ పాఠశాల విద్యార్థి జీఎన్ లక్ష్మీనారాయణ వంద పర్సంటైల్ సాధించి అఖిల భారత స్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారని డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ కొసరాజు కోటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణను కోటేశ్వరరావుతో పాటు డైరెక్టర్లు అవినాష్, శ్రీతేజ, అధ్యాపకులు అభినందించారు.





లక్ష్మీనారాయణను అభినందిస్తున్న డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ కొసరాజు కోటేశ్వరరావు

## గ్రూపు-1 ప్రిలిమ్స్ వాయిదా

మార్చి 31న నిర్వహించనున్నట్లు ఏపీపీఎస్సీ ప్రకటన

**ఈనాడు, అమరావతి:** గ్రూపు-1 ప్రిలిమ్స్ (స్క్రీనింగ్) పరీక్ష మార్చి 31వ తేదీకి వాయిదా పడింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) శుక్రవారం ఓ ప్రకటన జారీ చేసింది. తొలుత ప్రకటించిన ప్రకారం మార్చి 10వ తేదీన ఈ పరీక్ష జరగాల్సి ఉంది. అభ్యర్థుల విజ్ఞప్తుల మేరకు వాయిదా వేశారు.

- ★ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రధాన పరీక్షలను తొలుత ఏప్రిల్ 1, 2 తేదీల్లో నిర్వహిస్తామని ఏపీపీఎస్సీ ప్రకటించింది. వీటిని అదే నెల 29, 30 తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలిపింది.
- ★ ఫారెస్ట్ రేంజి ఆఫీసర్ స్క్రీనింగ్ పరీక్ష ఫిబ్రవరి 24న జరగాల్సి ఉంది. దీనిని మార్చి 10వ తేదీకి వాయిదా వేసింది. తొలుత ప్రకటించిన ప్రధాన పరీక్షలను ఏప్రిల్ 28, 29, 30 తేదీల్లో కాకుండా మే 14, 15, 16 తేదీల్లో జరుపుతామని తెలిపింది.
- ★ అసిస్టెంట్ కమిషనర్(దేవాదాయ శాఖ) నియామక రాత పరీక్షను ఏప్రిల్ 3,4 తేదీల్లో జరగాల్సి ఉండగా మే 9,10 తేదీలకు వాయిదా వేసింది.

***నోటిఫికేషన్ రద్దు!***

హార్టికల్చర్ ఉద్యోగ నియామక ప్రకటన(12/2018)ను రద్దు చేసినట్లు ఏపీపీఎస్సీ ప్రకటించింది. అర్హతల్లో మార్పు కారణంగా ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు తెలిపింది. చెల్లించిన రుసుమును అభ్యర్థులకు త్వరలోనే తిరిగి వెనక్కు పంపుతామని వెల్లడించింది.

# డీఎస్సీ అర్హతల సవరణ

- ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ అభ్యర్థులకు ఇంటర్ నుంచి పదోతరగతికి మార్పు
- పరీక్షలు పూర్తయ్యాక ఉత్తర్వులు జారీ

**ఈనాడు, అమరావతి:** డీఎస్సీ పరీక్షలు పూర్తయిన తర్వాత అభ్యర్థుల అర్హతలకు సవరణ చేస్తూ పాఠశాల విద్యాశాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. నిబంధనల ప్రకారం దరఖాస్తు సమయం కంటే ముందే ఈ ప్రక్రియ పూర్తి చేసి, దరఖాస్తులు స్వీకరించాల్సి ఉంటుంది. ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ అభ్యర్థులకు గతంలో ఇంటర్ అర్హత ఉండగా.. ఇప్పుడు దాన్ని పదోతరగతికి తగ్గించారు. 1973-74లో పదోతరగతి వారికి అర్హత కల్పించిన నేపథ్యంలో అభ్యర్థుల నుంచి వచ్చిన వినతుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పాఠశాల విద్యాశాఖవర్గాలు పేర్కొన్నాయి. ఈ పోస్టులను ఎస్జీటీగా పేర్కొని ఇంటర్మీడియట్‌ను అర్హతగా పెట్టారు. ఇప్పుడు దీన్ని పదోతరగతికి మార్పు చేశారు. వ్యాయామ ఉపాధ్యాయులకు గతంలో బ్యాచిలర్ డిగ్రీ అర్హతగా పేర్కొనగా దీన్ని ఏదైనా డిగ్రీ( గ్రాడ్యుయేషన్)గా మార్పు చేశారు. ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ పోస్టులకు కొత్తగా కంప్యూటర్ సిస్టమ్స్, ప్రొగ్రామ్స్ ప్రిన్సిపల్స్, పారిశ్రామిక సంబంధాలు, విదేశీ వాణిజ్యం చదివినవారికి అర్హత కల్పించారు. బీసీఏ, బీబీఎం అభ్యర్థులకు ఇంటర్‌లో సోషల్ సైన్స్ గ్రూపు సబ్జెక్టు ఉండాలని పేర్కొన్నారు.

# ఛాంపియన్




## ఎగిరి కొడితే..


- నేటి నుంచే ప్రొ వాలీబాల్ లీగ్
- తొలి మ్యాచ్‌లో కోచి × యు ముంబా

కోచి

వాలీబాల్ ఆడుతుంటే చాలా ఆసక్తికరంగా చూస్తాం. ఎందుకంటే హోరాహోరీగా సాగుతుంటాయా పోరాటాలు... కళ్లు చెదిరే స్మాష్‌లు.. ఔరా అనిపించే బ్లాకింగ్స్.. అనూహ్యంగా చేతులు మారే ఆధిక్యాలు..! ఇప్పుడా ఆటలో మరింత మజా తేవడానికి ఒక లీగ్ వచ్చింది... దేశవ్యాప్తంగా వాలీబాల్ ఆటగాళ్లలో ఉత్సాహాన్ని నింపుతూ ప్రొ వాలీబాల్ లీగ్ శనివారమే మొదలు కాబోతోంది. మన దేశంలో జరగబోయే తొలి వాలీబాల్ లీగ్ ఇదే. ఆరు జట్లు.. 18 మ్యాచ్‌లుగా జరిగే ఈ లీగ్‌లో తొలి అంచె పోటీలు కోచిలో జరగనున్నాయి. సెమీస్, ఫైనల్‌తో పాటు ఆరు మ్యాచ్‌లకు చెన్నై ఆతిథ్యం ఇవ్వనుంది. అహ్మదాబాద్ డిఫెండర్స్, కాలికాట్ హీరోస్, చెన్నై స్పార్టాన్స్, బ్లాక్‌హాక్స్ హైదరాబాద్, కోచి బ్లూ స్పైకర్స్, యు ముంబా వాలీ జట్లు ఈ లీగ్‌లో పోటీపడబోతున్నాయి. లీగ్ తొలి మ్యాచ్‌లో కోచి బ్లూ స్పైకర్స్ జట్టు యు ముంబా వాలీతో తలపడనుంది. రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో జరిగే టోర్నీలో అన్ని మ్యాచ్‌ల్లో ఐదు సెట్ల పాటు పోరు జరుగుతుంది. ఏ జట్టు మొదట 15 పాయింట్లు సాధిస్తుందో ఆ జట్టుకు ఆ సెట్ సొంతం అవుతుంది.

## ఏకాంత వేళ..


క్రికెట్ నుంచి విరామం దొరికిన కెప్టెన్ విరాట్ కోహ్లి, తన భార్య అనుష్క శర్మతో కలిసి న్యూజిలాండ్‌లో ఆహ్లాదంగా గడుపుతున్నాడు. ఒక సరస్సు దగ్గర.. అందమైన వాతావరణంలో వీళ్లిద్దరూ కౌగిలించుకుని తన్మయత్వంలో ఉన్న చిత్రాన్ని విరాట్.. తన ట్విటర్ ఖాతాలో పోస్టు చేశాడు. అతను పోస్టు చేసిన కాసేపటికే ఈ ఫొటో సోషల్ మీడియా విస్తృతమైంది. కామెంట్లు, రీట్వీట్‌లతో ఈ పోస్టు నిండిపోయింది.



## 200.. సంఖ్య మాత్రమే

"నా దృష్టిలో 200 ఒక సంఖ్య మాత్రమే. ఐతే ఇంత దూరం ప్రయాణించడం గొప్పగా అనిపిస్తుంది. మహిళల క్రికెట్లో భిన్న దశలు చూశా. 1999లో అంతర్జాతీయ మహిళల క్రికెట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో వన్డేల్లో అరంగేట్రం చేశా. ఐసీసీలో విలీనమయ్యాక తేడా స్పష్టంగా చూస్తున్నాం. సుదీర్ఘకాలం పాటు దేశానికి ప్రాతినిధ్యం వహించడం చాలా ఆనందంగా ఉంది. ఆట మొదలుపెట్టినప్పుడు ఈ స్థాయికి చేరుకుంటానని ఊహించలేదు. టీమ్ఇండియాకు ఆడితే చాలనుకున్నా. జట్టులో కీలక సభ్యురాలిగా ఉండాలనుకున్నా. కానీ ఇంత సుదీర్ఘంగా ఆడతానని అనుకోలేదు"

– మిథాలీ



"మిథాలీకి అభినందనలు. 200 వన్డే మ్యాచ్‌లు ఆడడం చాలా గొప్ప విషయం. అమ్మాయిలు క్రికెట్లోకి వచ్చేలా ఇక ముందు కూడా ఆమె ప్రేరణగా నిలుస్తుందని ఆశిస్తున్నా"

– వీవీఎస్ లక్ష్మణ్



## మిథాలీ రికార్డు

భారత కెప్టెన్ మిథాలీ రాజ్ 200 వన్డేలు ఆడిన తొలి మహిళా క్రికెటర్‌గా రికార్డు సృష్టించింది. న్యూజిలాండ్‌తో మూడో వన్డేతో ఆమె ఈ మైలురాయిని అందుకుంది. 36 ఏళ్ల మిథాలీ.. ఇప్పటి వరకు రెండొందల వన్డేల్లో 51.33 సగటుతో 6622 పరుగులు చేసింది. ఇందులో ఏడు శతకాలు ఉన్నాయి. ఆమె 1999లో అరంగేట్రం చేసింది. మిథాలీ 10 టెస్టులు, 85 టీ20 మ్యాచ్‌లు కూడా ఆడింది.

# చెరగని ముద్ర!

**పదేళ్ల కిందటి సంగతి.. ఓ మహిళా క్రికెటర్, ఓ వైద్యుడు ఒకరినొకరు ఇష్టపడ్డారు. వివాహం ఖాయమనుకున్నారు. కానీ పెళ్లి తర్వాత ఆటకు దూరంగా ఉండాలని షరతు పెట్టడంతో అతనితో తెగతెంపులు చేసుకుందా అమ్మాయి!**

**రెండేళ్ల క్రితం.. ఓ ప్రముఖ క్రీడా ఛానెల్‌లో మహిళా వ్యాఖ్యాత కోసం ఇంటర్వ్యూకు వెళ్లిందా క్రికెటర్. నైపుణ్యం, వాక్చాతుర్యంలో తిరుగులేని ఆ అమ్మాయి అన్ని పరీక్షలు పాసయింది. కానీ మోకాళ్ల పైవరకు దుస్తులు వేసుకోవాలని చెప్పగానే ఇంటికి తిరిగొచ్చేసింది!**

**పై రెండు సందర్భాల్లోని ఆ అమ్మాయి మరెవరో కాదు.. 200 వన్డే మ్యాచ్‌లు ఆడిన తొలి మహిళా క్రికెటర్‌గా రికార్డు సృష్టించిన మిథాలీరాజ్!**

ఈనాడు – హైదరాబాద్

మహిళా క్రికెట్లో పెద్దగా ఆదాయం లేని రోజుల్లో వైద్యుడిని పెళ్లి చేసుకుని జీవితంలో స్థిరపడే అవకాశం వచ్చినా.. ఆత్మాభిమానాన్ని, ఆటపై ప్రేమను చంపుకోలేకపోయింది. వ్యాఖ్యాతగా పేరుకు పేరు, డబ్బుకు డబ్బు సంపాదించే అవకాశం ఉన్నా.. ఆత్మగౌరవాన్ని వదులుకోలేకపోయింది. ఈ వ్యక్తిత్వమే మిథాలీని అందరిలోకెల్లా ప్రత్యేకంగా నిలబెట్టింది. భారత క్రికెట్లో.. ప్రపంచ క్రికెట్లో ఎంతోమంది మహిళా క్రికెటర్లు వచ్చారు.. వెళ్లారు. కానీ సుదీర్ఘ కెరీర్‌లో మిథాలీలా ఆటపై ముద్రను వేసినవారు మరొకరు లేరంటే అతిశయోక్తి కాదు. మహిళల క్రికెట్లో రెండొందల వన్డేలు అంటే చిన్న విషయం కాదు.

మిథాలీరాజ్.. 1999లో అంతర్జాతీయ క్రికెట్లో అరంగేట్రం చేసినప్పుడు అటు ఐసీసీ, ఇటు బీసీసీఐకి మహిళల క్రికెట్‌తో సంబంధమే లేదు. టీమ్ఇండియా క్రికెటర్లు పుష్కలంగా డబ్బు, జనాకర్షణతో వెలుగొందుతున్న సమయంలో.. అసలు ఉన్నారా? లేరా? అన్నట్లుండేది మహిళల క్రికెట్. స్పాన్సర్లు లేకపోవడంతో విదేశీ పర్యటనలకు వెళ్లలేని పరిస్థితి. ఎప్పుడో ఆర్నెల్లకో సిరీస్.. ఏడాదికో పర్యటన. ఇక దేశవాళీ క్రికెట్ అంతంతమాత్రమే. దీంతో ఆదాయం లేక.. సరైన పేరు రాక క్రికెట్‌ను వదిలేసిన అమ్మాయిలెందరో. క్రికెట్ జోలికే వెళ్లకుండా టెన్నిస్, బ్యాడ్మింటన్ రాకెట్లు పట్టిన చిన్నారులు మరెందరో. ఇలాంటి సమయంలో దృఢచిత్తంతో నిలబడింది మిథాలీ. మేటి ఇన్నింగ్స్‌లు.. సరికొత్త రికార్డులతో దేశంలో మహిళల క్రికెట్‌కు ప్రాణం పోసింది. అత్యుత్తమ బ్యాటింగ్.. అద్వితీయమైన సారథ్యంతో టీమ్ఇండియాకు ఎన్నో విజయాలు అందించింది. ఐసీసీ ఆదేశాలతో మిగతా బోర్డులు మహిళల క్రికెట్‌ను విలీనం చేసుకున్నా.. బీసీసీఐ మాత్రం మొదట్లో అందుకు ఒప్పుకోలేదు. ఐతే స్ఫూర్తిదాయక ఇన్నింగ్స్‌లు ఆడుతూ.. జట్టుకు విజయాలనందిస్తూ విలీనం చేయక తప్పని పరిస్థితిని కల్పించింది మిథాలీ. 2006లో బీసీసీఐలో విలీనం మహిళల క్రికెట్‌ను పూర్తిగా మార్చేసింది. తరచూ క్రికెట్ సిరీస్‌లు, విదేశీ పర్యటనలు, ప్రత్యక్ష ప్రసారాలు, మ్యాచ్ ఫీజులు.. తాజాగా సెంట్రల్ కాంట్రాక్టులతో మహిళల క్రికెట్లో మహర్దశ మొదలైంది. ఆటగాళ్లతో సమానంగా అమ్మాయిలకు వసతులు లభిస్తున్నాయంటే.. అందుకు మిథాలీ కూడా ఓ కారణమే!

2003లో మిథాలీ భారత జట్టు పగ్గాలు చేపట్టినప్పుడు జట్టులో అంతా ఆమె కంటే సీనియర్లే. ప్రస్తుత జట్టులో అందరూ ఆమె కంటే జూనియర్లే. ఒకప్పుడు అస్థిత్వమే లేని అమ్మాయిల క్రికెట్ ఇప్పుడు దేశంలో మహిళల క్రీడల్లో ముందుంది! ఆదాయం, ప్రచారం, పేరులో మహిళల క్రికెట్ మంచి స్థితికి చేరుకుంది. మిథాలీ స్ఫూర్తితో ఎంతోమంది అమ్మాయిలు క్రికెట్‌ను కెరీర్‌గా ఎంచుకున్నారు. స్మృతి మంధాన, పూనమ్ రౌత్, దీప్తిశర్మ అలా వచ్చినవాళ్లే. 2017 ప్రపంచ కప్‌లో టీమ్ఇండియా ప్రదర్శనతో దేశంలో ఆటకు మరింత ఆదరణ పెరిగింది. తమ పిల్లలకు క్రికెట్ నేర్పించాలనుకునే తల్లిదండ్రుల సంఖ్య ఎక్కువైంది. 20 ఏళ్ల కెరీర్.. 16 ఏళ్ల సారథ్యంతో మహిళల క్రికెట్‌కు కర్త, కర్మ, క్రియలా వ్యవహరించింది మిథాలీ. అమ్మాయిల క్రికెట్‌ను సున్నా నుంచి ప్రస్తుత స్థాయికి తీసుకురావడంతో కీలక పాత్ర పోషించి మిథాలీ.. మహిళల క్రికెట్‌కే మహారాణి.

## ఆటగాళ్లు ఉవ్విళ్లూరుతున్నారు

డేవిడ్ లీ

ప్రొ వాలీబాల్ లీగ్‌కు రంగం సిద్ధమైంది. మా జట్టు కోచి బ్లూ స్పైకర్స్, యు ముంబా వాలీ మధ్య శనివారం తొలి మ్యాచ్ జరగనుంది. బరిలోకి దిగాలని రెండు జట్ల ఆటగాళ్లు ఉవ్విళ్లూరుతున్నారు. ఈ లీగ్‌లో ఇంటా, బయటా విధానం లేనప్పటికీ కోచి బ్లూ స్పైకర్స్‌కు ప్రాతినిధ్యం వహించడం నా బాధ్యతను పెంచుతోంది. అదే సమయంలో కాస్త ఒత్తిడి కూడా ఉంది. తొలి అంచె కోచిలో జరగనుండడం ఒక్కటే అందుకు కారణం కాదు. ఇక్కడి ప్రజలకు వాలీబాల్ గురించి మంచి పరిజ్ఞానం ఉందని నాకు అర్థమైంది. అందుకే వాళ్లు కేవలం ప్రేక్షకులు కాబోరు. కేరళ నుంచి మా జట్టులో ముగ్గురు ఆటగాళ్లున్నారు. వాళ్లు మను జోసెఫ్, రోహిత్, ముజీబ్. మా కోచ్ టీసీ జోతిష్ కూడా ఈ రాష్ట్రం వాడే. మోహన్ ఉక్రపాండ్యన్ రూపంలో మాకు సమర్థుడైన కెప్టెన్ ఉన్నాడు. అతడు మంచి సెటర్. జట్టులో అందరూ అతణ్ని గౌరవిస్తారు. ప్రభాగరన్ రూపంలో మాకు మంచి స్పైకర్ ఉన్నాడు.

– డేవిడ్ లీ, ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత



## మూడో వన్డేలో భారత మహిళల ఓటమి

హామిల్టన్: న్యూజిలాండ్ మహిళలతో వన్డే సిరీస్‌ను ఇప్పటికే చేజిక్కించుకున్న భారత మహిళల జట్టు చివరిదైన మూడో వన్డేలో పేలవ ప్రదర్శన చేసింది. 8 వికెట్ల తేడాతో పరాజయం పాలైంది. శుక్రవారం టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్.. తాహుహు (3/26), అనా పీటర్సన్ (4/28) ధాటికి 44 ఓవర్లలో 149 పరుగులకే ఆలౌటైంది. దీప్తి శర్మ (52) టాప్ స్కోరర్‌గా నిలిచింది. హర్మన్‌ప్రీత్ కౌర్ 24 పరుగులు చేసింది. జెమిమా రోడ్రిగ్జ్ (12), స్మృతి మంధాన (1), మిథాలీరాజ్ (9) విఫలమయ్యారు. లక్ష్యాన్ని న్యూజిలాండ్ 29.2 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. సాటెర్‌వెయిట్ (66 నాటౌట్), బేట్స్ (58) సత్తా చాటారు. తొలి రెండు వన్డేల్లో గెలిచిన భారత్ 2-1తో సిరీస్‌ను సొంతం చేసుకుంది. మంధానకు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు దక్కింది. మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ 6న వెల్లింగ్టన్‌లో ఆరంభమవుతుంది.

## క్రీడలకు అదనంగా రూ.214.20 కోట్లు



దిల్లీ: కేంద్ర బడ్జెట్‌లో క్రీడలకు కేటాయింపులు పెరిగాయి. శుక్రవారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో క్రీడలకు రూ.2216.92 కోట్లు కేటాయించారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఈసారి రూ.214.20 కోట్లు అదనంగా నిధులు అందించారు. 2018-19 బడ్జెట్‌లో క్రీడలకు రూ.2002.72 కోట్లు ఇచ్చారు.


రామ్‌కుమార్

## భారత్‌కు చుక్కెదురు

- రెండు సింగిల్స్‌లలో ఓటమి
- ఇటలీతో డేవిస్ కప్ పోరు

కోల్‌కతా: డేవిస్ కప్ గ్రూప్ ఫైనల్స్ క్వాలిఫయర్స్‌లో తొలి రోజు భారత్‌కు చుక్కెదురైంది. శుక్రవారం జరిగిన రెండు సింగిల్స్ మ్యాచ్‌ల్లోనూ భారత ఆటగాళ్లు తడబడ్డారు. మొదటి మ్యాచ్‌లో రామ్‌కుమార్ రామనాథన్ 4-6, 2-6తో ఆండ్రియాస్ సెప్పి చేతిలో పరాజయం చవిచూశాడు. రెండో పోరులో ప్రజ్నేష్ గుణేశ్వరన్ 4-6, 3-6తో మతియో బెరెటిని చేతిలో ఓడాడు. భారత్ వరుసగా రెండు సింగిల్స్‌లలో ఓడిన నేపథ్యంలో శనివారం జరిగే డబుల్స్ మ్యాచ్‌లో రోహన్ బోపన్న- దివిజ్ శరణ్ తప్పక గెలవాల్సిన పరిస్థితి తలెత్తింది. ఐతే ప్రపంచ 19వ ర్యాంకర్ మార్కో చెచినాటో- సిమోన్ బొలెలి జోడీని ఓడించడం భారత జంటకు అంత సులువు కాకపోవచ్చు! నిరుడు చైనాతో జరిగిన ఆసియా ఓసియానియా గ్రూప్-1 పోరులో తొలుత భారత్ 0-2తో వెనుకబడింది. అనంతరం గొప్పగా పుంజుకున్న భారత్ 3-2తో విజేతగా నిలిచింది. శనివారం కూడా అలాంటి ఫలితమే పునరావృతమవుతుందని భారత్ ఆశాభావంతో ఉంది. "శనివారంపైనే మా దృష్టంతా. కఠినమైన సవాలే అయినా పోరాడాల్సిందే. ప్రత్యర్థి ఆటగాళ్లు అనుభవజ్ఞులు. అవకాశాల్ని అందిపుచ్చుకుంటే ఫలితం ఉంటుంది. దేశానికి ఆడుతున్నప్పుడు ఉండే ఒత్తిడిని అర్థం చేసుకోవచ్చు. ఒక్కోసారి అద్భుతాలు జరుగుతాయి. చైనాలో అదే చూశాం. ఐతే చైనా కంటే ఇటలీ బలమైన జట్టు" అని భారత్ నాన్ ప్లేయింగ్ కెప్టెన్ మహేశ్ భూపతి అన్నాడు.

## భారత్-ఆసీస్ మ్యాచ్‌కు టికెట్ల అమ్మకాలు నేటినుంచే



విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: ఈనెల 27న విశాఖ నగరంలోని ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య జరగనున్న టీ-20 మ్యాచ్ కోసం టికెట్ల అమ్మకాలు శనివారం నుంచి ఆన్‌లైన్‌లో ప్రారంభం కానున్నాయి. రూ.500, రూ.1200, రూ.1600, రూ.2 వేలు, రూ.4 వేలు, రూ.5 వేల ధరల శ్రేణిలో ఇవి అందుబాటులో ఉంటాయి. ఉదయం 8 గంటల నుంచే www.eventsnow.com వెబ్‌సైట్‌లో అభిమానులు టికెట్లు పొందవచ్చని ఏసీఏ మీడియా మేనేజరు సి.ఆర్. మోహన్ తెలిపారు.



బర్న్స్ 172*


హెడ్ 161*

## బర్న్స్, హెడ్ భారీ శతకాలు

**ఆస్ట్రేలియా 384/4 • శ్రీలంకతో రెండో టెస్టు**

కాన్‌బెర్రా: శ్రీలంకతో రెండో టెస్టులో ఆస్ట్రేలియా పరుగుల వరద పారిస్తోంది. జో బర్న్స్ (172 బ్యాటింగ్; 243 బంతుల్లో 26×4), ట్రావిస్ హెడ్ (161 బ్యాటింగ్; 204 బంతుల్లో 21×4, 1×6) భారీ శతకాలు బాదడంతో తొలి రోజు, శుక్రవారం ఆట ముగిసే సమయానికి ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్ల నష్టానికి 384 పరుగులు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా.. ఓ దశలో 28 పరుగులకే మూడు వికెట్లు కోల్పోగా.. బర్న్స్, హెడ్ ఆదుకున్నారు. పెద్దగా అనుభవంలేని లంక బౌలర్లను అలవోకగా ఎదుర్కొన్నారు. ఎడాపెడా బౌండరీలతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. వీళ్లిద్దరు నాలుగో వికెట్‌కు 308 పరుగులు జోడించారు. బర్న్స్‌కు తోడుగా ప్యాటర్సన్ (25) క్రీజులో ఉన్నాడు. ఫెర్నాండో మూడు వికెట్లు పడగొట్టాడు. తొలి టెస్టులో ఆస్ట్రేలియా గెలిచిన సంగతి తెలిసిందే.



## జపాన్‌కు షాక్

**ఆసియాకప్ ఫుట్‌బాల్ విజేత కతార్**

అబుదాబి: కతార్ జట్టు ఆసియాకప్ ఫుట్‌బాల్ విజేతగా నిలిచింది. ఫైనల్లో ఆ జట్టు 3-1తో జపాన్‌కు షాకిచ్చింది. స్ట్రైకర్ అల్మోజ్ అలీ 12వ నిమిషంలో బైసికిల్ కిక్‌తో చేసిన గోల్‌తో కతార్ ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. 27వ నిమిషంలో హతిమ్ గోల్‌తో ఆధిక్యాన్ని 2-0కు పెంచుకుంది. కతార్ మూడో గోల్‌ను 83వ నిమిషంలో అక్రమ్ అఫిఫ్ సాధించాడు. జపాన్ తరపున నమోదైన ఏకైక గోల్‌ను మినామినో (69వ) కొట్టాడు. జపాన్ చివరిసారి 31 ఏళ్ల కింద ఆసియాకప్‌లో కతార్ చేతిలో ఓడిపోయింది. కతార్ ఆసియాకప్ గెలవడం ఇదే తొలిసారి.


బ్రాత్‌వైట్ (49)

## వెస్టిండీస్‌కు ఆధిక్యం

**ఇంగ్లాండ్‌తో రెండో టెస్టు**

నార్త్ సౌండ్ (అంటిగ్వా): ఇంగ్లాండ్‌తో రెండో టెస్టులో వెస్టిండీస్ ఆధిక్యంలోకి వెళ్లింది. రెండో రోజు, శుక్రవారం కడపటి వార్తలందేసరికి తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్ల నష్టానికి 198 పరుగులు చేసింది. క్రెయిగ్ బ్రాత్‌వైట్ (49), క్యాంప్‌బెల్ (47), హోప్ (44) రాణించారు. విండీస్ ఓ దశలో 133/1తో చాలా పటిష్ఠంగా కనిపించింది. కానీ వేగంగా నాలుగు వికెట్లు కోల్పోయింది. బ్రాడ్, మొయిన్ అలీ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. డారెన్ బ్రావో (15), డౌరిచ్ (9) క్రీజులో ఉన్నారు. ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 187 పరుగులకే ఆలౌటైంది. మొయిన్ అలీ (60) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఫోక్స్ (35)తో ఏడో వికెట్‌కు అతడు 85 పరుగులు జోడించాడు. రోచ్ నాలుగు వికెట్లు పడగొట్టగా.. గాబ్రియెల్ మూడు వికెట్లు తీసుకున్నాడు.

## 26,769 జంటలకు పెళ్లికానుక

- రూ.114 కోట్లు విడుదల
- 2, 3, 4 తేదీల్లో అందజేత
- ప్రభుత్వం ఉత్తర్వులు

**ఈనాడు డిజిటల్, అమరావతి:** ప్రభుత్వం 26,769 జంటలకు ఒకేసారి 'పెళ్లి కానుక' ప్రకటించింది. చంద్రన్న పెళ్లికానుక పథకం అమలు చేసిన తర్వాత 2018 ఏప్రిల్ 20 నుంచి సెప్టెంబర్ 30 మధ్య దరఖాస్తు చేసుకోని వారికి నవంబరు 1 నుంచి 31 వరకు ప్రత్యేక అవకాశాన్ని కల్పించింది. 30 వేల మంది దరఖాస్తు చేసుకోగా 26,769 మంది అర్హత ఉన్నట్లు లెక్కతేల్చింది. వీరికి ఈ నెల 2, 3, 4వ తేదీల్లో డ్వాక్రామహిళలకు అందించనున్న పసుపు-కుంకుమ చెక్కులతో పాటు నూతన దంపతులకు పెళ్లికానుకను కూడా అందించనుంది. ఇందుకుగాను రూ. 113.94 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చింది.

## సహాయ ఆచార్యుల పోస్టుల భర్తీకి వినతులు

**ఈనాడు, అమరావతి:** విశ్వవిద్యాలయాల్లోని సహాయ ఆచార్యుల పోస్టులకు వెంటనే మౌఖిక పరీక్షలు నిర్వహించి, భర్తీ చేయాలని కోరుతూ అభ్యర్థులు శుక్రవారం మంత్రులు గంటా శ్రీనివాసరావు, లోకేశ్‌లకు వినతిపత్రాలు సమర్పించారు. ఇప్పటికే ఏపీపీఎస్సీ ద్వారా నిర్వహించిన స్క్రీనింగ్ పరీక్షలో మూడు వేల మంది అర్హత సాధించారని, మౌఖిక పరీక్షలు కోసం ఎదురు చూస్తున్నారని వెల్లడించారు. త్వరలోనే మౌఖిక పరీక్షలు నిర్వహిస్తామని మంత్రి గంటా చెప్పినట్లు అభ్యర్థులు పేర్కొన్నారు.

### సీపీఎస్ రద్దుకు చలో అసెంబ్లీ 7న

కాంట్రిబ్యూటరీ పింఛన్ పథకం(సీపీఎస్) రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 7న చలో అసెంబ్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఛైర్మన్, ప్రధాన కార్యదర్శులు పి.బాబురెడ్డి, జి.హృదయరాజులు ఓ ప్రకటనలో తెలిపారు.

## పట్టభద్రుల నియోజకవర్గ ఏపీటీఎఫ్ అభ్యర్థిగా శ్రీనివాస్

**ఈనాడు, అమరావతి:** ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఏపీ ఉపాధ్యాయ సమాఖ్య(ఏపీటీఎఫ్) అభ్యర్థిగా ఆర్‌వీవీఎం శ్రీనివాస్‌ను బలపరుస్తున్నట్లు ఆ సంఘ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీనివాస్ ఉపాధ్యాయ వృత్తిలో 20ఏళ్లుగా పని చేస్తూ ఏపీటీఎఫ్ సంఘం పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడిగా ఉన్నట్లు వెల్లడించారు.

## కొబ్బరితోటల పునరుద్ధరణకు రూ.4కోట్లు

**ఈనాడు, అమరావతి:** రాష్ట్రంలో 893.85 హెక్టార్ల విస్తీర్ణంలో కొబ్బరితోటల పునరుద్ధరణకు తొలి ఏడాది కోసం 4కోట్ల రూపాయలకు ప్రభుత్వం పరిపాలన అనుమతి ఇచ్చింది. కొచ్చిలోని ఉద్యాన అభివృద్ధి బోర్డు ముఖ్య అధికారి సూచన మేరకు ఈ నిధులు కేటాయించారు.

# హోదా పోరు ఉద్ధృతం

- అన్ని ప్రాంతాల్లో నిరసనలు, మానవహారాలు
- నల్లబ్యాడ్జీలతో తెదేపా శ్రేణుల ప్రదర్శనలు
- బంద్‌లో పాల్గొన్న వామపక్షాలు, ప్రత్యేకహోదా సాధన సమితి, విద్యార్థి సంఘాలు

ఈనాడు డిజిటల్ - విజయవాడ



శుక్రవారం భోజన విరామ సమయంలో కళ్లకు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలియజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా, విభజన చట్టంలోని హామీలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జరిగిన రాష్ట్ర బంద్ ప్రశాంతంగా ముగిసింది. పలు రాజకీయ పార్టీలకు చెందిన నేతలు, కార్యకర్తలు రోడ్లపైకి వచ్చారు. నిరసన, ద్విచక్ర వాహన ప్రదర్శనలు నిర్వహించారు. రహదారులపై బైఠాయించారు. మానవహారాలు ఏర్పాటు చేశారు. తెదేపా శ్రేణులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపాయి. విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్టాండ్ ఎదుట ఉదయం ఐదున్నర గంటలకు సీపీఎం, సీపీఐ, సాధన సమితి నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. రైల్వేస్టేషన్‌లోకి చొచ్చుకుపోయిన కాంగ్రెస్, వామపక్ష మహిళా నేతలు ఒకటో నెంబర్ రైల్వే ట్రాక్‌పైకి దిగి.. నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌ను అడ్డుకున్నారు. సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్, పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు, సీపీఎం నేత సీ.హెచ్.బాబూరావు పాల్గొన్నారు. అనంతపురంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించారు. తిరుపతి నగరంలో రోడ్లు నిర్మానుష్యంగా మారడంతో గాంధీరోడ్డులోని నాలుగు కాళ్ల మండపం వద్ద రహదారిపైనే సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ సరదాగా కబడ్డీ ఆడారు. శ్రీకాళహస్తిలో శాప్ మాజీ ఛైర్మన్ పీఆర్ మోహన్ రక్తంతో రాసిన లేఖను గాంధీ విగ్రహానికి అందించి నిరసన తెలియజేశారు. కడపలో తెదేపా ఆధ్వర్యంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి ఎన్టీఆర్ కూడలి వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళనకు దిగారు. విజయనగరం జిల్లాలో పలు చోట్ల విద్యా సంస్థలను మూసివేయించారు. బొబ్బిలిలో రాస్తారోకోతో వాహనాలు ఇరువైపులా భారీగా నిలిచిపోయాయి. తూర్పుగోదావరి జిల్లాలో సీపీఐ, కాంగ్రెస్, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఉద్యోగ సంఘాలు నల్ల జెండాలు చేత పట్టి నిరసనలో పాల్గొన్నాయి. గుంటూరు ఎన్టీఆర్ బస్టాండ్ వద్ద సీపీఎం, సీపీఐ నాయకులు ఉదయం 6 నుంచి 8.15 గంటల వరకు బస్సులు రాకుండా అడ్డుకున్నారు. పోలీసులకు రోజా పూలు ఇచ్చి తమ నిరసన వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్ శాఖ అధికారులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. విశాఖ నగరంలో సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, తెదేపా, జనసేన నేతలు ఆందోళనకు దిగారు. మద్దిలపాలెం కూడలి వద్ద ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయంపై ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు మాట్లాడకపోవడం విచారకరమన్నారు. పాత గాజువాక కూడలిలో జాతీయరహదారిపై కాంగ్రెస్ పార్టీ నేతలు రాస్తారోకో నిర్వహించారు. గాజువాక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్కడి కోర్టు ఆవరణలో న్యాయవాదులు నిరసన చేపట్టారు. శ్రీకాకుళం జిల్లాలో ప్రైవేటు పాఠశాలలకు ముందుగానే సెలవు ప్రకటించారు. జిల్లా కేంద్రంలో చేపట్టిన నిరసనలో శాసనసభ్యురాలు గుండ లక్ష్మీదేవి పాల్గొన్నారు. సాధన సమితి ప్రతినిధులు కొన్ని బ్యాంకులను, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలను మూసివేయించారు. ఒంగోలు, నెల్లూరు, కర్నూలు జిల్లా వ్యాప్తంగా బంద్ ప్రభావం కనిపించింది. పశ్చిమగోదావరి జిల్లాలో తెదేపా, వామపక్షాలు, వివిధ ప్రజాసంఘాలు, ఏపీ ఎన్జీవోస్ సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు జరిగాయి. జంగారెడ్డిగూడెంలో తల్లాడ-దేవరాపల్లి జాతీయరహదారిపై రాస్తారోకో చేశారు. పాలకొల్లులో జరిగిన దీక్షలో ఎమ్మెల్సీ రామ్మోహన్ పాల్గొన్నారు. ఏలూరులో సీపీఎం, సీపీఐల ఆధ్వర్యంలో ద్విచక్ర ర్యాలీని ప్రారంభించారు.



అసెంబ్లీ సమావేశాలకు నల్ల దుస్తుల్లో హాజరైన మహిళా మంత్రులు, ఎమ్మెల్యేలు

విజయవాడ గాంధీనగర్‌లో ఏపీ ఎన్జీవోల సంఘం నిరసన ర్యాలీ నిర్వహించింది. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రానికి ప్రత్యేక హోదాతో పాటు విభజన చట్టంలో ఇచ్చిన హామీలన్నీ కేంద్రం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ ఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి శ్రీనివాసరావు, ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాసరావు, ఎన్జీవోల సంఘం రాష్ట్ర నాయకులు జి.గంగిరెడ్డి, అజయ్‌కుమార్, జగదీష్, బాపూజీ, రమణ, ఎండీ ఇక్బాల్, డి.సత్యనారాయణ, శివలీల ఈ ఆందోళనలో పాల్గొన్నారు. నెల్లూరు నియోజకవర్గాలు, మండల కేంద్రాల్లో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలతోపాటు పలు పార్టీల అనుబంధ సంఘాలు, ఎన్జీవో ఉద్యోగ సంఘం ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొన్నాయి.

- అమరావతిలో మంత్రులు భూమా అఖిలప్రియ, పరిటాల సునీత, సహచర మహిళా ఎమ్మెల్యేలతో కలిసి నలుపు వస్త్రాలు ధరించి నిరసన తెలిపారు.
- సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మురళీకృష్ణ నేతృత్వంలో భోజన విరామ సమయంలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి ర్యాలీ చేశారు. కొంతమంది కళ్లకు నల్లగంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు, కేంద్రం రాష్ట్రానికి న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు.
- ప్రత్యేక హోదా డిమాండు చేస్తూ ఉత్తరాంధ్ర చర్చా వేదిక ప్రతినిధులు, జనఘోష రైలు యాత్ర కార్యకర్తలు దిల్లీలోని ఏపీ భవన్‌లో కాగడాలతో నిరసన వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర చర్చా వేదిక కన్వీనర్ కొణతాల రామకృష్ణ నేతృత్వంలో కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



విజయవాడ పండిట్‌నెహ్రూ బస్టాండ్ ప్రధానద్వారం ముందు నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న రఘువీరారెడ్డి, చలసాని శ్రీనివాస్, సుంకర పద్మశ్రీ, వివిధ పార్టీల నాయకులు

## 'ఆపరేషన్ గ్రీన్స్' అమలుకు అనుమతి

**ఈనాడు, అమరావతి:** కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదిత 'ఆపరేషన్ గ్రీన్స్' కింద రాష్ట్రంలో టమోట పంట అభివృద్ధి ప్రాజెక్టు అమలుకు అనుమతిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రాజెక్టులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.50 కోట్లు చొప్పున ఖర్చు చేయనున్నాయి.

## పింఛన్లకు రూ.15 కోట్లు

రాజధాని ప్రాంత మహిళా కుటుంబాల సాంఘిక భద్రత కోసం ప్రభుత్వం చెల్లిస్తున్న పింఛన్లకు నాలుగో విడత కింద రూ.15 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2018-19 సంవత్సరానికి ఇప్పటికే మూడు విడతల్లో పింఛన్లు పంపిణీ చేశారు.



## హామీల అమలు కోరుతూ తీర్మానాలు

### శాసనసభ, శాసనమండలిలో చర్చ

**ఈనాడు, అమరావతి:** విభజన అంశాలు, అప్పట్లో ప్రధాని ఇచ్చిన హామీల అమలులో జాప్యం.. ఆంధ్రప్రదేశ్ పట్ల కేంద్రం వివక్షపై శాసనసభ, మండలి శుక్రవారం తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ మేరకు శాసనసభలో తీర్మానాన్ని మంత్రి అచ్చెన్నాయుడు, శాసనమండలిలో మంత్రి యనమల రామకృష్ణుడు ప్రవేశపెట్టారు. శాసనసభలో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. 'ఇప్పటివరకు నాలుగుసార్లు తీర్మానించాం. ఐదో తీర్మానం ద్వారానైనా కేంద్రంలో కదలిక వస్తుందని ఆశిస్తున్నాం' అని పేర్కొన్నారు. రాజధాని నిర్మాణానికి కేంద్రం ఆర్థికసాయం చేయాలని తీర్మానించారు. 'రైల్వేజోన్ ఏర్పాటుతోపాటు ఉక్కు కర్మాగారం స్థాపించాలి. ఓడరేవు, పెట్రోకెమికల్ పరిశ్రమ ఏర్పాటుచేయాలి. ఉమ్మడి రాష్ట్రంలోని సంస్థల విభజన పూర్తి కావాలి. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలి. రెవెన్యూ లోటు భర్తీ చేయాలి. వెనకబడిన జిల్లాలకు ప్రత్యేక సాయాన్ని అందించాలి. విద్యాసంస్థల శాశ్వత భవనాల నిర్మాణానికి అవసరమైనన్ని నిధులు కేటాయించాలి' అని తీర్మానించారు. పోలవరం డీపీఆర్‌ను ఆమోదించకుండా కేంద్రం జాప్యం చేస్తోందని శాసనసభ పేర్కొంది. ప్రత్యేక హోదాతో పాటు న్యాయమైన డిమాండ్లను కేంద్రం గుర్తించి న్యాయం చేయాలని శాసనసభ తీర్మానించింది.

### ప్రతులను చించేసిన భాజపా సభ్యులు

ఇదే తీర్మానాన్ని శాసనమండలిలో మంత్రి యనమల రామకృష్ణుడు ప్రవేశపెట్టాక భాజపా సభ్యులు సోము వీర్రాజు, మాధవ్ తీర్మానాన్ని వ్యతిరేకిస్తున్నామంటూ ప్రతులను చింపివేశారు. అనంతరం వాకౌట్ చేశారు.

★ మాజీ సభ్యులు సివేరి సోమ, వంకా సత్యనారాయణ, జి.కమలాదేవి, కె.పున్నయ్య, ప్రకాశరావు, వై.అన్నపూర్ణమ్మ, నారాయణరెడ్డి, ఎన్.శివరామిరెడ్డి, సుభాష్‌చంద్రబోస్ మృతిపై శాసనసభ సంతాపాన్ని ప్రకటించింది.

★ అసైన్డ్ భూముల(బదిలీల నిషేధం) సవరణ ఆర్డినెన్స్‌ను ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి తరపున రాష్ట్ర రవాణా మంత్రి అచ్చెన్నాయుడు సభలో ప్రవేశపెట్టారు. దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం(సవరణ) బిల్లు, రాష్ట్ర ఫిజియోథెరపీ మండలి బిల్లును కూడా మంత్రి ప్రవేశపెట్టారు. ఉదయం తొమ్మిదింటికి మొదలైన శాసనసభ సాయంత్రం నాలుగున్నర వరకు కొనసాగింది. సభ ఫిబ్రవరి ఐదో తేదీన పునఃప్రారంభం కానుంది.

# రాష్ట్రానికి ప్రత్యేక కేటాయింపులేవీ?

- బడ్జెట్‌పై తెదేపా, కాంగ్రెస్ మండిపాటు

**ఈనాడు డిజిటల్, అమరావతి:** రాష్ట్రానికి కేంద్రం ప్రభుత్వం మరోసారి అన్యాయం చేసిందని తెదేపా మంత్రులు, కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. నాలుగేళ్లుగా రైతులను పట్టించుకోని కేంద్రం ఎన్నికల ముందుకు పెట్టుబడి సాయాన్ని ప్రకటించడం కంటితుడుపు చర్యేనని వేర్వేరు ప్రకటనల్లో విమర్శించారు.

### ఎన్నికల ముందు కంటితుడుపు చర్య

'రూ.6 వేలు ప్రకటించి రైతులను ఉద్ధరిస్తున్నట్లు కేంద్రం చెప్పుకొంటోంది. గత నాలుగేళ్లలో ఎరువుల ధరలు భారీగా పెంచింది. ఎన్నికల ముందు హఠాత్తుగా పెట్టుబడి సాయం ఇస్తామనడం కంటి తుడుపు చర్యే.'

– సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి

### ఆంధ్రులను అవమానపర్చారు

'బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు మొండిచేయి చూపి, ఆంధ్రులను అవమానపర్చారు. రైల్వే జోన్ ఊసే లేకపోవడం బాధ కలిగించింది. జాతీయ విద్యా సంస్థలకు నిధులు ఇవ్వాలని చాలాసార్లు అడిగినా పట్టించుకోలేదు. ఉద్యోగులకు ఆదాయ పరిమితి పెంచడం శుభపరిణామం'.

– గంటా శ్రీనివాసరావు, మానవవనరుల శాఖ మంత్రి

### భాజపాకు ఇదే చివరి బడ్జెట్

'కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా, రైల్వేజోన్, పోలవరానికి అదనపు నిధుల ప్రస్తావనే లేదు. రాష్ట్రాన్ని మోసం చేసిన భాజపాకు ఇదే చివరి బడ్జెట్ అవుతుంది'.

– కంభంపాటి రామ్మోహన్‌రావు, దిల్లీలో ఏపీ ప్రభుత్వ ప్రతినిధి

### మద్దతు ధరల ప్రస్తావనేదీ?

'పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధరల్లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే తాత్కాలిక సాయం ఇస్తామనడం ఎంత వరకు సమంజసం. బడ్జెట్‌లో మద్దతు ధరల గురించి పట్టించుకోలేదు. ఆంధ్రప్రదేశ్ రెవెన్యూలోటు భర్తీ, రాజధాని, పోలవరానికి నిధులు, కడప ఉక్కు, దుగరాజపట్నం ఓడరేవుపై కనీసం ప్రస్తావనే లేదు'

– రఘువీరారెడ్డి, ఏపీసీసీ అధ్యక్షుడు

### 2 హెక్టార్లు మించిన వారికీ ఇవ్వాలి

'రైతులకు పెట్టుబడి రాయితీ ఇవ్వాలని నిర్ణయించడం ఆహ్వానించదగ్గ పరిణామం. 2 నుంచి 10 హెక్టార్ల వరకూ భూమి ఉన్న రైతులకు పెట్టుబడి సాయం అందించాలి.'

– వడ్డే శోభనాదీశ్వరరావు, మాజీ మంత్రి

## ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటుపై వైఖరి చెప్పండి

- సినీ పరిశ్రమలో లైంగిక దోపిడీ విషయమై ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

**ఈనాడు, హైదరాబాద్:** తెలుగు సినీ పరిశ్రమలో మహిళా కళాకారులపై లైంగిక దోపిడీ విచారణలు, వారి సంక్షేమానికి సంబంధించి అనుసరిస్తున్న విధానమేమిటో చెప్పాలంటూ తెలంగాణ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు అంశంపై వైఖరిని తెలపాలని తెలంగాణ సినిమాటోగ్రఫీశాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలు సమర్పించేందుకు విచారణను ఫిబ్రవరి 12వ తేదీకి వాయిదా వేసింది. మహిళా కళాకారులపై లైంగిక దోపిడీపై విచారణలు, వారి సంక్షేమానికి ఇతర చర్యలు తీసుకునేందుకు ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసేలా ఆదేశించాలంటూ సామాజిక ఉద్యమకారిణి సంధ్యారాణి, మహిళా హక్కులపై పోరాడే వివిధ రంగాలకు చెందిన మరో ఆరుగురు సీనియర్ మహిళా ఉద్యమకారులు హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు.

## రైల్వే జోన్ ఊసు లేకపోవడం బాధాకరం

### రాజ్యసభ సభ్యుడు టి.సుబ్బరామిరెడ్డి

**పెదవాల్తేరు(విశాఖపట్నం), న్యూస్‌టుడే:** కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకంగా ఎలాంటి కేటాయింపులు కనిపించలేదని ఎంపీ టి.సుబ్బరామిరెడ్డి అన్నారు. విశాఖ రైల్వే జోన్ ఊసే లేకపోవడం బాధాకరమన్నారు. ఎన్నికలు వస్తున్నందునే తాయిలాలు ప్రకటించిందని ఓ ప్రకటనలో ఆరోపించారు.

# ఎన్నికల భయం కనిపించింది

- కేంద్ర బడ్జెట్‌పై తెదేపా ఎంపీలు

**ఈనాడు, దిల్లీ:** కేంద్ర బడ్జెట్‌లో భాజపా ఎన్నికల భయం కనిపించిందని తెదేపా పేర్కొంది. ఆ పార్టీ ఎన్నికల ప్రణాళికగా ఉన్న ఈ బడ్జెట్ ఆంధ్రప్రదేశ్ ప్రజలను తీవ్రంగా నిరాశ పరిచిందని తెలిపింది.

### ప్రభుత్వ సొమ్ముతో ఓట్లు కొనుగోలు చేస్తున్నారు

బడ్జెట్ ప్రవేశపెడుతున్నట్లుగా లేదు.. ఎన్నికల ప్రసంగం లాగా ఉంది. రాష్ట్రపతి ప్రసంగంలో కేంద్రం చెప్పించిన అంశాల్లో 90శాతం కనిపించాయి. మధ్యంతర బడ్జెట్ అని చెప్పినా ఎన్నికల్లో ఓటమి భయంతో ఉన్నట్లుగా కనిపిస్తోంది. ప్రభుత్వ సొమ్ముతో ఓట్లు కొనుగోలు చేస్తున్నారు. ఈ అంశంపై సుప్రీంకోర్టుకు కూడా వెళ్లొచ్చు.

– ఎంపీ సుజనాచౌదరి

### భాజపా ఎన్నికల మేనిఫెస్టో

కేంద్ర బడ్జెట్ చూస్తే భాజపా ఎన్నికల ప్రణాళిక (మేనిఫెస్టో)లా ఉంది. ఐదు రాష్ట్రాల ఫలితాలు చూసి సార్వత్రిక ఎన్నికల్లో ఓడిపోతామనే తాయిలాలతో ప్రవేశపెట్టారు.

– ఎంపీ తోట నరసింహం

### ఏపీ ప్రజలను తీవ్ర నిరాశపరిచింది

ఏపీ ప్రజల్ని తీవ్ర నిరాశ పరిచేలా ఉంది. రైతులు ఇప్పుడు గుర్తొచ్చారా? 2014 ఎన్నికల సమయంలో ప్రజల్ని మోసం చేసినట్లే మరోసారి మోసం చేయాలని భాజపా చూస్తోంది.

–ఎంపీ అవంతి శ్రీనివాస్

### గాయం చేసి కట్టు కట్టినట్లుగా ఉంది

ఐదేళ్లపాటు ప్రజలకు ఎన్నో గాయాలు చేసి ఇప్పుడు నామమాత్రంగా కట్టుకట్టినట్లుగా ఉంది. అన్ని వర్గాల ప్రజలను తీవ్ర మానసిక వేదనకు గురిచేశారు. పెద్దనోట్ల రద్దుతో రైతు సహా అన్ని వర్గాల వారు పూర్తిగా దెబ్బతిన్నారు. ఎన్నికలకు పథకాలు ప్రకటించినట్లుగా కేటాయింపులు చేశారు.

– ఎంపీ గల్లా జయదేవ్

### ప్రజాకర్షక బడ్జెట్ పెట్టారు

ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రజాకర్షక బడ్జెట్ పెట్టారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా, రైల్వే జోన్, పోలవరానికి కేటాయింపులు లేవు. ఆర్థిక, కరెంట్ ఖాతా లోటుపై స్పష్టత లేదు. ప్రైవేటు లెక్కల ప్రకారం దేశ, విదేశాల్లో రూ.70లక్షల కోట్ల నల్లధనం ఉంటే రూ.50వేల కోట్లను విదేశీ ఆస్తుల రూపంలో జప్తు చేశామనడం కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంలా ఉంది.

– విజయసాయిరెడ్డి, వైకాపా పార్లమెంటరీ పార్టీ నేత

### మాకు రాజకీయ న్యాయం జరుగుతుంది

నోట్ల రద్దుతో రెండింతలైన ఆదాయాన్ని ప్రజలకు అందించాలనే ఉద్దేశంతోనే నరేంద్ర మోదీ ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంది. అన్ని వర్గాలకు మేలు చేసిన మాకు రాజకీయ న్యాయం జరుగుతుందని భావిస్తున్నా. మేం మళ్లీ అధికారంలోకి వస్తాం.

– జి.వి.ఎల్.నరసింహారావు, భాజపా రాజ్యసభ సభ్యుడు



Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00

# ఆటను కత్తిలా మార్చుకుని!

1994లో మంచి ఊపు మీదున్న అమెరికా టెన్నిస్ తార మోనికా సెలెస్‌పై దాడి చేసి గాయపరిచాడో దుండగుడు. ఆమె కోలుకుని టెన్నిస్‌లోకి రావడానికి రెండేళ్లు పట్టింది. ఆ తర్వాత సెలెస్ మళ్లీ వచ్చి టైటిళ్లు కూడా గెలిచింది. చెక్ రిపబ్లిక్ అమ్మాయి పెట్రా క్విటోవాను చూస్తే మోనికా సెలెసే గుర్తొస్తుంది. సెలెస్ మాదిరిగానే ఒక అగంతుడికి చేతిలో దాడికి గురి కావడంతో కెరీర్ ప్రమాదంలో పడింది. కానీ అనూహ్యంగా మళ్లీ తిరిగొచ్చి జోరు ప్రదర్శిస్తోంది. పునరాగమనంలో ఒక్కో మెట్టే ఎక్కుతూ ఆస్ట్రేలియన్ ఓపెన్లో టైటిల్ పోరుకు అర్హత సాధించి సత్తా చాటింది క్విటోవా. కత్తి గుచ్చుకున్నా.. తన ఆటను పదునెక్కించి దూసుకెళ్తోంది ఈ భామ.



2011 వింబుల్డన్‌లో రివ్వున దూసుకొచ్చింది క్విటోవా.. అప్పటి ఫేవరెట్ మరియా షరపోవాకు షాకిస్తూ ట్రోఫీ ఎగరేసుకుపోయింది... ఆ తర్వాత ఏడాది ఫ్రెంచ్ ఓపెన్లో సెమీస్.. ఆపై మరోసారి వింబుల్డన్ టైటిల్.. ఇలా క్విటోవా కెరీర్ జోరుమీదున్న వేళ ఆమెకో శరాఘాతం!! ఇంట్లో ఉండగా దుండగుడి కత్తి దాడిలో క్విటోవా చేతికి తీవ్ర గాయమైంది. ఆమె పరిస్థితి చూస్తే అసలు మళ్లీ ఆటలోకి వస్తుందా అని అంతా అనుకున్నారు. కొన్ని నెలల వరకు రాకెట్ కూడా ఎత్తే పరిస్థితి లేదు. ఒకటికి మించి శస్త్ర చికిత్సలు జరిగాయి. ర్యాంకుల్లో పడిపోయింది.. కానీ గాయమైనా క్విటోవా మాత్రం ఎవరూ ఊహించని విధంగా పుంజుకుంది. ఈ చెక్ అమ్మాయికి ఇక కష్టమే అనుకున్న వారిని ఆశ్చర్యంలో ముంచెత్తుతూ ఏడాది తిరక్కుండానే మళ్లీ రాకెట్ పట్టింది. ఈ సంఘటన నుంచి శారీరకంగా కోలుకోవడానికి ఎంత సమయం పట్టిందో ఆ భయం నుంచి బయటపడటానికి ఆమెకు ఇంకా ఎక్కువ సమయం కావాల్సి వచ్చింది. జిమ్ సెషన్లతో పాటు మానసిక నిపుణులతో పాఠాలు చెప్పించుకుంది. దాడికి ముందే ఆమెకు విపరీతమైన అలసటతో కూడిన రుగ్మత ఉంది. కొంచెం కష్టపడినా.. ఒత్తిడికి గురైనా వెంటనే నిద్రపోవడం దీని లక్షణం. ఇంత ఇబ్బంది ఉన్నా కూడా నెమ్మదిగా ప్రాక్టీస్ చేస్తూ.. ఇబ్బందులను అధిగమించింది క్విటోవా.

### పడి లేచింది

2017 ఫ్రెంచ్ ఓపెన్లో రెండో రౌండ్ చేరిన క్విటోవా.. ఎగాన్ అంతర్జాతీయ టోర్నీలో గెలిచి పునరాగమనాన్ని ఘనంగా చాటింది. తనకు ఇష్టమైన వింబుల్డన్‌లో రెండో రౌండ్.. యుఎస్ ఓపెన్‌లో క్వార్టర్స్ చేరి నెమ్మదిగా అడుగులు వేసింది. ఆరంభం కలిసి రాకపోయినా నిరాశ పడలేదు. 2018లో ఫ్రెంచ్, యుఎస్ ఓపెన్లో మూడో రౌండ్ చేరి ఉనికిని చాటుకుంది. 2019లో ఆస్ట్రేలియన్ ఓపెన్లో ఫైనల్ చేరి సంచలనం సృష్టించింది. టైటిల్ గెలవకపోయినా మున్ముందు టోర్నీల్లో రాణించే ఆత్మవిశ్వాసాన్ని సంపాదించుకుంది. ప్రస్తుతం రెండో ర్యాంకుకు చేరిన క్విటోవా.. రాబోయే గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో టైటిల్ కొట్టాలనే సంకల్పంతో ఉంది.

# ఎగురుతున్నాయ్ కుర్ర రాకెట్లు

**పురుషుల టెన్నిస్ అంటే గత పుష్కర కాలంగా అభిమానులకు బాగా తెలిసిన పేర్లు నాలుగే.. రోజర్ ఫెదరర్, రఫెల్ నాదల్, నొవాక్ జకోవిచ్, ఆండీ ముర్రే! అయితే వీళ్ల తరంలో ఎంతో మంది కుర్రాళ్లు వచ్చారు.. వెళ్లిపోయారు! కానీ కొత్తగా వచ్చిన కొంతమంది కుర్రాళ్లు మాత్రం దిగ్గజాలకు దడ పుట్టిస్తున్నారు. వారిపై సంచలన విజయాలు సాధిస్తున్నారు. అంచనాలను తలకిందులు చేస్తున్నారు. తాజాగా ఆస్ట్రేలియన్ ఓపెన్లో డిఫెండింగ్ ఛాంపియన్ ఫెదరర్‌ను ఓడించాడు గ్రీకు వీరుడు సిట్సిపాస్.. గత కొన్ని నెలలుగా టాప్-10 ఆటగాళ్లపై విజయాలు సాధిస్తున్నాడు అమెరికా ఆటగాడు టియాఫో..ప్రతి టోర్నీకి మెరుగై దూసుకెళ్తున్నాడు రష్యా టీనేజర్ కచనోవ్... ఆటతోనూ ర్యాంకుల్లోనూ ముందుకెళ్తున్న వీళ్ల కథేంటో చూద్దామా...!**




## బాల్యం నుంచి పోరాటమే..

సియారా లియోన్.. ఈ పేరు వింటే చాలు తుపాకీ చప్పుళ్లు.. ఆర్తనాదాలు.. రక్తపాతాలే గుర్తొస్తాయి. అలాంటి నేపథ్యం నుంచి వచ్చిన ఒక కుర్రాడు టెన్నిస్ రాకెట్ పట్టుకుంటానని.. గ్రాండ్‌స్లామ్ వైపు కన్నెత్తయినా చూస్తానని కలలో కూడా అనుకోలేదు. అలాంటిది ఏకంగా ఆస్ట్రేలియన్ ఓపెన్లో క్వార్టర్‌ఫైనల్ చేరి అందరి దృష్టిని ఆకర్షించాడు. ఆ కుర్రాడి పేరు ఫ్రాన్సిస్ టియాఫో.

అంతర్ యుద్ధాలతో అట్టుడికే ఆఫ్రికా దేశం సియారా లియోన్‌లో జీవితం ఎంత దుర్భరంగా ఉంటుందో ప్రపంచానికి తెలియనిదేమీ కాదు. అలాంటి దేశం నుంచి టియాఫో తండ్రి 1993లోనే అమెరికాకు వలస వచ్చాడు. అయితే సియారాలో పుట్టకపోయినా టియాఫోకు కష్టాలు తప్పలేదు. హింస నుంచి తప్పించుకున్నా దుర్భర జీవితంలో మాత్రం మార్పు లేదు. చిన్నప్పటి నుంచి పేదరికం వెంటాడింది. తండ్రి మేరీలాండ్ (అమెరికా)లో నిర్మాణంలో ఉన్న జూనియర్ టెన్నిస్ కోర్టులో కూలీగా పని చేసేవాడు. కవల సోదరుడు ఫ్రాంక్లిన్‌తో కలిసి టియాఫో నాన్నకు సాయం చేసేవాడు. నిత్యం టెన్నిస్ కోర్టుల చుట్టే ఉండడంతో టియాఫోకు ఆటపై ఆసక్తి కలిగింది. మిషా కుజెనొత్సొవ్ దగ్గర అతను శిక్షణ తీసుకునేవాడు. టియాఫోకు కుజెనొత్సొవ్ కోచ్‌గా ఉండడమే కాక అతనికి అవసరమయ్యే ఖర్చులు కూడా భరించేవాడు. టియాఫో.. 16 ఏళ్ల వయసులో ఆరెంజ్ బౌల్ టోర్నీ గెలిచి ఈ ఘనత సాధించిన పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడు. 2014 సీజన్లో యుఎస్ ఓపెన్‌లో క్వాలిఫయింగ్ టోర్నీలో ఆడిన టియాఫో ఆ తర్వాత ఏడాది ఫ్రెంచ్, యుఎస్ ఓపెన్ టోర్నీల్లో మెయిన్ డ్రాకు అర్హత సాధించాడు. తొలి రౌండ్లలో ఓడిపోయాడు.

### ఆస్ట్రేలియన్ ఓపెన్‌తో..

2017 నుంచి అన్ని గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో మెయిన్ డ్రాకు అర్హత సాధిస్తూ ఒక్కో మెట్టూ ఎక్కాడీ కుర్రాడు. గతేడాది వింబుల్డన్‌లో మూడో రౌండ్ చేరడమే ఇప్పటిదాకా టియాఫో అత్యుత్తమ ప్రదర్శన. అందుకే తాజాగా ఆస్ట్రేలియన్ ఓపెన్లో దిమిత్రోవ్‌పై గెలిచి క్వార్టర్‌ఫైనల్ చేరగానే టియాఫో కన్నీళ్ల పర్యంతం అయ్యాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ తొలి రౌండ్లో భారత ఆటగాడు ప్రజ్నేశ్ గుణేశ్వరన్‌ను ఓడించిన అతడు.. ఆ తర్వాత అనుభవజ్ఞులు దక్షిణాఫ్రికా స్టార్ కెవిన్ అండర్సన్, సెప్పి, దిమిత్రోవ్‌లపై గెలిచి అందర్ని ఆశ్చర్యంలో ముంచెత్తాడు. విజయాలు సాధించాక కోర్టులో చొక్కా విప్పి తన కండలపై గుద్దుకుంటూ విచిత్ర హావభావాలతో ప్రేక్షకులకు తన కృతజ్ఞతలు చెప్పాడు టియాఫో. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 39వ స్థానంలో ఉన్న ఈ అమెరికా కెరటానికి రోజర్ ఫెదరర్ ఆరాధ్య ఆటగాడు. ఆరు అడుగుల ఐదు అంగుళాల పొడవుండే టియాఫోకు భారీ సర్వీసులు, శక్తివంతమైన ఫోర్‌హ్యాండ్ ప్రధాన ఆయుధాలు.

## ప్రాణాపాయం నుంచి బయటపడి..

అతని కుటుంబంలో అందరూ క్రీడాకారులే. తాత ఒలింపిక్స్‌లో స్వర్ణం గెలిచిన సోవియట్ యూనియన్ జట్టులో సభ్యుడు.. అమ్మ, నాన్న, సోదరి టెన్నిస్‌లో రష్యాకు ప్రాతినిధ్యం వహించారు. ఇంతటి క్రీడా నేపథ్యం ఉంది కాబట్టే ఆ ఇంటి నుంచి మరో ఆటగాడు పుట్టాడు. టెన్నిస్‌లో మెరుపులా దూసుకొచ్చాడు.. 20 ఏళ్ల వయసులోనే టాప్-20 ర్యాంకు సాధించి ఔరా అనిపించాడు.. ఆ కుర్రాడి పేరు స్టెఫానోస్ సిట్సిపాస్. ఈ గ్రీకు ఆటగాడు ప్రస్తుతం పురుషుల సింగిల్స్‌లో సంచలన విజయాలతో సత్తా చాటుతున్నాడు. తాజాగా ఆస్ట్రేలియన్ ఓపెన్లో దిగ్గజ రోజర్ ఫెదరర్‌కు షాక్ ఇచ్చి పెను ప్రకంపనలు సృష్టించాడు సిట్సిపాస్.

సిట్సిపాస్ తండ్రిది గ్రీస్.. తల్లిది రష్యా. తన కుటుంబంలో అందరూ క్రీడాకారులే కావడంతో సిట్సిపాస్ చిన్నప్పుడే రాకెట్ పట్టుకున్నాడు. అతని అమ్మ జూనియర్స్‌లో మాజీ ప్రపంచ నంబర్‌వన్ కూడా. అమ్మ, నాన్న శిక్షణలో రాటుదేలాడు సిట్సిపాస్. తన కవల సోదరి సన్లికోవాతో కలిసి ఏథెన్స్‌లోని గ్లెఫోడా టెన్నిస్ క్లబ్‌లో సాధన చేసేవాడు. ఒకసారి ప్రాక్టీస్‌కు వెళ్లినప్పుడు సిట్సిపాస్ ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. అయితే ఆలస్యంగా ఈ విషయాన్ని గుర్తించినా.. నాన్న అతణ్ని కాపాడాడు. ఈ సంఘటన సిట్సిపాస్‌లో భయం పోగొట్టింది. పోరాటతత్వాన్ని నేర్పింది. 2013లో ఐటీఎఫ్ సర్క్యూట్‌లోకి వచ్చిన సిట్సిపాస్ జూనియర్ ప్రపంచ నంబర్‌వన్ అయ్యాడు. ఆరెంజ్ బౌల్ టోర్నీలో ఫైనల్ చేరడం ద్వారా ఈ గ్రీసు కుర్రాడు అందరి దృష్టిలో పడ్డాడు. ఆ ఊపులోనే అతను జూనియర్ గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లోనూ పాల్గొన్నాడు.

### ఫెదరర్‌నే పడగొట్టాడు..

2017.. సిట్సిపాస్ కెరీర్‌ను మలుపు తిప్పింది. సీనియర్ విభాగంలో ఫ్రెంచ్ ఓపెన్లో అతడు మెయిన్‌డ్రాకు అర్హత సాధించాడు. అదే ఏడాది వింబుల్డన్‌లో కూడా మెయిన్ డ్రా ఆడిన సిట్సిపాస్.. 2018లో తన ఆటను మరో స్థాయి తీసుకెళ్లాడు. అన్ని గ్రాండ్‌స్లామ్ టోర్నీలోనూ మెయిన్‌డ్రాకు అర్హత సాధించిన ఈ గ్రీసు కెరటం...వింబుల్డన్‌లో నాలుగో రౌండ్ చేరి అందరి దృష్టిలో పడ్డాడు. ఈ ఏడాది తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీలోనే సెమీఫైనల్ చేరి సత్తా చాటాడు. ఈ క్రమంలో ఫెదరర్, కెవిన్ అండర్సన్ లాంటి టాప్-10 ర్యాంకు ఆటగాళ్లను ఓడించాడు. గత ఏడు నెలల కాలంలో అతను టాప్-10లో ఆరుగురు ఆటగాళ్లపై నెగ్గడం విశేషం. ప్రస్తుతం ర్యాంకింగ్స్‌లో 12వ స్థానంలో ఉన్న సిట్సిపాస్ (20 ఏళ్లు) టాప్-20లో చోటు సంపాదించిన పిన్న వయస్కుడిగా ఘనత సాధించాడు. మెరుపు సర్వీసులు, బలమైన ఫోర్ హ్యాండ్ షాట్లు ఆయుధాలుగా దూసుకెళ్తున్న ఈ గ్రీకు వీరుడు మున్ముందు ఎన్ని సంచలనాలు సృష్టిస్తాడో చూడాలి.

## సంచలనాలకు చిరునామా

పురుషుల టెన్నిస్‌లోకి దూసుకొచ్చిన మరో కుర్రాడు కరెన్ కచనోవ్. అద్భుత నైపుణ్యం ఉందని టెన్నిస్ అభిమానులు కొనియాడుతున్న ఈ రష్యా కెరటం ప్రస్తుతం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 11వ ర్యాంకులో ఉన్నాడు. గతేడాది సెర్బియా దిగ్గజం నొవాక్ జకోవిచ్‌ను ఓడించి పారిస్ మాస్టర్ టైటిల్ గెలిచి అందర్ని ఆశ్చర్యంలో ముంచెత్తాడు 22 ఏళ్ల కచనోవ్.

2013లో ప్రొఫెషనల్‌గా మారిన కచనోవ్.. వేగంగా ఎదిగాడు. ఖాతాలో నాలుగు ఏటీపీ టైటిళ్లు మాత్రమే ఉన్నా.. భవిష్యత్ తారగా మారగల సత్తా ఉందని అతడు తన ఆట ద్వారా నిరూపిస్తున్నాడు. అతని తండ్రి వాలీబాల్ ఆటగాడు. దేశానికి కూడా ప్రాతినిధ్యం వహించాడు. తండ్రి లాగే కచనోవ్ కూడా వాలీబాల్ ఆడేవాడు. అయితే మారత్ సఫిన్ నుంచి స్ఫూర్తి పొందిన అతడు రాకెట్ పట్టుకున్నాడు. 2013లో 17 ఏళ్ల వయసులో యూరోపియన్ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకున్న కచనోవ్ వేగంగా సీనియర్ సర్క్యూట్ దిశగా అడుగులు వేశాడు. 2016లో చెంగ్డూ ఓపెన్లో టైటిల్ గెలిచి సత్తా చాటాడు. ఇదే ఏడాది యుఎస్ ఓపెన్‌కు అర్హత సాధించి రెండో రౌండ్ చేరిన కచనోవ్.. 2017లో అన్ని గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో మెయిన్‌డ్రాకు అర్హత సాధించాడు. ఫ్రెంచ్ ఓపెన్లో ప్రిక్వార్టర్స్ చేరిన ఈ రష్యా కుర్రాడు.. ఆస్ట్రేలియన్ ఓపెన్లో రెండో రౌండ్‌కు, వింబుల్డన్‌లో మూడో రౌండ్‌కు చేరుకున్నాడు. గతేడాది ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్‌లో ప్రిక్వార్టర్స్ చేరాడు కచనోవ్. యుఎస్ ఓపెన్లోనూ మూడో రౌండ్లో ప్రవేశించాడు. తాజా ఆస్ట్రేలియన్ ఓపెన్లో అతడు మూడో రౌండ్లో ప్రవేశించి సత్తా చాటాడు.

---

# కబడ్డీ.. కబడ్డీ

# కేరాఫ్ చినగంజాం

**ఆంధ్రప్రదేశ్ ప్రకాశం జిల్లాలోని సముద్ర తీర ప్రాంతం.. ఉదయం అంతా ఉప్పు తయారీలో నిమగ్నమై ఉండే ఆ కుర్రాళ్లు సాయంత్రం అయితే కూత పెడతారు.. కబడ్డీ కబడ్డీ అంటూ ఉత్సాహంగా బరిలో దూకుతారు. అక్కడ దాదాపు ఇంటికో ఛాంపియన్ ఉన్నాడు.. జిల్లాలకు, రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించిన వాళ్ల సంఖ్యకు లెక్కే లేదు.. వందల ఆటగాళ్లు పుట్టారు.. ఇంకా పుడుతూనే ఉన్నారు.. కబడ్డీకి కార్ఖానాగా మారిన ఆ ఊరు పేరు చినగంజాం!**



రెండు దశాబ్దాలు.. రెండు వేలకు మందికిపైగా కబడ్డీ ఆటగాళ్లు.. ఒక చినగంజాం..! కబడ్డీని వారసత్వంగా చేసుకుని.. దాన్నే బతుకుదెరువుగా మార్చుకుని..ఆటలో సత్తా చాటుతున్నవాళ్లు అక్కడ కోకొల్లలు. కూలీలుగా పని చేసే ఎక్కువమందికి ఈ ఆట ఓ వ్యాపకం.. ఈ ఆటే పెద్ద లోకం. చిన్నా పెద్దా తేడా లేదు.. అందరి నోటా కబడ్డీనే.. వాళ్లకు కోచ్‌లు బయట ఎక్కడ నుంచో రారు.. తాతలు తండ్రులే కోచ్‌లు. పాతతరం వాళ్లు సాధించిన ఘనతలే వారికి పెద్ద ఆస్తి. అందుకే వాళ్లు ఏది వదిలిపెట్టినా కబడ్డీ మాత్రం వదలరు. కబడ్డీలో ఇక్కడ నుంచి అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో సత్తా చాటిన ఆటగాళ్లు ఎందరో ఉన్నారు. ప్రొ కబడ్డీ లీగ్‌తో పాటు జాతీయ కబడ్డీ ఛాంపియన్‌షిప్, అంతర్జాతీయ కబడ్డీ పోటీల్లో పాల్గొన్నవాళ్లూ ఉన్నారు.



చిరిగిపోయిన జెర్సీలు.. బూట్లు లేక వరుచుపోయిన కాళ్లు.. కానరాని కనీస వసతులు..! అయినా.. ఇక్కడ కబడ్డీ ఆగదు. వీళ్లందరికి ఈ ఆటే పెద్ద సంపద! కబడ్డీలో రాణిస్తే తమ బతుకులు బాగు పడతాయేమోనన్న ఆశ వారిది. చినగంజాం ఆటగాళ్లు స్వాభావికంగానే దేహదారుఢ్యంలో మిన్నగా ఉండడంతో వారికి కబడ్డీలో అంతగా పట్టు వచ్చింది. క్రీడా కోటాలో పోలీసు, మిలిటరీ లాంటి ఉద్యోగాలు వస్తే తమ పేదరికం కొద్దిగా అయినా తగ్గుతుందేమో అన్న అభిలాషతో వీళ్లు కబడ్డీని వదలరు. విశేషం ఏమిటంటే 1985కు ముందు చినగంజాంలో కబడ్డీ ఆట పెద్దగా ప్రాముఖ్యత లేదు. కానీ అప్పటి ప్రభుత్వ పీఈటీ గోవిందు శ్రీనివాసరావు ప్రోత్సాహంతో మొదలైన ఈ ఆట ఆ తర్వాత మరో పీఈటీ బత్తుల నాగేశ్వరరావు అండతో వేగంగా వ్యాప్తి చెందింది. పక్క ఊళ్లో కబడ్డీ పోటీలు గెలిస్తే డబ్బులు వస్తాయన్న ఆశతో కుర్రాళ్లంతా జట్టుగా ఏర్పడి కబడ్డీని చాలా సీరియస్‌గా తీసుకున్నారు. జాతీయ జట్టుకు ఆడిన ఆట్ల అంజిరెడ్డి, మోపర్ల వెంకటేశ్వర్లు, ముసలారెడ్డి ఇలా ఎంతో మంది ఆటగాళ్లు పుట్టుకొచ్చారు. ఇక్కడ కబడ్డీ ఆడే వాళ్లందరి వృత్తి దాదాపు కూలీనే. ఉదయాన్నే లేవడం ఏదో ఒక పనికి వెళ్లడం.. ఖాళీ దొరికితే కబడ్డీ ఆడడం ఇదే వాళ్ల దినచర్య. జాతీయ టోర్నమెంట్లతో పాటు స్థానికంగా జరిగే ప్రతి టోర్నీల కోసం చినగంజాం నుంచి ఆటగాళ్లను తీసుకెళ్లడం ప్రత్యేకత.

### కూలీల నుంచి ఛాంపియన్లుగా

2015లో గుజరాత్, 2016లో తమిళనాడులో జరిగిన జాతీయ సీనియర్ కబడ్డీలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించిన ఉమామహేశ్వరరావు, 2018లో విశాఖపట్నంలో జరిగిన జాతీయ కబడ్డీ టోర్నీలో బెస్ట్ డిఫెండర్‌గా నిలిచిన సురేశ్‌రెడ్డి, ఇదే జట్టులో ఉన్న కాశీ విశ్వనాథ్, లక్ష్మారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి లాంటి ఆటగాళ్లు చినగంజాం నుంచి వచ్చిన వాళ్లే. ఉమామహేశ్వరరావు ఉప్పు తయారీ పనులతో పాటు రొయ్యలు పట్టే పనికి వెళ్లేవాడు. సురేశ్‌రెడ్డి కూడా తన తల్లిదండ్రులతో కలిసి కూలీగా పని చేసేవాడు. మరో ఆటగాడు కాశీ విశ్వనాథ్ ఇసుక క్వారీల్లో పని చేస్తూ జాతీయ స్థాయి టోర్నీల్లో పాల్గొన్నాడు. ఇంకో ఆటగాడు శ్రీకృష్ణ 2016తో తెలుగు టైటాన్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. తినడానికి తిండి లేని పరిస్థితి ఉండే క్రీడాకారులు చాలా మంది. అందుకే వీళ్లందరూ ప్రతిభ నిరూపించుకుని సాయ్ హాస్టల్స్‌కు ఎంపిక కావడానికి ప్రయత్నిస్తూ ఉంటారు. నైపుణ్యం ఉన్నా సరైన వసతులు లేకపోవడంతో ఆటకు చాలామంది దూరం అయిపోతున్నారు. ప్రభుత్వం సహకారం అందించి మెరుగైన వసతులు కల్పిస్తే మరింత గొప్పగా రాణిస్తామని చెబుతున్నారు ఈ కబడ్డీ ఛాంపియన్లు.

**– పల్లపోలు పుండరీకాక్షయ్య, న్యూస్‌టుడే, చినగంజాం**

# ఈనాడు సినిమా

దక్షిణాదిలోని అన్ని భాషలతో పాటు... హిందీలోనూ నటించి ప్రేక్షకుల్ని అలరించిన కథానాయకుడు మమ్ముట్టి. 'స్వాతికిరణం', 'దళపతి' చిత్రాలతో తెలుగు ప్రేక్షకులపై చెరిగిపోని ముద్ర వేశారాయన. చాలా రోజుల తర్వాత ఆయన 'యాత్ర'తో మరోసారి తెలుగులో నటించారు. అందులో వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి పాత్రలో నటించారు మమ్ముట్టి. ఈ నెల 8న 'యాత్ర' ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా మమ్ముట్టి శుక్రవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు. ఆ విషయాలివీ...



## నేనూ రాజకీయాల్లో ఉన్నట్లే

"చాలా రోజుల తర్వాత తెలుగులో నేను చేసిన చిత్రం 'యాత్ర'. ఈమధ్య కాలంలో తెలుగు చిత్ర పరిశ్రమలో మీకెలాంటి మార్పులు కనిపిస్తున్నాయని అడుగుతున్నారంతా. మార్పు అనేది సహజం. అన్ని పరిశ్రమల్లోనూ మార్పులు చోటు చేసుకొన్నాయి. నేను మాత్రం మారలేదు (నవ్వుతూ). 'స్వాతికిరణం'లో ఎలా కనిపించానో ఇప్పుడూ అలాగే ఉన్నానని అంటున్నారంతా. అందుకు కారణమేంటనేది మాత్రం నాకు తెలియదు".

"ప్రేక్షకులకు ప్రత్యేకమైన మీడియా ఉందిప్పుడు. సామాజిక మాధ్యమాల ద్వారా సినిమాలపై వాళ్ల అభిప్రాయాల్ని వినిపిస్తుంటారు. నటులు వాటిని పరిగణనలోకి తీసుకోవల్సిందే, ఎప్పటికప్పుడు కొత్తగా మనల్ని మనం ఆవిష్కరించుకోవల్సిందే. ప్రతిభ అందరిలోనూ ఉంటుంది, కావల్సింది కష్టపడటమే. తెలుగు చిత్ర పరిశ్రమతో నాకు మంచి అనుబంధముంది. చిత్ర పరిశ్రమ మద్రాసులో ఉన్నప్పుడు మేమంతా అక్కడ కలిసి పనిచేసిన వాళ్లమే. ఏవీఎమ్ స్టూడియోలో ఒకొక్క ఫ్లోర్‌లో ఒకొక్క భాషకి చెందిన సినిమా చిత్రీకరణ జరిగేది. 1980 బ్యాచ్ కథానాయకుల్లో మీరూ ఉన్నారా అంటే లేనని చెబుతాను. ఎందుకంటే నాది 2018 బ్యాచ్ (నవ్వుతూ)".

❑ "తెలుగులో ఇంతకాలం సినిమాలు చేయకపోవడానికి కారణం బలమైన పాత్రలు దొరక్కపోవడమే. మహి వి.రాఘవ్ 'యాత్ర' స్క్రిప్టుని పూర్తిస్థాయిలో సిద్ధం చేసుకొని నా దగ్గరికొచ్చారు. ఆయనతో మాట్లాడాక నేను చేయాల్సిన సినిమా అనిపించింది. పైగా ఓ గొప్ప నాయకుడి పాత్ర. ఇది బయోపిక్ కాదు. వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి చేసిన పాదయాత్రలో జరిగిన సంఘటనల ఆధారంగా తెరకెక్కింది. నిజమైన సంఘటనలు, చరిత్ర ఇందులో లేకపోవచ్చు కానీ... పాదయాత్రలో వై.ఎస్ ఎవరెవరిని కలిశారు? వాళ్ల సమస్యల్ని ఎలా విన్నారు? వాటికి ఎలాంటి పరిష్కారం ఆలోచించారనే విషయాలు ఆసక్తికరంగా ఉంటాయి. తెలుగు, మలయాళం, కన్నడం, తమిళం ఇలా మాట్లాడే భాష వేరు కావొచ్చు కానీ, మన జీవితాలు ఒకేలా ఉంటాయి. అందుకే ఈ సినిమాలో భావోద్వేగాలకి నేను బాగా కనెక్ట్ అయ్యా".

❑ "నాతో సినిమా తీసిన దర్శకుల్లో 70మంది కొత్తవాళ్లే. ప్రస్తుతం చాలామంది అగ్ర దర్శకులుగా కొనసాగుతున్నారు. ఆ రకంగా చూస్తే మహి వి.రాఘవ్ అనుభవజ్ఞుడే. మహి ఈ చిత్రాన్ని చాలా బాగా తీశారు. మంచి నిర్మాతలు కూడా దొరికారు. ఈ సినిమా ప్రయాణం ఒక విహారయాత్రలా సాగింది. నేనెక్కడా వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డిని అనుకరించే ప్రయత్నం చేయలేదు. ఆ పాత్రలో ఉన్న ఆత్మని అర్థం చేసుకొని నటించాను. ఈ సినిమా కోసమని నేను ప్రత్యేకంగా పరిశోధన చేసిందంటూ ఏమీ లేదు. అంతా దర్శకుడే చేశాడు. ఆయన సిద్ధం చేసిన స్క్రిప్టుకి తగ్గట్టుగా నేను నటించానంతే".

❑ "రాజకీయ నేపథ్యంలో సాగే కొన్ని సినిమాలు చేశాను. 'అంబేద్కర్', 'బషీర్' వంటి బయోపిక్‌లు కూడా చేశాను. వాటితో పోలిస్తే ఇది పూర్తి భిన్నమైన చిత్రం. నా పాత్రకి నేనే డబ్బింగ్ చెప్పుకున్నాను. ఎక్కువ భాషలు మాట్లాడటం అంటే ఇష్టం. పైగా మలయాళం, తెలుగు మధ్య చాలా పోలికలు ఉంటాయి. తెలుగులో అద్భుతం అంటారు, మలయాళంలో అద్భుతం అని ఒత్తు లేకుండా పలుకుతారు. భాషపై ఆసక్తితో తెలుగు సినిమాలు కూడా చూస్తుంటా. ఈ మధ్య 'రంగస్థలం', 'భరత్ అనే నేను' చిత్రాల్ని చూశా".

❑ "మీకూ రాజకీయాల్లోకి ప్రవేశించాలనే ఆలోచన ఉందా అని అడుగుతుంటారు. మనది ప్రజాస్వామ్య దేశం కాబట్టి, నేను కూడా రాజకీయాల్లో ఉన్నట్లే. 38 ఏళ్లుగా సినీ రంగంలో ఉన్నాను. ఇప్పుడు ప్రత్యేకంగా రాజకీయాల్లోకి ఎందుకు? సినిమానే నా రాజకీయం. సినిమా నా ప్యాషన్. ఆసక్తి ఉన్నప్పుడు ఎలాంటి సవాళ్లయినా స్వీకరిస్తుంటాం. నేను చేసేవన్నీ నా డ్రీమ్ రోల్సే. ప్రస్తుతం తెలుగు చిత్ర పరిశ్రమ చాలా ఆరోగ్యకరంగా ఉంది. కమర్షియల్ చిత్రాలు, ప్రయోగాలు, అర్థవంతమైన చిత్రాలు రూపుదిద్దుకొంటున్నాయి".

## సింగరేణి నేపథ్యం



విజయ్ దేవరకొండ

మరో ప్రేమకథ మొదలు పెట్టాడు విజయ్ దేవరకొండ. ముగ్గురమ్మాయిలతో ముడిపడిన ఆ ప్రేమకథ క్రాంతి మాధవ్ దర్శకత్వంలో తెరకెక్కుతోంది. ఇందులో రాశీ ఖన్నా, ఐశ్వర్య రాజేష్, ఇసబెల్లా కథానాయికలుగా నటిస్తున్నారు. కె.ఎ.వల్లభ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఖమ్మం జిల్లా ఇల్లెందులో చిత్రీకరణ జరుపుకొంటోంది. 'మళ్లీ మళ్లీ ఇది రాని రోజు'తో విజయాన్ని అందుకొన్న క్రాంతి మాధవ్, ఈ చిత్రాన్ని సింగరేణి నేపథ్యంలో సాగే కథతో తెరకెక్కిస్తున్నారు. ఒక పక్క 'డియర్ కామ్రేడ్'లో నటిస్తూనే మరోపక్క ఈ చిత్రంతో బిజీ అయిపోయారు విజయ్ దేవరకొండ.

## హాలీవుడ్ అవకాశం



రానా

తొలి అడుగుల్లోనే పలు భాషల్లో సినిమాలు చేసి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు రానా. 'బాహుబలి' తర్వాత ఆయనకి అంతర్జాతీయ స్థాయిలో ప్రాచుర్యం లభించింది. హిందీలో 'హాథీ మేరే సాథీ'తో పాటు 'హౌస్‌ఫుల్ 4'లో నటిస్తున్న ఆయనకి హాలీవుడ్ అవకాశం వచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం ఆ సినిమాకి సంబంధించిన చర్చలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. త్వరలోనే రానా 'హిరణ్య' కోసం రంగంలోకి దిగనున్నారు. గుణశేఖర్ దర్శకత్వం వహించనున్న ఆ చిత్రం అంతర్జాతీయ స్థాయిలో రూపుదిద్దుకోబోతోంది.

కొత్త కబుర్లు

## మన్మథుడి సరసన?

నాగార్జున కథానాయకుడిగా రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. 'మన్మథుడు2' పేరుతో సెట్స్‌పైకి వెళ్లనున్న ఆ చిత్రంలో పాయల్ రాజ్‌పుత్ ఓ కథానాయికగా ఎంపికైనట్టు సమాచారం. 'ఆర్.ఎక్స్.100'తో వెలుగులోకి వచ్చిన కథానాయిక పాయల్. ప్రస్తుతం రవితేజతో 'డిస్కోరాజా'లో నటిస్తున్న ఆమెని, ఇటీవలే నాగ్‌తో కలసి నటించే అవకాశం వరించినట్టు తెలుస్తోంది. 'మన్మథుడి2'లో ఇద్దరు కథానాయికలకి చోటుండగా, ఓ నాయికగా పాయల్‌ని ఎంపిక చేసినట్టు సమాచారం. త్వరలోనే పోర్చుగల్‌లో చిత్రీకరణ ఆరంభించబోతున్నారు. 'చి.ల.సౌ'తో విజయాన్ని అందుకొన్న రాహుల్ రవీంద్రన్, నాగ్ కోసం ఆయన ఇదివరకు నటించిన 'మన్మథుడు' తరహా కథని సిద్ధం చేశారు.



పాయల్ రాజ్‌పుత్

## సహజీవన గందరగోళం



కార్తిక్ ఆర్యన్, కృతి సనన్

గతేడాది 'సోను కే టిటూ కీ స్వీటీ'తో ఘన విజయాన్ని అందుకున్నాడు కార్తిక్ ఆర్యన్. అతడు కథానాయకుడిగా నటించిన చిత్రం 'లుకా చుప్పి'. కార్తిక్ సరసన కృతి సనన్ నాయికగా నటిస్తోంది. సహ జీవనం చేయాలనుకునే రష్మి, గుడ్డు అనే ఓ జంట.. వారితోనే కలసి ఉండాలనుకునే కుటుంబం.. ఈ నేపథ్యంలో వినోదాత్మకంగా ఈ చిత్రం తెరకెక్కింది. ఇటీవలే విడుదలైన ట్రైలర్ ఆకట్టుకుంటోంది. ఇందులోని 'పోస్టర్ లగ్వా దో' అనే పాటను విడుదల చేశారు. 1990ల నాటి థీమ్‌తో నాయకానాయికలకు, వారి కుటుంబ సభ్యులకు మధ్య జరిగే దాగుడుమూతలతో తెరకెక్కించిన ఈ పాట వినోదాలు పంచుతోంది. లక్ష్మణ్ ఉతేకర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం వచ్చే నెల 1న విడుదలవుతోంది. ఇందులో కీలక పాత్రల్లో పంకజ్ త్రిపాఠి, వినయ్ పాఠక్, అపర్‌శక్తి ఖురానా నటించారు.

## జీవితం ఒక్కటే




జితన్ రమేష్, శ్రుతియుగల్

ప్రముఖ నిర్మాత ఆర్.బి.చౌదరి తనయుడు జితన్ రమేష్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'ఒకటే లైఫ్'. హ్యాండిల్ విత్ కేర్... అనేది ఉపశీర్షిక. శ్రుతియుగల్ కథానాయిక. ఎం.వెంకట్ దర్శకుడు. సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఫిబ్రవరి 8న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారు. దర్శకుడు మాట్లాడుతూ ''సాంకేతికత పేరుతో పరుగులు పెడుతున్న యువతరం ఆలోచనల నేపథ్యంలో సాగే చిత్రమిది. మానవ సంబంధాలకి, భావోద్వేగాలకి ప్రాధాన్యం ఇవ్వాలనే విషయాన్ని ఒక మంచి కథతో చెప్పే ప్రయత్నం చేస్తున్నాం. జితన్ రమేష్ నటన, అమ్రీష్ సంగీతం చిత్రానికి ప్రధాన బలం" అన్నారు. "తెరాస నేత హరీష్ రావు చేతులమీదుగా విడుదలైన ట్రైలర్‌కి మంచి స్పందన లభించింది. చిత్రం తప్పకుండా ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది" అన్నారు నిర్మాత.


## కొత్తగా ఉందన్నారు

"రెండో వారం కూడా మా చిత్రం విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. కొత్తగా 55 థియేటర్లలో విడుదల చేస్తున్నాం" అన్నారు ప్రియాంత్. ఆయన కథానాయకుడిగా నిశ్చయ్ ప్రొడక్షన్స్ పతాకంపై తెరకెక్కిన చిత్రం 'కొత్తగా మా ప్రయాణం'. యామిని భాస్కర్ కథానాయిక. రమణ మొగిలి దర్శకత్వం వహించారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కథానాయకుడు మాట్లాడుతూ "పేరుకు తగ్గట్టుగానే సినిమా కొత్తగా ఉందని ప్రేక్షకులు మెచ్చుకొంటున్నారు" అన్నారు. కార్యక్రమంలో రామారావు, రామకృష్ణ, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రియాంత్



## 'ప్యాడ్‌మ్యాన్'తో 'నీర్జా'?



అక్షయ్‌కుమార్

అక్షయ్‌కుమార్ కథానాయకుడిగా రోహిత్ శెట్టి దర్శకత్వంలో తెరకెక్కనున్న చిత్రం 'సూర్య వంశీ'. ఈ చిత్రంలో కథానాయికగా పూజా హెగ్డే, కత్రినాకైఫ్ పేర్లు వినిపించాయి. కానీ చివరకు 'నీర్జా' భామ సోనమ్ కపూర్‌కు అవకాశం దక్కినట్లు సమాచారం. అక్షయ్‌కుమార్, సోనమ్‌కపూర్ కలసి నటించిన 'ప్యాడ్ మ్యాన్' చిత్రం మంచి ప్రశంసలు దక్కించుకొంది. పూర్తిస్థాయి యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందించనున్న ఈ కొత్త చిత్రానికి సోనమ్ ఓకే చెప్పిందంటున్నాయి బాలీవుడ్ వర్గాలు. సాధారణంగా రోహిత్ శెట్టి సినిమాల్లో కథానాయికలకు అంతగా ప్రాధాన్యం ఉండదు. కథానాయకుడితో యాక్షన్ ఘట్టాలకే ప్రాధాన్యత ఉంటుంది. ఈ చిత్రంలోని కథానాయిక పాత్ర ఎలా ఉంటుందో చూడాలి మరి.



సోనమ్‌కపూర్

## టాయ్ స్టోరీ నాలుగోసారి



హాలీవుడ్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన యానిమేషన్ చిత్రాల్లో 'టాయ్ స్టోరీ' ఒకటి. ఈ సిరీస్‌లో వచ్చిన మూడు చిత్రాలూ ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందాయి. ఇప్పుడు నాలుగో చిత్రం అభిమానులను అలరించడానికి సిద్ధమవుతోంది. 2010లో వచ్చిన 'టాయ్ స్టోరీ 3' ఉత్తమ యానిమేషన్ చిత్రంగా ఆస్కార్ పురస్కారం అందుకుంది. పదేళ్ల విరామం తర్వాత 'టాయ్ స్టోరీ 4' రాబోతోంది. దీనికి సంబంధించి ఓ ఆసక్తికరమైన విషయం వెల్లడైంది. తొలి రెండు చిత్రాల్లో గుర్తుండిపోయిన బో పీప్ అనే బొమ్మ పాత్ర ఈ నాలుగో చిత్రంలోనూ కనిపించనుంది. ఆ పాత్ర ఫస్ట్‌లుక్‌ను చిత్రబృందం విడుదల చేసింది. జోష్ కూలే తెరకెక్కించిన ఈ చిత్రం ఈ ఏడాది జూన్‌లో విడుదల కాబోతోంది.

## ఇంజినీరింగ్ విద్యార్థులకి ఓ సందేశాన్నిచ్చాం



ఆర్.రఘురాజ్, ఉదయ్‌కుమార్

"వందేళ్ల సినిమా చరిత్రలో ఎవ్వరూ చేయని ఓ ప్రయత్నాన్ని మా చిత్రంలో చేశాం. అదేంటన్నది తెరపైనే చూడాల"న్నారు ఆర్.రఘురాజ్. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం '4 లెటర్స్'. కుర్రాళ్లకి అర్థమవుతుందిలే... అనేది ఉపశీర్షిక. ఈశ్వర్ కథానాయకుడు. దొమ్మరాజు హేమలత, దొమ్మరాజు ఉదయ్‌కుమార్ నిర్మాతలు. ఈ నెలలోనే చిత్రం ప్రేక్షకుల ముందుకు రానున్న సందర్భంగా దర్శకనిర్మాతలు శుక్రవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు. దర్శకుడు మాట్లాడుతూ "తొలి చూపులో ప్రేమ కొన్ని అనుభూతుల్ని పంచి, పాఠాల్ని నేర్పుతుంది. ఆ తర్వాత పుట్టే ప్రేమలే సఫలమవుతుంటాయి. అలాంటి ప్రేమల గురించి చెప్పే ప్రయత్నమే ఈ చిత్రం. ఇంజినీరింగ్ విద్యార్థుల నేపథ్యంలో సాగుతుంది. వాళ్లకి ఓ మంచి సందేశాన్నిచ్చాం. తెలుగులో 'కలుసుకోవాలని' తర్వాత నేను చేసిన చిత్రమిది"న్నారు. నిర్మాత ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ "మాది తిరుపతి. మూడేళ్లు ఇంజినీర్‌గా పనిచేసి అమెరికా వెళ్లా. 21 ఏళ్లుగా న్యూయార్క్‌లో ఉంటున్నా. మా అబ్బాయి ఈశ్వర్‌కి సినిమా అన్నా, సంగీతం అన్నా ఆసక్తి. దర్శకుడు చెప్పిన కథ నచ్చడంతో ఈ సినిమా చేశా. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చే భావోద్వేగాలు ఇందులో ఉంటాయి. తదుపరి మా సంస్థ నుంచి వరుసగా సినిమాలు చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం" అన్నారు.

# వసుంధర

కొత్త బడ్జెట్ వచ్చేసింది.
మరి మన వ్యక్తిగత బడ్జెట్టో!
నెల జీతం చేతికి రాగానే...
దేనికి ఎంత ఖర్చుపెట్టాలని
చకచకా లెక్కలు వేసుకుంటాం.
వ్యక్తిగత అవసరాలే కాదు... అప్పటికప్పుడు వచ్చే
ఖర్చుల్ని సైతం భరించాల్సి వస్తుంది.
మన ఆదాయం, వ్యయం, భవిష్యత్తు గురించి
ఆలోచించాల్సిన సమయం కూడా ఇదే.
మరి ఇప్పటినుంచీ ఎలాంటి ఆర్థిక ప్రణాళిక
వేసుకోవాలో చూద్దామా!



ఐదులక్షల లోపు ఆదాయం గలవారికి కేంద్రబడ్జెట్ ప్రకటించిన పన్ను మినహాయింపు ఊరటనిచ్చింది. అయితే ఆలోపు ఆదాయం పొందుతున్న మహిళలు...మినహాయింపు ఉంది కదాని పొదుపు పథకాలకు దూరం కావడం సరికాదు. ప్రభుత్వ ఆదాయపుపన్ను మినహాయింపు కోసం ఉద్దేశించిన పథకాలను ఉపయోగించుకోవడం అలవాటు చేసుకోవాలి.

# ఇకనైనా.. కూడబెట్టేద్దాం

**చిన్న చిన్న ప్రణాళికలతోనే జీవితాన్ని మనం కోరుకున్నట్లుగా మలుచుకోవచ్చు. ఈ రోజుల్లో పురుషులతో సమానంగా మనం కూడా ఉద్యోగాలు చేయడం అనేది మంచి మార్పే. అయితే పొదుపు విషయంలో పురుషులతో పోలిస్తే ఒక అడుగు వెనకే ఉంటున్నామని అధ్యయనాలు చెబుతున్నాయి. ఏ సంకేతం లేకుండా వచ్చే అనారోగ్యాలు, ఊహించని ప్రమాదాలు... వంటివన్నీ దృష్టిలో పెట్టుకుంటే ఆర్థిక భద్రత విలువ తెలుస్తుంది. అందుకే పక్కా ప్రణాళిక ఉండాలి.**

- శ్వేత వయసు ఇరవై ఒక్కేళ్లు. క్యాంపస్ సెలక్షన్స్‌లోనే ఎంఎన్‌సీలో ఉద్యోగం కొట్టేసింది. రెండంకెల జీతం. ఏ బాధ్యతలూ లేకపోవడంతో నచ్చిన వస్తువులు కొనుక్కుంటూ, సరదాగా గడిపేస్తోంది.
- హరిణి ఓ సంస్థలో మేనేజర్. వయసు ఇరవై తొమ్మిదేళ్లు. పెళ్లయ్యింది. ఇద్దరు పిల్లలు. తనకొచ్చే నెలజీతంతో భర్త సంపాదనకు వేణ్నీళ్లకు చన్నీళ్లుగా ఉండాలనుకుంటోంది. అలాగే పిల్లల భవిష్యత్తు, ఇల్లు కొనుగోలు... ఇలా చాలా ప్రణాళికలే వేసుకుంది.
- గాయత్రి వయసు ముప్పై నాలుగేళ్లు. ఓ పాప. భర్త నుంచి విడిపోయి ఒంటరిగా ఉంటోంది. సాఫ్ట్‌వేర్ సంస్థలో సీనియర్ మేనేజర్. తన ఆశలన్నీ అమ్మాయి భవిష్యత్తు మీదే. ఇప్పటివరకూ వస్తోన్న ఆదాయం అంతా ఖర్చులకే సరిపోతోంది.

ఇలాంటి వాళ్లు మన చుట్టూ చాలామందే ఉంటారు. అందరికీ ఒకే పొదుపు సూత్రం వర్తించదు. పనిచేయదు. ఎందుకంటే పెరిగే వయసుతో పాటు లక్ష్యాలు, అవసరాలు కూడా మారిపోతాయి కాబట్టి దానికి తగినట్లుగా ఆర్థిక ప్రణాళిక ఉండాలి. మహిళా సాధికారతలో భాగంగా, ఆర్థిక స్వేచ్ఛ ఎంత అవసరమో ఆర్థిక భద్రతా అంతే ముఖ్యం. పడిపోతున్న ఆదాయం, పెరుగుతోన్న ఖర్చులు, జీవనశైలిలో మార్పులు, ఉపాధి అస్థిరత్వం, విచ్ఛిన్న కుటుంబాలు... వంటి పరిస్థితులన్నీ ప్రతి ఒక్కరికి ఆర్థిక ప్రణాళిక అవసరమనే విషయాన్ని హెచ్చరిస్తున్నాయి.



### 21-30 సంవత్సరాలలోపు

ఉద్యోగం మొదలుపెట్టినప్పటి నుంచీ భవిష్యత్తు లక్ష్యాలు, బాధ్యతలు, ఆర్థిక అవసరాలు దృష్టిలో పెట్టుకోవాలి. ఉద్యోగంలో చేరిన వెంటనే ఎటువంటి ఒత్తిడీ ఉండకపోవచ్చు. ఖర్చులు పోను జీతంలో ఎక్కువశాతం డబ్బు మిగులుతుంది. తల్లిదండ్రులతోనే ఉంటూ ఉద్యోగం చేస్తుంటే ఇంకా ఎక్కువగా మిగలొచ్చు. అయినప్పటికీ పొదుపు, భవిష్యత్తు లక్ష్యాల గురించి పెద్దగా పట్టించుకోరు కొందరు. తరచూ గ్యాడ్జెట్లు మార్చేయడం, కొత్త దుస్తులు, యాక్సెసరీలు కొనడం, విహారయాత్రలు... ఇలా డబ్బును వాడేస్తారు. ఈ క్రమంలో క్రెడిట్ కార్డులు తీసుకోవడం, ఈఎంఐలు పెట్టడం వంటివీ మామూలే. దాంతో తెలియకుండానే నెలనెలా మిగిలే డబ్బు వీటికి వెళ్లిపోతుంది. ఈ దశలో మిగిలిన డబ్బును ఆదా చేసుకునే మార్గాలు వెతుక్కుంటే గనుక... పెళ్లయి, పిల్లలు కలిగాక ఆ డబ్బు ఎంతో ఆసరా అవుతుంది. అందుకే ఈ వయసులో దీర్ఘకాలిక లక్ష్యాలు పెట్టుకోవాలి. అంటే ఎనిమిది నుంచి పదిహేనేళ్ల కాల వ్యవధికి షేర్లు, మ్యూచువల్ ఫండ్లు, పీపీఎఫ్, ఎన్‌పీఎస్, ఎన్ఎస్‌సీ వంటి వాటిల్లో పొదుపు చేయడం మంచిది. వచ్చే ఆదాయంలో ఎక్కువమొత్తాన్ని వీటిల్లో పెట్టుబడులుగా పెట్టొచ్చు. చిన్నవయసులో టర్మ్ పాలసీ తీసుకోవడం వల్ల తక్కువ ప్రీమియంతో జీవితకాలం బీమా లభిస్తుంది.

### 30 సంవత్సరాల తరువాత...

ఈ దశలో ప్రతిఒక్కరూ లక్ష్యాలు మార్చుకోవాల్సి ఉంటుంది. అనారోగ్య సమస్యల్ని ముందే ఊహించి ఐదు నుంచి పదిలక్షల రూపాయలకు ఆరోగ్య బీమా పాలసీలను ఎంచుకోవడం మంచిది. పొదుపు చేసే డబ్బులో యాభైశాతం ఈక్విటీ, మ్యూచువల్ ఫండ్లలో పెట్టాలి. మిగిలిన భాగాన్ని నష్టభయంలేని ప్రభుత్వ పథకాల్లో మదుపు చేసుకోవచ్చు. ఈ దశలో నష్టభయం ఉన్నవాటిల్లో పెట్టుబడి పెట్టడం తగ్గించుకుంటూ రావాలి. ఈ సమయంలోనే పదవీ విరమణ తరువాతి జీవితానికి ప్రణాళిక సిద్ధం చేసుకుంటే ఉద్యోగానంతరం కూడా ఆర్థిక భరోసా ఉంటుంది.

### ఒంటరి మహిళలకు...

2001-2011 జనాభా లెక్కల ప్రకారం... మహిళా జనాభాలో సుమారు పన్నెండు శాతం వయసు పెరిగినా పెళ్లి చేసుకోని మహిళలు, విడాకులు తీసుకున్న స్త్రీలు, ఒంటరి తల్లులు, వితంతువులు ఉన్నారట. వీళ్లు తమ ఆర్థిక ప్రణాళిక విషయంలో ఇంకాస్త అప్రమత్తంగా ఉండాలి. ఇతరులతో పోలిస్తే... వీళ్ల ఆర్థిక అవసరాలు కూడా వేరు కాబట్టి దానికి అనుగుణంగానే ప్రణాళిక సాగాలి. ఈ మహిళలు ప్రణాళిక సిద్ధం చేసుకోవడానికి ముందు వారి అవసరాలు, లక్ష్యాలను పక్కాగా లెక్కేసుకోవాలి. ఒంటరి మహిళగా మీ ఆరోగ్యం, జీవితం మీ బాధ్యతే కాబట్టి... వీలైనంత ఎక్కువ మొత్తాన్ని ఆరోగ్యబీమా పాలసీలకోసం కేటాయించుకోవాలి. అలానే ఏ పరిస్థితుల్లో అయినా ఉద్యోగం కోల్పోతే కొంతకాలం పాటు ఆదాయం ఉండకపోవచ్చు. ఆ సమయంలో ఎవరినీ చేయి చాచకుండా ఉండేందుకు, ఇబ్బందులు పడకుండా తొమ్మిది నుంచి పన్నెండు నెలల పాటు సరిపోయే అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకోవాలి.



**- స్వప్న కంతేటి**
ఆర్థిక రంగ నిపుణురాలు

# ఫొటోల్లో సహజంగా



ఫొటోలు మన జీవితంలో మధుర జ్ఞాపకాలు. ప్రతి సందర్భాన్నీ ఒడిసిపట్టుకోవాలని ప్రయత్నిస్తాం. దానికి తగ్గట్లే దుసులు, వాటికి నప్పే నగలు అన్నీ ఎంచుకున్నా అలంకరణ విషయంలో మాత్రం కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

- మనకు నచ్చినట్లుగా మేకప్ వేసుకోవడంతోనే అందం వచ్చేయదు. అలంకరణ చేసుకున్నా ముఖం సహజ అందంతో మెరవాలి. కుదిరితే ముందు రోజు చర్మంపై పేరుకున్న మృతకణాలు, మురికిని పూర్తిగా తొలగించుకోవాలి. మర్నాడు మరోసారి శుభ్రం చేసుకుని మాయిశ్చరైజర్ రాసుకోవాలి. అవసరం అనుకుంటే దానిపై కొద్దిగా ప్రైమర్‌నీ రాసుకోవచ్చు.
- చర్మతత్వానికి నప్పే ఫౌండేషన్‌నే ఎంచుకోవడం మంచిది. అప్పుడే సహజ అందం సొంతమవుతుంది. వీలైనంతవరకూ మెరిసే అలంకరణ కాకుండా మ్యాటీ రకాన్ని ఎంచుకోవడం మంచిది. ముఖం అందంగా కనిపించేందుకు కనుబొమల ఆకృతిని కూడా తీర్చిదిద్దుకోవాలి. కళ్లు అలసిపోయినట్లు కనిపిస్తూ, ఎర్రగా ఉంటే తెలుపు రంగు ఐలైనర్‌ని వేసుకోవాలి. దీన్ని వాడటం వల్ల కళ్లు కాస్త పెద్దగా, తాజాగా కనిపిస్తాయి.
- మిగిలిన సందర్భాల్లో సన్‌స్క్రీన్ రాసుకుంటున్నా... ఇలాంటప్పుడు మాత్రం వద్దు. జిడ్డు చర్మతత్వం ఉన్నవారికి అలంకరణ చేసుకోగానే ముఖం మెరుస్తున్నట్లు కనిపిస్తుంది. ఫొటోలకు ఆ మెరుపు పనికిరాదు. దానికి బదులుగా అలంకరణ అంతా పూర్తయ్యాక కొద్దిగా మ్యాటీపౌడర్‌ని అద్దుకుంటే చాలు. ముఖం మరీ మెరుస్తున్నట్లు కనిపించదు. అది అందుబాటులో లేకపోతే గనుక కొన్ని టిష్యూలు దగ్గర పెట్టుకుని అప్పుడప్పుడూ అద్దుకుంటే చాలు.

# నేతల బతుకులు మారాలని!

**చేనేతల బతుకుల్లో మార్పులు తేవాలన్నది మైక్రోసాఫ్ట్ సంస్థ ఆలోచన. అందుకు సాంకేతికంగా ఎలా ఉపయోగపడొచ్చు.. అని అధ్యయనం చేసి.. వారికి డిజిటల్ పాఠాలు బోధిస్తోంది ఆ సంస్థ. ఆ వివరాలే చెబుతున్నారు సీఎస్ఆర్ విభాగం సభ్యురాలు చిత్రాసూద్.**




నేను మైక్రోసాఫ్ట్ సంస్థలోని డెవలప్ సెంటర్ విభాగంలో సీఎస్ఆర్ కార్యక్రమాలు చూస్తున్నా. సీఎస్ఆర్‌లో భాగంగా మైక్రోసాఫ్ట్ సంస్థ చేనేత కార్మికులకు ఆర్థిక భరోసా ఇచ్చే దిశగా అడుగులు వేస్తోంది. దానికోసం మేం ఆరునెలల పాటు అధ్యయనం చేశాం. జౌళి శాఖ లెక్కల ప్రకారం మనదేశంలో నలభై మూడు లక్షల మంది చేనేత కార్మికులు ఉన్నట్టు అంచనా. కానీ వాస్తవానికి ఆ సంఖ్య ఇంకా అధికమే. అయితే తెలంగాణలోనూ లక్షల మంది చేనేత కార్మికులున్నారు. ఇప్పటికీ వాళ్ల జీవితాల్లో మార్పు రాలేదు. రోజుకో కొత్త టెక్నాలజీ పుట్టుకొస్తున్నా... నేతలు మాత్రం ఆ దిశగా ఆలోచించట్లేదు. వారిని అప్‌డేట్ చేయాలనే ఆలోచనతోనే స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. దీనివల్ల చేనేత కార్మికులు ఇంటర్నెట్ వాడకం, సామాజిక మాధ్యమాల ద్వారా వ్యాపారం చేయడం నేర్చుకుంటారు. అలానే నెట్ సాయంతో కొత్త కొత్త డిజైన్లు రూపొందించడం, వినియోగదారుల అవసరాలు గుర్తించడం, వారే సొంతంగా చేయగలుగుతారు. ఈ కామర్స్ పోర్టల్స్ వారే స్వయంగా నిర్వహించుకోవడంతోపాటు... వినియోగదారుల రివ్యూలు తెలుసుకోగలుగుతారు. పరిచయాలు పెంచుకుంటూ.. ఆర్థికంగా పుంజుకోగలుగుతారు.

### క్యాడ్ నేర్పిస్తున్నాం

నిఫ్ట్‌వాళ్ల సాయంతో కొత్త డిజైన్లు, క్యాడ్ వంటి కంప్యూటర్ కోర్సులు కూడా నేర్పిస్తున్నాం. వాళ్లందర్నీ హైదరాబాద్ తీసుకురావడం కష్టం. అందుకే మేమే వారి దగ్గరకు వెళుతున్నాం. పోచంపల్లి, కొయ్యలగూడెం, సిద్ధిపేట, నారాయణపేట, గద్వాల్... ఇలా తెలంగాణ వ్యాప్తంగా మేం చేనేత కార్మికులను కలిశాం. వాళ్లందర్నీ బృందాలుగా విభజించి... బ్యాచుల వారీగా శిక్షణ ఇస్తున్నాం. ఈ శిక్షణ మూడు నుంచి నాలుగు నెలలపాటు ఉంటుంది. గత నెలలో ఒక బ్యాచ్ పూర్తైంది. దాదాపు నూటనలభై మందికి స్కిల్ ట్రైనింగ్ ఇచ్చి... సర్టిఫికెట్లు కూడా అందించాం. ఈ కోర్సును నేత కార్మికుల సమయాలకు అనుగుణంగానే నిర్వహిస్తున్నాం.

# పైపుల్లో పెంచుదాం!








చాలా మంది ఇళ్లలో పగిలిపోయిన, రంధ్రాలు పడిన పైపులు ఉంటాయి. అలాంటి పైపుల్ని ఇవతలకు తీయండి. కొంచెం ఆలోచిస్తే వాటిని కళాత్మకంగా, మొక్కలు పెంచే కుండీలుగా మార్చుకోవచ్చు. ఎలాగంటే పైపులకు రంధ్రాలు పడిన చోట చేతి గాజు పరిమాణంలో మళ్లీ రంధ్రం పెట్టుకోవాలి. అలా అడుగు దూరంలో పైపు పొడవును బట్టి పెట్టుకుంటూ రావాలి. ఆ తరువాత వాటిల్లో మట్టిని నింపి... మనకు కావల్సిన గింజల్ని చల్లాలి. కొన్ని రోజుల్లో వాటి నుంచి మొలకలు వచ్చి... ఎదుగుతాయి. మొక్కలుగా మారాక చూడ్డానికి అందంగా కనిపిస్తాయి. అలానే పైపును నిలువుగా రెండు ముక్కలు చేసి... వాటిలో మట్టి పోసి గింజల్ని చల్లుకోవచ్చు. ఇలా పైపులను అలంకరణ వస్తువులుగా మార్చుకోవచ్చు. వాటిని భూమీద పెట్టినా, రెండుమూడు కలిపి వేలాడదీసినా... అందంగా కనిపిస్తాయి. గోడలకు కూడా అమర్చుకోవచ్చు. సృజన ఉండాలే కానీ... వాటితో ఎన్నో చేయొచ్చు. అలాంటివే ఇవి.






# ప్రతినెలా అదే సమస్య!

**నాకు పదహారు సంవత్సరాలు. ఐదేళ్లక్రితం రుతుక్రమం మొదలైంది. నెలసరి వచ్చే వారం ముందు నుంచీ కళ్లు తిరుగుతున్నట్లుగా అనిపిస్తుంది. రుతుక్రమం మొదలైనప్పటి నుంచీ నాకు ఈ సమస్య ఉంది. రక్తస్రావం కూడా ఎక్కువగానే అవుతోంది. ఆహారంలో ఐరన్ బాగా అందేలా జాగ్రత్తలు తీసుకుంటున్నా కూడా ప్రయోజనం లేదు. ఈ సమస్యకు కారణాలేంటి... ఏదయినా పరిష్కారం ఉందా?** – ఓ సోదరి

**డియర్ వసుంధర**



డా॥ అనగాని మంజుల
గైనకాలజిస్టు

సాధారణంగా నెలసరి సమయంలో జరిగే హార్మోన్ల మార్పులు, రక్తసరఫరాలో తేడాల వల్ల ఇలా కావచ్చు. నెలసరి సమయంలో దాదాపు 35 ఎంఎల్ నుంచి 80 ఎంఎల్ వరకూ రక్తం పోతుంది. అలా కాకుండా మీలా అధిక రక్తస్రావం అవుతున్నా, రక్తం గడ్డల్లా పడుతున్నా... శరీరంలో ఫెర్రిటిన్ స్థాయులు, బి12 విటమిన్ స్థాయుల లోపం ఉండి ఉండొచ్చు. అవి ఏ స్థాయుల్లో ఉన్నాయో తెలుసుకోవాలంటే వైద్యుల దగ్గరకు వెళ్లి వాటికి సంబంధించిన పరీక్షలు చేయించుకోవాలి. ఒకవేళ సమతూకంలో లేవనుకుంటే... చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. కొన్నిసార్లు థైరాయిడ్ పనితీరులో మార్పుల వల్ల కూడా ఇలా కావచ్చు. థైరాయిడ్‌లో తేడాల వల్ల అధిక రక్తస్రావం మాత్రమే కాదు, కాళ్లనొప్పులు కూడా ఇబ్బంది పెడతాయి. కాబట్టి ఓ సారి వైద్యుల్ని సంప్రదించి అవసరమైన పరీక్షలు చేయించుకోవడం మంచిది.

– మీ సందేహాలను, సమస్యల్ని vasuhealth@eenadu.net కు పంపించగలరు.

### నజరానా

**ఖర్జూరంలో విటమిన్ సి ఉంటుంది. దీన్ని నీటిలో నానబెట్టి మెత్తగా చేసి, కాసిని పాలు కలిపి ముఖానికి రాసుకోవాలి. ముడతలు పోయి, చర్మం మృదువుగా మారుతుంది.**

# ఈ బామ్మ... డ్రిల్ టీచర్

అదొక పాఠశాల మైదానం. ఓ బామ్మ ఉత్సాహంగా వ్యాయామాలు చేస్తుంటే, పిల్లలు అంతే ఉత్సుకతతో నేర్చుకుంటున్నారు. ఇంతకీ ఆ డ్రిల్ చేయిస్తున్న బామ్మ వయసు ఎంతో తెలుసా... 81 ఏళ్లు. ఆమే జార్ఖండ్‌కు చెందిన ఇషా ఘోష్.



అక్కడ విద్యార్థులకు ఆమె సుపరిచితమే. ఇంత లేటు వయసులో ఎందుకంత కష్టపడుతున్నారని ఎవరైనా అడిగితే... 'కూర్చుని తినడంలో మజా ఏముంది.. సమాజానికి ఏదైనా ఉపయోగపడేది చేయడంలోనే కిక్ ఉంది' అని అంటారామె. పిల్లల్లో శారీరక, మానసిక దారుఢ్యాన్ని పెంచడానికి ఇషా చాలా కష్టపడతారు. ఇలా జార్ఖండ్‌లోని ప్రభుత్వపాఠశాలల విద్యార్థులకు డ్రిల్ తరగతులు చెప్పే ఇషా ఘోష్ స్వస్థలం కోల్‌కతా. ఆమె లఖనవూలో డిగ్రీ పూర్తి చేశారు. 25వ ఏట భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్(బీఎస్‌జీ) సభ్యురాలయ్యారు. అప్పటి నుంచీ ఆమెలో సామాజిక సేవ పట్ల ఆసక్తి పెరిగింది. అలా అప్పటినుంచీ విద్యార్థులకు డ్రిల్ తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతీ రోజూ దాదాపు ఎనిమిది గంటలపాటు శిక్షణివ్వడమే కాదు, ఏ పాఠశాలకు అయినా నడిచే వెళ్తారు. అలా రోజుకు ఏడు కిలోమీటర్ల దూరం నడుస్తారు. 'నేను శారీరకంగా ఆరోగ్యంగా ఉంటేనే ఇతరులకు పాఠాలు చెప్పగలను. అందుకే నా వంతుగా కొన్ని జాగ్రత్తలు తీసుకుంటా. నేటి బాలలే రేపటి పౌరులు. వాళ్లు శారీరకంగా దృఢంగా ఉంటే... రేపటి సమాజం కూడా ఆరోగ్యంగా ఉంటుందనే ఉద్దేశంతోనే ఈ వయసులోనూ పిల్లలకు శిక్షణ ఇవ్వడానికి సిద్ధమయ్యా. మొదట కోల్‌కతాలో చెప్పేదాన్ని. గత 15 ఏళ్ల నుంచి జార్ఖండ్‌లోని పలు పాఠశాలల్లో డ్రిల్ తరగతులను నిర్వహిస్తున్నా. అదీ ఉచితంగానే. పిల్లలు కూడా ఉత్సాహంగా చేస్తారు. ఈ శిక్షణలో భాగంగా జపనీయుల సంగీతానికి తగ్గట్లుగా కూడా రకరకాల వ్యాయామాలు నేర్పిస్తున్నా. వాటిల్లో యోగాసనాలు, స్ట్రెచస్... వంటివెన్నో ఉంటాయి. నా నిత్యావసరాలకు అవసరమైన డబ్బును బీఎస్‌జీ కొంతవరకూ అందిస్తుంది. ఇందులోనే నాకు ఆనందం, సంతృప్తి. నా తుది శ్వాస వరకూ సమాజానికి ఉపయోగపడతా' అని అంటున్న ఈ బామ్మ ఎందరికో ఆదర్శం అనడంలో అతిశయోక్తి లేదు.

### బంగారం వెండి

01న ముగింపు–క్రితం



| | హైదరాబాద్ | | విజయవాడ | |
|---|---|---|---|---|
| బంగారం(24క్యా) | 34,400 | 34,350 | ------- | 33,750 |
| ఆర్నమెంట్ | 32,130 | 31,990 | ------- | 31,300 |
| వెండి (కిలో) | 41,680 | 41,525 | ------- | 41,600 |
| | ప్రొద్దుటూరు | | రాజమహేంద్రవరం | |
| బంగారం(24క్యా) | 33,750 | 33,700 | 34,410 | 34,350 |
| ఆర్నమెంట్ | 31,210 | 31,210 | 31,860 | 31,730 |
| వెండి (కిలో) | 41,400 | 41,400 | 41,700 | 41,500 |
| | విశాఖపట్నం | | తమిళనాడు | |
| బంగారం(24క్యా) | 34,250 | 34,010 | ------- | ------- |
| ఆర్నమెంట్ | 31,860 | 31,630 | 3,186 | 3,173 గ్రా |
| వెండి (కిలో) | 41,500 | 41,500 | 43.80 | 44.00 గ్రా |

# నా చుట్టూ

## ఆమె జ్ఞాపకాలే

సికింద్రాబాద్ హరిహరకళాభవన్‌లో యువ-2005 కార్యక్రమం.. యువత కోలాహలంతో హాలంతా ఊగిపోతోంది. కాసేపటికి పాటల పోటీ మొదలైంది. ఒక్కో పేరు.. ఒక్కో పాట.. ప్రవాహంలా సాగిపోతున్నాయి. ఇంతలో నా పేరు పిలిచారు. నాకు తెలియకుండా స్నేహితులే నా పేరిచ్చారని అర్థమైంది. కూని రాగం తప్ప మరే రాగం రాదు నాకు. అసహనంలో ఉండగా అనౌన్సర్ మైక్ చేతిలో పెట్టింది. 'మా ఊళ్లో ఒక పడుచుంది..' పాటందుకున్నా. పల్లవి పూర్తయ్యేటప్పటికి అందరూ చప్పట్లు. దిగిపొమ్మని కాదు. కోరస్‌గా మోగుతున్న కరతాళాలు. 55 మంది పోటీదార్లు. 10 మందిని ఫైనల్స్‌కు ఎంపిక చేశారు. అందులో నా పేరుంది.

మర్నాడు.. ఫైనల్స్ మొదలయ్యాయి. పది మందిమీ వేదికపై కూర్చున్నాం. 'కైకే పాన్ బనారస్ వాలా!' పాడాలనుకున్నా. ఇంతలో ఓ అబ్బాయి అటుగా వచ్చి చేతిలో ఓ చీటీ ఉంచాడు. చూస్తే.. 'ఉరికే చిలుకా వేచి ఉంటాను..' శైలాబాను అని రాసుంది. మది నిండా ఆలోచనలే.. అంతలో నా పేరు పిలిచారు. చీటీలోని పాటే ఎత్తుకున్నాను. పాడినంత సేపూ నా కళ్లు హాలంతా వెతికాయి. ఆ పాట కోరిన వారు మాత్రం ఎక్కడా కనిపించలేదు.

వేదిక దిగాక. అంతటా వెతికా! ఏనాటి జ్ఞాపకమో ఆమె! ముస్లిం




అమ్మాయి. ఐదో తరగతిలో చిగురించిన స్నేహం మాది. ఎనిమిదో తరగతికి వచ్చేసరికి ఎంతో ఎదిగింది. అప్పుడే బొంబాయి సినిమా రిలీజైంది. ఆ సినిమా నాకు బాగా కనెక్ట్ అయింది. అందులో హీరోయిన్ పేరు శైలాబాను. ఆనాటి నుంచి ఆమే నా శైలా. అలాగే పిలిచేవాణ్ని. తనూ పలికేది. కొంటెగా చూస్తే మొహమాటంగా నవ్వేది. దారికాస్తే.. తటపటాయిస్తూ దాటి వెళ్లేది. 'ఉరికే చిలుకా..' అని ఉడికిస్తే ఉన్నపళంగా ఉరికేది. తెలిసీతెలియని వయసులో చిగురించిన ప్రేమ అది. తొమ్మిదో తరగతిలో నేను స్కూలు మారాను. ఆమె ఊరే మారిపోయింది. మళ్లీ తొమ్మిదేళ్ల తర్వాత చిన్న చీటీతో తన జాడ కనుక్కోమని సవాలు విసిరింది. ఈ ఆలోచనల్లో ఉండగానే.. వెనక నుంచి 'శర్మ!' అని పిలుపు. తిరిగి చూస్తే.. శైలా! అప్సరసలా ఉంది. 'షుక్రియా జీ! ఆ పాట పాడినందుకు' అంది. 'కైసా హో శైలా?' అనడిగా! 'తుమ్ బోలో..' అంటూ ప్రశ్నించింది. 'బహుత్ ఖూబ్‌సూరత్..'.. ఇలా మా మధ్య మాటలు కోటలు దాటాయి.

హైదరాబాద్‌లోనే ఉంటున్నానంది. తను చదువుతున్న కాలేజీ పేరు చెప్పింది. ఎన్ని గంటలకు కాలేజీ అయిపోతుందో కూడా సమాచారం ఇచ్చింది. మూడు నెలల్లో ముప్ఫయ్ సార్లు కలిసుంటాం. డిగ్రీ ఫైనల్ ఎగ్జామ్. పరీక్ష పూర్తవ్వగానే ఆమె సెంటర్‌కి వెళ్లాను. నా కోసం ఎదురు చూస్తోంది. కాసేపు మాట్లాడుకున్నాం. మళ్లీ ఫలానా రోజు.. ఎప్పుడూ కలిసే చోట కలుద్దామనుకున్నాం. ఆ రోజు అక్కడికి వెళ్లాన్నేను. తను రాలేదు. రోజంతా ఉన్నా.. అయినా రాలేదు. మర్నాడు.. ఆ తరువాతి రోజూ అంతే! ఆనాటి నుంచి ఆరాలు తీస్తే కొన్నాళ్ల తర్వాత ఆమెకు పెళ్లయిపోయిందని తెలిసింది. ఆమె జ్ఞాపకాలు మాత్రం నేటికీ నాతోనే ఉన్నాయి. ఆమెను తలచుకున్నప్పుడల్లా 'ఉరికే చిలుకా..' పాట మనసులో మార్మోగుతూనే ఉంటుంది.

**- రాజ్**

# మా దారి కొత్త దారి!

యువావిష్కరణలు

కళ్లు లేని వాళ్లకు దారి చూపే షూ చూశారా?

విద్యుదాఘాతానికి ఆస్కారం లేని స్టార్టర్ గురించి విన్నారా?

నీరు అవసరం లేని, దుర్గంధం రాని మరుగుదొడ్డి ఉందంటే నమ్ముతారా?

కొండపల్లి బొమ్మల నుంచి... పెంబర్తి కళ వరకూ... అన్నీ యువతను ఆకట్టుకునే ట్రెండ్ ఎలా అయ్యాయో తెలుసా?

యువత కృషి వల్ల..

యువత కొత్త ఆవిష్కరణల వల్ల..

యువత సృజనాత్మకత వల్ల.. వీరిలో స్నేహితుల కష్టాలు చూసి చలించిన వారు కొందరైతే... సాటి మనుషుల కన్నీళ్లు తుడవాలని నడుంబిగించిన వారు మరికొందరు. వీరెవరో? వీరు చేసిన ఆవిష్కరణలేంటో? వాటి ఉపయోగాలేంటో? చదవండి.



### 'సత్య' శోధన

**రైతుల కోసం ప్రత్యేక స్టార్టర్**

అప్పటి దాకా తనతో కలిసి ఆడుకున్న స్నేహితుడి గుండె ఆగిపోతే... ఎంత బాధ? ఎగిరేసిన గాలిపటం విద్యుత్తు తీగలకు తగిలి కళ్ల ముందే ఫ్రెండ్ ప్రాణాలు వదిలేస్తే... ఎంత కష్టం? ఆ బాధ, ఆ కన్నీళ్లు ఒక ఆవిష్కరణకు ప్రాణం పోశాయి. హైదరాబాద్‌కు చెందిన సత్యాను ప్రయోగాల వైపు మళ్లించాయి.



ఇంజినీరింగ్ చదువుతున్నప్పుడు ఎలక్ట్రికల్ సేఫ్టీపై ప్రాజెక్టు చేయమన్నారు. పరిశోధనలో భాగంగా 30 మంది మిత్రులతో కలిసి వికారాబాద్ జిల్లా పరిగి వెళ్లాడు సత్యా. అప్పుడు తెలిసింది విద్యుదాఘాతంతో మన రాష్ట్రంలో ఎక్కువ మరణాలు సంభవిస్తున్నాయని. తన స్నేహితుడి మరణం కళ్లలో కన్నీరైంది. అప్పుడే ఈ విద్యుదాఘాత మరణాలను ఆపేందుకు ఏదైనా చేయాలని నిర్ణయించుకున్నాడు. గ్రామాల్లో మోటారు స్టార్టర్ల కారణంగానే 30శాతం మరణాలుంటున్నాయని గుర్తించిన ఆతను రైతుల కోసం ప్రత్యేక స్టార్టర్లను తయారు చేశాడు. స్వయంగా గ్రామాల్లోకి వెళ్లి కర్షకులకు తాను రూపొందించిన స్టార్టర్లను విక్రయించడమే కాకుండా.. విద్యుత్తు ప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నాడు. ఇతని ప్రతిభను గుర్తించిన జర్మన్ ఎంబసీ ఈ అంశంపై మరిన్ని పరిశోధనలు చేయడానికి గతేడాది 7000 డాలర్ల ఉపకారవేతనం ఇచ్చింది. ప్రస్తుతం కేరళలోని "కాంతారి ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ విజనరి"లో ఉంటున్న సత్యా విద్యుదాఘాతంతో చనిపోయిన వారి కుటుంబ స్థితిగతులపై అధ్యయనం చేస్తున్నాడు.

### 'భూ'పతి

**నీరు అవసరం లేని మూత్రశాల**

ఒక్క టాయిలెట్‌ను శుభ్రం చేయడానికి ఏటా 1,50,000 లీటర్ల నీరు అవసరమౌతుంది. అసలు నీరు అవసరం లేని టాయిలెట్ ఉంటే...! ఆ నీరంతా మిగులేకదా! ఈ ఆలోచనే హైదరాబాద్‌కు చెందిన పీఎల్ భూపతికి వచ్చింది. స్వతహాగా ప్లాస్టిక్ ఇండస్ట్రీలో నిపుణులైన ఆయన సుమారు నాలుగేళ్లు కష్టపడి దుర్గంధం రాని, నీటి అవసరం లేని, పర్యావరణ హితమైన మూత్రశాలని రూపొందించారు. ఇది ఆదా చేసే 1,50,000 లీటర్ల నీరు సంవత్సర కాలంలో 150 మంది తాగే నీటితో సమానం. టాయిలెట్ శుభ్రం చేయడానికి విరివిగా వాడేస్తున్న 150 లీటర్ల రసాయనాల వాడకాన్ని పూర్తిగా నియంత్రించవచ్చు. టాయిలెట్ సీట్ కింద నీరుపోయేలా అమర్చిన ప్రత్యేక పరికరమే దుర్గంధం వ్యాప్తి చెందకుండా చేస్తుంది. ప్రతి రోజు శుభ్రం చేయాల్సిన అవసరం కూడా లేదు. నెలరోజులకోసారి పర్యావరణహితమైన ద్రావణం పోసి స్పాంజ్‌తో శుభ్రం చేస్తే సరిపోతుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని మియాపూర్ మెట్రో స్టేషన్‌లో దీని పనితీరును పరిశీలించారు. విజయవంతం కావడంతో త్వరలోనే 30 మెట్రో స్టేషన్లలో ఈ తరహా మరుగుదొడ్లు ఏర్పాటు చేసేందుకు హెచ్ఎంఆర్ఎల్ (హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్) సన్నాహాలు చేస్తోంది. భారతీయ రైల్వేలోనూ వీటిని అమర్చే అంశం పరిశీలనలో ఉంది.





### స్నేహితుడికి చూపై..

**అంధుల కోసం సెన్సార్ షూ**





పక్కన మనిషి సాయం లేనిదే బయటకు రాలేని స్నేహితుడి నరకయాతన కళ్లారా చూశాడో యువకుడు. కళ్లు లేని మిత్రుడికి కళ్లుగా మారదామనుకున్నాడు విశాఖపట్నంకు చెందిన కృష్ణసాయి. ఫ్రెండ్ చేతికర్రతో పడుతున్న ఇబ్బందులను గమనించాడు. కొత్తగా దీనికి పరిష్కారం చూపాలని నిర్ణయించుకున్నాడు. స్నేహితుడి(ప్రీతం) కోసం ప్రత్యేక పాదరక్షలు (బూట్లు) తయారు చేయాలని అనుకున్నాడు. దాదాపు రెండేళ్లు కష్టపడి 2015లో సెన్సార్ బూట్లను రూపొందించాడు. అవి ప్రీతంకు ఇచ్చి నడవమన్నాడు. చాలా సౌకర్యంగా ఉన్నాయని స్నేహితుడు చెప్పినప్పుడు సంతోషంతో పొంగిపోయాడు. ప్రస్తుతం అహ్మదాబాద్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైన్‌లో బోధకుడిగా ఉన్న కృష్ణసాయి.. బ్లైండ్ పీపుల్ అసోసియేషన్‌తో కలిసి తన ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తున్నాడు. నడుస్తున్నప్పుడు రెండు మీటర్ల దూరంలో ఉన్న గుంతలు, అడ్డంకులను సెన్సార్స్ ద్వారా ఈ పాదరక్షలు పసిగడతాయి. గుంతలను గుర్తించగానే బూటులో ఉండే సెన్సార్ పాదాలను ట్యాప్(తట్టడం) చేస్తుంది. మరీ దగ్గరగా ఉంటే తట్టే వేగం పెరుగుతుంది. దీంతో నడుస్తున్న వ్యక్తి వెంటనే దిశను మార్చుకునే వీలుంటుంది. రూ.3500లతో ఈ బూట్లను తయారు చేయొచ్చని కృష్ణసాయి చెబుతున్నాడు. వీటి ప్రత్యేకతను గుర్తించిన బాటా కంపెనీ ప్రస్తుతం అతనితో చర్చలు జరుపుతోంది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద, బ్లైండ్ పీపుల్ అసోషియేషన్‌తో కలిసి వినియోగంలోకి తీసుకొచ్చే యోచనలో ఉన్నాడీ యువ తరంగం.

### కళాభివందన

**స్నేహితుల ఫ్యాషన్ డిజైనింగ్**

రేఖ, వంద్య చదివింది ఫ్యాషన్ డిజైనింగ్. చేసేది హస్త కళలను ప్రోత్సహించడం. హైదరాబాద్‌లోని నిఫ్ట్ కళాశాలలో చదువుతున్న రోజుల్లో కొండపల్లి వెళ్లిన వీళ్లు, అక్కడ చెక్కతో బొమ్మ చేసిన దశావతారాలను చూశారు. ఎప్పటినుంచో ఒకే రకమైన బొమ్మలు చేస్తుండటంతో కొండపల్లి బొమ్మలకు డిమాండ్ తగ్గిపోతుందని గుర్తించి, కొత్తరూపం ఇవ్వాలనుకున్నారు. 2014లో చదువు పూర్తవగానే రెండేళ్లు పరిశోధన చేసి కొండపల్లి మొదలు, అనంతపురం తోలుబొమ్మలు, ఏటికొప్పాక లక్కపిడతలు, పెంబర్తి బ్రాస్‌వర్క్(ఇత్తడి పని) చేసే కళాకారులు, రంగారెడ్డి జిల్లా లంబాడీ మహిళలతో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నారు. నేటి తరాన్ని ఆకర్షించేలా డిజైన్లు రూపొందించి చెక్కబొమ్మలు, లోహపు వస్తువులు, ప్రతిమలు, అభరణాలు, నగలు తయారు చేస్తున్నారు. మొదట ఇద్దరూ కలిసి రూపొందించిన డిజైన్లను కళాకారులకు పంపిస్తారు. వాటిని అనుసరించి అక్కడి వారు తయారు చేసిన వస్తువులను హైదరాబాద్‌కు తీసుకొచ్చి, తుది మెరుగులు దిద్దాక ఇస్మా.ఇన్‌లో, హైదరాబాద్‌లో నిర్వహించే ఎగ్జిబిషన్లలో విక్రయిస్తుంటారు. ఈ పనితో తమకు ఆదాయంతో పాటు కళాకారులకు ఉపాధీ దొరుకుతుందని, ముఖ్యంగా పురాతన కళలను బతికిస్తున్నామనే సంతృప్తి మిగులుతుందని చెబుతున్నారు స్నేహితురాళ్లు.





**- గుళ్లపెల్లి సిద్ధార్థ,** హైదరాబాద్

# రచనకు సాయంకాలం!



**శనివారం సాయంత్రం మూడుగంటలు... బంజారాహిల్స్‌లో ఉండే లామకాన్ టెర్రస్‌పైకి అబ్బాయిలు, అమ్మాయిలు క్యూ కట్టారు. ముప్ఫయిమంది ఒకటే చోట చేరి హాయ్ అంటూ పలకరించుకుంటూ తెగ సందడి చేస్తున్నారు.**

**వారెవరూ తెలిసినవాళ్లు కాదు.. ఒకచోట చదివినవాళ్లో, ఉద్యోగం చేస్తున్నవాళ్లో అంతకంటే కాదు. కానీ వీళ్లకి రాయటం ఇష్టం. రాసింది కథ అయినా కవిత అయినా ఎదురుగా ఉండే పదిమందితో పంచుకోవటం వీరికి భలే ఇష్టం. ఛాయ్ తాగుతూ, సమోసా తింటూ కూల్‌గా రాసుకుంటోన్న 'రైట్ క్లబ్' నిర్వాహకురాలు స్రవంతి తల్లూరి, అక్కడికొచ్చే రైటర్లను 'ఈతరం' కలిసింది.**

నగర జీవనంలో ముప్ఫయిమందికి పైగా (ఉత్తరభారతదేశం, తమిళనాడు, బెంగళూరు.. లాంటి ప్రదేశాల నుంచి వచ్చినవారు) ఒకేచోట కలవటం అంటే అదో అరుదైన విషయమే. ఇందులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, ఎంబీఏ విద్యార్థులతోపాటు స్కూల్ పిల్లలూ ఉన్నారు. వీరంతా ఒకేచోట కూర్చుని సీరియస్‌గా ఆ రోజు ఇచ్చిన సెగ్మెంట్‌ను పూర్తి చేస్తారు. డిస్క్రిప్టివ్ రైటింగ్, కామెడీ, మూవీరైటింగ్.. ఇలా ప్రతివారం ఓ టాపిక్‌ను ఎంచుకుంటారు. ఆ టాపిక్‌మీద అక్కడే వచ్చింది రాస్తారు. రాసింది చదువుతారు. ఒకరు రాయలేకపోవచ్చు. కొత్తగా వచ్చినవారు బిడియపడొచ్చు. కొందరికి ఇంగ్లిష్ సరిగా రాకపోయుండొచ్చు. ఎన్ని తప్పులున్నా సరిచేస్తారు. ఎవరికి వారు మెరుగుపడతారు. ఎవరేం చెప్పినా ఓపిగ్గా వింటారు. సలహాలిస్తారు. కొందరి కామెడీ ఆలోచనలు విన్నాక పగలబడి నవ్వుతారు. రాతవిషయంలో అందరూ ఏకమవుతారు. ఈ యువతకి లామకాన్ ప్రాంగణం ఓ రచ్చబండ. ఎన్నో ఊసులు, ఆలోచనలు, ఆశయాలు కలబోసిన రచనా కూడలి 'రైట్ క్లబ్'.

### శనివారం సాయంత్రాన అక్షరాల వాన!

'రైట్ క్లబ్' కర్త, కర్మ, క్రియ స్రవంతి తాల్లూరి. బడికెళ్లే సమయంలో రాయటం తనకి అలవాటు. కాలేజీకెళ్లాక చదువుల్లోపడి రాతకు కామా పెట్టేసింది. బెంగళూరులో ఉద్యోగం వచ్చింది. వారాంతాల్లో అక్కడ రచనపై ఆసక్తి ఉండేవాళ్లు కలిసేవాళ్లు. స్రవంతి కూడా వెళ్లేది. ఇంతలో ఆమె ఉద్యోగం హైదరాబాద్‌కి షిఫ్టు అయింది. ఇక్కడ రైటర్స్ క్లబ్ లేకపోవటంతో.. 2015 ఏప్రిల్ 11, శనివారం రోజు సాయంత్రం మూడుగంటలకు లామకాన్‌లో 'రైట్ క్లబ్'పేరిట ప్రారంభించింది. ఆరుగంటలకు పూర్తయ్యింది ఓ సెషన్. ఆ మొదటిరోజు పదకొండుమంది వచ్చారు. ఆ తర్వాత వస్తారో రారో అని కంగారు పడిందామె. వచ్చే వారమూ క్లబ్ అయ్యారు. హమ్మయ్య అని ఊపిరిపీల్చుకుంది. ఐదుమంది వచ్చినా సరే ఒక్కవారం కూడా ఆపకుండా రైట్ క్లబ్‌ను నడుపుతోందామె. 'యువతలో ఉండే గొప్పదనం ఏంటంటే.. ఏదైనా బావుంటే పదిమంది స్నేహితులకు చెబుతారు. అలా రచనాసక్తి ఉండేవాళ్లంతా లామకాన్ దారి పట్టడం ఆరంభించారు' అంటుంది స్రవంతి. ఓ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఫ్రెంచ్ టీచర్‌గా పనిచేసే పోర్చుగీసు మహిళ ఎలొయ్‌డా ప్రతివారం రైట్ క్లబ్‌కి హాజరవుతుంది. జనాలతో కలవటం బావుంటుంది. రాయటం ఛాలెంజింగ్‌గా ఉంటుందంటుందామె.

### నా జీవితంలో భాగం



రైట్ క్లబ్‌లో జాయిన్ అయిన రెండువారాల తర్వాత ఎవరైనా సరే ఓ సెషన్‌ను హోస్ట్ చేయవచ్చు. ప్రతిసారి కొత్తథీమ్ ఉంటుంది కాబట్టి ఇంట్లో రాసుకుని రాలేరు. ఇచ్చిన సమయంలో బాగా రాయటానికి ప్రయత్నిస్తారు. ఎడిట్ చేసుకునేంత సమయం ఉండదు కాబట్టి వచ్చిన ఆలోచనను చకచకా రాస్తారు. ఇక్కడికికొచ్చినవారు ఛానెల్స్, ఫిల్మ్‌రైటింగ్‌కి కూడా వెళ్లారు. ఈ క్లబ్ నాజీవితంలో ఓ భాగం. రైటర్స్ కమ్యూనిటీని బిల్డప్ చేయాలన్నదే నా లక్ష్యం' అంటూ స్రవంతి చెప్పుకొచ్చింది.

### పుస్తకాలూ ప్రచురితమయ్యాయి..

2015 నుంచి ఇప్పటివరకూ 'రైట్ క్లబ్' 180 సెషన్స్ పూర్తిచేసుకుంది. దాదాపు 2,500 మంది హాజయ్యారు. ప్రతివారం సగటున పాతికమంది వస్తారు. వచ్చినవారెవరైనా ఆ రోజు ఇచ్చిన టాపిక్‌తో కథో, కవితో, హైకూనో రాస్తారు. వాటిలో మంచి రైటింగ్స్ ఎంచుకుంటారు. రచయితతో కంటెంట్‌ను డెవలప్ చేయిస్తారు. ఇలా పదిమంది రచయితలతో ఇటీవలే '3పిఎమ్ టేల్' అనే పుస్తకం వేసింది ఈ రైట్ క్లబ్. ఈ పుస్తకంలో 13 ఏళ్ల బాలిక నుంచి 50 ఏళ్ల వయసున్న వ్యక్తి వరకూ రాసిన కథలున్నాయి, కవితలున్నాయి. రెండేళ్లక్రితం 2016లో రైట్‌క్లబ్ మెంబర్లు రాసిన 'హాఫ్ బ్లడ్ అండ్ ఇంక్', 'ఎన్‌కౌంటర్స్' పుస్తకాలను అచ్చువేసింది. సభ్యుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపటానికే ఇలా చేస్తామంటోంది రైట్ క్లబ్ టీమ్.

**– రాళ్లపల్లి రాజావలి**

# ఆఫీసులో అందంగా..

కొత్తగా ఆఫీసుల్లో అడుగుపెట్టే యువతకు సహోద్యోగులతో ఎలా మెలగాలో? అందరికంటే ప్రత్యేకంగా ఎలా కన్పించాలో? బాస్‌ను ఎలా మెప్పించాలో? లాంటి సవాలక్ష ప్రశ్నలు తొలుస్తుంటాయి. మంచిపేరు తెచ్చుకోవడానికి, నలుగురి దృష్టిని ఆకర్షించడానికి ప్రధానంగా ఈ నాలుగు అంశాలను ఫాలో అయిపొమ్మంటున్నారు నిపుణులు...

**నలుగురిలో ఒకరిగా..**



- **ఎం'చక్కగా'** : అవును మీరు స్ట్రెయిట్‌గా నిల్చుంటే అందరికంటే ప్రత్యేకంగా కన్పిస్తారు. తల, మెడ, ఛాతి చక్కగా ఉంచి నిలబడటం ప్రాక్టీస్ చేయండి. ఇలా నిలబడటం వల్ల మీరు కాన్ఫిడెంట్‌గా ఉన్నారని అవతల వ్యక్తికి అర్థమవుతుంది. మీ స్థిరమైన వ్యక్తిత్వం అవతల వారికి తెలుస్తుంది. వంగిపోయి ఉన్న వారికంటే... నిటారుగా నిల్చొన్న వారిపైనే ఎక్కువ మంది చూపులు నిలుస్తాయని ఇటీవల అమెరికాలోని ఓ ఫిట్‌నెస్ ఏజెన్సీ నిర్వహించిన సర్వేలో తేలింది.
- **నవ్వు...నువ్వు** : ఎప్పుడూ నవ్వుతూ పలకరించే వారు ఎక్కువ మందిని ఆకట్టుకుంటారు. మీ చిరునవ్వు చుట్టూ ఉన్న వారందరినీ మీకు స్నేహితులుగా మార్చేస్తుంది. మీరు సానుకూల ఆలోచనలున్న వ్యక్తిగా ఎదుటివారు గుర్తిస్తారు.
- **బీ అటెన్షన్** : బాస్, సహోద్యోగులు, స్నేహితులు ఎవరైనా కానీ ఏదైనా చెబుతున్నప్పుడు సరిగ్గా వినాలి. చూపు, ఆలోచన వారిపైన ఉంచాలి. అప్పుడే ఎదుటివారిని నువ్వు గౌరవిస్తున్నట్లు. అలా మీరు ఉంచకపోతే అవతలి వారి దృష్టిలో చులకన అవుతారు. మీకు చెప్పి ప్రయోజనం లేదని నిర్ధరణకు వస్తారు.
- **బెల్ట్ అండ్ షూ** : మంచిగా ఇన్‌షర్ట్ చేసి, నడుముకు సరిపోయే విధంగా ఉండే బెల్ట్‌నే కట్టుకోండి. కొత్త, నాణ్యమైన బెల్ట్ మీ హుందాతనాన్ని చాటుతుంది. షూ రోజూ పాలిష్ చేయండి. షూ చూసి మీకున్న శ్రద్ధను లెక్కకడతారు.